www.andhrajyothy.com
పేజీలు: 14
విజయవాడ సిటీ

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
వెల (Price) : Rs. 6.50
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 66

శుక్రవారం 21-6-2024

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం, తిథి: చతుర్దశి ఉ. 7.32 తదుపరి పౌర్ణమి, నక్షత్రం: జ్యేష్ఠ సా. 6.19 తదుపరి మూల, వర్జ్యం: రా. 2.10-3.45, దుర్ముహూర్తం: ఉ. 8.22-9.14, మ.12.43-1.35, అమృతఘడియలు: ఉ. 9.27-11.04, రాహుకాలం: ఉ. 10.30-12.00, సూర్యోదయం: 5.45, సూర్యాస్తమయం: 6.48

Vijayawada | Hyderabad | Mahabubnagar | Tirupati | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



రాజధాని అమరావతికి శంకుస్థాపన చేసిన ప్రాంతంలో మొక్కుతున్న చంద్రబాబు



అమరావతి పునర్నిర్మాణం

"రాష్ట్రం, దేశం, ప్రపంచంలోని అన్ని ప్రాంతాల ప్రార్థనాలయాలు, పవిత్ర నదుల నుంచి మట్టి, జలాలు తీసుకొచ్చి రాజధాని నిర్మాణానికి ఆనాడు శంకుస్థాపన చేశాం. గత ఐదేళ్లలో జగన్ ఎంతగానో విధ్వంసం చేయాలని ప్రయత్నించినా ఆ మహిమే ఈరోజు రాజధానిని కాపాడింది. అమరావతి రైతులు 1631 రోజులు ఉద్యమం చేశారు. వాటిలో ఒక్కో సంఖ్య కూడితే 11 వస్తుంది. చివరికి జగన్‌కు కూడా 11 సీట్లే వచ్చాయి అంటే ఇది దేవుడి స్క్రిప్టే"
– చంద్రబాబు

అంతా ధ్వంసం చేశారు.. ఒక దుర్మార్గుడి వల్ల రాజధాని బలైంది: బాబు

ఏం చేయాలో, ఎక్కడ మొదలుపెట్టాలో అర్థం కావడం లేదు.. అందరి అభిప్రాయాలు తీసుకుని మళ్లీ పట్టాలపైకి

- బ్రాండ్‌ను ఘోరంగా దెబ్బతీశారు..
- ఐదేళ్లపాటు తుమ్మచెట్లు పెంచారు
- ఎక్కడ వేసిన మట్టి అక్కడే ఉంది
- మరోవైపు గల్లాపెట్టె ఖాళీ చేశారు
- అమరావతిపై శ్వేతపత్రం విడుదల చేస్తాం
- రాజధానికి పూర్వ వైభవం తీసుకొస్తాం
- రాజధాని ప్రాంతంలో చంద్రబాబు పర్యటన
- ప్రజావేదిక ప్రాంతంతో మొదలుపెట్టి అన్ని భవన సముదాయాలనూ పరిశీలించిన ముఖ్యమంత్రి
- ఏ రూల్ ప్రకారం ప్రజావేదిక కూల్చారు?
- అధికారులను నిలదీసిన ముఖ్యమంత్రి
- వేదిక నమూనా చిత్రం చూస్తూనే భావోద్వేగం

అమరావతి, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ఐదు కోట్ల రాష్ట్ర ప్రజల కలల రాజధాని అమరావతి విధ్వంసానికి గురైందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవేదన వ్యక్తంచేశారు. అమరావతిని అన్ని రకాలుగా దెబ్బతీసే ప్రయత్నం చేశారన్నారు. ఒకవైపు విధ్వంసం, నిర్వీర్యం చేస్తూనే మరోవైపు అపహాస్యం చేశారని వ్యాఖ్యానించారు. చివరికి రాజధానిలోని భవనాల్లో తలుపులు పగలగొట్టించి అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మార్చారని మండిపడ్డారు. గురువారం రాజధాని ప్రాంతంలో చంద్రబాబు నాలుగు గంటలపాటు విస్తృతంగా

మిగతా 12వ పేజీలో...

బరువెక్కిన మనసుతో..

రాజధాని దుస్థితికి కలత చెందిన సీఎం

నీళ్లలో నానుతున్న సెక్రటేరియట్ పునాదులను చూసి తీవ్ర ఆవేదన

12

అమరావతి ఔటర్ ప్రాజెక్టు

మళ్లీ పట్టాలపైకి

రంగం సిద్ధం చేస్తున్న ఆర్‌అండ్‌బీ

పెరగనున్న ప్రాజెక్టు వ్యయం

మరోసారి డీపీఆర్‌కు రూపకల్పన



గ్రూప్ 4 ఉద్యోగుల నివాస సముదాయం వద్ద సీఎం చంద్రబాబు

ఏసీబీ నుంచి మాజీ డీజీపీ అవుట్



రాజేంద్రనాథ్ రెడ్డి



సునీల్ కుమార్

ప్రాధాన్యం లేని ప్రింటింగ్‌కు రాజేంద్రనాథ్ రెడ్డి బదిలీ

సీఐడీ మాజీ చీఫ్ సునీల్‌కుమార్‌పైనా వేటు

జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశం

జగన్ భక్త ఎస్పీ రిశాంత్‌రెడ్డికీ ఉద్వాసన

అతుల్‌సింగ్‌కు ఏసీబీ అదనపు బాధ్యతలు

శంఖబ్రత బాగ్చీకి 'ఫైర్' అదనం

అమరావతి, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డితో అంటకాగి.. చంద్రబాబు, లోకేశ్ సహా ప్రతిపక్ష నేతలను, శ్రేణులను వేధించిన పోలీసు అధికారులపై టీడీపీ కూటమి ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. ముఖ్యంగా ఎన్నికల సమయంలో వైసీపీ సర్కారుకు అనుకూలంగా వ్యవహరించి ఎన్నికల కమిషన్ (ఈసీ) ఆగ్రహానికి గురై డీజీపీ పదవి కోల్పోయిన కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డికి, సీఐడీ మాజీ చీఫ్ పీవీ సునీల్‌కుమార్‌కు, ఎస్పీ రిశాంత్‌రెడ్డికి గట్టి షాకిచ్చింది. ప్రస్తుతం ఏసీబీ డీజీగా ఉన్న రాజేంద్రనాథ్‌రెడ్డిని

మిగతా 12వ పేజీలో...



ఏజీగా బాధ్యతలు స్వీకరిస్తున్న దమ్మాలపాటి

ఏజీగా దమ్మాలపాటి బాధ్యతల స్వీకారం

12

జగన్ నోట మళ్లీ మోసం పాట



ఎన్నికల్లో మోసం జరిగిందట.. కానీ సాక్ష్యాలు, ఆధారాల్లేవట!

- వైసీపీ ప్రజాప్రతినిధులు, ఓడిన అభ్యర్థులతో విస్తృత భేటీ
- పరాజితుల్లో సగమైనా హాజరుకాని వైనం
- ఆత్మవిమర్శ లేదు.. అభిప్రాయ సేకరణ లేదు
- అధికార పక్షంపై అప్పుడే విమర్శలు
- డిసెంబరు తర్వాత ఓదార్పు యాత్ర
- పథకాలు అందక జనాగ్రహం ఖాయం
- 2029లో బాబుకు సింగిల్ డిజిట్!
- వైసీపీకి మళ్లీ అధికారంపై జగన్ జోస్యం

అమరావతి, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో మోసం జరిగిందని మాజీ సీఎం, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మరోసారి వ్యాఖ్యానించారు. అయితే ఇందుకు సాక్ష్యాలు, ఆధారాల్లేవని చెప్పారు. టీడీపీ కూటమి పాలనలో రాష్ట్రంలో ఘోరం జరిగిపోతోందని ఆరోపించారు. రెడ్‌బుక్ చూపిస్తూ హోర్డింగులు పెడుతూ వైసీపీ నేతలను బెదిరిస్తున్నారని అన్నారు. గురువారమిక్కడ తాడేపల్లి ప్యాలెస్‌లో పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. జగన్ సహా 11 మంది ఎమ్మెల్యేలు, నలుగురు

మిగతా 11వ పేజీలో...

కార్పొరేషన్లలోని జగన్ సైన్యంపై వేటు

'ఆంధ్రజ్యోతి' కథనంతో తొలగింపు

రిటైర్మెంట్ తర్వాతా శాఖల్లోనే వైసీపీ సిబ్బంది

వారి రాజీనామాలు తీసుకోవాలని సీఎస్ ఉత్తర్వులు

11



'గనుల' ఫైళ్లు గల్లంతు!

ఇసుక, సర్వేరాళ్లు, సెక్యూరిటీ డిపాజిట్ల నోట్ ఫైళ్లు మాయం

- ఎన్నికల ఫలితాలు రాగానే చించేసిన కీలక అధికారులు
- రెగ్యులర్ రికార్డుల్లో ఆనవాళ్లు కూడా లేకుండా జాగ్రత్తలు
- ఉన్నతాధికారి వ్యక్తిగత సహాయకుడికి వాటిని తగులబెట్టే బాధ్యతలు
- ఫైళ్లు, ఇతర సామగ్రిని బయటికి తీసుకెళ్లడం సీసీ కెమెరాల్లో రికార్డు
- అంతా ముగిసిన తర్వాత గనుల శాఖ, ఏపీఎండీసీ కార్యాలయాలు సీజ్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గనుల శాఖలో చీకటి దందాలు బయటకు రాకుండా అక్రమార్కులు ముందుగానే జాగ్రత్త పడ్డారు. కొత్త ప్రభుత్వం అప్రమత్తమయ్యేలోపే కీలకమైన నోట్‌ఫైళ్లను, ఇతర డాక్యుమెంట్లను మాయం చేసేశారు. ఇసుక, మాంగనీస్, బీచ్ శాండ్, బొగ్గు, వివిధ రకాల ఖనిజాలకు ఇచ్చిన లెటర్ ఆఫ్ ఇండెంట్ (ఎల్‌వోఐ)లకు సంబంధించిన నోట్ ఫైళ్లను గనుల శాఖ కీలక అధికారి, మరో ముగ్గురు అధికారులు కలసి ఆనవాళ్లు కనబడకుండా చేసినట్లు సమాచారం. మాంగనీస్ టెండర్ల సెక్యూరిటీ డిపాజిట్‌ను దారి మళ్లించిన కేసులో ఉన్నతాధికారుల పాత్ర వెలుగు చూస్తుండటంతో ఈ కేసుతో పాటు ఇసుక, బొగ్గు, సర్వే రాళ్లకు సంబంధించిన ఫైళ్లను కూడా రెగ్యులర్ రికార్డుల నుంచి తొలగించి, చింపివేసినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత వాటిని తగులబెట్టే బాధ్యతను శాఖలోని ఓ ఉన్నతాధికారి వద్ద పనిచేసే వ్యక్తిగత సహాయకుడికి అప్పగించినట్లు సమాచారం. ఎన్నికల ఫలితాలు వచ్చిన మరుసటి రోజే పెద్ద ఎత్తున ఫైళ్లు, ఇతర సామగ్రిని అతను బయటకు తీసుకెళ్లడం ఇతర ఉద్యోగులు గమనించారు. ఇదంతా అక్కడి సీసీ కెమెరాలోనూ రికార్డయిందని తెలిసింది. చేతికి మట్టి అంటకుండా, అక్రమాలు బయటకు రాకుండా ఉండేందుకు ముందుగానే నోట్‌ఫైళ్లను తొలగించినట్లు స్పష్టమవుతోంది. ఈ వ్యవహారంలో

మిగతా 11వ పేజీలో...



ప్రొటెం స్పీకర్‌గా గోరంట్ల బుచ్చయ్య చౌదరితో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

నేటి నుంచి అసెంబ్లీ

మొదటి రోజు సభ్యుల ప్రమాణ స్వీకారాలు

రెండో రోజు స్పీకర్ ఎన్నిక, ప్రసంగాలు

11

ప్రొటెం స్పీకర్‌గా బుచ్చయ్య చౌదరి ప్రమాణం

50 శాతం మించొద్దు!

బిహార్ ప్రభుత్వ రిజర్వేషన్ల పెంపు కొట్టివేత

65 శాతం కుదరదన్న పట్నా హైకోర్టు

కులగణన ఆధారంగా రిజర్వేషన్లు పెంచాం

కులాల శాతం ప్రకారం కాదు

2

హైకోర్టులో రాష్ట్ర సర్కారు వాదన

సుప్రీంను ఆశ్రయిస్తామన్న డిప్యూటీ సీఎం

నీట్ పేపర్ లీక్

బిహార్‌లో ఒక రోజు ముందే మునిసిపల్ ఇంజనీర్ చేతికి

నితీశ్, అమిత్ అనే వ్యక్తులతో రూ.32 లక్షలకు ఒప్పందం

- తన మేనల్లుడు సహా నలుగురి కోసం పేపర్ కొనుగోలు
- మే 4నే ఆ నలుగురినీ పట్నాకు రప్పించి.. బస ఏర్పాట్లు
- వారిలో ఇద్దరి నుంచి.. రూ.40 లక్షల చొప్పున వసూలు
- పట్నాకు వచ్చిన అభ్యర్థులకు ప్రభుత్వ అతిథి గృహంలో బస
- చేయడానికి మాజీ మంత్రి తేజస్వీయాదవ్ పీఏ సహకారం



నీట్, యూజీసీ నెట్ పరీక్షల వివాదంపై ఢిల్లీలో విద్యార్థుల నిరసన

పట్నా, జూన్ 20: నీట్ పేపర్ లీక్ అయ్యింది! "అబ్బే.. నీట్‌లో ఎలాంటి అక్రమాలూ జరగలేదు, పేపర్ లీక్ అయ్యిందనడానికి ఎలాంటి ఆధారాలూ లేవు" అంటూ కేంద్ర ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని ఎంతగా దాచే ప్రయత్నం చేస్తున్నా నిజాలు దాగట్లేదు. మే 5న నీట్ పరీక్ష జరగ్గా.. దానికి ఒకరోజు ముందే.. అంటే మే 4వ తేదీనే ప్రశ్నపత్రం బిహార్‌లోని సికందర్ ప్రసాద్ యాదవేందు అనే ప్రభుత్వ ఉద్యోగి చేతికి చేరినట్టు రుజువైంది! దానాపూర్ మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జూనియర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న యాదవేందు.. నితీశ్ కుమార్, అమిత్ ఆనంద్ అనే

మిగతా 2వ పేజీలో...

డార్క్‌వెబ్‌లో.. యూజీసీ-నెట్ ప్రశ్నపత్రాలు



రుషికొండపై అన్నీ అబద్ధాలే

- పర్యాటక భవనం పేరిట కేంద్రానికి దరఖాస్తు
- పర్యాటకుల కోసం వసతులుంటాయని అనుమతులు
- అందుకు పూర్తి విరుద్ధంగా నిర్మాణాలు
- గతంలో అక్కడ ఏపీటీడీసీకి చెందిన హరిత రిసార్ట్
- వాటి స్థానంలో సీఎం క్యాంపు కార్యాలయానికి ప్లాన్
- 58 గదులు కూలగొట్టి.. కొత్తగా కట్టినవి 12 గదులే
- అవి కూడా జగన్ దంపతులు, వారి కుమార్తెలకే..
- పాత భవనాలు 48 వేల చ.అడుగుల్లోనే
- కొత్తగా 1,48,413 చ.అడుగుల్లో బిల్టప్ ఏరియా
- పేరుకే 7 బ్లాకులు.. నిర్మించింది ఐదే
- పర్యాటకుల కోసం వసతులు నిల్
- అంచనా వ్యయం 240 కోట్లు.. ఖర్చు 500 కోట్లు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రుషికొండపై రాజమహల్ నిర్మాణం విషయంలో జగన్ బృందం ఇప్పటికీ అబద్ధాలే వల్లెవేస్తోంది. అద్భుతమైన నిర్మాణం చేపడితే అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని ఆడిపోసుకుంటోంది. అక్కడ నిర్మించింది పూర్తిగా పర్యాటక భవనమే అని వాదిస్తోంది. అయితే అక్కడ పర్యాటకుల కోసం ఎలాంటి వసతులూ లేవు. గతంలో ఆ కొండపై ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ)కు చెందిన హరిత రిసార్ట్స్ ఉండేవి. అందులో పాతవి 34, కొత్తగా నిర్మించినవి 24 కలిపి మొత్తం 58 గదులు అందుబాటులో

మిగతా 11వ పేజీలో...



కేజ్రీవాల్‌కు బెయిల్

మద్యం కేసులో ఢిల్లీ కోర్టు మంజూరు

దర్యాప్తునకు ఆటంకం కలిగించొద్దు

పలు షరతులు పెట్టిన న్యాయస్థానం

2

అధికారుల ప్రకటనే చంపేసింది!

కళ్లకుర్చి కల్తీసారా ఘటనలో కొత్తకోణం

తమిళనాడులో 39కి పెరిగిన మృతుల సంఖ్య

తొలుత కల్తీ సారా తాగి మృతి చెందింది ఇద్దరే

అబ్బే.. అది కల్తీ సారా కాదన్న అధికారులు

2

దాంతో అంత్యక్రియల వద్ద, మళ్లీ అదే షాపులో కల్తీ సారా తాగిన 200 మంది

ఆస్పత్రుల్లో వందల మంది.. 24 మంది విషమం

33 మందికి కంటి చూపూ కష్టమే

డార్క్‌వెబ్‌లో.. యూజీసీ-నెట్ ప్రశ్నపత్రాలు

ఒక్కో పేపర్‌కు రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల ధర

న్యూఢిల్లీ, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): యూజీసీ-నెట్ ప్రశ్నపత్రం లీకైనట్లు తేలిపోయింది. దేశవ్యాప్తంగా మంగళవారం రెండు షిఫ్టుల్లో ఈ పరీక్ష జరగ్గా..సోమవారమే ప్రశ్నపత్రాలు డార్క్‌వెబ్‌లో అందుబాటులోకి వచ్చాయి. ఒక్కో ప్రశ్నపత్రానికి రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు ధర నిర్ణయించారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేసే సైబర్ క్రైమ్ హెచ్చరికల విశ్లేషణ యూనిట్-ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్(ఐ4సీ) ఈ విషయాన్ని గుర్తించింది. మంగళవారం యూజీసీ-నెట్ పరీక్ష ముగిశాక రెండు షిఫ్టుల ప్రశ్నపత్రాలు, డార్క్‌వెబ్‌లో సంపాదించిన క్వశ్చన్ పేపర్లతో పోల్చిచూశాక అవన్నీ సరిపోలడంతో బుధవారం కేంద్ర విద్యాశాఖకు సమాచారం అందజేసింది. గురువారం సాయంత్రం విలేకరుల సమావేశంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ విషయాలను నిర్ధారించారు. "బుధవారం మధ్యాహ్నం 3గంటలకు మాకు ఈ సమాచారం అందింది. వెంటనే యూజీసీ ఛైర్మన్‌తో మాట్లాడాను. డార్క్‌వెబ్‌లో ముందురోజే అందుబాటులోకి వచ్చిన ప్రశ్నపత్రాలు, టెలిగ్రామ్‌లో చక్కర్లు కొట్టిన ప్రశ్నలు యూజీసీ-నెట్ పరీక్ష పేపర్‌తో సరిపోలాయి" అని అన్నారు. అయితే గురువారం మధ్యాహ్నం విలేకరుల సమావేశంలో కేంద్ర విద్యాశాఖ సంయుక్త కార్యదర్శి గోవింద్ జైస్వాల్ లీకేజీ వ్యవహారమేమీలేదన్నారు. యూజీసీ-నెట్ పరీక్షపై ఎలాంటి ఫిర్యాదులు రాలేదని స్పష్టం చేశారు. యూజీసీ-నెట్ పరీక్ష విశ్వసనీయతకు భంగం వాటిల్లిందని ఐ4సీ అనుమానాలను వ్యక్తం చేయడంతో ఆ సమాచారాన్ని సుమోటోగా తీసుకుని, పరీక్షను రద్దు చేశామన్నారు. దీనిపై సీబీఐతో దర్యాప్తు చేయిస్తున్నట్లు తెలిపారు. కాగా జూన్ సెషన్ యూజీసీ-నెట్‌కు దేశవ్యాప్తంగా 11లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా మంగళవారం రెండు షిఫ్టుల్లో జరిగిన పరీక్షలకు 9లక్షల మంది హాజరయ్యారు. మరోవైపు నెట్ రద్దు, నీట్ పేపర్ లీకేజీ ఆరోపణలపై విద్యార్థి సంఘాలు భగ్గుమన్నాయి. గురువారం ఉదయం సెంట్రల్ ఢిల్లీలోని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇంటి ఎదుట ఆందోళన చేపట్టాయి. ఈ ధర్నాలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఏ, డీఎస్ఎఫ్, కేవైఎస్, ఎన్ఎస్‌యూఐ సంఘాలకు చెందిన 50 మంది నేతలు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. నీట్ లీకేజీ, నెట్ రద్దుపై ఆరెస్సెస్ అనుబంధ విద్యార్థి సంస్థ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఢిల్లీ యూనివర్సిటీ (డీయూ),జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం(జేఎన్‌యూ)లో ఏబీవీపీ నేతలు, కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. కాగా నెట్ లీకేజీ ఉదంతంపై గురువారం కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించినట్లు సీబీఐ ఓ ప్రకటనలో తెలిపింది.

నీట్ పేపర్ లీక్



(మొదటి పేజీ తరువాయి)

ఇద్దరు వ్యక్తుల నుంచి ఆ పేపర్‌ను సంపాదించాడు. తన మేనల్లుడు, నీట్ అభ్యర్థి అయిన అనురాగ్ యాదవ్‌తోపాటు శివనందన్ కుమార్, అభిషేక్ కుమార్, ఆయుష్ రాజ్ అనే మరో ముగ్గురు నీట్ అభ్యర్థుల కోసం యాదవేందు ఆ ప్రశ్నపత్రాన్ని రూ.32 లక్షలు పెట్టి కొన్నాడు. అదే ప్రశ్నపత్రాన్ని అతడు.. అభిషేక్ కుమార్, ఆయుష్‌రాజ్‌కు ఒక్కొక్కరికీ రూ.40 లక్షల చొప్పున విక్రయించాడు. ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న ఈ ఏడుగురూ.. తాము చేసిన నేరాన్ని అంగీకరిస్తూ కన్ఫెషన్ స్టేట్‌మెంట్లు ఇచ్చారు. దానాపూర్ మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి తాను ఒకసారి ఏదో పనిమీద వెళ్లినప్పుడు అక్కడ తనకు సికిందర్ కుమార్ యాదవేందుతో పరిచయం అయిందని.. అమిత్ ఆనంద్ తన కన్ఫెషన్ స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నాడు. తాను ఎలాంటి ప్రవేశ/పోటీ పరీక్ష పేపర్ అయినా లీక్ చేయగలనని మాటల మధ్యలో అతడికి చెప్పగా.. తనకు తెలిసిన నలుగురైదుగురు నీట్‌కు ప్రిపేర్ అవుతున్నారని, వారు ఆ పరీక్షలో ఉత్తీర్ణులయ్యేలా సహకరించాలని యాదవేందు తనను కోరాడని వివరించాడు. అందుకు రూ.30-32 లక్షల దాకా ఖర్చవుతుందని తాను చెప్పగా.. యాదవేందు అందుకు అంగీకరించాడని తెలిపాడు. ఒప్పందం మేరకు తాను పేపర్ తేగా.. మే 4న యాదవేందు తన వద్దకు నలుగురు అభ్యర్థులను తీసుకొచ్చాడని వెల్లడించాడు. బిహార్, యూపీ, ఝార్ఖండ్ తదితర రాష్ట్రాల్లో ప్రవేశ/పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలను లీక్ చేసే సాల్వర్ గ్యాంగుల్లో నితీశ్, అమిత్ గ్యాంగు కూడా ఒకటి. నీట్‌తోపాటు.. గతంలో బీపీఎస్సీ, యూపీఎస్సీ ప్రశ్నపత్రాలను లీక్ చేసిన చరిత్ర వీరికి ఉంది. ఇలా అమిత్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాకే.. రాజస్థాన్‌లోని కోటాలో నీట్ పరీక్షకు సిద్ధమవుతున్న తన మేనల్లుణ్ని, మిగతా ముగ్గుర్నీ యాదవేందు మే 4న పట్నాకు రప్పించాడు. అక్కడ నితీశ్, అమిత్ వారికి ప్రశ్నపత్రంతోపాటు జవాబులు అందజేసి.. సమాధానాలు బట్టీకొట్టడంలో సహకరించారు. ఆ మర్నాడు జరిగిన పరీక్షలో.. అవే ప్రశ్నలు వచ్చినట్టు నలుగురు అభ్యర్థులూ తమ నేరాంగీకార పత్రాల్లో పేర్కొన్నారు. నితీశ్, అమిత్ నుంచి నీట్ ప్రశ్నపత్రాన్ని యాదవేందు కొనుగోలు చేసినట్టు వెల్లడైన నేపథ్యంలో.. "వారు ఆ పేపర్‌ను ఇంకెంతమందికి అమ్మి ఉంటారో? ఎన్ని కోట్లు చేతులు మారి ఉంటాయో? చూడబోతే ఇదేదో చాలా పెద్ద కుంభకోణంలా ఉంది" అనే ఆందోళన లక్షలాది మంది అభ్యర్థుల్లో వ్యక్తమవుతోంది.

ఆ నలుగురూ..

తాను కోటాలో నీట్‌కు ప్రిపేర్ అవుతుండగా.. తన మేనమామ ఫోన్ చేసి ప్రశ్నపత్రం అందినట్టు తెలిపాడని యాదవేందు మేనల్లుడు అనురాగ్ యాదవ్ తన కన్ఫెషన్ స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నాడు. పరీక్షకు ముందురోజున ఆయన తనకు అమిత్ ఆనంద్‌ను, నితీశ్‌కుమార్‌ను పరిచయం చేశాడని.. వారు తనకు ప్రశ్నపత్రం, ఆన్సర్ కీ ఇచ్చారని వెల్లడించాడు. మరో విద్యార్థి శివనందన్ కుమార్.. తమకు యాదవేందుతో కుటుంబపరమైన సంబంధాలు ఉన్నాయని తెలిపాడు. ఆయన తనకు ఫోన్ చేసి.. ఒక ఇంటి చిరునామా ఇచ్చి.. మే 4న అక్కడికి రావాల్సిందిగా చెప్పాడని.. అక్కడే తనకు సాల్వర్ గ్యాంగ్ సభ్యులైన నితీశ్ కుమార్, అమిత్ ఆనంద్ పరిచయమయ్యారని వివరించాడు. మిగతా ఇద్దరు అభ్యర్థులైన అభిషేక్ కుమార్, ఆయుష్‌రాజ్ తండ్రులు అవధేష్‌కుమార్, అఖిలేష్ కుమార్.. తాము యాదవేందుకు రూ.40 లక్షల చొప్పున ఇచ్చినట్టు పోలీసులకు వెల్లడించారు. 'నీట్ ప్రశ్నపత్రం ఇచ్చినందుకుగాను.. యాదవేందుకు నేను రెండు బ్లాంక్ చెక్కులు ఇచ్చాను. రూ.40 లక్షలకు మాకు ఒప్పందం కుదిరింది' అని అవధేష్ కుమార్ లిఖితపూర్వకంగా తెలిపారు.

తేజస్వీ యాదవ్ పీఏ ప్రమేయం..

ముందుగానే అందిన ప్రశ్నపత్రం కోసం మే 4వ తేదీన పట్నాకు చేరుకున్న తన మేనల్లుడు, సోదరికి, మిగతా ముగ్గురు అభ్యర్థులకు వసతి కల్పించడంలో తాను సాయం చేశానని సికందర్ ప్రసాద్ యాదవేందు తన కన్ఫెషన్ స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నాడు. "నా మేనల్లుడు అనురాగ్ యాదవ్ తన తల్లి రీనాకుమారితో కలిసి పట్నాకు వచ్చాడు. పట్నా జూ, ఎయిర్‌పోర్టుకు సమీపంలోని ఒక ప్రభుత్వ అతిథిగృహంలో వారు బస చేయడానికి నేను ఏర్పాట్లు చేశాను" అని యాదవేందు పేర్కొన్నాడు. దీన్ని ధ్రువీకరించుకునేందుకు జాతీయ మీడియా ఆ గెస్ట్‌హౌస్ వద్దకు వెళ్లి ఆరా తీయగా.. వారి బసకు బిహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ పీఏ ప్రీతమ్ కుమార్ సిఫారసు చేసినట్టు బిల్ పుస్తకాల్లో నమోదైన వివరాల ద్వారా వెల్లడైంది.

పేపర్ లీక్ అయినా.. వచ్చింది 185 మార్కులే!

మేనమామ అక్షరాలా రూ.32 లక్షలకు నీట్ ప్రశ్నపత్రాన్ని కొనుగోలు చేశాడు! ఒక రోజు ముందే.. మేనల్లుడికి ఆ ప్రశ్నపత్రాన్ని, దాంతోపాటు జవాబులను ఇచ్చి బట్టీ కూడా కొట్టించాడు!! ఇంతా చేస్తే ఆ అభ్యర్థికి నీట్‌లో వచ్చిన మార్కులెన్నో తెలుసా? 720కిగాను.. 185 మార్కులే! బిహార్ పోలీసుల అదుపులో ఉన్న అనురాగ్ యాదవ్ కథ ఇది. పరీక్షకు ముందురోజు రాత్రంతా కూర్చుని సమాధానాలు బట్టీ పట్టినా.. అతడికి 54.84 పర్సెంటైల్ స్కోరు మాత్రమే వచ్చింది. ఫిజిక్స్‌లో 85. పర్సంటైల్, బయాలజీలో 51 పర్సంటైల్ రాగా.. కెమిస్ట్రీలో కేవలం 5 పర్సంటైల్ మాత్రమే రావడం గమనార్హం. అతడికి వచ్చిన ఆలిండియా ర్యాంకు 10,51,525 కాగా.. ఓబీసీ కేటగిరీలో 4,67,824 ర్యాంకు వచ్చింది. మిగతా అభ్యర్థుల్లో ఒకరికి 300 మార్కులు.. మరొకరికి 581 మార్కులు.. ఇంకొకరికి 483 మార్కులు వచ్చాయి.

నీట్ రద్దుపై కేంద్రానికి, ఎన్‌టీఏకి

సుప్రీంకోర్టు నోటీసులు

కౌన్సెలింగ్‌పై నిలుపుదల ఉత్తర్వులు ఇవ్వడానికి నో!



న్యూఢిల్లీ, జూన్ 20(ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్షను రద్దు చేసి, మళ్లీ కొత్తగా పరీక్ష నిర్వహించాలని కోరుతూ 20 మంది అభ్యర్థులు దాఖలుచేసిన పిటిషన్లపైన, నీట్ అక్రమాలపై స్వతంత్ర కమిటీతో దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ దాఖలైన మరో పిటిషన్‌పైన.. స్పందన తెలియజేయాలని సుప్రీంకోర్టు గురువారం కేంద్రానికి, ఎన్‌టీఏకి ఆదేశాలు జారీచేసింది. అలాగే.. ఈ వ్యవహారంపై దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లోని హైకోర్టుల్లో నమోదైన కేసులను సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలంటూ ఎన్‌టీఏ పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో అన్ని హైకోర్టుల్లో నీట్‌పై జరుగుతున్న ప్రొసీడింగ్స్‌పై స్టే విధించింది. జూలై 6 నుంచి నిర్వహించతలపెట్టిన నీట్ కౌన్సెలింగ్‌పై నిలుపుదల ఉత్తర్వులు ఇచ్చేందుకు మాత్రం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టితో కూడిన సుప్రీం ద్విసభ్య ధర్మాసనం తిరస్కరించింది. పిటిషనర్లలో పలు కోచింగ్ సంస్థలు ఉన్నట్టు కేంద్రం తరఫు న్యాయవాది విచారణ సందర్భంగా కోర్టు దృష్టికి తేగా.. వారు విద్యార్థులకు కోచింగ్ ఇచ్చే వ్యాపారం చేస్తున్నారని.. వారికి అలా వచ్చే హక్కు ఉన్నదని ధర్మాసనం స్పష్టం చేసింది. 'విద్యార్థుల హక్కులతో మీరు చెలగాటమాడితే కోచింగ్ సంస్థలు కోర్టుకు రాకుండా ఉంటాయా?' అని నిలదీసింది. కాగా.. సుప్రీంకోర్టు ఆదేశిస్తే నీట్‌ను మళ్లీ నిర్వహించేందుకు కేంద్ర విద్యాశాఖ సిద్ధంగా ఉందని సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. ఇక.. నీట్ అవకతవకలపై దేశవ్యాప్తంగా దుమారం రేగుతున్న నేపథ్యంలో ఈ అంశం కేంద్ర హోం మంత్రి అమిత్ షా వద్దకు చేరింది. కేంద్ర మంత్రులు ధర్మేంద్రప్రధాన్, జేపీ నడ్డా బుధవారం అమిత్ షాను ఆయన నివాసంలో కలిసి దాదాపు గంటసేపు మాట్లాడి, అన్ని వివరాలూ తెలిపినట్టు సమాచారం. మరోవైపు.. గ్రేస్ మార్కులు ఇచ్చిన 1500 మందికిపైగా అభ్యర్థులకు ఎన్‌టీఏ మరోసారి నిర్వహించనున్న పరీక్ష రాసే అవకాశం తమకు కూడా కల్పించాలని కోరుతూ ముగ్గురు అభ్యర్థులు దాఖలుచేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టేసింది.

ఎవరు తప్పు చేసినా వదిలేది లేదు: ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ, జూన్ 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తే తమకు అత్యంత ప్రాధాన్య అంశమని.. వారి ప్రయోజనాలను పరిరక్షించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్మాణం, పనితీరు, పారదర్శకత, డేటా సెక్యూరిటీ ప్రొటోకాల్ తదితర అంశాలపై క్షుణ్ణంగా విచారణ జరిపి ప్రభుత్వానికి సిఫారసులు చేసేందుకు ఒక ఉన్నతస్థాయి కమిటీని నియమిస్తామని ఆయన తెలిపారు. బిహార్‌లో నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై పోలీసు దర్యాప్తు జరుగుతోందని.. దానిపై త్వరలో తమకు నివేదిక అందుతుందని వెల్లడించారు. కొన్ని చోట్ల తప్పులు జరిగాయని అంగీకరించిన ఆయన.. తప్పు చేసిన వారు ఎన్‌టీఏకు చెందినవారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ఎంత పెద్దవారైనా క్షమించబోమని హెచ్చరించారు.

లోకం తీరు



విద్యావ్యవస్థను బీజేపీ, ఆర్ఎస్ఎస్ చెరబట్టాయి

- యుద్ధాలను ఆపినోళ్లు.. పేపర్ లీక్‌ను అడ్డుకోలేకపోయారా?: రాహుల్



న్యూఢిల్లీ, జూన్ 20: ఉక్రెయిన్-రష్యా, ఇజ్రాయెల్-గాజా యుద్ధాలను ఆపినట్లుగా చెప్పుకొనే మోదీ.. పేపర్ లీక్‌ను అడ్డుకోలేకపోయారా? అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. విద్యావ్యవస్థను బీజేపీ, ఆర్ఎస్ఎస్ చెరబట్టాయని, అందుకు మోదీ అవకాశం కల్పించారని ఆరోపించారు. గురువారం ఢిల్లీలో రాహుల్ విలేకరులతో మాట్లాడారు. మోదీ దృష్టంతా లోక్‌సభ స్పీకర్ పదవి తమవారికి దక్కేలా చూడడంపైనే ఉందని, లక్షలాది మంది విద్యార్థులకు సంబంధించిన నీట్ పేపర్ లీకేజీ అంశం ఆయనకు ప్రాధాన్యంగా కనిపించడం లేదని ధ్వజమెత్తారు. మోదీ సైద్ధాంతికంగా పతనం అయ్యారని, ప్రభుత్వాన్ని నడపడంలో ఆయనకు ఇబ్బందులు తప్పవని పేర్కొన్నారు. మరోవైపు నీట్ లీకేజీలో అరెస్టయిన సికిందర్ ప్రసాద్ యదువేందుకు ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని బిహార్ డిప్యూటీ సీఎం విజయ్‌కుమార్ సిన్హా ఆరోపించారు.

విద్యావ్యవస్థను ధ్వంసం చేశారు: ఖర్గే

విద్యావ్యవస్థను మోదీ ప్రభుత్వం ధ్వంసం చేసిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. నీట్, యూజీసీ-నెట్, సీయూఈటీల్లో ప్రశ్నపత్రాల లీకులు, అక్రమాలు-అవకతవకలు, మోసాలు బహిర్గతమయ్యాయని పేర్కొన్నారు. గురువారం ఆయన 'ఎక్స్' వేదికగా ఓ పోస్టు చేశారు. రోజుకో ప్రశ్నపత్రం లీక్ అవుతోందని, ఇదేం 'పరీక్షా పే చర్చ' అని ఎద్దేవా చేశారు.



మృతదేహాలకు సామూహిక దహనం

అధికారుల ప్రకటనే చంపేసింది!

- కళ్లకుర్చి కల్తీసారా ఘటనలో కొత్తకోణం
- 39కి పెరిగిన కల్తీసారా మృతులు
- రోదనలతో మిన్నంటిన కరుణాపురం

చెన్నై, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): కల్తీసారా తాగి ఇద్దరు వ్యక్తులు మృతి చెందితే.. అబ్బే.. అదేం లేదు.. అది కల్తీ కాదు అని అధికారులు చేసిన తప్పుడు ప్రకటన ఏకంగా 39మందిని పొట్టన పెట్టుకుంది! 24 మంది పరిస్థితి విషమంగా ఉండగా, మరెంతోమంది ఆస్పత్రుల్లో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. 33 మంది కంటిచూపు కోల్పోయే ప్రమాదంలో పడగా, ఏ క్షణం ఏం జరుగుతుందోనని స్థానికులు బిక్కుబిక్కుమంటూ తీవ్ర భయాందోళనతో గడుపుతున్నారు. వాస్తవానికి మంగళవారం సాయంత్రం ఒకే కుటుంబానికి చెందిన సురేష్, ప్రవీణ్ అనే యువకులు కల్తీసారా తాగి తీవ్ర అస్వస్థతకు గురై మరణించారు. అయితే వారు కల్తీసారా వల్ల మృతి చెందలేదని, తమ వైద్యశాఖాధికారులు అన్నీ పరిశీలించాకే ఈ ప్రకటన చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఆయన మాటలు నమ్మిన గ్రామస్థులు బుధవారం ఉదయం సురేష్, ప్రవీణ్ అంత్యక్రియలకు వచ్చి, ఆ పక్కనే ఉన్న సారా దుకాణంలో సారా తాగారు. మృతుల కుటుంబీకులు కూడా సంప్రదాయబద్ధంగా కొన్ని సారా ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ మొత్తం వ్యవహారం ఇంతమంది చావుకు కారణమైందని గ్రామస్థులు తెలిపారు. మొత్తం 200 మందికి పైగా ఇలా సారా సేవించినట్లు తేలింది. వీరిలో 39 మంది కన్నుమూయగా, మిగిలిన వారు ఆసుపత్రులపాలయ్యారు. కాగా ఆసుపత్రుల్లో వందమంది మాత్రమే ఉన్నట్లు తేలడంతో మిగిలిన 60 మంది ఏమయ్యారన్న అనుమానాలతో నర్సులు, ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికీ తిరిగి పరిస్థితిని అంచనా చేశారు. వీరిలో 32 మంది జాడ తెలియడంతో వారిని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా, ఈ ఉదంతంతో కళ్లకుర్చి కలెక్టరును బదిలీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా ఎస్పీని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే!.

వీధి వీధంతా శవాల గుట్ట!

కరుణాపురంలో కల్తీసారా మృతుల సంఖ్య గురువారానికి 39కి చేరింది. వీరిలో ఐదుగురు మహిళలున్నారు. ఎటు చూసినా ఆ ప్రాంతం రోదనలు, వేదనలతో కన్నీటిసంద్రంలా మారిపోయింది. తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు, భర్తను కోల్పోయిన భార్య, భార్యను కోల్పోయిన భర్త, తమ ఇంటి పెద్దలను కోల్పోయిన కుటుంబీకుల రోదనలతో ఏ ఇల్లు చూసినా విషాదంలో మునిగిపోయింది. ఒకే వీధిలో ఏకంగా 15 మంది మృతి చెందడంతో ప్రతి ఇంటి ముందూ ఒక షామియానా, దాని కింద మృతదేహం కనిపించాయి. ఒకేసారి ఇంతమంది మృతి చెందడంతో ఆ చుట్టుపక్కల శవపేటికలు కూడా దొరకడం లేదు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను మంత్రి ఉదయనిధి స్టాలిన్ పరామర్శించి, వారికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించారు. ప్రభుత్వం తరఫున తలా రూ.10 లక్షల చొప్పున పరిహారపు చెక్కులను అందజేశారు. మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, ప్రముఖ నటుడు విజయ్ మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఈ వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించేలా ఆదేశించాలని కోరుతూ అన్నాడీఎంకే హైకోర్టును ఆశ్రయించింది. కళ్లకుర్చి ఘటనపై విచారణ జరిపేందుకు హైకోర్టు మాజీ జడ్జి గోకుల్‌దాస్ నేతృత్వంలో విచారణ కమిషన్‌ను నియమించినట్లు సీఎం స్టాలిన్ ప్రకటించారు.

50% మించొద్దు!

బిహార్ రిజర్వేషన్ల పెంపు కొట్టివేత.. 65% కుదరదన్న పట్నా హైకోర్టు

పట్నా, జూన్ 20: ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో రిజర్వేషన్లను 65 శాతానికి పెంచుతూ ఇటీవల నితీశ్ కుమార్ నేతృత్వంలోని బిహార్ సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని పట్నా హైకోర్టు కొట్టేసింది. రిజర్వేషన్లు 50% దాటరాదని సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పునకు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం భిన్నంగా ఉండటంతో జస్టిస్ కె.వినోద్ చంద్రన్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకుంది. గత ఏడాది నితీశ్ సర్కారు రాష్ట్రవ్యాప్తంగా కుల గణన చేపట్టి, వాటి ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈబీసీల రిజర్వేషన్లను పెంచాలని నిర్ణయించింది. ఈ మేరకు గత ఏడాది నవంబరు 21న రిజర్వేషన్లను 50% నుంచి 65 శాతానికి పెంచుతూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ డబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పదిశాతంతో కలిపితే రిజర్వేషన్లు 75 శాతానికి చేరాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 16లను రిజర్వేషన్‌ల పెంపు నిర్ణయం ఉల్లంఘిస్తోందంటూ పలువురు హైకోర్టులో పిటిషన్లు వేశారు. హైకోర్టు గత మార్చిలో ఇరు వర్గాల వాదనలు విని తీర్పును వాయిదా వేసింది. గురువారం పిటిషనర్ల వాదనను హైకోర్టు సమర్థిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పెంచిన రిజర్వేషన్లను కొట్టేసింది. చట్టం ముందు అందరూ సమానులే(ఆర్టికల్14), సమాన అవకాశాలు(ఆర్టికల్ 16) అనే రాజ్యాంగ నిబంధనలు ఉల్లంఘనకు గురైనట్లు హైకోర్టు అంగీకరించింది. కులగణన ఆధారంగా రిజర్వేషన్లను పెంచామన్న వాదనను హైకోర్టు అంగీకరించలేదు. తాము జనాభాలో కులాల శాతాన్ని బట్టి రిజర్వేషన్ పెంచలేదని, తగిన ప్రాతినిధ్యం లభించని కులాలకు ప్రాతినిధ్యం కల్పించేందుకే రిజర్వేషన్లను పెంచామని ప్రభుత్వ న్యాయవాది వాదించారు. ఈ వాదనను పిటిషనర్లు తోసిపుచ్చారు. కులాల శాతాన్ని బట్టే పెంచారని పిటిషనర్లు అన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు 10% కల్పించినపుడే 50% దాటినందున తాము కొత్తగా ఏమీ సుప్రీం తీర్పును ఉల్లంఘించలేదన్న ప్రభుత్వ వాదనను హైకోర్టు తోసిపుచ్చింది.

తమిళనాడులో 50 శాతానికి మించి

రిజర్వేషన్లు 50 శాతానికి మించి ఉండరాదని 1992లో ఇంద్రా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఇందుకు భిన్నంగా తమిళనాడులో ఎప్పటి నుంచో 69% రిజర్వేషన్లు అమలవుతున్నాయి. తమిళనాట దశాబ్దాలుగా అమలవుతున్న రిజర్వేషన్లను కాపాడేందుకు అప్పట్లో కేంద్రం తమిళనాడు రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చింది. తొమ్మిదో షెడ్యూల్‌లోని అంశాలపై న్యాయ సమీక్షకు అవకాశం లేదు. దాంతో కొన్నాళ్లపాటు సుప్రీంకోర్టు తమిళనాడు రిజర్వేషన్ల జోలికి పోలేదు. తర్వాత కాలంలో సుప్రీంకోర్టు తొమ్మిదో షెడ్యూల్‌లోని అంశాలనూ అవసరమైతే సమీక్షిస్తామని స్పష్టం చేసింది. దాంతో తమిళనాడు రిజర్వేషన్లపై అనేక పిటిషన్లు దాఖలై సుప్రీంకోర్టులో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నాయి. 50% నిబంధన వచ్చిన తర్వాత మహారాష్ట్రలో మరాఠాల కోసం, రాజస్థాన్, హరియాణాల్లో జాట్‌ల కోసం రిజర్వేషన్లను 50 శాతానికి మించి పెంచే ప్రయత్నం చేయగా సుప్రీంకోర్టు కొట్టేసింది. ఇప్పుడు తాజాగా కుల గణన ప్రాతిపదికన రిజర్వేషన్లను పెంచేందుకు బిహార్ ప్రభుత్వం చేసిన ప్రయత్నాన్ని అక్కడి హైకోర్టు కొట్టేసింది.

సుప్రీంకోర్టుకు వెళతాం

హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి అన్నారు. బీజేపీ బిహార్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కూడా అయిన సామ్రాట్ చౌదరి తమ పార్టీ రిజర్వేషన్ల పెంపును పూర్తిగా సమర్థిస్తోందని చెప్పారు. తమ మద్దతుతోనే నితీశ్ ప్రభుత్వం కుల గణన చేపట్టి, ఆయా కులాలకు రిజర్వేషన్లు పెంచాలని నిర్ణయం తీసుకుందని తెలిపారు. తమిళనాడుకు 69% రిజర్వేషన్ ఉన్నపుడు బిహార్‌కు ఎందుకు ఉండరాదని ప్రశ్నించారు. హైకోర్టు తీర్పు తనను దిగ్భ్రాంతికి గురి చేసిందని ఆర్జేడీ అధినేత తేజస్వి యాదవ్ అన్నారు. బిహార్ సర్కారు వెంటనే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తుందా? అని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ప్రశ్నించారు.

చిన్నారి ప్రాణం ఖరీదు

16 కోట్లు!

- 9 నెలల పాపకు స్పైనల్ మస్కులర్ అట్రోఫి
- జోల్‌జెన్‌స్మా ఇంజెక్షన్ ఖరీదు రూ.16 కోట్లు
- ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని తల్లిదండ్రుల వేడుకోలు



గుంటూరు, జూన్ 20: బుడిబుడి నడకలతో ఇల్లంతా సందడి చేయాల్సిన ఆ చిన్నారి స్పైనల్ మస్కులర్ అట్రోఫి (ఎస్ఎంఏ) అనే ప్రాణాంతక వ్యాధి బారిన పడింది. వెన్నెముకపై ప్రభావం చూపే ఈ వ్యాధి కారణంగా తొమ్మిది నెలల ఆ పసిపాప.. కూర్చోవడం, మింగడం, శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బంది పడుతోంది. ఈ వ్యాధికి చికిత్స చేయాలంటే జోల్‌జెన్‌స్మా అనే ఇంజెక్షన్‌కు రూ.16 కోట్లు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. అది విని తల్లిదండ్రులు హతాశులయ్యారు. తమకు అంత స్థోమత లేదని.. ప్రభుత్వం, దాతలు సహకరించి తమ చిట్టితల్లి ప్రాణాలు నిలబెట్టాలని వేడుకుంటున్నారు. గుంటూరులోని చాంబర్ ఆఫ్ కామర్స్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో చిన్నారి తల్లిదండ్రులు మాట్లాడారు. గుంటూరు చాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు తూనుగుంట్ల నాగేశ్వరరావు కుమార్తె గాయత్రికి, రాజమండ్రికి చెందిన వెచ్చా ప్రీతమ్‌తో వివాహమైంది. వారిద్దరూ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. గతేడాది వారికి పాప హితైషీ జన్మించింది. తొమ్మిదినెలలు వచ్చినా ఆపాప కూర్చోలేకపోవడం, మింగడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతోంది. అరుదైన ప్రాణాంతక స్పైనల్ మస్కులర్ అట్రోఫి (ఎస్ఎంఏ) టైప్-1 సోకిందని వైద్యులు గుర్తించారు. దీనికి చికిత్స అందుబాటులో ఉందని, జోల్‌జెన్‌స్మా ఇంజెక్షన్‌కు రూ.16కోట్లు ఖర్చవుతుందని తెలిపారు. పాపకు రెండు నెలల్లో చికిత్స అందించాల్సి ఉందన్నారు. దాతలు స్పందించి తమ పాపకు ప్రాణదానం చేయాలని వేడుకుంటున్నారు. సాయం చేయదలచిన వారు వెచ్చా ప్రీతమ్ ఫోన్ నంబర్ 7794024001ను సంప్రదించాలని కోరుతున్నారు. ఆర్‌బీఎల్‌బ్యాంకు ఖాతా నంబరు 222330038835175, (ఐఎఫ్ఎస్‌సీ కోడ్ RATN0 VAAPIS) ద్వారా ఆర్థిక సాయం అందించాలని కోరారు.

మద్యం కేసులో కేజ్రీకి బెయిల్

న్యూఢిల్లీ, జూన్ 20(ఆంధ్రజ్యోతి): ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు మద్యం కుంభకోణం కేసులో ఎట్టకేలకు రెగ్యులర్ బెయిల్ లభించింది. ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు వెకేషన్ జడ్జి నియాయ్ బిందు గురువారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. రూ.లక్ష వ్యక్తిగత పూచీకత్తును సమర్పించాలని, దర్యాప్తునకు ఆటంకం కలిగించొద్దని, విచారణకు సహకరించాలని, సాక్షులను ప్రభావితం చేయొద్దని, పిలిచినపుడు కోర్టుకు రావాలని పలు షరతులు విధించారు. కేజ్రీ బెయిల్ పిటిషన్‌కు సంబంధించి గురువారం తీర్పును రిజర్వు చేసిని ఉదయం జడ్జి నియాయ్ బిందు.. సాయంత్రానికి బెయిల్ ఇచ్చారు. బెయిల్ బాండ్ పత్రాలపై సంతకం చేసేందుకు 48 గంటల పాటు బెయిల్ ఆర్డర్‌ను నిలిపివేయాలని ఈడీ విజ్ఞప్తి చేసింది. తీర్పును పై కోర్టులో సవాల్ చేసుకునే వీలు కలుగుతుందని పేర్కొంది. ఈ వాదనను జడ్జి తిరస్కరించారు. కేజ్రీ తరఫు న్యాయవాదులు శుక్రవారం బెయిల్ బాండ్ పత్రాలను కోర్టుకు సమర్పించనున్నారు. అనంతరం ఆయన తిహాడ్ జైలు నుంచి విడుదల కానున్నారు. మరోవైపు కేజ్రీకి బెయిల్ మంజూరు నేపథ్యంలో ఢిల్లీ మద్యం స్కాంలో మిగతా నిందితులకూ త్వరలో బెయిల్ లభించే అవకాశం ఉందనే అభిప్రాయం న్యాయ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

ఇక ముద్రగడ పద్మనాభ రెడ్డి!

పేరు మార్చుకున్న కాపు ఉద్యమ నేత

కిర్లంపూడి, జూన్ 20: కాపు ఉద్యమ నేత, వైసీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం తన పేరును ముద్రగడ పద్మనాభ రెడ్డిగా మార్చుకున్నారు. కొన్నిరోజుల క్రితం ఆయన చేసిన దరఖాస్తు మేరకు రాష్ట్ర ప్రభుత్వం ముద్రగడ పద్మనాభ రెడ్డిగా పేరు మార్చుతూ బుధవారం గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఎన్నికలకు ముందు వైసీపీలో చేరిన ముద్రగడ.. పిఠాపురంలో లక్ష ఓట్ల మెజార్టీతో గెలుస్తానని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించగా, పవన్‌ను ఓడించి ఇంటికి పంపిస్తామని, లేనిపక్షంలో తన పేరు పద్మనాభ రెడ్డిగా మార్చుకుంటానని సవాల్ విసిరిన సంగతి తెలిసిందే.

ఉపాధి నిధులపై సోషల్ ఆడిట్!

- నిధులు దుర్వినియోగంపై పర్యవేక్షణ
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశం
- ఉపాధి హామీ పథకంపై సుదీర్ఘ సమీక్ష



అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అమరావతి, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం నిధులు సద్వినియోగం చేసుకోవాలని, గ్రామాల్లో పగడ్బందీగా సోషల్ ఆడిట్ చేయాలని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ విభాగం అధికారులతో గురువారం ఉదయం ఆయన విజయవాడలోని తన క్యాంప్ కార్యాలయంలో రెండున్నర గంటలపాటు సమీక్ష నిర్వహించారు. సోషల్ ఆడిట్ ప్రక్రియపై చర్చించారు. సోషల్ ఆడిట్ ద్వారా నిధుల దుర్వినియోగాన్ని గుర్తించే పద్ధతిని అధికారులు డిప్యూటీ సీఎంకు వివరించారు. కాగా, ఈ పథకాన్ని గ్రామీణాభివృద్ధి కోసం మరింత విస్తృతంగా ఎలా వినియోగించుకోవచ్చనే అంశంపై పవన్ అధికారులతో చర్చించారు. సోషల్ ఆడిట్ పక్కాగా జరగాలని, ఉపాధి హామీ నిధులు దుర్వినియోగం కాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.

2047 విజన్‌కు అనుగుణంగా పనిచేద్దాం..

కేంద్ర ప్రభుత్వ విజన్ 2047కు అనుగుణంగా పనిచేద్దామని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అధికారులకు సూచించారు. తన క్యాంప్ కార్యాలయంలో ఏపీ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ అధికారులతో ఆయన గురువారం సమీక్ష నిర్వహించారు. చిన్నారుల్లోని ప్రతిభను వెలికితీసేలా భారీ వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించాలని సూచించారు. ఇక, రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి పవన్ కల్యాణ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ముత్యపు కవచంలో మురిపించిన మలయప్ప



తిరుమల, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి జ్యేష్టాభిషేక ఉత్సవాల్లో రెండవ రోజైన గురువారం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి ముత్యపు కవచంలో భక్తులను మురిపించారు. శ్రీవారి ఆలయంలోని సంపంగి ప్రాకారంలో 9 నుంచి 11 గంటల వరకు మలయప్పస్వామికి, దేవేరులకు అభిదేయక అభిషేకాన్ని కన్నులపండువగా చేపట్టారు. సాయంత్రం మలయప్పస్వామికి ముత్యపు కవచ సమర్పణ చేశారు. అనంతరం సహస్ర దీపాలంకార సేవలో స్వామి ముత్యపు కవచంలో భక్తులను అనుగ్రహించారు.

శ్రీవారి మెట్టు మార్గంలో స్కానింగ్ పునఃప్రారంభం

» స్కాన్ చేసిన టోకెన్లుంటేనే దివ్యదర్శనం: టీటీడీ

తిరుమల, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు వెళ్లే శ్రీవారి మెట్టు నడక మార్గంలో 1200వ మెట్టు వద్ద దివ్య దర్శనం టోకెన్ స్కానింగ్‌ను టీటీడీ తిరిగి ప్రారంభించింది. దీనికి సంబంధించి గురువారం ట్రయల్ రన్ నిర్వహించింది. దివ్య దర్శన టోకెన్లు పొందిన భక్తులు శుక్రవారం నుంచి విధిగా 1200వ మెట్టు వద్ద స్కానింగ్ చేయించుకోవాల్సి ఉంటుంది. లేకుంటే భక్తులకు దివ్యదర్శన క్యూలైన్‌లోకి అనుమతి ఉండదని టీటీడీ స్పష్టం చేసింది. గతంలో దివ్యటోకెన్లున్న భక్తులు మార్గ మధ్యంలోని కౌంటర్లలో తప్పనిసరిగా స్కానింగ్ చేసుకోవాలనే నిబంధన ఉండేది. అయితే పులుల సంచారం నేపథ్యంలో ఈ టోకెన్లున్నా తప్పనిసరిగా నడిచి రావాలనే నిబంధనను టీటీడీ తాత్కాలికంగా రద్దు చేసింది.

'సస్పెండైన టీచర్లకు పోస్టింగ్ ఇవ్వాలి'

అమరావతి, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో వివిధ కారణాలతో సస్పెన్షన్‌కు గురైన టీచర్లపై సస్పెన్షన్ ఎత్తివేసి, తిరిగి పోస్టింగ్ ఇవ్వాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, యూటీఎఫ్ అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం సచివాలయంలో సీఈవో ఎంకే మీనాను కలిసి వినతిపత్రం అందజేశారు. కొందరికి షోకాజ్ నోటీసులు జారీచేశారని, వాటిని రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎయిడెడ్ పోస్టుల భర్తీకి అనుమతి

అమరావతి, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ ఎత్తివేసినందున ఎయిడెడ్ పాఠశాలల్లో టీచర్లు, ఇతర సిబ్బందిని నియమించుకునేందుకు పాఠశాల విద్యాశాఖ అనుమతిచ్చింది. ఈ మేరకు కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. గతంలో ప్రభుత్వం అనుమతించిన పోస్టులనే భర్తీచేయాలని స్పష్టంచేశారు.

ఏపీ నిట్‌లో సీట్ల కేటాయింపు పూర్తి

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 20: ఏపీ నిట్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి నిర్వహిస్తున్న కౌన్సెలింగ్‌లో 480 సీట్లకు కేటాయింపులు పూర్తయ్యాయని రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి తెలిపారు. సీఈసీలో 90, ఈఈఈ 90, ఈసీఈ 90, సివిల్ 60, మెకానికల్ 60, కెమికల్ 30, బయో టెక్నాలజీ 30, ఎంఎంఈ 30 చొప్పున మొత్తం 480 సీట్లు ఉన్నాయన్నారు. వీటిలో 50 శాతం సీట్లను రాష్ట్ర విద్యార్థులతోనూ, మిగిలిన వాటిని ఇతర రాష్ట్రాల విద్యార్థులతోనూ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తున్నామన్నారు. విద్యార్థులు ఈ నెల 24వ తేదీలోగా ఆన్‌లైన్ రిపోర్టింగ్‌తో పాటు ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

ఏఎన్‌యూ ఐసెట్, పీజీ సెట్ దరఖాస్తుల గడువు పొడిగింపు

పెదకాకాని, జూన్ 20: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సెల్ఫ్ సపోర్టు కేటగిరిలో నిర్వహిస్తున్న ఏఎన్‌యూ ఐసెట్, పీజీ సెట్‌లకు సంబంధించి దరఖాస్తు గడువును పొడిగించినట్టు అడ్మిషన్ డైరెక్టర్ డాక్టర్ జి.అనిత గురువారం తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు జూలై రెండో తేదీలోగా వెయ్యి రూపాయల అపరాధ రుసుము చెల్లించి ఆఫ్‌లైన్‌లో ఐసెట్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్టు పేర్కొన్నారు. అర్హత పరీక్ష జూలై 3న నిర్వహిస్తామన్నారు. ఐసెట్ పరీక్ష ద్వారా ఎంబీఏ కేటగిరిలో 8 కోర్సులకు ప్రవేశం కల్పిస్తామని తెలిపారు. పీజీ సెట్ 2024కు సంబంధించి దరఖాస్తు గడుగు జూలై 18 వరకు పొడిగించినట్టు పేర్కొన్నారు. ఎంఏ, ఎంఎస్సీ, ఎంకామ్, ఎంఈడీ తదితర పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూఏఎన్యూ.ఏసి.ఇన్‌లో సంప్రదించాలని సూచించారు.

మున్సిపాలిటీల్లో శంకర్‌దాదాలు

» చదివింది ఐటీఐ... చేస్తుంది డీఈ ఉద్యోగం

» రాజస్థాన్ డిగ్రీలతో వైఎస్ఆర్ కాలంలో 2008లో అడ్డగోలుగా ఏఈ ప్రమోషన్‌లు

» మళ్లీ జగన్‌రెడ్డి హయాంలో మరోసారి పదోన్నతి

» ఏపీపీఎస్సీ ద్వారా వచ్చిన వారికి తీవ్ర అన్యాయం

గుంటూరు సిటీ, పిడుగురాళ్ల, జూన్ 20: 10వ తరగతి పాసైన తరువాత వాళ్లు చదివింది ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఐటీఐ)లో. ఆయా కోర్సులకు అనుగుణంగా వాళ్లంతా డీజిల్ మెకానిక్‌గా, పంపు మెకానిక్‌గా, వాటర్ వర్క్స్ ఆపరేటర్లుగా రాష్ట్ర ప్రభుత్వంలో చిరు ఉద్యోగాల్లో చేరారు. ఇలా ఐటీఐ అర్హతతో మున్సిపాలిటీల్లో చిన్నా చితక ఉద్యోగాల్లో చేరిన వారు జోన్ 3లో (గుంటూరు, ప్రకాశం, నెల్లూరు) సుమారు 25 మంది ఉన్నారు. వీరు దూర విద్య ద్వారా వినాయక మిషన్ (సేలం), ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్ ఆఫ్ గాంధీ మందిర్ (రాజస్థాన్), జనార్దన్‌రాయ్ నగర్ రాజస్థాన్ విద్యాపీఠం (రాజస్థాన్), కళింగ యూనివర్సిటీ (రాజ్‌పూర్), నేతాజీ సుభాష్ చంద్రబోస్ యూనివర్సిటీ (రాజ్‌పూర్)లలో ఇంజనీరింగ్ చదివినట్లు సర్టిఫికెట్‌లు పుట్టించారు. అదే సమయంలో రాజస్థాన్ డిగ్రీలుగా పేరుపొందిన వీటిపై దేశవ్యాప్తంగా దుమారం చెలరేగింది. దీంతో ఆయా యూనివర్సిటీలకు చెందిన సర్టిఫికెట్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చెల్లవని అప్పటి ఉన్నత విద్యామండలి ప్రకటించింది. మరోవైపు పంజాబ్ - హరియాణా హైకోర్టు ఆ డిగ్రీలు చెల్లవని 2008లోనే తీర్పు ఇచ్చింది. అయినా ఆంధ్రప్రదేశ్‌లోని అప్పటి ప్రభుత్వ పెద్దలు అధికారులు వాటిని పెడచెవిన పెట్టారు. వారిపట్ల నాటి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం ఉదారంగా వ్యవహరించింది. వైఎస్ కూడ 'ఎస్' అనడంతో బీటెక్ చదివిన వారు వేలాదిమంది ఉండగా అర్హత లేని, ఐటీఐ చదివిన వారు 2008లోనే ఏఈలుగా అందలమెక్కారు. ఏపీపీఎస్సీ ద్వారా ఏఈలుగా ఉద్యోగంలో చేరిన వారు వారికి పదోన్నతులు ఇవ్వడం చట్ట విరుద్ధమంటూ నెత్తీనోరు బాదుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఆ తరువాత 2012లో దేశ అత్యున్నత న్యాయస్థానం కూడా ఆ సర్టిఫికెట్‌లు చెల్లవని తీర్పు చెప్పింది. అయితే అప్పటికే ఏఈలుగా పదోన్నతి పొంది ఆయా మున్సిపాలిటీల్లో హల్‌చల్ చేస్తున్న వారంతా మరో ప్రమోషన్ కోసం పైరవీలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో 2019, ఫిబ్రవరి 6న 11 మంది డైరెక్ట్ ఏఈలు బయట రాష్ట్రాలకు చెందిన డిగ్రీలతో ఉద్యోగం పొందిన వారికి ప్రమోషన్లు ఇవ్వొద్దని అప్పటి ఈఎన్‌సీకి లేఖ రాశారు. 2019లో జగన్ ప్రభుత్వం వచ్చిందో లేదో పక్క రాష్ట్రాల డిగ్రీలతో ఏఈలు అయిన వారికి ప్రమోషన్‌లు ఇచ్చేందుకు ఈఎన్‌సీ(ఇంజనీరింగ్ ఇన్ చీఫ్)లు చకచకా ఫైళ్లు కదిలించారు. అంతే ఏ అర్హతా లేకుండా వైఎస్ఆర్ హయాంలో ఏఈలుగా ప్రమోషన్లు పొందిన వారంతా మళ్లీ జగన్మోహన్ రెడ్డి హయాంలో డిఈలుగా పదోన్నతులు కొట్టేశారు.

వారు వైసీపీకి వీర భక్తులు

ఈ రాజస్థాన్ డిగ్రీ డిఈలే జగన్ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు జోన్-3లోని కీలక మున్సిపాలిటీల్లో వైసీపీకి అనుకూలంగా చక్రం తిప్పారు. ఎమ్మెల్యేలు ఏది చెబితే అది చేసి ఇష్టానుసారంగా బిల్లులు డ్రా చేయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉదాహరణకు పల్నాడు జిల్లా పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల మున్సిపాలిటీల్లో కోట్లలో నిధులు డ్రా చేసినట్లు సమాచారం. సరైన నాణ్యత లేకుండా పనులు చేసినా ఎమ్మెల్యే చెప్పారన్న సాకుతో డీఈలు రూ.కోట్లు వైసీపీ కార్యకర్తలకు దోచిపెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వం అయినా ఈ వ్యవహారంపై విచారణ జరిపి పక్క రాష్ట్రాల డిగ్రీలతో ఉన్నత పదవులు అనుభవిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

రాష్ట్రమంతా 'నైరుతి' విస్తరణ

» అయినా జాడలేని వానలు.. బలహీనంగా రుతుపవనాలు

» ఎండ తీవ్రతకు ఠారెత్తిన జనం

విశాఖపట్నం, అమరావతి, జూన్ 20(ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల్లో పది రోజుల తరువాత మళ్లీ కదలిక వచ్చింది. విదర్భ, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లోని మిగిలిన ప్రాంతాలు, వాయువ్య బంగాళాఖాతం, పశ్చిమ బెంగాల్‌లో పలు ప్రాంతాలకు గురువారం రుతుపవనాలు విస్తరించాయి. దీంతో ఏపీ మొత్తం రుతుపవనాలు విస్తరించినట్టయింది. ఈనెల పదో తేదీ తరువాత రుతుపవనాలు ముందుకు కదలలేదు. అరేబియా సముద్రంలో రుతుపవన కరెంట్ బలహీనంగా ఉండడంతో స్తబ్దత ఏర్పడింది. అయితే రెండు రోజుల నుంచి అరేబియా సముద్రం నుంచి రుతుపవన కరెంట్ పుంజుకోవడంతో గురువారం పలు ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించినట్టు భారత వాతావరణ శాఖ తెలిపింది. జూన్ 13 కల్లా ఏపీలో అన్ని ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించాలి. కానీ, ఈ ఏడాది వారం ఆలస్యమైంది. రుతుపవనాలు విస్తరించే క్రమంలో మేఘాలు ఆవరించి వర్షాలు కురవాల్సి ఉంది. అయితే గురువారం రెండు, మూడు చోట్ల మినహా రాష్ట్రంలో ఎక్కడా వర్షం జాడలేదు. ఎండ తీవ్రంగా ఉంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. బాపట్ల, నెల్లూరుల్లో 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ తీవ్రత, వాతావరణ అనిశ్చితితో ఒకటి, రెండుచోట్ల వర్షాలు కురిశాయి తప్ప, అది రుతుపవనాల ప్రభావం కాదని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. శుక్రవారం కోస్తా, రాయలసీమల్లో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయని, రుతుపవనాలు మాత్రం బలహీనంగానే ఉన్నాయని పేర్కొన్నారు. కేరళ, కర్ణాటక తీరాల మీదుగా ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో రానున్న 48గంటల్లో కోస్తాలో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శుక్రవారం మన్యం, అల్లూరి, కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురుస్తాయని వివరించింది. శనివారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో వర్షాలు పడతాయని పేర్కొంది.



అగ్నిప్రమాదంలో ఎగసిపడుతున్న మంటలు

నెల్లూరులో భారీ అగ్నిప్రమాదం

» 12 ఇళ్లు దగ్ధం.. దివ్యాంగురాలు సజీవదహనం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జూన్ 20: నెల్లూరు నగరంలో గురువారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఓ దివ్యాంగురాలు సజీవదహనం కాగా, 12 ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. పాతచెక్‌పోస్టు వద్ద రైల్వేలైన్ విస్తరణ కోసం అక్కడ ఉంటున్న వారిని ఐదేళ్ల క్రితం బర్మాషెల్ గుంటకు తరలించారు. వారంతా పూరిళ్లు నిర్మించుకొని కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే, గురువారం మధ్యాహ్నం పనులు ముగించుకుని వారు ఇంటికి వచ్చిన కొద్దిసేపటికే మంటలు ఎగసిపడి వేగంగా వ్యాపించాయి. మూడు ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలికి చేరుకున్నాయి. రెండు గంటలపాటు అగ్నిమాపక సిబ్బంది శ్రమించి మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో 12 ఇళ్లు పూర్తిగా దగ్ధమవగా, మరో మూడిళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంలో నాగలక్ష్మి (40) అనే దివ్యాంగురాలు ఇంట్లోనే సజీవ దహనమైంది. ప్రమాద సమాచారం అందుకున్న కలెక్టర్ ఎం.హరినారాయణన్ హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ ప్రమాద ఘటనపై వెంటనే స్పందించి తక్షణ సాయం కింద ఒక్కో కుటుంబానికి రూ.15 వేలు, మృతురాలి కుటుంబసభ్యులకు రూ.50 వేల నగదు అందించారు.

ప్రణతి వైద్యానికి కదిలిన యంత్రాంగం

» మడకశిర ఎమ్మెల్యే భరోసా.. రూ.50 వేలు అందజేత

» కలెక్టర్ ఆదేశాలతో అప్పటికప్పుడు ఆరోగ్యశ్రీ కార్డు

» 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



ప్రణతి తండ్రికి ఆరోగ్యశ్రీ కార్డును అందజేస్తున్న తహసీల్దారు, వైద్యాధికారి

యల్లనూరు, జూన్ 20: క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారి ప్రణతికి వైద్య సాయం అందించే దిశగా ప్రభుత్వం యంత్రాంగం చర్యలు చేపట్టింది. అనంతపురం జిల్లా యల్లనూరు మండలం చిలమకూరు గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల ప్రణతి దీనస్థితిపై 'ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనానికి శ్రీసత్యసాయి జిల్లా మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు స్పందించారు. 'ఆంధ్రజ్యోతి' ద్వారా ఆయన ప్రణతి తల్లిదండ్రులను సంప్రదించారు. సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో మాట్లాడి చిన్నారికి హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తామని భరోసా ఇచ్చారు. వెంటనే హైదరాబాద్ వెళ్లేందుకు రూ.50 వేలు చిన్నారి తండ్రి ఖాతాలో డిపాజిట్ చేశారు. 'ఆంధ్రజ్యోతి' కథనానికి అనంతపురం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందించారు. ఆయన ఆదేశాలతో పీహెచ్‌సీ వైద్యుడు లోకేశ్‌కుమార్ చిలమకూరుకు వెళ్లి ప్రణతికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆ కుటుంబానికి ఆరోగ్యశ్రీ కార్డు లేని విషయాన్ని తహసీల్దార్ జయప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన అప్పటికప్పుడు కార్డు సిద్ధం చేయించి, ప్రణతి తండ్రి గంగరాజుకు అందజేశారు. ప్రణతిని తీసుకుని తల్లిదండ్రులు హైదరాబాద్‌కు బయలుదేరారు.

వైసీపీ వర్గీయులపై అట్రాసిటీ కేసు

» పోలింగ్ రోజు టీడీపీ కార్యకర్తపై దాడి

» అప్పట్లో ఫిర్యాదు చేసినా స్పందించని పోలీసులు



యాడికి పోలీస్‌స్టేషన్ వద్ద కుటుంబ సభ్యులతో కలిసి బైఠాయించిన ఓబన్న

యాడికి, జూన్ 20: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజు టీడీపీ కార్యకర్త, దళితుడైన ఓబన్నపై దాడి చేసిన 27 మంది వైసీపీ వర్గీయులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని అనంతపురం జిల్లా యాడికి పోలీసులు గురువారం తెలిపారు. యాడికి మండలం కోనుప్పలపాడు గ్రామానికి చెందిన ఓబన్న యాడికిలో నివాసం ఉంటున్నాడు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు గత నెలలో స్వగ్రామానికి వెళ్లాడు. పోలింగ్ కేంద్రంలోకి వెళుతున్న సమయంలో వైసీపీ వర్గీయులు ఓబన్నను కులంపేరుతో దూషిస్తూ దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడి నుంచి వెళ్లిపోయేందుకు ప్రయత్నిస్తుండగా మరోసారి దాడిచేశారు. ఆ సమయంలో స్థానికులు విడిపించి, ఓబన్నను అక్కడి నుంచి పంపించేశారు. బాధితుడు యాడికి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ప్రథమ చికిత్స చేయించుకుని, తాడిపత్రికి వెళ్లి మెరుగైన వైద్యం చేయించుకున్నాడు. అప్పట్లో యాడికి పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదు. దీంతో ఇటీవల తాడిపత్రి డీఎస్పీ జనార్దన్ నాయుడును ఆశ్రయించాడు. డీఎస్పీ గ్రామానికి వెళ్లి విచారించారు. ఆ తరువాత కూడా పోలీసులు కేసు నమోదు చేయలేదు. దీంతో ఓబన్న యాడికి పోలీస్‌స్టేషన్ ఎదుట బుధవారం తన కుటుంబ సభ్యులతో కలిసి నిరసనకు దిగాడు. ఈ క్రమంలో పోలీసులు కోనుప్పలపాడుకు చెందిన 27 మంది వైసీపీ వర్గీయులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మణిపూర్ హింస

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) అధినేత మోహన్ భాగవత్ చేసిన ఒక హెచ్చరికలాంటి సూచనవల్లనో, ఏకంగా మణిపూర్ ముఖ్యమంత్రి భద్రతాబలగంలోని పోలీసు వాహనాలమీద మిలిటెంట్లు కాల్పులు జరిపినందువల్లనో తెలియదుకానీ, కేంద్రహోంమంత్రి అమిత్‌షా మణిపూర్‌మీద ఇప్పుడు పూర్తిశ్రద్ధపెట్టారు. సోమవారం ఢిల్లీలో ఆయన మణిపూర్‌శాంతిభద్రతల పరిస్థితిని లోతుగా సమీక్షిస్తున్నప్పుడు ఆ సమావేశంలో ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ లేరు. ఆర్మీచీఫ్, కేంద్ర హోం సెక్రటరీ, ఇంటలిజెన్స్ బ్యూరో (ఐబీ) డైరెక్టర్ ఇత్యాది పెద్దలతో కూడిన ఈ సమావేశానికి మణిపూర్ డీజీపీ, ఆ రాష్ట్ర భద్రతాసలహాదారు, చీఫ్ సెక్రటరీ హాజరైనారు. ఇదేమన్నా రాజకీయ సమవేశమా, ముఖ్యమంత్రిని పిలవడానికి అని బీజేపీ నాయకులు వ్యాఖ్యానిస్తున్నప్పటికీ, కాంగ్రెస్ మాత్రం ఈ పరిణామాన్ని తనకు నచ్చినరీతిలో విశ్లేషిస్తోంది. బీరేన్ లేరంటే అవిశ్వాసతీర్మానం నెగ్గినట్టే అంటూ ఏవో వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీ సమావేశం వివరాలను ఆ తరువాత ముఖ్యమంత్రి సదరు అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారట. మణిపూర్ ఎంతో కాలంగా రగులుతున్నా ఎవరికీ కనబడని, వినబడని గవర్నర్ సైతం ఇప్పుడు తెరమీదకు వచ్చి ఉన్నతాధికారులతో ఓ సమీక్ష నిర్వహించారు. ఆరునూరైనా హింసను అనుమతించవద్దనీ, కఠినమైన చర్యలతో శాంతిభద్రతలు కాపాడాలని గవర్నర్ అనసూయ డీజీపీకి హితవుచెప్పారు. ముఖ్యమంత్రిని పక్కనబెట్టి ఆమె స్వయంగా రంగంలోకి దిగడం ఢిల్లీ ఆదేశాలు లేనిదే జరగకపోవచ్చు. ఇండియా కూటమికి చెందిన ఓ ఇరవైమంది నాయకులు మణిపూర్ సందర్శించి, గవర్నర్‌తోనూ, ముఖ్యమంత్రితోనూ భేటీ కావడం కూడా వాతావరణంలో వస్తున్న మార్పుకు నిదర్శనం.

మణిపూర్‌లో హింస ఇటీవల మళ్ళీ తీవ్రస్థాయికి చేరడం, మీతీ, కుకీజో తెగల మధ్య ఘర్షణలు తిరిగి రేగడం, అవి కొత్త ప్రాంతాలకు విస్తరించడం కేంద్రప్రభుత్వానికి సరికొత్త పరీక్ష. అసోంకు ఆనుకొని ఉన్న జిరిబమ్ జిల్లా మణిపూర్‌కు ఆర్థికశక్తిని సమకూర్చే మంచి వ్యాపారకేంద్రం. ఏడాదికాలంగా తాకని హింస ఇప్పుడు ఆ జిల్లాకు విస్తరించడంతో కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి. రెండుతెగలకూ చెందిన వందకు పైగా ఇళ్ళు తగలబడిపోయి, వందలాదిమంది అసోంకు పారిపోయారు. తెగిపడిన తల ఒకటి దొరకడంతో ఈ అగ్గిరాజుకుంది. పోలీసువాహనాలు, చెక్‌పోస్టులు, అటవీకార్యాలయాలు కూడా ధ్వంసమైనాయి. ముఖ్యమంత్రి అక్కడకు వెళ్ళడానికి సిద్ధమవుతూంటే, అడ్వాన్స్ సెక్యూరిటీ టీమ్ మీద మిలిటెంట్లు దాడిచేశారు. బుధ, గురువారాల్లో కూడా ఇక్కడ హింసాత్మక ఘటనలు జరిగాయి.

మణిపూర్‌లో శాంతిభద్రతలను సమీక్షించిన తరువాత హోంమంత్రి అమిత్ షా ఎవరూ ఊహించని మాటన్నారు. మీతీ, కుకీజో తెగలమధ్య వైషమ్యాలను తుంచి, సయోధ్యను పెంచేందుకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన ప్రకటించారు. పరిస్థితిని చేజారనివ్వబోమని, నియంత్రణకు కట్టుబడి ఉన్నామన్నారు. తెగలమధ్య పరస్పర విశ్వాసాన్ని పెంపొందించేందుకు ఒక నిర్దిష్టమైన ప్రయత్నం జరగడం కచ్చితంగా అవసరం. ఇప్పటికైనా అటువంటి ఆలోచన కలిగినందుకు సంతోషించాల్సిందే. కేంద్రహోంమంత్రి శాంతిభద్రతలను సమీక్షించడం, గవర్నర్ ఢిల్లీ వెళ్ళి రావడం, సిఎంతో చర్చలు జరపడం, ఇతర పార్టీల నాయకుల రాకను అడ్డుకోకుండా రాష్ట్రంలో పర్యటించనివ్వడం వంటివి సైతం ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతాయి. ఈ నేపథ్యంలో, ఆయా తెగల ప్రతినిధులతో ఢిల్లీ పెద్దలు నేరుగా కూచొని మాట్లాడితే కచ్చితంగా మరింత ప్రయోజనం ఉంటుంది. హిందువులు అధికంగా ఉన్న తన మీతీజాతి పక్షాన బీరేన్‌సింగ్ నిలబడి, క్రైస్తవులైన కుకీజోలను ఊచకోతకోయిస్తున్నాడన్నది ఆరోపణ. మీతీలకు ఆదివాసీ హోదా కట్టబెట్టాలన్న బీరేన్ కుట్రతో ఈ అగ్గిరాజుకున్న విషయం తెలిసిందే. ఆ హోదాతో వారు తమ ఉద్యోగాలు, భూములను హస్తగతం చేసుకుంటారన్నది ఆదివాసుల భయం. వందల మంది మరణించినా, వేలమంది వలసపోయినా, హత్యలు, అత్యాచారాలు, గృహదహనాలు యథేచ్ఛగా సాగినా కేంద్ర ప్రభుత్వం బీరేన్‌ను అక్కడనుంచి కదల్చలేదు. డబుల్ ఇంజన్ ప్రభుత్వం మణిపూర్‌కు ఎనలేని నష్టాన్ని, ద్రోహాన్ని చేయడంతో పాటు, అంతర్జాతీయంగా భారతదేశం పరువు తీసింది. జాతుల మధ్య సయోధ్య ఏర్పడితే తప్ప, శాంతిభద్రతలు సాధ్యపడవని గుర్తించిన కేంద్రం, ఇప్పటికైనా బీరేన్‌సింగ్‌ను తప్పించి సానుకూల వాతావరణాన్ని ఏర్పరుచుకోవాలి.

కొత్త భావాలతో పాత ఎజెండా

కొత్త ప్రభుత్వానికి సూచిస్తున్న ఎజెండా పాత ఎజెండానే, అయితే ఒక ప్రాథమిక తేడాతో. వాస్తవమేమిటంటే కార్యాచరణకు ప్రాధాన్యత నివ్వాల్సిన అంశాల జాబితా మునుపటిదే. అందులో మార్పులు ఏమీ లేవు. ఉండబోవు. ఇంధనం నుంచి నీటి సరఫరా వరకు, పారిశుద్ధ్యం నుంచి ఆహారం, పోషకాహారం దాకా మన కర్తవ్యాల నిర్వహణ, మనం చేయాల్సిన కృషి అసంపూర్ణంగా ఉన్నాయి. సరే, ఆరోగ్యం, విద్య గురించి చెప్పనే అవసరం లేదు. ప్రభుత్వం కొన్ని పథకాలను రూపొందించి అమలుపరుస్తుందని మనకు తెలుసు. ప్రస్తావిత రంగాలకు బడ్జెట్ కేటాయింపులు కూడా చేసింది. ప్రజలకు సంక్షేమం, శ్రేయస్సు సమకూర్చే కృషి కొనసాగుతోంది. ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో పాత్రికేయులు దేశంలో నలు మూలలా పర్యటించారు. వివిధ సమస్యలపై ప్రజల అభిప్రాయాలను విన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే కదా ప్రజల అభిప్రాయాలు పరిగణన పొందేది! పెచ్చరిల్లుతోన్న నిరుద్యోగమే అసంఖ్యాక ప్రజలకు అమిత ఆందోళన కరంగా ఉన్నది. స్వచ్ఛమైన తాగు నీటి కొరత, పారిశుద్ధ్యం లోటు ప్రజలను బాగా కలత పెడుతున్న సమస్యలలో ప్రముఖంగా ఉన్నాయి. ఇంధన సంక్షోభం ఇప్పటికీ తీవ్రంగా ఉన్నది. ఎల్‌పిజి సిలెండర్ ధర భరించలేనిదిగా ఉన్నది, విద్యుత్ సరఫరాపై నిశ్చింతకు ఆస్కారం లేదు. రైతులు ఇప్పటికీ నానా దురవస్థల్లో కునారిల్లుతున్నారు. వ్యవసాయ రంగంలో పరిస్థితులను మెరుగుపరిచేందుకు ఇంకా ఎంతో పనిచేయాల్సి వున్నది.



■ సునీతా నారాయణ్

మట్టివాసన

అభివృద్ధికై సంకల్పించిన అనేకానేక పనులు అసంపూర్ణంగా ఉండిపోవడంపై ఆశ్చర్యపోవలసిన అవసరం లేదు. ఇండియా ఒక సువిశాల దేశం. పాలనలో ఎన్నో లొసుగులు, లోపాలు ఉన్నాయి. ఏ ప్రభుత్వ పథకమైనా సమాజంలో అట్టడుగు స్థానంలో ఉన్న సామాజిక వర్గం వారికి చేరాలి – ఏదో ఒక సారికాదు, ప్రతిసారీ, అనునిత్యమూ సుమా! ఇదే సమయంలో వాతావరణ మార్పు విషమ ప్రభావం మనకు స్పష్టంగా కనపడుతోంది. ప్రతి రోజూ దేశంలో ఏ దో ఒక ప్రాంతం కనీసం ఒక వాతావరణ వైపరీత్య ఘటనతో అల్లాడిపోతోంది. ఇది అభివృద్ధి కార్యక్రమాల పురోగతికి అవరోధమవుతోంది. అకాల వర్షాలు, తీవ్ర ప్రతికూల వాతావరణ పరిస్థితులు మరిన్ని కరువుకాటకాలు, వరదలు, తీవ్ర దుర్భిక్షాలకు దారి తీస్తున్నాయి. జీవనాధారాలను తీవ్రంగా దెబ్బ కొడుతున్నాయి. ప్రభుత్వ వనరులపై అదనపు భారాన్ని మోపుతున్నాయి. ఈ పరిస్థితి సూచిస్తున్నదేమిటి? అభివృద్ధి సాధన మరింత సమర్థంగా జరగాలి. వృద్ధి ఫలాలు సత్వరమే మరింత అధిక స్థాయిలో ప్రజలకు చేరేలా చూడడమూ చాలా ముఖ్యం. ఈ దుర్భర పరిస్థితులు మారిపోయేందుకు, మరింత శుభస్కర పరిస్థితులు నెలకొనేందుకు తదుపరి ప్రభుత్వ కొత్త ఎజెండా– కొత్త ప్రభుత్వం వాస్తవానికి పాత సర్కారే అయినప్పటికీ– ఈ క్రింద సూచించిన విధంగా భిన్నంగా ఉండి తీరాలి.

తొట్ట తొలుత మరింత జవాబుదారీతనంతో వ్యవహరించేలా సంస్థలను పునర్నిర్మించడంపై కొత్త సర్కార్ ప్రథమ ప్రాధాన్యమివ్వాలి. భిన్న దృక్పథంతో ఆలోచించే వారిని, భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేసిన వారిని ప్రభుత్వ శత్రువుగా భావించకూడదు. ప్రత్యామ్నాయ సమాచారం అసమ్మతి కాదు, ప్రభుత్వంపై గురిపెట్టిన విమర్శా కాదు. ప్రత్యామ్నాయ వార్తలు, విశ్లేషణలను అభివృద్ధి సాధనకు జరిగే దోహదంలో భాగంగా చూడాలి. ఏది ప్రయోజనకరంగా పని చేస్తుంది, ఏది లక్ష్య పరిపూర్తికి తోడ్పడం లేదు అన్న విషయమై మనం ఎంత ఎక్కువగా తెలుసుకుంటామో పాలన అంతగా మెరుగుపడుతుంది. ప్రస్తుతం భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నవారిని బలవంతంగా మౌనం వహించేలా చేస్తున్నారు. ఇది ఉద్దేశపూర్వకంగా జరగకపోవచ్చు కానీ పాలకులకు ఇష్టమైనవే ఆమోదయోగ్యమయ్యేట్టు చేస్తుంది. ప్రభుత్వ వంది మాగధులకే ప్రాధాన్యం లభించేట్టు చేస్తుంది. ఇదెంత మాత్రం క్షేమకరం, శ్రేయస్కరం కాదు. ఇటువంటి పాలనా ధోరణులు ఒక ప్రభుత్వాన్ని ప్రజల నిరాదరణకు గురి చేస్తాయి. ప్రజావాణిని వినని, గౌరవించని పాలకులు ఆదరణ ఎలా పొందుతారు? కనుక నిష్పాక్షికంగా ఉండడమనేది ప్రభుత్వ ఎజెండా కావాలి. విశాల దృక్పథంతో ఉండాలి. ఎటువంటి దాపరికం లేనిదిగా, అందరూ పాల్గొనదగినదిగా ఉండాలి. దీనర్థం ప్రభుత్వ కమిటీలలో అందరికీ చోటు కల్పించడం కాదు. సమాచారాన్ని గుర్తించడం, భావాలు, అభిప్రాయాలను గౌరవించడం నమ్మకాన్ని పునరుద్ధరించుకోవడం చాలా కీలకం. పథకాలు సఫలమయ్యేందుకు మాత్రమేకాదు, సమాజాలు శీఘ్రగతిన పురోగమించేందుకు కూడా.

నవ భారతదేశ నిర్మాణానికి కొత్త ఆలోచనలు, కార్యాచరణలకు దోహదం చేసే సంస్థలు అవసరం. గత కొద్ది సంవత్సరాలుగా సంప్రదాయ సంస్థలను ఉద్దేశ పూర్వకంగాను, నిరక్ష్యపరచడం ద్వారా క్షీణించి పోయేలా చేస్తున్నారు. కారణమేమిటి? ఈ సంస్థలు తమ విధులను సరిగ్గా నిర్వర్తించడం లేదని ప్రభుత్వం చెప్పుతున్నది. అవి కాలంలోకి జారిపోవల్సిన అవసరం ఉందని కూడా స్పష్టం చేస్తోంది నిజమేమింటంటే అవి నిర్వర్తిస్తున్న కీలక విధులను మరింత చురుగ్గా, మరింత మెరుగ్గా నిర్వర్తించేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం చేపట్టడం లేదు. కాలుష్య నియంత్రణకు ఏర్పాటు చేసిన ఏజెన్సీలనే తీసుకోండి అవి అర్థరహితంగా పరిణమించాయి. వాటిలో కొన్ని కాలుష్యంపై పోరుకు సంబంధించిన వాణిజ్యం నుంచి లబ్ధి పొందేందుకు ప్రయత్నించాయి. యథార్థమేమిటంటే కాలుష్యాన్ని నియంత్రించేందుకు జవాబుదారీతనంతో నిరోధాలను పటిష్ఠంగా అనువర్తింప చేసే సంస్థలు అవసరం. ఇబ్బందికరమైన, కఠోర నిర్ణయాలు తీసుకుని వాటిని కచ్చితంగా అమలుపరిచే సామర్థ్యమూ వాటికి ఉండాలి. మరి ఈ సామర్థ్యమే ఇప్పుడు పూర్తిగా కొరవడింది. కాలుష్యం పెరిగిపోతుందంటే ఆశ్చర్యమెందుకు? కాలుష్యం తగ్గిపోదు. మన నదులలోను, వాయుతలంలోను అది సర్వత్రా ఆవరించి ఉన్నది, ఉంటుంది.

ఈ పరిస్థితి లేకుండా పోవాలంటే మనకు రెండు కొత్త తరం సంస్కరణలు అవసరం. ఒకటి– స్థానిక ప్రజలు పాల్గొనే కింది స్థాయి సంస్థలను పటిష్ఠపరచాలి. అభివృద్ధి కార్యక్రమాలు ప్రయోజనకరంగా అమలయ్యేందుకు ప్రజలు క్రియాశీలంగా పాల్గొనే ప్రజాస్వామ్యం మనకు ఎంతైనా అవసరం. స్థానిక స్వపరిపాలన సంస్థల సాధికారతకు ఉద్దేశించిన 74, 75 రాజ్యాంగ సంస్కరణలను ఆమోదించి 30 సంవత్సరాలు గడిచిపోయాయి మరి గ్రామీణ ప్రాంతాలలో పంచాయతీరాజ్, పట్టణ ప్రాంతాలలో మునిసిపల్ వ్యవస్థ మెరుగుపడ్డాయా? గ్రామ సభలను పటిష్ఠపరచడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత ప్రగాఢం చేసే ప్రయోగాలు చేశాము. అయితే





srini

> భావాలు, అభిప్రాయాలు, భిన్న సమాచారం పట్ల సహన వైఖరితో వ్యవహరించాలి. ప్రాథమిక స్థాయి సంస్థలను పటిష్ఠపరచి ప్రజలు క్రియాశీలంగా పాల్గొనే ప్రజాస్వామ్యాన్ని పెంపొందించాలి. ఈ వాతావరణ మార్పు యుగంలో అభివృద్ధిని సమ్మిళితం, నిలకడగలదిగా చేసేందుకు వివిధ పథకాలు, కార్యక్రమాలను పునర్వ్యవస్థీకరించాలి.

ఈ కృషి అంతా అసంపూర్ణంగా మిగిలిపోయింది. సహజ వనరులపై గ్రామీణ, పట్టణ ప్రభుత్వాలకు మరింత నియంత్రణాధికారాలను కల్పించేందుకు చేయవలిసింది ఎంతో ఉన్నది. నిధులు సమకూర్చుకునేందుకు, పథకాల నిర్వహణకు సహజ వనరులను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. కొత్త ఉద్యోగాలను సృష్టించేందుకు, జీవనాధారాలను పెంపొందించుకునేందుకు సహజ వనరుల అభివృద్ధికి మరింతగా మదుపులు చేయవలసి ఉన్నది.

చివరగా మన అభివృద్ధి పథకాలను కొత్త భావాలతో రూపొందించవలసిన అవసరమున్నది. చాలా కాలంగా ప్రభుత్వాలు సంక్షేమ దృక్పథం– దీనిని తరచు బిచ్చం వేయడంగా కొట్టివేస్తున్నారు– పెట్టుబడిదారీ దృక్పథం మధ్య చిక్కుకున్నాయి. నా అభిప్రాయంలో వాతావరణ మార్పుతో కొట్టుమిట్టాడుతున్న ఈ కాలానికి ఒక కొత్త దృక్పథం అవసరం. ఆలోచనలు మారాలి. ఆచరణలు విధిగా ప్రయోజనకరం కావాలి. మనం ప్రతి రంగంలోనూ వినూత్న భావాలతో, నవ కార్యాచరణ ప్రణాళికలతో పనిచేయవలసి ఉంది. అభివృద్ధి సమ్మిళితంగాను, సాధించదగినదిగాను, నిలకడగా ఉండి తీరాలి. ఇందుకు పథకాల రూపకల్పనలోనే కాదు వాటి అమలు తీరుతెన్నులలో కూడా మార్పులు అవసరం. ధరిత్రిని కాపాడే కొత్త అభివృద్ధి నమూనా అవసరం ఎంతైనా ఉన్నది. ఆ నమూనా చిట్ట చివరి వ్యక్తికి సైతం సంక్షేమాన్ని సమకూర్చేదిగా ఉండాలి. అవును, ఈ అంశంపైనే కొత్త –పాత ప్రభుత్వం తన దృష్టిని కేంద్రీకరించాలి.

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

ఆ నేర చట్టాల అమలును ఆపండి!

ప్రస్తుతం అమలులో ఉన్న భారతీయ శిక్షా స్మృతి, 1860; భారతీయ సాక్ష్యాధారాల చట్టం, 1872; భారతీయ నేర విధాన స్మృతి/సంహిత, 1973 రద్దవనున్నాయి. వాటి స్థానంలో 'భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, 2023', 'భారతీయ న్యాయ సంహిత, 2023', భారతీయ సాక్ష్యా అధినియం, 2023' అనే మూడు కొత్త నేర చట్టాలు జూలై1 నుంచి అమలులోకి రానున్నాయి. ఈ కొత్త చట్టాలలోని పలు నిబంధనల రాజ్యాంగబద్ధతపై సంశయాలు వ్యక్తమవుతున్న దృష్ట్యా వాటిపై న్యాయమూర్తులు, న్యాయవాదులు, నేర దర్యాప్తు సంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, దేశ పౌరులు సమగ్రంగా చర్చించవలసిన అవసరం ఉంది. ఈ విస్తృత, ఆవశ్యక చర్చకు వీలుగా ఈ కొత్త చట్టాల అమలును వాయిదా వేయాలని కోరుతూ కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్‌కు సుప్రీంకోర్టు న్యాయవాది ఇందిరా జైసింగ్ రాసిన లేఖ స్వేచ్ఛానువాదం ఇది.



మాన్య మేఘ్వాల్ గారూ,

కేంద్ర న్యాయశాఖ సహాయమంత్రిగా నియమితులయినందుకు తొలుత మిమ్ములను అభినందిస్తున్నాను. ఈ లేఖలో లేవనెత్తిన అంశాలపై ఏకాభిప్రాయ సాధన స్ఫూర్తితో, పౌరుల జీవితం, వ్యక్తిగత స్వేచ్ఛను పరిరక్షించే విషయంలో ప్రజలకు శీఘ్రగతిన న్యాయం సమకూర్చడమనే ఉత్కృష్ట ఆదర్శం ప్రేరణతో మీతో ఉపయోగకరమైన, నిర్మాణాత్మక రీతిలో పరస్పర ప్రభావశీలంగా కలసికట్టు కృషి చేసేందుకు భారత ప్రజలమైన మేము ఆసక్తితో ఎదురుచూస్తున్నాము.

'భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, 2023', 'భారతీయ న్యాయ సంహిత, 2023', భారతీయ సాక్ష్యా అధినియం, 2023' అనే మూడు కొత్త నేర చట్టాలను అమలుపరచనుండడంపై తీవ్ర ఆందోళనతో మీకు నేను ఈ లేఖ రాస్తున్నాను. ఈ మూడు చట్టాలు జూలై 1, 2024 నుంచి అమలులోకి రానున్నాయి. ప్రస్తుతం అమలులో ఉన్న భారతీయ శిక్షా స్మృతి (ఇండియన్ పీనల్ కోడ్), 1860, భారతీయ సాక్ష్యాధారాల చట్టం, 1872; భారతీయ నేర విధాన స్మృతి/సంహిత, 1973ను రద్దు చేసి వాటి స్థానంలో ఇంతకు ముందు ప్రస్తావితమైన మూడు కొత్త నేర చట్టాలను ప్రవేశపెట్టనున్నారు. మూడు మూల చట్టాలలోని పదావళికి ఉన్న అర్థానికి భిన్నమైన భావాన్ని, ఉద్దేశాన్ని తెలియజేసేందుకు అమలులో ఉన్న అనేక చట్ట నిబంధనలకు నూతన స్వరూపాన్ని కల్పించి, కొత్త మాటలు చేర్చారు. అమలులో ఉన్న చట్టాలు వంద సంవత్సరాలకు పైగా భారత న్యాయ పాలనలో కీలక పాత్ర వహిస్తున్నాయి. ఆ చట్టాలలోని ప్రతి విభాగానికీ దేశంలోని వివిధ ఉన్నత న్యాయస్థానాలు (హై కోర్టులు) భారత సర్వోన్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) కేసుల విచారణ క్రమంలో న్యాయ నిర్వహణ సంబంధమైన భాష్యాలు చెప్పాయి. న్యాయపరమైన వ్యాఖ్యానాలు చేశాయి. సుప్రీంకోర్టులోని వివిధ ధర్మాసనాలు ఒక నిర్దిష్ట నిబంధనకు భాష్యం చెప్పడంలో ఒకదానికొకటి విభేదించాయి. ఏకాభిప్రాయం కొరవడినప్పుడు సంబంధిత అంశాలపై విచారణను విస్తృత ధర్మాసనానికి నివేదించేవి.

సరే, మూడు కొత్త నేర చట్టాలు యథాతథంగా అమలులోకి వచ్చినప్పుడు, అమలులో ఉన్న చట్టాల అనువర్తింపు కూడా కొనసాగుతుంది. బహుశా, మరో ఇరవై సంవత్సరాల పాటు లేదా అంతకంటే ఎక్కువ కాలం– ఆ పాత చట్టాల కింద దాఖలైన కేసుల విచారణ– మెజిస్ట్రేట్ కోర్టుతో ప్రారంభమై సుప్రీంకోర్టులో అంతిమంగా ఒక కొలిక్కి వచ్చే దాకా– ఆ ఆ పాత చట్టాల వినియోగం కొనసాగవచ్చు. అత్యంత దిగువ కోర్టు నుంచి అత్యున్నత స్థాయి కోర్టు దాకా సాగే విచారణ కాలాన్ని మన దేశంలో ఒక కేసు జీవన కాల వ్యవధిగా వ్యవహరించడం పరిపాటి.



akbar

> న్యాయనిపుణుల, న్యాయకోవిదుల, వివేకశీలుర విజ్ఞతాయుత భావాలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా కొత్త నేర చట్టాలను అమలుపరచడం ఉపద్రవానికి దారితీస్తుంది. భారత న్యాయపాలనకు జూలై 1న ఎటువంటి విపత్తు దాపురించకుండా నివారించేందుకు మీరు వెంటనే సముచిత నిర్ణయం తీసుకోవాలి.

ఒక పౌరుని జీవితం, స్వేచ్ఛకు; అతనికి వివిధ రూపాలలో, మార్గాలలో నేరపూరితమైన హాని చేసే చర్యలు, విషయాలతో అమలులోకి రానున్న కొత్త చట్టాలు వ్యవహరించనున్నాయనడంలో ఎటువంటి సందేహం లేదు. దేశ ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, ముఖ్యంగా వాక్ స్వాతంత్ర్యం, సమావేశమయ్యే హక్కు, సంఘాలను ఏర్పాటు చేసుకునే హక్కు, నిరసన ప్రదర్శనలు చేసే హక్కు, ఇంకా ఇతర పౌర స్వేచ్ఛలతో కూడా ఆ కొత్త చట్టాలు వ్యవహరిస్తాయి. అమల్లోకి రానున్న మూడు కొత్త చట్టాల్లోని శాంతి భద్రతల నిబంధనలలో భాగంగా ఆ హక్కులను నేరపూరితమైనవిగా పరిగణించడం జరుగుతుంది! వాస్తవానికి మనం చాలా కాలం వరకు (ఇరవై నుంచి ముప్పై సంవత్సరాల పాటు) రెండు సమాంతర నేర విచారణా విధానాలను కలిగి ఉంటామనడంలో సందేహం లేదు. ఇప్పటికే పని భారంతో సతమతమవుతున్న న్యాయవ్యవస్థపై ఈ కొత్త చట్టాలు తప్పక మోపే అదనపు భారాన్ని సమగ్రంగా పరిగణనలోకి తీసుకున్నట్టు కనిపించడం లేదు. వివిధ న్యాయస్థానాల్లో లక్షలాది కేసులు అపరిష్కృతంగా ఉన్నట్టు నేషనల్ జుడీషియల్ గ్రిడ్ గణాంకాలు విశదం చేస్తున్నాయి. కొత్త చట్టాలతో పెండింగ్ కేసులు అంతకంతకూ పెరిగిపోతాయే కానీ తగ్గిపోయే ప్రసక్తే లేదు. ఉదాహరణకు ఒక కేసులో అంతిమ విచారణ జరిగే సుప్రీంకోర్టులోని పెండింగ్ కేసుల వివరాలను చూద్దాం : పెండింగ్‌లో ఉన్న మొత్తం సివిల్ కేసులు : 65,264 కాగా వీటిలో ఒక సంవత్సర కాలంగా పెండింగ్‌లో ఉన్నవి 20,130 (30.84 శాతం); పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులు 17,804 కాగా ఒక ఏడాదిగా పెండింగ్‌లో ఉన్నవి: 7,829 (43.97 శాతం); మొత్తం పెండింగ్ కేసులు 83,068 కాగా ఒక సంవత్సర కాలంగా ఉన్న కేసులు 27,959 (33.66 శాతం). దేశవ్యాప్తంగా అన్ని న్యాయస్థానాలలోనూ పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసుల సంఖ్య శీఘ్రగతిన పెరుగుతోందని నేషనల్ జుడీషియల్ డేటా గ్రిడ్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మరి కొత్త నేరచట్టాల ప్రభావం అపరిష్కృతంగా ఉన్న కేసులపై ఎలా ఉంటుందన్న విషయమై ప్రభుత్వం ఏమైనా అధ్యయనం నిర్వహించిందో లేదో నాకు తెలియదు. ఒకవేళ ఏదైనా అధ్యయనం నిర్వహించి ఉన్నట్టయితే దాని వివరాలు ఏవీ ప్రజలకు అందుబాటులో లేవు. దయచేసి ఆ వివరాలను నాకు అందుబాటులో ఉంచాలని అభ్యర్థిస్తున్నాను.

కొత్త నేర చట్టాలను పూర్వానువర్తనం చేసి (రెట్రొస్పెక్టివ్ అప్లికేషన్– ఇది నిస్సందేహంగా చిరాకు కలిగించే రాజ్యాంగ సమస్య) న్యాయాన్ని సత్వరమే సమకూర్చేందుకు వీలుగా న్యాయ వ్యవస్థలోని సదుపాయాల స్థాయిని మెరుగుపరచడంగానీ, మెజిస్ట్రేట్ కోర్టు, సెషన్స్ కోర్టు, హైకోర్టులకే కాకుండా సుప్రీంకోర్టుకు సైతం తగిన విధంగా శిక్షణ ఇచ్చేందుకు ఎటువంటి ప్రయత్నాలు, నాకు తెలిసినంతవరకు జరగనే లేదు. సైద్ధాంతిక నేర న్యాయ చట్టాల (సబ్‌స్టేంటివ్ క్రిమినల్ లా)ను పూర్వానువర్తనం చేయలేమని, అయితే ప్రొసీజర్ లా (ప్రక్రియా శాసనం)ను ఒక పెండింగ్ కేసుకు అనువర్తింప చేయవచ్చన్న విషయం న్యాయవాదులుగా మాకు తెలుసు. ప్రతి ఒక్క పెండింగ్ కేసు విషయంలోను ఏ చట్టాన్ని ఒక ప్రత్యేక కేసులో అనువర్తింపచేయాలనే ప్రశ్న తలెత్తుతుంది. అసలు ఇప్పటికే మూడు కొత్త నేర చట్టాలలోని పలు నిబంధనల రాజ్యాంగ బద్ధతపై ప్రజలు అనేక సంశయాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై నేను ఎటువంటి వ్యాఖ్యలు చేయదలుచుకోలేదు. ఎందుకంటే అవి సర్వోన్నత న్యాయస్థానం నిర్ణయించాల్సిన ప్రశ్నలు.

కొత్త నేర చట్టాల అమలుకు ఇవి సరైన పరిస్థితులేనా? కావని నేను అభిప్రాయపడుతున్నాను. ఈ కారణంగానే సదరు కొత్త చట్టాల అమలును జాప్యం చేయాలని హృదయపూర్వకంగా కోరుతున్నాను. ఆ కొత్త చట్టాలను అమలుపరచడం గురించి, న్యాయాన్ని అందుబాటులో ఉంచడంలో వాటి అమలు నెరపే ప్రభావంపై అన్ని స్థాయిలలోని న్యాయమూర్తులు, న్యాయవాదులు; దర్యాప్తు సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం, మరీ ముఖ్యంగా దేశ పౌరులు సమగ్రంగా చర్చించేందుకు ఒక అవకాశం కల్పించాలి. ఆ చర్చలు నిర్ధారించిన కొత్త చట్టాల మంచి చెడులను, ఆ శాసనాల అమలులో తప్పక పరిగణనలోకి తీసుకోవాలి. మా ఆందోళనను మీరు అర్థం చేసుకుంటారనే నమ్మకం ఈ దేశ ప్రజలుగా మాకు ఉన్నది. న్యాయనిపుణుల, న్యాయకోవిదుల, వివేకశీలుర విజ్ఞతాయుత భావాలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా కొత్త నేర చట్టాలను అమలుపరచడం ఉపద్రవానికి దారి తీస్తుంది జూలై 1న భారత న్యాయపాలనకు ఎటువంటి విపత్తు దాపురించకుండా నివారించేందుకు వెన్వెంటనే మీరు సముచిత నిర్ణయం తీసుకోగలరనే నిండు నమ్మకంతో ఈ లేఖను ముగిస్తున్నాను.

■ ఇందిరా జై సింగ్
సుప్రీంకోర్టు న్యాయవాది

వైసీపీ క్రిమినల్స్‌కు ఒక వెబ్‌సైట్ ఉండాలి!

మన వ్యవస్థలో ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీలు గెలవడమో ఓడడమో పెద్ద విషయం కాదు. ఏదో ఒక పార్టీ ప్రచారం చేసే అబద్ధాలకు, ప్రలోభాలకు, కుల మత ప్రాంత ప్రభావాలకు ఓటర్లు ప్రభావితం కావడాన్ని మనం గత డెబ్బై ఏళ్లుగా చూస్తూనే ఉన్నాం. ఎన్నికల్లో గెలిచి అధికారం చేపట్టినవారో, వారి అనుయాయులో ఎంతో కొంత అవినీతి అక్రమాలకు పాల్పడడాన్ని కూడా చూస్తూనే ఉన్నాం. కానీ, ఇదేమిటి? ఈ అరాచకం ఏమిటి? ఈ దోపిడీ ఏమిటి? ఈ ఐఏఎస్‌లు ఐపీఎస్‌లు ఏమిటి? అర్ధ రాత్రిళ్ళ ఇళ్ల మీద పడి తలుపులు పగలకొట్టి ఈ దొంగ కేసులు ఏమిటి? ఇసుకలు, కొండలు, భూగర్భ వనరులు తవ్వి పోసే రాజకీయాసురులకు రక్షణ వలయంగా ఏర్పడి, ప్రశ్నించిన వారిని జైళ్లకు తరలించడం ఏమిటి? ఈ మిడతల దండు ఎక్కడి నుంచి వచ్చి పచ్చటి ఆంధ్రప్రదేశ్‌పై వాలింది? వీరిలో ఎవ్వరికైనా పౌర సమాజంలో, జన జీవన స్రవంతిలో కలిసి జీవించే అర్హత ఉందా?



ఏ రాజకీయ పార్టీలోనైనా కొద్దో గొప్పో అవాంఛనీయ శక్తులు ఉండడం సహజం. కానీ, గ్రామానికో ఇసుకాసురుడు, నియోజకవర్గానికో ఖనిజాసురుడు, అడుగడుగునా మారీచులు... ఇలా ఎటుచూసినా రాక్షస గణంతో గత అయిదేళ్ళూ ఆంధ్ర రాష్ట్రం తల్లడిల్లిపోయింది. గోరుచుట్టు మీద రోకటిపోటు చందంగా తాడూ బొంగరం లేకపోయినా రాష్ట్రాన్ని మడిచి జేబులో పెట్టేసుకుని, రాష్ట్ర రాజకీయ యవనికపై గజ్జె కట్టి ఆడిన సజ్జలని చూసినప్పుడు, రాష్ట్రం భవిష్యత్తు తలచుకొని దిగులేసేది.

ఇవాళ రాష్ట్రానికి పట్టిన ఈ రాజకీయ పీడ విరగడ అయింది. అయితే, ఈ రాజకీయాసురులు ప్రజల పట్ల, సమాజం పట్ల, వ్యవస్థల పట్ల పాల్పడిన అరాచకాలు, దౌర్జన్యాలు, అక్రమాలు, దోపిడీలను నియోజకవర్గ వారీగా వెలికి తీసి, నిగ్గుతేల్చి, చట్టానికి అప్పగించాల్సిన పని ఇంకా మిగిలే ఉంది. అంతే కాదు, దీనితోపాటు వీరందరి ఫోటోలు, పాల్పడిన అక్రమాలతో ఒక వెబ్‌సైట్‌ను పబ్లిక్ డొమైన్‌లోకి తీసుకురావలసిన అవసరాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకురావాలి. సీబీఐ, పోలీస్ వెబ్‌సైట్లలో నేరస్థుల వివరాలు ఉన్నట్లే, గత అయిదేళ్ళల్లో ప్రజల పట్ల, సమాజం పట్ల, వ్యవస్థల పట్ల సమస్త అపచారాలకు పాల్పడిన రాజకీయాసురులు, పోలీసాసురులు, అధికారాసురులు, బ్రోకరాసురుల వివరాలు, వారి నిర్వాకాలతో కూడిన వివరాలతో ఒక వెబ్‌సైట్ అనేది తక్షణావసరంగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలి.

అలాగే నియోజకవర్గానికి ఒక డీఎస్పీని ప్రత్యేకంగా నియమించి, ఆ నియోజకవర్గంలో నిరాఘాటంగా సాగిన దౌర్జన్యకాండకు బాధితులైన వారి నుంచి అధికారికంగా ఫిర్యాదులు స్వీకరించి, ఆ ఫిర్యాదుల మేరకు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలి. బాధితులు ఆధారాలతో స్వేచ్ఛగా ఫిర్యాదు చేసేందుకు వీలుగా ప్రతి ఎస్పీ కార్యాలయంలో ఒక ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేసి, దానిని జిల్లా ఎస్పీ, లేదా ఎస్పీ అనుమతి పొందిన అధికారి తెరిచి చూసే విధంగా ఏర్పాటు చేయాలి. ఈ ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. వీటిని రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేకంగా నియమితులయ్యే అడిషనల్ డీజీ స్థాయి పోలీస్ అధికారి రోజువారీ మానిటర్ చేయాలి. ఈ కేసుల విచారణకు ప్రతి జిల్లాకు ఒక ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి, ఒక ఏడాదిలో మొత్తం మురికిని శుభ్రం చేయాలి.

ఇదంతా రాజకీయ వేధింపు చర్య కాదు. చంద్రబాబు నాయుడుకు, పవన్ కళ్యాణ్‌కు ప్రజలు అప్పగించిన చారిత్రక బాధ్యత. ఆ నేరస్థుల బెడద నుంచి తమను శాశ్వతంగా విముక్తి చేయమని ప్రజలు కోరుకుంటున్నారు. హామీలు, ఉచితాల గురించి తెలుగు ప్రజలు ఆందోళన చెందడం లేదు. తాము నిర్భీతిగా, స్వేచ్ఛగా, సగౌరవంగా జీవించే హక్కు పునరుద్ధరణ కోసం ఆందోళన చెందుతున్నారు. వారు కష్టపడగలరు, సంపాదించుకోగలరు, తమ పిల్లలకు చదువు సంధ్యలు చెప్పించుకోగలరు. కానీ, వారికి కావలసింది రాజకీయాసురుల నుంచి రక్షణ.

○ భోగాది వేంకటరాయుడు

అమరావతి జయపతాక

ప్రాచీన గ్రీకు పురాణాల ప్రకారం ఫీనిక్స్ అనేది పునర్జీవితాన్ని తీసుకోగలిగే ఒక కాల్పనిక పక్షి. ఈ పక్షి తన పూర్వీకుల బూడిద లోంచి కొత్త జీవితాన్ని పొందుతుంది. సూర్యునికి, కాలానికి, సామ్రాజ్యాలకి, పునర్జన్మలకి, పునరుజ్జీవనానికి చిహ్నంగా దీనిని భావిస్తారు. అలాగే అమరావతి కూడా ఫీనిక్స్ పక్షి లాంటిది. అమరావతికి మరణం లేదు. అమరావతిని చంపాలి అనుకున్నవారు సూర్యుని ముందు దివిటీల్లా తేలిపోతారు. మిణుగురు పురుగుల్లా మాడిపోతారు. ఇది వర్తమాన చరిత్ర చెప్పిన సత్యం కూడా. నాలుగున్నరేళ్ళుగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో రాజధాని అమరావతిని హత్య చేసేందుకు చెయ్యని ప్రయత్నం లేదు. పన్నని కుట్రలు, కుతంత్రాలు లేవు. ఆయన ప్రజా రాజధానిపై ఎలాంటి జాలి చూపలేదు. 2019కి ముందు జగన్, విపక్ష నేత హోదాలో అందరిలా అమరావతిని 'అమ్మా' అని పిలిచారు. అమరావతి అందరిదన్నారు. అమరావతి రాజధాని అన్నారు. అమరావతి ఉంటుందన్నారు. తాను కూడా అమరావతిలో ఉంటానన్నారు. ముఖ్యమంత్రి కాగానే అమరావతి కమ్మలది అన్నాడు. స్మశానం అన్నారు. ఎడారి అన్నారు. రైతులు స్వార్థపరులు అన్నారు. చంద్రబాబు బినామీలని పేర్లు పెట్టారు.

భూములు ఇచ్చిన రైతులు రాజధాని రక్షణ కోసం ఉద్యమిస్తుంటే, పోలీసులను ఉసిగొలిపి చిత్రహింసలు పెట్టారు. మహిళలపై వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారు. అరెస్టులు చేశారు. జైళ్ళకు పంపారు. ఆఖరికి న్యాయస్థానం నుంచి దేవస్థానం వరకు పాదయాత్రకు అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేశారు. తానీషా ప్రభువు రామదాసుని చెరలో పెట్టినట్లు పాదయాత్రలో పాల్గొన్న మహిళలను చెరలో పెట్టారు. అమరావతి నుంచి అరసవల్లి వరకు చేస్తున్న పాదయాత్రపై లాఠీలు ప్రయోగించి రామచంద్రపురంలో నిలిపేశారు. అయినా రాజధాని ఉద్యమం ఫీనిక్స్ పక్షిలాగా బతికింది. సుదీర్ఘంగా సాగింది. రైతులు ముక్కోటి దేవతలకు పూజలు చేశారు. శిబిరాలలోనే రామకోటి రాశారు. హనుమాన్ చాలీసా చదివారు. ఒంట్లో సత్తువను కూడదీసుకుని, ఊపిరి బిగబట్టుకొని మరీ ఉద్యమ శంఖారావం పూరించారు. వెరసి రాజధాని ఉద్యమ ఫలితంగా జగన్‌కి అధికారం సుదూరమైంది. వై నాట్ 175 అని బీరాలు పలికిన వ్యక్తికి నుదుట రెండు పంగనామాలు పెట్టి కూర్చోబెట్టింది. కళ్ళు బైర్లు కమ్మాయి. భవిష్యత్తు దోలాయమానమైంది. రాజధానిపై కూతలు కూసిన వాళ్ళు, కేరింతలు కొట్టిన వాళ్ళ జాడ కనుచూపు మేరలో కనిపించటం లేదు. భవిష్యత్తులో కూడా రాజధానిపై కళ్ళల్లో నిప్పులు పోసుకునే వారికి తెలుగు ప్రజలు చెప్పిన గుణపాఠం.

–పోతుల బాలకోటయ్య, అమరావతి బహుజన ఐకాస అధ్యక్షులు

పాదయాత్ర అంటే మార్నింగ్ వాక్ కాదు!

ఎన్నికలకు చాలా కాలం ముందు నుంచి జగన్మోహన్ రెడ్డి పరిపాలన తీరు గురించి ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ ప్రతి సందర్భంలోనూ చెప్తూ వచ్చిన మాటల సారాంశం: 'జగన్ తనను తాను ఒక రాజుగా, దేవుడిగా భావించుకుంటున్నారు. ప్రజలకు తాను ప్రొవైడర్‌ను అనుకుంటున్నారు. కానీ ప్రజలు కోరుకునేది అది కాదు' అని! 2019 ఎన్నికలకు ప్రశాంత్ కిషోర్‌ను ఎంతగానో నమ్మిన జగన్, ఈ మాటలను జీర్ణించుకోలేకపోయారు. వందిమాగధులతో ఆయనను తిట్టించారు. ఆయన ప్రజలకు దూరమైపోయారని, ప్రజల నాడి తెలియదని ఎద్దేవా చేశారు. కానీ ప్రజలకు దూరమైంది ఎవరో ఎన్నికల ఫలితాలు తేల్చి చెప్పాయి. ఆ రోజున జగన్ కొంత జాగ్రత్తపడి, ప్రశాంత్ కిషోర్‌తో మాట్లాడి దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించి ఉంటే బహుశా ఇప్పుడున్నంతటి నీచస్థితి తప్పి ఉండేది.



ఇప్పటికీ జగన్ ప్రజల తీర్పును గౌరవించకుండా జనాన్ని బుకాయించడానికే ప్రయత్నిస్తున్నారు. నలభై శాతం ప్రజలు నా వెంటే ఉన్నారు అంటూ విర్రవీగుతున్నారు. ఎన్ని వందల కోట్లు గుమ్మరిస్తే ఆ నలభై శాతం లెక్కతేలిందో నియోజకవర్గాల్లో పోటీచేసిన అభ్యర్థుల ఒళ్లంతా వాతలు తేలిన బతుకులను గమనిస్తే అర్థమవుతుంది. కానీ మిగిలిన 60 శాతం మంది తమ తీర్పును అనుమానిస్తున్న జగన్ అహంకార ధోరణిని ఈసడించుకుంటారనే భయం ఆయనకు కలగడం లేదు. తనను తాను మభ్యపెట్టుకుంటున్న జగన్ మాటల్లో ముఖ్యమైనది మళ్లీ పాదయాత్ర చేసే సత్తువ, వయసు తనకు ఉన్నాయనటం! తనను తిరస్కరించిన జనాన్ని పాదయాత్రతో మళ్లీ మాయగలనని ఆ వ్యాఖ్యల అర్థం. పాదయాత్రను ఆయన జిందాతిలిస్మాత్ అనుకుంటున్నారు. అధికారం తన చేతి నుంచి జారిన వెంటనే పాదయాత్ర అనడం తన పాలనకే అవమానం అని జగన్ గుర్తించడం లేదు. అయిదేళ్లు ఏలిన తర్వాత, ఎమ్మెల్యేలను ఇంటింటికీ తిప్పి అందరి సమస్యలనూ తెలుసుకున్నానని డప్పు కొట్టుకున్న తర్వాత, మళ్లీ ఏ మొహం పెట్టుకుని పాదయాత్ర మాటెత్తుతున్నారో అర్థం కావడం లేదు.

పాదయాత్ర అంటే జగన్ కాస్త సుదీర్ఘమైన మార్నింగ్ వాక్ అనుకుంటున్నట్టున్నారు. అందుకే అది చేయడానికి అర్హతలుగా ఆయన తన వయసును, ఒంట్లోని సత్తువను ప్రస్తావిస్తున్నారు. కానీ పాదయాత్రకు ఉండాల్సిన అర్హత – ప్రజల కష్టాలపట్ల కన్సర్న్, ప్రజల అభిప్రాయాల పట్ల గౌరవం. జగన్‌కు ఆ రెండూ లేవు. తన పార్టీలో సీనియర్ల అభిప్రాయాలకే విలువ ఇచ్చే అలవాటు లేని జగన్, ప్రజల అభిప్రాయాలకు విలువ ఇస్తారనుకోవడం భ్రమ! 'నేను ఇస్తున్నా.. నేను ఇస్తున్నా..' అనే మాటల ద్వారా జగన్ ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల్లో 'తాము బిచ్చగాళ్లమన్న భావన రేకెత్తించారు తప్ప– ప్రభుత్వం నుంచి తాము హక్కుగా పించను పొందుతున్నామనే భావన రానివ్వలేదు. అదే బెడిసికొట్టింది.

గతంలో పాదయాత్ర చేసిన సంగతి పక్కన పెట్టండి. ఈ అయిదేళ్లలో ఆయన ఎందరు సామాన్యులను కలిశారు? ఎందరి కష్టాలను విన్నారు? ఏ ఊరిలో సభ పెట్టినా ఆ ఊరి జనజీవితాన్ని మొత్తం కొన్ని రోజులపాటు చిందరవందర చేసిన చరిత్ర ఆయనది. రోడ్ల పక్కన దుకాణాలు మూయించి, రోడ్లకు పరదాలు కట్టి, హెలికాప్టర్‌లో పోతున్నా సరే కింద రోడ్ల పక్కన చెట్లను నరికి మోడులుగా మార్చేసిన దుర్మార్గం ఆయనది. ఐప్యాక్ వారి మాయలో పడి, వారు కిరాయికి ఏర్పాటుచేసిన, పొగడడానికి తర్ఫీదు ఇవ్వబడిన గుంపులను తప్ప సామాన్య ప్రజలను అయిదేళ్లలో ఒక్కసారి కూడా కలవని మాట్లాడని జగన్ ఇప్పుడు తగుదునమ్మా అంటూ పాదయాత్ర మాటెత్తుతున్నారు.

ముందు జగన్ తనను తాను రాజుగా, దేవుడిగా, ప్రొవైడర్‌గా భావించుకునే మానసిక దౌర్బల్యం నుంచి బయటకు రావాలి. తాను కేవలం సేవకుడు అని తెలుసుకోవాలి. దేవుళ్ళు, రాజులు కూడా భక్తుల, ప్రజల కష్టాలు తెలుసుకోవడానికి మారువేషాల్లో వారి మధ్య తిరిగారని చెప్పే కథలు మనకు బోలెడున్నాయి. కానీ జగన్ తనను తాను అలా భావించుకున్న అయిదేళ్లలో ప్రజలను, సామాన్యులను అంటరానివాళ్లలా చూశారు. మాటల సాముగరిడీల్లో తప్ప ఆయన ప్రేమాభిమానాలు ఎక్కడా వ్యక్తం కాలేదు. ఇప్పుడు మళ్లీ పాదయాత్ర అంటూ కొత్త డ్రామా షురూ చేస్తే మాత్రం ఎవరు నమ్ముతారు?

• దాసరి కృష్ణమోహన్
పాత్రికేయుడు, డల్లాస్

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు
శుక్రవారం 21 జూన్ 2024




శంకుస్థాపన స్థలం వద్ద నమస్కారం
శిలాఫలకాలను శుభ్రం చేస్తూ..
భవన సముదాయాల వద్ద చంద్రబాబు పర్యటన


నీటిలో నానుతున్న కొత్త సెక్రటేరియట్ టవర్ల నిర్మాణం

అమరావతికి అభయం

రాజధానిలో పర్యటించిన సీఎం చంద్రబాబు

- రాక్షస పాలనలో బలైన నిర్మాణాల పరిశీలన
- ప్రజావేదిక నుంచి జడ్జి భవనాల వరకూ పర్యటన
- శంకుస్థాపన స్థలంలో సాష్టాంగ నమస్కారం
- పాడైన భవనాలు చూసి చలించిన చంద్రబాబు
- అభివృద్ధి చేసి తీరుతానని ప్రతిన
- రైతుల పోరాటాన్ని శ్లాఘించిన సీఎం


ముళ్ల కంచెల్లో శిలాఫలకం


ముళ్లకంచెల్లో భవన సముదాయాలు


రాజధాని మహిళలకు చంద్రబాబు అభివాదం

కలల రాజధాని కకావికలమైంది.. ఆంధ్రుల అమ్మలాంటి అమరావతి అడవిలా మారింది.. ఐదేళ్లుగా రాష్ట్రాన్ని వెంటాడిన ఈ విధ్వంసక పీడనను, ఇన్నాళ్లూ కమ్ముకున్న నిశ్శబ్దాన్ని, అలుముకున్న చీకట్లను అధిగమించి.. రేపటికి ముందడుగు వేస్తూ సీఎం చంద్రబాబు గురువారం రాజధానిలో పర్యటించారు. శ్మశాన వైరాగ్యంలో చిక్కుకున్న అమరావతి తీరును.. విధ్వంసమైన భవన సముదాయాలను.. కట్టడాలను చూసి చలించిపోయారు. బీటలు వారిన రహదారులు, పిచ్చిమొక్కలు లేచిన భవనాలను చూసి బాధపడ్డారు. ఎట్టి పరిస్థితుల్లో అమరావతిని అభివృద్ధి చేస్తానని ప్రతినబూనారు. రాజధానివాసులతో మాట్లాడి భవితకు భరోసానిచ్చారు. తొలుత ఉండవల్లిలోని ప్రజావేదిక శిథిలాలను పరిశీలించారు. అక్కడి నుంచి ఉద్దండరాయునిపాలెంలోని రాజధాని శంకుస్థాపన ప్రాంతంలో పర్యటించారు. పవిత్రమైన మట్టి, పుణ్యజలాలతో చేసిన స్థూపాన్ని సందర్శించి సాష్టాంగ నమస్కారం చేశారు. పీఎం నరేంద్రమోదీ శంకుస్థాపన చేసిన శిలాఫలకాలతో పాటు అక్కడున్న యజ్ఞశాలను, మాస్టర్ ప్లాన్ నమూనా మ్యూజియాన్ని సందర్శించారు. అనంతరం హైకోర్టు క్రాస్ రోడ్డులోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవన సముదాయాల్ని పరిశీలించారు. మూడంతస్తుల వరకూ మెట్లెక్కి భవనాల్లోని గదులను చూశారు. ఆ తర్వాత ఆలిండియా సర్వీసెస్ జూనియర్ ఉద్యోగుల భవన సముదాయాలను పరిశీలించారు. అక్కడి నుంచి సెక్రటేరియట్ భవనాల కోసం వేసిన పునాదులను పరిశీలించి, నీటిలో నానిపోయి ఉండటాన్ని చూసి ఆవేదన చెందారు. అనంతరం క్లాస్-4 ఉద్యోగుల భవన సముదాయాలను పరిశీలించారు. సగంలో ఆగిపోయిన వాటి దుస్థితిని గమనించారు. అక్కడి నుంచి హైకోర్టు మీదుగా జడ్జిల భవన సముదాయాలను పరిశీలించేందుకు బయల్దేరగా, హైకోర్టు న్యాయవాదులు ఆయన కాన్వాయ్ వద్దకు పరిగెత్తుకుంటూ వచ్చి అభివాదం చేశారు. ఆ తర్వాత న్యాయమూర్తులు, మంత్రుల గృహ సముదాయాలను చూసుకుంటూ సీఆర్డీఏ కార్యాలయానికి చేరుకున్నారు. - తుళ్లూరు/గుంటూరు


ప్రజావేదికను పరిశీలిస్తూ..

దేవదాయ శాఖలో... దొంగాదాయం

ఓ ఉన్నతాధికారిణి ఆధ్వర్యంలో భారీ అవినీతి

దేవుడంటే భయం లేదు.. భక్తి లేదు.. సంపాదనే లక్ష్యంగా దేవుడి సొమ్మును దోచేస్తున్నారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలు ఒకే అధికారిణి పర్యవేక్షణలో ఉండటంతో ఆమె ఆడిందే ఆట, పాడింది పాటగా సాగుతోంది. దేవదాయ శాఖ ఆధీనంలో ఉన్న షాపుల అద్దెల బకాయిలు వసూలు విషయం మొదలు.. ఆస్తుల స్వాధీనం వరకు కాసులిస్తే ఒకలా, లేకుంటే మరోలా దందాలు సాగుతున్నాయి. లక్షలాది రూపాయల ఆదాయం వచ్చే ఆలయాలను దేవదాయ శాఖ నిబంధనలకు విరుద్ధంగా బీ గ్రూపు నుంచి 6ఏ గ్రూపులోకి మార్చాల్సి ఉన్నా కాసుల కోసం తొక్కిపెడుతున్నారు. - (విజయవాడ-ఆంధ్రజ్యోతి)



ప్రకాశం రోడ్డులోని దేవదాయ శాఖకు చెందిన షాపు. కూలగొట్టక ముందు..

- ఆస్తుల స్వాధీనం.. అద్దె బకాయిల్లో నిర్లక్ష్యం
- కోర్టు ఆదేశాలు ఉన్నా బేఖాతరు
- దేవదాయ ఆస్తులను కొల్లగొట్టినా గప్‌చుప్
- తెరవెనుక మంతనాలు.. భారీగా ముడుపులు
- ఆది నుంచీ వివాదాస్పద వైఖరే..

నిదర్శనాలివిగో..

- నగరంలోని బ్రాహ్మణ వీధిలో ఉన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి ప్రకాశం రోడ్డులోని అట్లా రత్తయ్య వీధిలో ఎనిమిది దుకాణాల సముదాయం ఉంది. అందులో ఓ షాపును లీజుదారుడు కూలగొట్టారు. దీనిపై 2023, డిసెంబరు 30న గవర్నర్‌పేట పోలీసుస్టేషన్‌లో ఈవో శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. షాపు పైభాగంతో ఎలాంటి సంబంధం లేకపోయినా దాన్ని కూలగొట్టినట్లు ఆ ఫిర్యాదులో స్పష్టంగా పేర్కొన్నారు. అక్రమంగా దేవదాయ ఆస్తులను కూలగొట్టడం నేరమని నిందితుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వారం రోజులకే సీన్ మారిపోయింది. జిల్లా ఉన్నతాధికారిణితో సదరు లీజుదారుడికి బేరం కుదరడంతో ఈవో ఆ ఫిర్యాదుపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కోరుతూ 2024, జనవరి 6న లిఖితపూర్వకంగా రాసి ఇవ్వడం గమనార్హం. భారీ ఎత్తున సొమ్ము చేతులు మారడంతోనే ఈ విధంగా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ వివాదం దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ దృష్టికి వెళ్లడంతో ఆయన సమగ్ర నివేదికను పంపాల్సిందిగా ఎన్టీఆర్ జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్(ఏసీ)ను ఆదేశించారు. ఏసీ సైతం పూర్తిగా లీజుదారుడికి కొమ్ముకాసేలా నివేదికను ఇవ్వడం గమనార్హం. సదరు షాపు దురదృష్టవశాత్తు మాత్రమే కూలిపోయిందని, దీనికి, లీజుదారుడికి ఎటువంటి సంబంధం లేదని, కూలగొట్టిన షాపు తాలుకా శిథిలాలను దేవదాయ శాఖ ఉన్నతాధికారుల అనుమతి లేకుండా తొలగించడం మాత్రమే జరిగిందని ఆ రిపోర్టులో ఏసీ పేర్కొన్నారు.
- ఉయ్యూరులోని సోమేశ్వరస్వామి ఆలయానికి నెలకు రూ.5 లక్షల పైచిలుకు, ఏడాదికి రూ.70 లక్షల వరకు ఆదాయం వస్తుంది. దేవదాయ శాఖ నిబంధనల ప్రకారం వార్షికాదాయం రూ.25 లక్షలు దాటిన ఆలయాన్ని 6ఏలో చేర్చాలి. కానీ, ఐదేళ్లుగా సోమేశ్వరస్వామి ఆలయానికి ఏడాదికి రూ.70 లక్షల వరకు ఆదాయం వస్తున్నా ఇంత వరకు 6ఏలో చేర్చకుండా బీ గ్రూపులోనే ఉంచారు. ఇక్కడి ఈవో జిల్లా ఉన్నతాధికారిణితో కలిసి ఆదాయాన్ని పక్కదారి పట్టిస్తూ ఈ విధంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.
- రెండు జిల్లాలకు అధికారిణిగా ఉన్న ఈమె తాడేపల్లిలో ఏకంగా ఓ విల్లానే నిర్మిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ అధికారిణి ఇంట్లో పనిచేసే పనివారికి హనుమాన్‌పేటలోని గుంటూరు సీతారామయ్య అన్నదాన ట్రస్టు నుంచి భోజనం తీసుకెళ్తున్నారనేది మరో ఆరోపణ.
- సత్యనారాయణపురంలోని శివాలయం కల్యాణమండపాన్ని స్వాధీనం చేసుకోవాలని కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ఆ అధికారిణి నేటి వరకు పాటించ లేదు. ఆక్రమణదారులతో కుమ్మక్కై, నేటికీ వారి ఆధీనంలోనే దాన్ని ఉంచడం గమనార్హం. వన్‌టౌన్‌లోని కోమలావిలాస్ సెంటర్‌లో ఉన్న పుచ్చావారి సత్రాన్ని స్వాధీనం చేసుకోమని కోర్టు ఆదేశాలు ఉన్నా పట్టించుకోలేదు.
- పాత శివాలయం ప్రాంగణంలో ఉన్న విఘ్నేశ్వర రమా సహిత సత్యనారాయణ స్వామివార్ల దేవస్థానానికి గవర్నరుపేటలో 10 షాపులు ఉన్నాయి. వాటిని కొందరు వ్యాపారులు ఐదారు సంవత్సరాల నుంచి అనధికారంగా నిర్వహిస్తున్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అద్దెదారుడు సుమారు రూ.20 లక్షలకు పైగా బకాయి ఉన్నా వసూలుపై దృష్టిసారించలేదు.
- వన్‌టౌన్‌లోని కెనాల్ రోడ్డులో ఉన్న బావాజీ మఠానికి సుమారు రూ.30 లక్షలకు పైగా అద్దె బకాయిలు ఉన్నప్పటికీ వసూలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు.

మొదటి నుంచీ వివాదాలే..

ఈ అధికారిణి గతంలో విశాఖపట్నంలో పనిచేసిన సమయంలోనూ తీవ్ర ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఆ సమయంలో ఉద్యోగులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తనకు 100 కాసులపైనే బంగారం ఉందని ఆమె పేర్కొనడం సంచలనం కలిగించింది. ఈ విషయమై అప్పట్లో కొందరు ఉద్యోగులు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేసినా వైసీపీ నాయకుడు విజయసాయి రెడ్డి అండతో కేసులు లేకుండా మేనేజ్ చేశారన్న ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో ఈ అధికారిణి వేధింపులు తట్టుకోలేక విశాఖ జిల్లాలో దేవదాయ శాఖ ఉద్యోగులు ఏకంగా రోజుల తరబడి ధర్నాలు చేశారు. దీంతో తప్పని పరిస్థితుల్లో ఉన్నతాధికారులు ఆమెను అక్కడి నుంచి బదిలీ చేశారు. అయితే, ఇప్పటికీ ఆ అధికారిణి తన తీరు మార్చుకోకుండా వేధింపులకు గురి చేస్తున్నారని పలువురు దేవదాయ శాఖ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దుర్గగుడిలో తగ్గిన బంగారం

- రిజిస్టర్‌లో తక్కువగా నమోదైన అమ్మవారి బంగారం
- ఈవో, ఏఈవో మధ్య వాగ్వాదం..
- సమయం కాదని ఈవో పక్కన పడేయడంతో గొడవ

వన్‌టౌన్, జూన్ 20 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థాన ఈవో కేఎస్ రామారావు, ఏఈవో సుధారాణి మధ్య గురువారం వాగ్వాదం చోటుచేసుకుంది. దుర్గమ్మకు భక్తులు సమర్పించిన హుండీల్లోని కానుకల లెక్కింపు గురువారం ఇంద్రకీలాద్రిపై జరగ్గా, అదే సమయంలో వీరిద్దరూ ఆవేశంగా మాట్లాడుకున్నారు. వివరాల్లోకి వెళితే.. రిజిస్టర్‌లో నమోదు చేసిన బంగారం తక్కువగా ఉందని సంబంధిత విభాగ ఏఈవో సుధారాణి బంగారం మదింపుదారుడు (గోల్డ్ అప్రైజర్) దృష్టికి తీసుకెళ్లారు. ఆయన విషయాన్ని ఈవోకు చెప్పడంతో దేవదాయ శాఖ జ్యూయలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ (జేఈవో)ను దేవస్థానానికి పిలిపించి వెరిఫికేషన్ చేపట్టాలని ఆదేశించారు. వచ్చే నెలలో వచ్చి బంగారాన్ని పరిశీలిస్తానని జేఈవో చెప్పారు. కాగా, గురువారం మహామండపం ఆరో అంతస్థులో కానుకల లెక్కింపులో ఉన్న ఈవోకు ఏఈవో సుధారాణి గోల్డ్, సిల్వర్ రిజిస్టర్‌లో బంగారం తగ్గిందని పేర్కొంటూ ఓ లెటర్‌ను ఇచ్చారు. కాపీ టూ.. సీఎం, దేవదాయ శాఖ మంత్రి, కమిషనర్ అని జత చేశారు. ఈ లేఖను పరిశీలించిన ఈవో సీఎం, మంత్రి, కమిషనర్‌లకు లేఖ ఎందుకని, జేఈవో వచ్చే నెలలో వస్తారని, అప్పటి వరకు ఆగమని ఆమెకు సూచించారు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. ఈవో ఆ లెటర్‌ను పక్కన పడేశారు. అనంతరం ఏఈవో లెటర్‌ను సీఎం, దేవదాయ శాఖ మంత్రి, కమిషనర్, ఈవోకు మెయిల్ చేసినట్లు తెలిసింది.

టమాటా రేటు.. ఉల్లి ఘాటు..

- రైతుబజార్‌లో కిలో టమాటా రూ.64
- బయటి మార్కెట్‌లో రూ.80పైనే
- కిలో రూ.36 పలుకుతున్న ఉల్లిపాయలు



టమాటాలు, ఉల్లిపాయలు ధరలో పోటీ పడుతున్నాయి. టమాటా ధరలు పెరగడానికి సహేతుక కారణాలే ఉన్నా.. ఉల్లిపాయల ధరలు ఎందుకు పెరుగుతున్నాయో అర్థంకాని పరిస్థితి. రైతుబజార్‌లో ప్రస్తుతం టమాటా కేజీ రూ.64 పలుకుతుండగా, ఉల్లిపాయలు రూ.36కు చేరుకున్నాయి. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. - (ఆంధ్రజ్యోతి-విజయవాడ)

తమిళనాడుకు టమా..రా..

రాష్ట్రం మొత్తానికి టమాటా మదనపల్లి మార్కెట్ నుంచి దిగుమతి అవుతుంది. దీంతో పాటు పుంగనూరు, అనంతపురం నుంచి సరఫరా అవుతుంది. రాష్ట్రంలో ఉన్న అన్ని మార్కెట్లకు ఈ మూడు ప్రాంతాల నుంచే సరుకు సరఫరా అవుతుంది. ఇప్పటి వరకు రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు సరఫరా అయిన టమాటా ఇప్పుడు తమిళనాడు వైపు చూస్తోంది. ఆ రాష్ట్రంలో ఇటీవల కురిసిన వర్షాలకు మొత్తం టమాటా పంట నష్టపోయింది. దీంతో అక్కడికి టమాటాను ఎగుమతి చేస్తున్నారు. ఇక్కడి కంటే ఎక్కువ ధర లభిస్తుండటంతో వ్యాపారులు తమిళనాడు వైపు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా ఆ ప్రభావం విజయవాడ పరిసర ప్రాంతాలపై పడుతోంది. ప్రస్తుతం రైతుబజార్లలో కిలో టమాటాను రూ.64కు విక్రయిస్తున్నారు. బయట మార్కెట్‌లో రూ.80 నుంచి రూ.90 పలుకుతోంది. ఇంకో రూ.10 నుంచి రూ.20 వరకు పెరిగే సూచనలు ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో టమాటా సాగు ఇప్పట్లో అందుబాటులోకి వచ్చే అవకాశం లేదు. అవనిగడ్డ, జి.కొండూరు, నవాబుపేట, జగ్గయ్యపేట పరిసర ప్రాంతాల్లో టమాటా పండుతుంది. ఇక్కడి రైతులు జూలైలో నాట్లు వేస్తారు. ఈ పంట ఆగస్టు, సెప్టెంబరులో చేతికొస్తుంది.

ఉల్లికి కృత్రిమ కొరత?

ప్రస్తుతం రైతుబజార్‌లో కిలో ఉల్లి రూ.36 పలుకుతోంది. బహిరంగ మార్కెట్‌లో రూ.40కు విక్రయిస్తున్నారు. మహారాష్ట్ర నుంచి ఉల్లి దిగుమతి అవుతోంది. ఇంతకుముందు కురిసిన వర్షాలకు కర్నూలు, అనంతపురం, నంద్యాల ప్రాంతాల్లో ఉల్లి పంట కొట్టుకుపోయింది. తర్వాత మళ్లీ పంటలు వేసినా సెప్టెంబరు వరకు అందుబాటులోకి వచ్చే అవకాశం లేదు. కాగా, సరుకు పుష్కలంగా అందుబాటులో ఉందని, కృత్రిమ కొరతే కారణమని వ్యాపారులు చెబుతున్నారు.



హుండీలలో కానుకల లెక్కిస్తున్న సిబ్బంది

దుర్గమ్మ హుండీ కానుకల లెక్కింపు
16 రోజులకు రూ.3.23 కోట్లు

వన్‌టౌన్, జూన్ 20 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను లెక్కించారు. 16రోజులకు గాను రూ.3,23,75,523లు సమకూరింది. సగటున రోజుకు రూ.20,23,470లు కానుకల రూపంలో రాగా రికార్డు స్థాయిలో రోజువారీ హుండీ ఆదాయం పెరిగినట్టు ఈవో కేఎస్ రామారావు తెలిపారు. బంగారం 694 గ్రాములు, వెండి 6కిలోల 264 గ్రాములు వచ్చాయి. 516 యూఎస్ డాలర్లు, 100 ఆస్ట్రేలియా డాలర్లు, 1000 కొరియా ఓన్‌లు, 40 ఇంగ్లండ్ పౌండ్లు, 100 ఓమన్ బైస్సాలు, 17 కెనడా డాలర్లు, 25 యూఏఈ దీర్హమ్స్, ఒక కువైట్ దినార్, 24 ఖతార్ రియాల్స్, 2 సింగపూర్ డాలర్లు సమకూరాయి. ఆన్‌లైన్ ఈ హుండీ ద్వారా రూ.59,380లు ఆదాయం వచ్చింది. ఈవో రామారావు, దేవదాయశాఖ అధికారులు, వన్‌టౌన్ పోలీస్ సిబ్బంది, ఎస్‌పీఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐటీ వ్యవస్థపై ఈవో సమీక్ష

ఐటీ వ్యవస్థపై గురువారం ఈవో రామారావు తన ఛాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. 9 అండ్ 9 సాఫ్ట్‌వేర్ ప్రతినిధి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ప్రతి సేవాకార్యక్రమాన్ని భక్తులు వీక్షించే విధంగా అమ్మవారి సేవలను భక్తులకు మరింత చేరువగా తీసుకునివెళ్లేందుకు అవగాహన కల్పించే విధంగా డిజిటల్ మార్కెటింగ్ చర్యలు తీసుకోవాలని ఈవో కోరారు. ఆలస్యం లేకుండా సంబంధిత సేవలు భక్తులకు అందేలా చూడాలని సూచనలు చేశారు.

ఆన్‌లైన్‌లో టికెట్‌లు బుక్ చేసుకుని సులభతరంగా స్లాట్ మేరకు అమ్మవారి దర్శనం చేసుకోవచ్చునని దేవస్థానం ఈ మేరకు ఒక ప్రకటనలో తెలిపింది. స్వయంగా పూజా కార్యక్రమంలో పాల్గొనలేని భక్తులు ఆన్‌లైన్ ద్వారా టికెట్‌లు కొనుగోలు చేసి ఇంటివద్దనే ఉండి పరోక్ష సేవల్లో పాల్గొనవచ్చునని తెలిపారు.



దక్షిణామూర్తికి ప్రత్యేక అర్చన

మల్లేశ్వరాలయం ప్రాంగణంలోని దక్షిణామూర్తికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. జ్ఞానబిక్ష కోసం, మేథోసంపత్తి కోసం, సుఖం, శాంతి కలగడం కోసం సంకల్పిస్తూ దక్షిణామూర్తికి వివిధ ఉపచారాలను నిర్వహించారు. మంత్రపుష్పం, హారతులు సమర్పించారు.

ధర్మపథం వేదికపై..

దేవస్థానంలోని ధర్మపథం వేదికపై గురువారం నర్తన నటరాజ నాట్యాలయం యశశ్రీ ఆధ్వర్యంలో కళాకారులు పలు కీర్తనలకు నాట్యప్రదర్శన చేసి భక్తుల నుంచి హర్షధ్వానాలు అందుకున్నారు.



హుండీలలో కానుకల లెక్కిస్తున్న సిబ్బంది

దుర్గమ్మ సేవలో ప్రముఖులు..



దుర్గమ్మ సేవలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

వన్‌టౌన్ : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో కనకదుర్గమ్మ దర్శనార్థం గురువారం ఇద్దరు రాష్ట్ర మంత్రులు, ఒక ఎంపీ విచ్చేశారు. వీరికి ఈవో కేఎస్ రామారావు, అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. ఈవో వారికి అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, శేష వస్త్రం తదితరాలు అందజేశారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో రాష్ట్ర జలవనరుల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు కుటుంబసభ్యులు, ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ, ఎంపవర్‌మెంట్, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కుటుంబసభ్యులు, ఎంపీ టీకే పార్థసారధిలు ఉన్నారు.



స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు రఘురామకు అందజేస్తున్న ఆలయ పర్యవేక్షకులు

సుబ్బారాయుడి సేవలో రఘురామ కృష్ణంరాజు

మోపిదేవి/అవనిగడ్డ, జూన్ 20 : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఉండి నియోజకవర్గ శాసనసభ్యులు కె.రఘురామ కృష్ణంరాజు గురువారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం నాగపుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఆలయ పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు ఆయనకు అందజేశారు.

సుపరిపాలన అందించాలని..

భాషా.. ద్వేష పాలనకు వ్యతిరేకంగా చేపట్టిన పోరాటం సఫలమయిందని ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు అన్నారు. గురువారం అవనిగడ్డకు వచ్చిన ఆయనను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రఘురామ మీడియాతో మాట్లాడుతూ, తెలుగుభాష పరిరక్షణ, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ పరిరక్షణ కోసం గత ప్రభుత్వంపై తాను చేపట్టిన పోరాటం ఫలించిందని, ప్రజలు ఓటు రూపంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి అద్భుతమైన విజయం అందించారన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నూతన ప్రభుత్వం సుపరిపాలన అందించేలా భగవంతుని ఆశీస్సులు లభించాలని కోరారు. సమావేశంలో మండలి వెంకట్రామ్, శీలం అశ్విన్ కుమార్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పవన్‌కళ్యాణ్‌కు కలెక్టర్ దంపతుల శుభాకాంక్షలు



వన్‌టౌన్, జూన్ 20 : రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, తాగునీటి సరఫరా, పర్యావరణం, అటవీ, శాస్త్ర, సాంకేతిక మంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్‌ను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు వెంకటేశ్వరస్వామి విగ్రహం, మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఢిల్లీరావుతో పాటు రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కమిషనర్‌గా, ఆయన సతీమణి పి.ప్రశాంతిలు పవన్‌కళ్యాణ్‌కు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

ఏపీ-పీజీ సెట్‌లో ఉత్తమ ర్యాంకులు

గుడ్లవల్లేరు, జూన్ 20 : గుడ్లవల్లేరు వి.వి.ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మా స్యూటికల్ సైన్స్ బీఫార్మసీ కళాశాలలో బీ.ఫార్మసీ పూర్తి చేసిన 40 మంది విద్యార్థులు ఏపీ-పీజీ సెట్ ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ ఎ.లక్ష్మణరావు తెలిపారు. 100 లోపు ఐదుగురు, 1000 లోపు 18 మంది, 2000 లోపు 17 మంది ర్యాంక్‌లు సాధించారన్నారు. కె.సాంబయ్యకు 43వ ర్యాంకు, సీహెచ్ సువర్ణకు 57వ ర్యాంక్, ఎం.నరసింహారావుకు 68వ ర్యాంక్, ఎం.కుసుమ సిరి 88, సీహెచ్ రాంపండు 99వ ర్యాంక్‌లు సాధించారని ఆయన తెలిపారు. విద్యార్థులను యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

త్వరలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం

- పీఎన్‌బీఎస్‌లో రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పర్యటన
- ప్రయాణికులు, కార్మికుల సమస్యలపై ఆరా



పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న రవాణాశాఖ మంత్రి

బస్సుస్టేషన్, జూన్ 20 : ఆర్టీసీకి కార్మికులు, ప్రయాణికులు రెండు కళ్లు అని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన పండిట్ నెహ్రూ బస్టాండ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ప్రత్యేక బృందంతో అధ్యయనం చేయించి వీలైనంత త్వరలో అమలు చేస్తామన్నారు. కర్ణాటక, తెలంగాణలలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అమలవుతోందని, స్వయంగా ఆ రాష్ట్రంలో పర్యటించి అధ్యయనం చేస్తానని పేర్కొన్నారు.

కొత్త బస్సుల కొనుగోలుకు బడ్జెట్‌లో ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. విద్యుత్ బస్సులను ఎక్కువగా అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఆర్టీసీ ఆస్తులను దుర్వినియోగం చేసినా, అన్యాక్రాంతం చేసినా అటువంటి వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. వీలైనంత త్వరగా సంస్థ అప్పులను తీర్చడంతో పాటు ఆర్టీసీని బలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమీక్షలో ఆర్టీసీ అభివృద్ధిలో అధికారుల పాత్ర కీలకమని, ప్రయాణికుల మన్ననలు పొందేలా సేవలందించాలని అధికారులు, సిబ్బందికి సూచించారు.

పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో ప్రయాణికులను మంత్రి పలకరించి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. డిపార్చర్ బ్లాక్, సమాచార కేంద్రం, రిజర్వేషన్ కౌంటర్‌లు పరిశీలించి సిబ్బంది పనితీరును అభినందించారు. దూర ప్రాంత ప్రయాణికులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని హోటల్ యాజమానులకు సూచించారు. చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని మరో నెలలో నెరవేరుస్తామని, మహిళలందరికీ ఉచిత బస్సు సౌకర్యం కల్పించడానికి విస్తృత ప్రణాళికలు చేస్తున్నామని తెలిపారు. కార్గో కార్యకలాపాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రిని అన్ని అసోసియేషన్‌ల ప్రతినిధులు, సభ్యులు సత్కరించారు. డీజీపీగా పదోన్నతి పొందిన ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జోన్-2 ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ గోపీనాథ్‌రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా ప్రజారవాణా అధికారి ఎంవై దానం, పీఎంటీఎస్ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బషీర్ అహ్మద్, బస్సుస్టేషన్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం మద్దతు ధరలు పునఃపరిశీలించాలి

- ఏపీ రైతుసంఘం

వన్‌టౌన్, జూన్ 20 : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు రైతుల ఆదాయాన్ని పెంచేవి కావని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం విమర్శించింది. మద్దతు ధరలను పునఃపరిశీలించాలని రైతులకు ప్రయోజనకరంగా పెంచాలని కోరింది. గురువారం ఈ మేరకు సంఘం అధ్యక్షుడు వై.రాధాకృష్ణ, కార్యదర్శి ఎం.హరిబాబులు సంయుక్త ప్రకటన చేశారు. కేంద్ర ప్రభుత్వం 14 రకాల పంటలకు ప్రకటించిన మద్దతు ధరలతో రైతుల ఆత్మహత్యలను ఆపడం కానీ, ఆదాయాన్ని రెట్టింపు చేయడం కానీ, వ్యవసాయంలో ముందడుగు సాధ్యం కాదన్నారు. ధాన్యానికి కేవలం రూ.117లు మాత్రమే పెంచడం చాలా అన్యాయమని ఉత్పత్తి ఖర్చులు 18నుంచి 30శాతానికి పెరిగాయని, అయితే మద్దతు ధర కేవలం 5 నుంచి 10 శాతం లోపే ఉందని తెలిపారు. రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని కొన్ని వందల మంది వ్యవసాయం నుంచి ఇతర పనులకు వెళుతున్నారని పేర్కొన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు కోసం చట్టాన్ని చేయాలని కోరారు. స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని పేర్కొన్నారు.



గవర్నర్ చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న రేవతి

ఘంటసాల కేవీకే శాస్త్రవేత్తకు బంగారు పతకాలు

ఘంటసాల, జూన్ 20 : ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో సస్యరక్షణ శాస్త్రవేత్తగా పనిచేస్తున్న డాక్టర్ రేవతికి రెండు బంగారు పతకాలు వచ్చాయి. బాపట్ల వ్యవసాయ కళాశాలలో జరిగిన స్నాతకోత్సవంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా రేవతి పతకాలను, ప్రశంసాపత్రాలను అందుకున్నారు. విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీలో అందరికంటే అత్యధిక గ్రేడ్ పాయింట్ సాధించినందుకు బంగారు పతాకం, అమ్మాయిల్లో అందరిక కంటే అత్యధిక గ్రేడ్ పాయింట్ సాధించినందుకు బంగారు పతాకం అందుకున్నట్టు రేవతి తెలిపారు.

టిడ్కో పనులు వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే వెనిగండ్ల



టిడ్కో, మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల, రావి

గుడివాడ, జూన్ 20 : టిడ్కో కాలనీలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరతగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గురువారం స్థానిక ప్రజావేదికలో టిడ్కో కాలనీలో అభివృద్ధి పనులు, లబ్ధిదారులకు అప్పగించాల్సిన ప్లాట్‌ల వివరాలపై టిడ్కో, మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తొలుత లే అవుట్‌లో నేటి వరకు జరిగిన పనులు, పెండింగ్ పనులపై ఎమ్మెల్యేకు ఎస్.ఇ బి.చిన్నోడు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టిడ్కో కాలనీలో నేటికి 6900 మందికి ప్లాట్‌లను అప్పగించారని, మిగిలిన లబ్ధిదారులకు త్వరలోనే అప్పగిస్తామన్నారు. ఈ నెల 24వ తేదీ జరగనున్న సమావేశంలో కాలనీలో అభివృద్ధి పనులపై కాంట్రాక్టర్‌లు వివరాలతో రావాలని ఎమ్మెల్యే ఆదేశించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ నాయకులు టిడ్కో, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సీజన్‌లో ప్రతి ఎకరం తడవాలి..

ఖరీఫ్ సీజన్‌లో ప్రతి ఎకరం తడవాలని, ఒక్క ఎకరం కూడా మునగకూడదని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గురువారం ప్రజావేదికలో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు యిచ్చిన హామీ మేరకు సాగునీరు అందించేలా కృషి చేస్తానన్నారు. నీటి పన్ను వసూళ్ల నివేదిక యివ్వాలన్నారు. నియోజకవర్గంలో పంటకాలువల్లో 10చోట్ల పనులు చేయాల్సి ఉందని ఇరిగేషన్ డీఈ సూర్యభరత్, 26చోట్ల పనులు చేయాల్సి ఉందని డ్రెయినేజీ డీఈ గణపతిలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పట్టిసీమలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయని, నీటిని రైతులందరికి చేరేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

కేశినేని చిన్ని శుభాకాంక్షలు..



విద్యాధరపురం, జూన్ 20 : రాష్ట్ర గనులు, భూగర్భ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను విజయవాడ భారతీనగర్‌లోని ఆయన నివాసంలో గురువారం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ, చంద్రబాబు నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునే విధంగా రవీంద్ర సమర్థవంతంగా పని చేసి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

కేశినేని శివనాథ్(చిన్ని) గురువారం రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని పార్టీ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. అన్న నందమూరి తారకరామారావు కుమార్తెగా పురందేశ్వరి సమర్థత, సామర్థ్యం గల నాయకురాలిగా కేంద్ర రాజకీయాలలో తనదైన ముద్ర వేస్తున్నారన్నారు.

రాష్ట్ర అడ్వకేట్ జనరల్‌గా బాధ్యతలు స్వీకరించిన దమ్మాలపాటి శ్రీనివాస్‌ను హైకోర్టులోని ఆయన చాంబర్‌లో ఎంపీ కేశినేని శివనాథ్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. అడ్వకేట్ జనరల్‌గా రెండోసారి బాధ్యతలు స్వీకరించిన ఆయన అనుభవం రాష్ట్రానికి ఎంతో అవసరమన్నారు. జగన్ బాధితుల్లో దమ్మాలపాటి కూడా ఒకరని పేర్కొన్నారు.

గురునానక్ కాలనీలో ఎన్టీఆర్ భవన్‌లో గురువారం ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) 28వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ పాల్గొని కేక్ కట్ చేసి ఫెడరేషన్ నాయకులు, అభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు. ఏఐసీఎఫ్ స్టేట్ లీగల్ సెల్ చైర్మన్ చాట్ల రాజశేఖర్, టీడీపీ క్రిష్టియన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇత్తడి చార్లెస్, నాయకులు సొంగా సంజయ్ వర్మ, పరిశపోగు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన డీజీపీ ద్వారకా తిరుమలరావును గురువారం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) శుభాకాంక్షలు తెలియజేశారు. పండిట్ నెహ్రూ బస్టాండ్‌లోని ఆర్టీసీ ఎండీ కార్యాలయంలో తిరుమలరావును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

బందరును మోడల్‌గా తీర్చిదిద్దుతాం

- మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూన్ 20 : మచిలీపట్నం నియోజకవర్గాన్ని కేంద్ర ప్రభుత్వ సాయంతో మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఎక్సైజ్, గనులు, జుయాలజీ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. రెవెన్యూ కళ్యాణ మండపంలో గురువారం రాత్రి కొల్లు రవీంద్ర జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. గజమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు నేతృత్వంలో బందరు పోర్టు నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. ఉపాధి అవకాశాలు లభించేందుకు పోర్టు అనుబంధ పరిశ్రమలను స్థాపిస్తామన్నారు. ఎంపీ బాలశౌరి సహకారంతో మచిలీపట్నంలో ఆయిల్ రిఫైనరీ ప్రాజెక్టులు నెలకొల్పుతామన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయబోమన్నారు. వైసీపీ పాలనలో నియోజకవర్గ ప్రజలు ఎన్నో అవస్థలకు గురయ్యారన్నారు. ప్రజలు తనకు 50వేలకు పైగా మెజారిటీ ఇచ్చి ఆదరించారన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు సంస్కరణలు చేపట్టారని, అనుకూలంగా వ్యవహరించే అధికారులు సహకరిస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. వైసీపీకి వత్తాసు పలికి రాష్ట్రాన్ని అవినీతిమయంగా చేసిన అధికారులను ఉపేక్షించేది లేదన్నారు. మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, ప్రజలు అఖండ విజయాన్ని ఇచ్చారని, ప్రజలు ఆశించిన విధంగా పరిపాలన సాగుతుందన్నారు.చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల కాంబినేషన్‌తో ప్రధాని మోదీ నుంచి రావలసిన నిధులను సేకరిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ, టీడీపీ నాయకులు కుంచే నాని, గోపు సత్యనారాయణ, టీడీపీ కార్పొరేటర్లు చిత్తజల్లు నాగరాము, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, ఎండీ ఇలియాస్ పాషా, పిప్పళ్ళ కాంతారావు, లంకే శేషగిరిరావు, వాలిశెట్టి తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం ప్రకటిస్తేనే రహదారికి భూములిస్తాం

- అధికారులకు తేల్చి చెప్పిన వేలేరు రైతులు



భూసేకరణపై రైతుల అభ్యంతరాలను ఆర్డీవో, పీడీలకు అందజేస్తున్న వేములపల్లి శ్రీనివాసరావు, రైతులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 20 : జాతీయరహదారి 216హెచ్(పోర్టురోడ్డు) కానుమోలు శివారు నుంచి వేలేరు మీదుగా ఏలూరు జిల్లాలోని నూజివీడు మండలం సీతారాంపురం వరకు నిర్మించే రహదారి భూసేకరణ నిమిత్తం విధి, విధానాలతో కూడిన కార్యాచరణ ప్రకటిస్తేనే భూములిస్తామని రైతులు తేల్చి చెప్పారు. వేలేరులో గుడివాడ ఆర్డీవో పి.పద్మావతి, ఎన్‌హెచ్216హెచ్ మచిలీపట్నం, ప్రాజెక్ట్ డైరెక్టర్, సాయిశ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం భూసేకరణ సదస్సు నిర్వహించారు. రైతులకు ఎటువంటి సమాచారం లేకుండానే గుగుల్ మ్యాప్ ఆధారంగా సాగు భూముల్లో సర్వే చేసి కాంక్రీట్ పిల్లర్లు వేయడం పట్ల అధికారులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేటు భూములను ప్రభుత్వ భూములుగా చూపడంపై ప్రశ్నిస్తూ సదస్సును అడ్డుకున్నారు. మండల సర్వేయర్ ఫణికుమార్ రైతులతో దురుసుగా ప్రవర్తించారని ఆర్డీవో ఎదుట ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. మరల ఇలాంటి పొరపాట్లు జరగకుండా చూస్తామని ఆర్డీవో, పీడీ హామీపై రైతులు శాంతించడంతో సదస్సు నిర్వహించారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంటలకు, కట్టడాలకు, బోర్లకు, డ్రిప్, పైపులైన్లకు, టేకు, వేప, తదితర వృక్షాలకు పోలవరం కుడికాలువ నిర్మాణానికి ఏ విధంగా భూసేకరణ నష్టపరిహారం ఇచ్చారో అదే విధంగా అమలు చేయాలని, ఉన్నతస్థాయి కమిటీతో సమావేశం జరిగేలా చూడాలని కోరుతూ రైతుల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వేములపల్లి శ్రీనివాసరావు అధికారులకు అందజేశారు. అధికారులకు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోకుండా పనులు చేస్తున్నారని, ఈసారి పనులను అడ్డుకుంటామని రైతులు, ప్రజలు హెచ్చరించారు. రైతుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే ఉన్నతస్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తామని ఆర్డీవో పద్మావతి, పీడీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎన్‌హెచ్ ఏఈ వెంకట్, సర్వే(డీఐ) నరసింహారావు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

విమానాశ్రయ విస్తరణ పనులపై కలెక్టర్ ఆరా..

గన్నవరం, జూన్ 20 : గన్నవరం విమానాశ్రయ విస్తరణ పనులపై వివిధ శాఖల అధికారులతో గురువారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సమీక్షించారు. తొలుత ఎయిర్‌పోర్టు విస్తరణ వివరాలు తెలుసుకున్నారు. శాఖల వారీగా పనులపై ఆరా తీశారు. దావాజీగూడెం, అజ్జంపూడి గ్రామాల్లో పర్యటించారు. గన్నవరం-ఉంగుటూరు మధ్య ఏలూరు కాలువపై నిర్మించనున్న వంతెన ప్రాంతాన్ని పరిశీలించారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజ్, వెంచర్‌లను పరిశీలించారు. మొత్తం 896 ఎకరాలు సేకరించామని, అందులో 90 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని కలెక్టర్‌కు అధికారులు వివరించారు. భూములు కోల్పోయిన వారికి కౌలు చెల్లించాల్సి ఉందని, డ్రెయినేజీ నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు అద్దె చెల్లించాలని చెప్పారు. నష్ట పరిహారం పెంచాలని కలెక్టర్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు. ఎయిర్‌పోర్టు విస్తరణ పనులు పూర్తిస్థాయిలో పూర్తయ్యేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బాధతుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతానని తెలిపారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎమ్మెల్‌కె రెడ్డి, ఆర్డీవో పద్మావతి, తహసీల్ధారు పవన్‌కుమార్, మండల సర్వేయర్ మాధవరావు, ఆర్ఐ ఉదయ్‌కుమార్ వీఆర్వో శ్రీరామ్ కుమార్ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



గూడూరులో విత్తనాలు వెదజల్లుతున్న కలెక్టర్ బాలాజీ

వ్యవసాయభూముల పరిశీలన..

- రైతులకు ప్రభుత్వ సాయం

పెడన రూరల్ : వ్యవసాయ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో కలక్టర్ డీకే బాలాజీ గూడూరులో వ్యవసాయ భూములను పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ, సాగుకు అవసరమైన వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ ఖర్చులు విపరీతంగా పెరిగి పోవటంతో విత్తనాలు వెదజల్లే పద్ధతిలో సాగుచేస్తున్నామని రైతులు తెలిపారు. కూలీలద్వారా, యాంత్రికంగా వెదజల్లే విధానాన్ని పరిశీలించారు. స్వయంగా కలక్టర్ విత్తనాలు వెదజల్లారు. దారిలో ఉన్న నారుమళ్లను చేశారు. సాగుకు పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వం ద్వారా సాయం అందిస్తామన్నారు. జిల్లా వ్యవసాయాధికారిణి ఎస్.పద్మావతి, ఏడీఏ మహిదర్, ఏవో జీవీ శ్రీనివాస్ తహసీల్దార్ శాంతి రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



జి.కొండూరు, జూన్ 20 : ట్రాక్టర్ వెనుక భాగాన్ని ఢీ కొట్టిన ఘటనలో స్కూటీపై వెళుతున్న యువకుడు దుర్మరణం చెందాడు. ప్రమాదం బుధవారం రాత్రి చెవుటూరులో 30.వ నంబరు జాతీయ రహదారిపై జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మైలవరానికి చెందిన షేక్ అబ్దుల్ నబీ (21) తన ఇద్దరు స్నేహితులు షేక్ ఉస్మాన్, షేక్ సుభానిలతో కలిసి బుధవారం రాత్రి 9 గంటలకు జి.కొండూరు వైపు స్కూటీపై వస్తు ఎదురుగా చెవుటూరు ఇటుక బట్టీల్లోకి వెళుతున్న ట్రాక్టర్‌ను బలంగా ఢీ కొట్టారు. ప్రమాదంలో నబీ తీవ్రంగా గాయపడగా, మిగిలిన ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. 108లో నబీని మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి షేక్ గాలిషాహిద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్సై షబ్బీర్ అహ్మద్ దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని రైతు ఆత్మహత్య



జగ్గయ్యపేట రూరల్, జూన్ 20 : మండలంలోని అన్నవరం గ్రామంలో రైతు కీతా బ్రహ్మయ్య (62) ఉరేసుకుని మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. గ్రామంలోని గిలక బావికి ఉన్న దిమ్మెకు మోకు కట్టి ఆ మోకును మెడకు ఉరిగా వేసుకుని బావిలోకి దూకటంతో మృతి చెందినట్టు గ్రామస్థులు తెలిపారు. ఆరోగ్య సమస్యల కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్టు కుటుంబసభ్యులు చెబుతున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సతీష్ తెలిపారు.

రైలు ఢీకొని మహిళ..



గుడివాడ : స్థానిక మల్లాయిపాలెం రైల్వే గేటు వద్ద గుర్తు తెలియని రైలు ఢీకొని నందివాడ మండలం టెలిఫోన్‌నగర్‌కు చెందిన కర్రె ప్రేమలీల(63) మృతి చెందినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	138, 147, 158
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.05

ఎంపీ కేశినేని చిన్నికి అభినందనలు



చిట్టినగర్, జూన్ 20: విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్‌ను గురువారం ఆయన కార్యాలయంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సుకాశికిరణ్‌కుమార్ 51వ డివిజన్‌కు చెందిన బూత్ కన్వీనర్లు, నాయకులతో కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో 51వ డివిజన్‌లో టీడీపీకి అత్యధిక ఓట్లు వచ్చాయని ఎంపీకి వివరించారు. ఎంపీని కలిసిన వారిలో పీతల కనకారావు, బెవర రవికుమార్, కిలిమి నాగరాజు, పొట్నూరి శేషు, రాయన చిన్న, కొరగంజి వినోద్, కంపా పోతురాజురెడ్డి, సుకాశి లీలా ప్రసాద్, డివిజన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి కొల్లు రవీంద్ర పుట్టినరోజు వేడుకలు

పటమట, జూన్ 20 : పటమటలంక ఫిషర్‌మెన్ సొసైటీ, 9వ డివిజన్ టీడీపీ సంయుక్త ఆధ్వర్యంలో గనులు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా ఎన్టీఆర్ సర్కిల్ వద్ద నిర్వహించారు. కొల్లు రవీంద్ర ఎన్టీఆర్ విగ్రహానికి తొలుత గజమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం టీడీపీ శ్రేణులు జయజయధ్వానాల మధ్య ఆయన కేక్ కట్ చేశారు. టీడీపీ అభిమానులు మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తుందన్న ధీమాను వ్యక్తం చేశారు. రాజధాని అమరావతి నిర్మాణం, మచిలీపట్నం పోర్టు నిర్మించి తీరుతామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీ, ముమ్మనేని ప్రసాద్, సబ్బినేని పసి, యలమంచిలి దేవేంద్ర, రాధారపు యల్లబాబు, పామర్తి కిషోర్, గద్దె క్రాంతికుమార్‌లు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

ఏపీపీజీ సెట్ ఫలితాల్లో సిద్దార్ధ ఫార్మశీ విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

మొగల్రాజపురం, జూన్ 20: ఏపీపీజీ సెట్ పరీక్షా ఫలితాల్లో కేవీఎస్ ఆర్ సిద్ధార్థ ఫార్మశీ విద్యార్థులు 2023-24 సంవత్సరానికి 41 మంది ఉత్తమ ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. సునీత ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయిలో పి.సౌజన్య 8వ ర్యాంకు, ఎం. ధాత్రిదీపిక 15 ర్యాంకు సాధించారన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయులను సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కళాశాల కన్వీనర్ అరుణ్‌కుమార్ అభినందించారు.



సౌజన్య, ధాత్రి దీపిక

నగరాభివృద్ధికి ఒక్క రూపాయి కేటాయించని జగన్

భారతీనగర్, జూన్ 20: గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది నగరాభివృద్ధికి రూ.150కోట్లు కేటాయిస్తున్నానని ప్రకటన చేసి ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ విమర్శించారు. గురువారం తూర్పు పరిధిలోని 3వ డివిజన్‌లోని గణేష్ నగర్ కాలనీలో సుమారు రూ.91లక్షల 30వేల వ్యయంతో భూగర్భ డ్రెయినేజీ సౌకర్యం, 9వ రోడ్డు పునర్నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హాజరై భూమి పూజ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాభివృద్ధికి చంద్రబాబునాయుడు పక్కా ప్రణాళికతో ఉన్నారని అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే నగరంలోని ప్రధాన సమస్యలను అన్నింటిని పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో ఏటా రూ.300కోట్లను కేటాయించడమే కాకుండా కార్పొరేషన్ ఉద్యోగుల జీతాలను ప్రభుత్వమే భరించేలా ప్రత్యేకంగా చర్యలు తీసుకున్నారని అన్నారు. చంద్రబాబు హయాంలో ప్రపంచ స్థాయి నగరాల్లో విజయవాడను ఒకటిగా తీర్చిదిద్దుతామని అన్నారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, తాడి బాబురావు, గుత్తికొండ కృష్ణమోహన్, గద్దె రమేష్, యలమంచిలి రాజేంద్ర ప్రసాద్, రాజేష్, యలమందరావు, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ

పటమట: 9వ డివిజన్ పటమటలంక ఎలిమెంటరీ హైస్కూల్, 11వ డివిజన్ కేబీసీ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు గురువారం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాంలను పంపిణీ చేశారు. ఎంఈవోలు విజయరామారావు, రాజశేఖర్, విజయలక్ష్మి, చెన్నుపాటి కాంతి శ్రీ, చెన్నుపాటి గాంధీ, ముమ్మనేని ప్రసాద్, కోనేరు రాజేష్, యలమంచిలి దేవేంద్ర, అన్నాబత్తుల బాబీ, ఎలిమెంటరీ స్కూల్ హెచ్ఎం జేబీ పాల్గొన్నారు.

500 మందికి అన్నదానం

ఈనాడు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు పెద్ద కర్మ సందర్భంగా గురువారం 11వ డివిజన్ ఆటోనగర్ పాకల దగ్గర ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తన సొంత నిధులతో 500 మందికి అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దె టీడీపీ తూర్పు నియోజకవర్గం తరపున రామోజీరావుకు ఘన నివాళి అర్పించారు.

ట్రైసైకిళ్లు, వినికిడి మిషన్‌లు పంపిణీ

భారతీనగర్, జూన్ 20: లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ, తటవర్తి వరలక్ష్మీ, సూర్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఐదుగురు దివ్యాంగులకు ట్రైసైకిళ్లను, 20మందికి వినికిడి మిషన్‌లను గురునానక్ రోడ్డు సమీపంలోని ఆర్టీసీ కాలనీ మొదటి రోడ్డులోని ట్రస్ట్ కార్యాలయంలో గురువారం అందజేశారు. లయన్స్ జిల్లా గవర్నర్ జెఎన్.శంకర్ గుప్తా, లయన్స్ డిజిగ్నేటెడ్ అంబాసిడర్ వేముల హజరత్తయ్య గుప్తా, మాజీ గవర్నర్ దుర్గా మల్లేశ్వరరావు, ట్రస్ట్ సభ్యులు చంద్రశేఖర్, లయన్స్‌క్లబ్ సభ్యులు కొత్తమాసు రామ్‌కుమార్, ఐ.నాగేశ్వరరావు, గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్న సంతర్పణ

సత్యనారాయణపురం, జూన్ 20: మెగాస్టార్ చిరంజీవి మనుమరాలు క్లింకార మొదటి జన్మదినం సందర్భంగా చిరంజీవి అభిమానులు పేదలకు అన్న సంతర్పణ చేశారు. సత్యనారాయణపురం, బీఆర్టీఎస్ రోడ్డు, ముత్యాలంపాడు, దుర్గాపురం, గాంధీనగర్, ప్రకాశం బ్యారేజీ ప్రాంతాల్లో గురువారం పేదలకు అన్నసంతర్పణ చేశారు. ఈ సందర్భంగా చిరంజీవి అభిమానురాలు గుడివక లక్ష్మి మాట్లాడుతూ యువత సేవా కార్యక్రమాల్లో పాలుపంచు కోవాలన్నారు.



గాంధీజీ మహిళా కళాశాల ఆధ్వర్యంలో, ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ఆధ్వర్యంలో ర్యాలీ

యోగాతో వ్యక్తిత్వ వికాసం

ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధాకర్

వన్‌టౌన్, జూన్ 20: వ్యక్తిత్వ వికాసానికి యోగా దోహదపడుతుందని డాక్టర్ నోరి రామశాస్త్రి, ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సాయిసుధాకర్ అన్నారు. గురువారం కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైనందిన కార్యక్ర మాలలో యోగాకు కొంతసమయం కేటాయించాలని అన్నారు. ఆచంట లక్ష్మీపతి ఆయుర్వేద ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే.రాజరాజేశ్వరి, ప్రాంతీయ ఉపసంచాలకుడు డాక్టర్ వెంకట కృష్ణ, లే సెక్రటరీ ధనుంజయరావు, తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ మహిళా కళాశాల ఆధ్వర్యంలో....

వన్‌టౌన్‌లోని గాంధీజీ మహిళా కళాశాల విద్యార్థినులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల ఆవరణ నుంచి వన్‌టౌన్‌లోని జెండా చెట్టు వీధి మీదుగా హిందూ హైస్కూల్, సామరంగం చౌక్, కెనాల్ రోడ్డు, కాళేశ్వరరావు మార్కెట్‌ల మీదుగా తిరిగి కళాశాలకు ర్యాలీ చేరింది. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఎల్. కాంతారావు, వైస్ ఛైర్మన్ కేవీ పిచ్చయ్య, ప్రిన్సిపాల్ ఎం.రమణశ్రీ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న మధురానగర్ టీడీపీ నాయకులు



మధురానగర్, జూన్ 20: సెంట్రల్‌లో కూటమి అభ్యర్థిగా టీడీపీ తరపున పోటీ చేసిన బొండా ఉమామహేశ్వరరావు గెలి చిన సందర్భంగా 29వ డివిజన్ మధురానగర్ నాయకులు గురు వారం మొక్కు తీర్చుకున్నారు. డివిజన్ ఇన్‌ఛార్జి నెక్కంటి ప్రసాద్, అధ్యక్షుడు పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో డివిజన్ కమిటీ నాయకులు, పెద్దలు శ్రీశైలం, మంత్రాలయం, మహానంది తదితర క్షేత్రాలకు వెళ్లి దేవుడి మొక్కు తీర్చుకున్నారు. వీరిలో అడపా కోటేశ్వరరావు, అంగిరేకుల రాంబాబు, రమేష్ తదితరులు ఉన్నారు.

సాయిబాబా భక్తులకు పాదుకలు అందజేత



గవర్నర్‌పేట, జూన్ 20: బాబా భక్తులు కనకమేడల భరత్‌భూషణ్, శివపార్వతీ దంపతుల సౌజన్యంతో గురువారం లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీషిర్డినాగసాయిబాబా-నాగమానసాదేవి మందిరానికి, సాయిబాబా భక్తులకు పాదుకలు అందజేశారు. మందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో పాదుకలకు పూజలు నిర్వహించి, బాబా దర్శనానికి వచ్చిన 100 మంది భక్తులకు వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుధాస్వామి మాట్లాడుతూ 150 సంవత్సరాల వయస్సు ఉన్న ఔదంబర వృక్షం నుంచి సేకరించిన కలపతో వీటిని తయారు చేయించినట్లు తెలిపారు. పాదుకలు పంపిణీ అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. బాబా భక్తులు వెన్నా వీరాంజనేయులు, రమాదేవి దంపతులు, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగులు పంపిణీ

చిట్టినగర్, జూన్ 20: 49వ డివిజన్ చిట్టినగర్ మట్టా లాజరస్ నగరపాలక సంస్థ పాఠశాల విద్యార్థులకు గురువారం కార్పొరేటర్ బుల్లా విజయ్ కుమార్ ప్రభుత్వం అందించిన ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బూట్లు, బ్యాగులు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం బసవేశ్వరరావు, టీడీపీ డివిజన్ అధ్యక్షుడు బడుగు వెంకన్న, డివిజన్ జనసేన అధ్యక్షుడు చినబాబు, జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు కొమర కిరణ్, స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సత్యనారాయణపురం, జూన్ 20: ముత్యాలంపాడు సబ్‌స్టేషన్ పరిధి బుడమేరు కట్ట ఫీడర్ లో శుక్రవారం ఉదయం 8గంటల నుంచి 10 వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీరు బి.వి.సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్, లెవన్‌కేవీ లైన్లు మరమ్మతుల కారణంగా అయోధ్యనగర్ ఒకటవ రోడ్డు నుంచి ఏడో రోడ్డు వరకూ చింతచెట్లబజారు, ఘట్టారత్తయ్య వీధి, అయోధ్యనగర్ డొంకరోడ్డు, సాయిబాబా గుడి రోడ్డు, అగ్రిగోల్డ్ శివాలయం, గన్నాబత్తుల బాబురావు వీధి, పసుపులేటివారి వీధి, రామదాసు ఆదినారాయణ, సూర్యబాల అపార్టుమెంట్, బుడమేరుకట్ట, సూరిబాబుకాలనీ, శారదాస్కూల్, క్షత్రియభవన్, ఆర్.ఎల్.పేట రెండవ లైన్ ఏరియాలలో విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలుగుతందని తెలిపారు.

ఇంతియాజ్‌కు ఘన నివాళి

పాతరాజరాజేశ్వరి పేట, జూన్ 20 : టీడీపీ యువనాయకుడు సయ్యద్ ఇంతియాజ్ హుస్సేన్ మూడో వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం పెజ్జోనిపేటలో స్థానిక టీడీపీ నాయకులు చేపట్టారు. ముందుగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ సీనియర్ నాయకుడు చెన్నుపాటి శ్రీను, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ఎంఎస్ బేగ్ హాజరయ్యారు. ముందుగా ఇంతియాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇంతియాజ్ సేవలను మెచ్చి అతని సోదరుడు ఫయాజ్ హుస్సేన్, స్నేహితులు దుర్గ, దుర్గారావు, రాజేశ్వరి, ప్రసాద్, ప్రభ, సాయిలకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అన్నదానం నిర్వహించారు. టీడీపీ డివిజన్ ప్రెసిడెంట్ నందకుమారి, కొట్టేటి హనుమంతరావు, ముజీబ్, జలాల్, కొండ, కరీం పాల్గొన్నారు.



ఇంతియాజ్‌కు నివాళి అర్పిస్తున్న సీనియర్ నాయకుడు చెన్నుపాటి శ్రీను

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

గన్నవరం,జూన్ 20: గన్నవరం విమానాశ్రయం ఎదురుగా ఉన్న వీకేఆర్ కళాశాలలో గురువారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన వచ్చింది.

480 మంది యువతీయువకులు రాగా రాష్ట్రంలోని పేరొందిన 15 సంస్థలకు చెందిన ప్రతి నిధులు ఇంటర్వ్యూలు జరిపారు. 125 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు తెలిపారు. నవీన్ కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



చిట్టినగర్, జూన్ 20: స్థానిక పద్మావతి గోదాదేవి సమేత గరుడాచల స్థిత వేంకటేశ్వరస్వామి వార్ల దేవస్థాన త్రయోదశ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు లింగిపిల్లి అప్పారావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు(పీసీ)లు పేర్కొన్నారు. గురువారం చిట్టినగర్ నగరాల సీతారామస్వామి మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానంలో కమిటీ సభ్యులు బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వివరాలను మీడియాకు తెలియజేశారు. ఈ నెల 21 (శుక్రవారం) నుంచి 25వరకు, మురికిపూడి మనిదీప్‌కుమార్(ప్రొఫెసర్ వైదిక్ యునివర్శిటీ, తిరుమల) ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు విసుకొండ రత్నామాచార్యులు, అర్చకుడు శ్రీనివాసుల గోపాల్ ప్రత్యేక పర్యవేక్షణలో బ్రహ్మో త్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గుంతలో దిగబడిన భారీ ట్రాలీ



వన్‌టౌన్, జూన్ 20: అభివృద్ధి పనుల నిమిత్తం తవ్విన గుంతను సక్రమంగా పూడ్చకపోవడంతో ఓ భారీ ట్రాలీ దిగబడింది. గురువారం విజయవాడలోని పూర్ణానందపేట నుంచి సింగ్‌నగర్ వైపునకు కేబుల్ లోడ్‌తో ఓ భారీ ట్రాలీ వెళుతుంది. పప్పులమిల్లు సమీపంలో ఇటీవల వీఎంసీ అధికారులు అభివృద్ధి పనుల నిమిత్తం రోడ్డు తవ్వి సక్రమంగా పూడ్చకుండా వదిలేశారు. ఆ భారీ ట్రాలీ టైర్లు తవ్వి వదిలేసిన గుంతలోకి దిగబడిపోయాయి. డ్రైవర్, క్లీనర్ నానా ఇబ్బందులకు గురయ్యారు.

మహిళలకు చీరల పంపిణీ

పాతరాజరాజేశ్వరి పేట, జూన్ 20 : ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి జన్మదిన కార్యక్రమాన్ని టీడీపీ సీనియర్ నాయకుడు యలవర్తి సునీల్ చౌదరి, కస్తూరిబాయ్ మెమోరియల్ ట్రస్ట్ ఛైర్మన్ యలవర్తి శ్రీకాంత్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని పలు ప్రాంతాల్లో వీధుల్లో ఉన్న యాచక మహిళలకు చీరలను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు, ట్రస్ట్ సభ్యులు చల్లగాలి అనీల్ కుమార్, వి. రాజేష్, టి. కొండలరావు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీడీలో మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్

హైదరాబాద్-బాలానగర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్(సీఐటీడీ)- ఫుల్ టైం మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్(ఎంఈ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ సహకారంతో ఈ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నారు. కోర్సు వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఎంట్రెన్స్ ఎగ్జామ్, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. హైదరాబాద్ సీఐటీడీ క్యాంపస్‌లో ప్రతి సోమ, మంగళ, బుధ వారాల్లో ఉదయం తొమ్మిదిన్నర నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు; ఓయూ ఇంజనీరింగ్ కాలేజ్(మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్) క్యాంపస్‌లో ప్రతి గురు, శుక్ర, శని వారాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం అయిదున్నర వరకు తరగతులు నిర్వహిస్తారు. ఉస్మానియా యూనివర్సిటీ మాస్టర్స్ డిగ్రీని ప్రదానం చేస్తుంది.

స్పెషలైజేషన్‌లు

- మెకానికల్ క్యాడ్/క్యామ్
- టూల్ డిజైన్
- డిజైన్ ఫర్ మాన్యుఫాక్చర్
- మెకట్రానిక్స్

అర్హత: ఏఐసీటీఈ గుర్తింపు పొందిన కళాశాల నుంచి మెకానికల్ ఇంజనీరింగ్/ప్రొడక్షన్ ఇంజనీరింగ్/ మెకట్రానిక్స్ ఇంజనీరింగ్/ఆటొమొబైల్ ఇంజనీరింగ్/ఏరోనాటికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.

- **ప్రోగ్రామ్ ఫీజు:** రెగ్యులర్ అభ్యర్థులు సెమిస్టర్‌కు రూ.41,000; స్పాన్సర్డ్ అభ్యర్థులు సెమిస్టర్‌కు రూ.51,000 చెల్లించాల్సి ఉంటుంది. అటానమస్ ఫీజు కింద రూ.9,770; కాషన్ డిపాజిట్ కింద రూ.1,000 చెల్లించాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.750
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 12
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** జూలై 14
- **పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **వెబ్‌సైట్:** citdindia.org

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/BeB8vjvలో చదవండి.

దిక్సూచి
DIKSUCHI

నల్సార్‌లో సర్టిఫికేషన్ కోర్సు

హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లాకు చెందిన సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(సీడీఓఈ)- షార్ట్ టర్మ్ సర్టిఫికేషన్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇందులో ప్రధానాంశం 'సైబర్ క్రైమ్స్ ఇన్వెస్టిగేషన్ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్స్ యూజింగ్ ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్(ఓసింట్) టూల్స్ అండ్ టెక్నిక్స్'. ఈ కోర్సుకి సెంటర్ ఫర్ సైబర్ లాస్ అండ్ ఫోరెన్సిక్ సైన్సెస్ సహకారం అందిస్తోంది. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు, ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 70 సీట్లు ఉన్నాయి. నల్సార్ విద్యార్థుల కోసం 10 సీట్లు ప్రత్యేకించారు.

- **కోర్సు ఫీజు:** రూ.6000
- **ప్రోగ్రామ్ సెషన్స్:** జూలై 5 నుంచి 7 వరకు
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 4
- **వెబ్‌సైట్:** nalsar.ac.in



ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ గురువారం 'విశ్వంభర' చిత్రం సెట్స్‌లో చిరంజీవితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దుర్గేశ్‌ను చిరంజీవి శాలువా కప్పి సత్కరించారు. మంత్రిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నెరవేర్చడంలో దుర్గేశ్ విజయం సాధించాలని చిరంజీవి ఆకాంక్షించారు.



యాభై ఏళ్లుగా తెలుగు చిత్రపరిశ్రమకు ఎనలేని సేవ చేస్తూ, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి అధ్యక్షుడిగా సేవలు అందిస్తూ, హిందూపురం నుంచి మూడోసారి శాసనసభ్యుడిగా ఎన్నికైన నందమూరి బాలకృష్ణను తెలుగు చలనచిత్ర వాణిజ్యమండలి, తెలుగు నిర్మాతల మండలి, తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు కలసి అభినందించారు.

మూడు ప్రపంచాల మధ్య జరిగే కథ



ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్ వంటి టాప్ స్టార్స్ నటించిన సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ' ప్రమోషనల్ కంటెంట్ ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తికలిగిస్తోంది. అలాగే దర్శకుడు నాగ్ అశ్విన్ పాల్గొన్న 'ఎపిక్ జర్నీ ఎపిసోడ్ వన్' కుతూహలాన్ని మరింత పెంచింది. తాజాగా గురువారం రెండో ఎపిసోడ్‌ను విడుదల చేశారు. ఇందులో దర్శకుడు మాట్లాడుతూ 'మూడు ప్రపంచాల మధ్య జరిగే కథ ఇది. ఒక్కో వరల్డ్ నుంచి ఒక్కో థాట్ ప్రాసెస్‌తో ఫ్యూచరిస్టిక్‌గా బిల్డప్ చేశాం. ఇందులో కాశీ మొదటిది. ఈ ప్రపంచంలో కాశీనే చివరి సిటీ అయితే ఎలా ఉంటుందన్న ఆలోచనతో 'కల్కి' స్క్రిప్ట్ మొదలు పెట్టాం. కలియుగం చివరిలో గంగానది ఎండిపోయిన తర్వాత కాశీ ఎలా ఉంటుంది, నాగరికత ఏ విధంగా ఉంటుంది అనే ఊహతో ఆ సిటీని క్రియేట్ చేశాం. ఇండియన్ ఆర్కిటెక్చర్, వెహికిల్స్, కరెన్సీ.. ఇలా అన్ని విషయాల్లో ఫ్యూచరిస్టిక్‌గా ఆ సిటీని రూపొందించాం. కాశీ పైన పిరమిడ్ ఆకారంలో ఉండే స్ట్రక్చర్ ఉంటుంది. దాన్ని మేం కాంప్లెక్స్ అంటాం. భూమిపై లేని నేచర్, యానిమల్స్, ఫుడ్.. అక్కడ ఉంటాయి. ఇదో రకం స్వర్గం అనుకోవచ్చు. మూడో ప్రపంచం శంబల. కాశీకీ, కాంప్లెక్స్‌కూ సంబంధం లేని ప్రపంచం అది. అక్కడ ఉన్న వారు కాంప్లెక్స్‌లో ఉన్నవారిని ఛాలెంజ్ చేస్తుంటారు. కల్కి అవతారం శంబలలో పుడుతుందనే నమ్మకం మన శాస్త్రాల్లో ఉంది. ఈ మూడు ప్రపంచాలు ఒకదానితో మరొకటి కలగలుస్తూ 'కల్కి' కథ నడుస్తుంది' అన్నారు.

థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో...



వరుణ్ సందేశ్, మధులిక వారణాసి జంటగా నటిస్తున్న చిత్రం 'ద కానిస్టేబుల్'. ఆర్యన్‌సుభాన్ ఎస్.కే దర్శకత్వం వహిస్తుండగా, జగదీశ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ఇటీవలే పూర్తయింది. ఈ సందర్భంగా వరుణ్ సందేశ్ మాట్లాడుతూ "త్వరలోనే కానిస్టేబుల్ పాత్రతో.. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో మీ ముందుకు వస్తున్నాను" అని చెప్పారు. "అద్భుతమైన కథ, ఆకట్టుకునే కథనం కుదిరిన సినిమా ఇది" అని నిర్మాత జగదీశ్ అన్నారు. "ఈ సినిమాలో వరుణ్ సందేశ్ నట విశ్వరూపం చూస్తారు" అని దర్శకుడు ఆర్యన్ సుభాన్ ఎస్.కే అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: వరప్రసాద్, కెమెరామెన్: హజరత్ షేక్, సంగీతం: సుభాశ్ఆనంద్.



తెలుగు నిర్మాతల హిందీ చిత్రం

టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థలు మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బాలీవుడ్ ఎంట్రీకి సిద్ధమయ్యాయి. ఈ రెండు సంస్థలు కలసి సన్నీడియోల్ కథానాయకుడిగా ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, టీ.జి విశ్వప్రసాద్ నిర్మాతలు. తెలుగు దర్శకుడు గోపీచంద్ మలినేని దర్శకత్వం వహిస్తున్నారు. డైరెక్టర్‌గా హిందీలో ఆయనకు ఇది తొలి చిత్రం. భారీ బడ్జెట్‌తో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని మేకర్స్ గురువారం లాంచ్ చేశారు. ఈ నెల 22 నుంచి రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించనున్నారు. సయామీ ఖేర్, రెజీనా కసాండ్రా కీలకపాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: ఎస్ థమన్, సినిమాటోగ్రఫీ: రిషి పంజాబీ.

సర్‌ప్రైజ్ ఇవ్వబోతున్నా



దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కించిన 'మగధీర' చిత్రంలో ప్రతినాయకుడిగా అందరినీ మెప్పించిన దేవ్‌గిల్.. ఆ తర్వాత వరుస సినిమాల్లో అవకాశాలు కొట్టేసి, అనేక సార్లు ప్రతినాయకుడి పాత్రలు పోషించారు. ప్రస్తుతం ఆయన లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'అహో విక్రమార్క'. 'మా అబ్బాయి', 'రంగుల రాట్నం' ఫేమ్ చిత్ర శుక్లా హీరోయిన్‌గా నటిస్తున్నారు. పేట త్రికోటి దర్శకత్వంలో ఆర్తి చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గురువారం సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దేవ్‌గిల్ మాట్లాడుతూ "నన్ను ఇంతవరకూ మీరందరూ విలన్ పాత్రల్లోనే చూశారు. కానీ మీ అందరికీ ఈ సినిమాతో నేను సర్‌ప్రైజ్ ఇవ్వబోతున్నాను" అని చెప్పారు. "టెక్నికల్‌గా ఈ చిత్రం అద్భుతంగా ఉంటుంది" అని దేవ్ గిల్ భార్య, నిర్మాత ఆర్తి అన్నారు. "మంచి సినిమా చేశాం. ప్రేక్షకులందరూ ఈ సినిమాను ఆదరించాలి" అని దర్శకుడు పేట త్రికోటి కోరారు.



ఆలయ దర్శనం


అలకనంద సంగమ సీమలు
పంచ ప్రయాగలు

ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని చార్‌ధామ్ యాత్రకు ఏడాదిలో సుమారు ఆరు నెలలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ యాత్రలో భక్తులు తప్పనిసరిగా సందర్శించి, పవిత్రస్నానాలు ఆచరించే ప్రదేశాలు... పంచ ప్రయాగలు. 'ప్రయాగ' అంటే 'సంగమం' అని అర్థం. అలకనందలో అయిదు నదులు కలిసి... పవిత్ర గంగానదిగా రూపుదిద్దుకుంటాయి. ఈ పంచ సంగమ స్థలాల్లో చేసే స్నానం మోక్షప్రదాయకమనీ, ఆత్మను శుద్ధి చేస్తుందనీ అనాది విశ్వాసం. పంచ ప్రయాగలు... ఋషీకేశ్ నుంచి బదరీనాథ్ వెళ్ళే మార్గంలో ఉన్నాయి. వాటి విశిష్టత గురించి తెలుసుకుందాం.




దేవప్రయాగ: దేవప్రయాగ ఉత్తరాఖండ్‌లోని టిహ్రీ-గర్వాల్ జిల్లాలోని ఒక పట్టణం. 'దేవ ప్రయాగ' అంటే 'దేవతలు కలిసే' లేదా 'దివ్యత్వం సంగమించే ప్రదేశం' అని అర్థం. కుబేరుని పట్టణంగా పురాణాలు వర్ణించిన అలకాపురి నుంచి ప్రవహించే అలకనంద... గంగోత్రి నుంచి వచ్చే భాగీరథి నదులు ఇక్కడ సంగమిస్తాయి. శ్రీరాముడు అశ్వమేధ యాగం చేసిన ప్రదేశం ఇదేననే విశ్వాసం ఉంది. దానికి ప్రతీకగా ఇక్కడ నెలకొన్న రఘునాథ ఆలయాన్ని భక్తులు పెద్ద సంఖ్యలో సందర్శిస్తారు.

ఎక్కడుంది?: ఋషీకేశ్ నుంచి 72 కిలోమీటర్ల దూరంలో




రుద్రప్రయాగ: ఇది మందాకినీ, అలకనంద నదుల సంగమ స్థలి. రుద్రప్రయాగ జిల్లాకు కేంద్రం. పురాణాల ప్రకారం... నారదుడికి మహా శివుడు సంగీతాన్ని నేర్పిన చోటు. అలాగే శివుడు రుద్రవీణానాదాన్ని పలికించిన చోటు. రుద్రమూర్తిగా కనిపించిన శివుణ్ణి నారదుడు పూజించగా... అతని కోరిక మేరకు శివుడు ఇక్కడ వెలిశాడట. రుద్రప్రయాగలో రుద్రనాథ మందిరం, చాముండా దేవి ఆలయంతో సహా పలు మందిరాలు ఉన్నాయి. ఇది బదరీనాథ్, కేదార్‌నాథ్ యాత్రికులకు కూడలి.

ఎక్కడుంది?: ఋషీకేశ్ నుంచి 137 కిలోమీటర్ల దూరంలో



కర్ణప్రయాగ: అజేయమైన కవచాన్ని పొందడానికి శివుడి కోసం కర్ణుడు తపస్సు చేసిన చోటుగానూ, కర్ణుడి నగరంగానూ పురాణాలు పేర్కొంటున్న కర్ణ ప్రయాగ... ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో ఉంది. కర్ణ ప్రయాగ దగ్గర... అలకనంద, పిండారి నదులు సంగమిస్తాయి. జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్, నైనిటాల్, అల్మోరాలకు ఇక్కడి నుంచి మార్గాలు ఉన్నాయి. కర్ణప్రయాగలో పద్ధెనిమిది రోజుల పాటు స్వామి వివేకానంద తపస్సు చేశారంటారు. ఇక్కడ ఉమాదేవి ఆలయం ఉంది.

ఎక్కడుంది?: ఋషీకేశ్ నుంచి 168 కిలోమీటర్ల దూరంలో



నందప్రయాగ: శ్రీకృష్ణుణ్ణి పెంచిన నందుడి ఊరు, గోపాలుడు పెరిగిన నంద గోకులం, నందుడు యజ్ఞం ఆచరించిన చోటు, కణ్వాశ్రమం ఉన్న ప్రదేశం, శకుంతలా దుష్యంతుల వివాహ స్థలి... ఇలా నంద ప్రయాగ విశిష్టతను పురాణాలు అనేక విధాలుగా వర్ణించాయి. అలకనంద, నందాకినీ నదులు సంగమించే నందప్రయాగలో పురాతనమైన గోపాల్జీ (నంద గోపాల) మందిరం ఉంది. నందాదేవీ పర్వత పాదాల దగ్గర... చమోలీ జిల్లాలో ఉన్న నందప్రయాగ సంగమంలో స్నానం సకలపాప హరం అని భక్తుల విశ్వాసం.

ఎక్కడుంది?: ఋషీకేశ్ నుంచి 188 కిలోమీటర్ల దూరంలో.



విష్ణుప్రయాగ: అలకనంద, ధౌలిగంగ నదులు ఇక్కడ సంగమిస్తాయి. చమోలీ జిల్లాలో ఉన్న విష్ణుప్రయాగ... కేదార్‌నాథ్‌కు వెళ్ళే మార్గంలోని ఆఖరి సంగమం. మహా విష్ణువు కోసం నారదుడు ఈ ప్రదేశంలో తపస్సు చేశాడని పురాణాలు చెబుతున్నాయి. ఇక్కడ మహా విష్ణువు ఆలయం, సంగమం దగ్గర విష్ణుకుండం ఉన్నాయి. ప్రకృతి సంపదకు నిలయమైన ఈ ప్రాంతం ట్రెక్కింగ్, హైకింగ్‌లకు కూడా ప్రసిద్ధి చెందింది. వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్, హేమకుండ్ లేక్ లాంటివి పర్యాటకులను ఆకట్టుకుంటాయి.

ఎక్కడుంది?: ఋషీకేశ్ నుంచి 255 కిలోమీటర్ల దూరంలో.

ఎలా వెళ్ళాలి: ఋషీకేశ్- బదరీనాథ్‌ల మధ్య దూరం దాదాపు 286 కిలోమీటర్లు. పంచప్రయాగలు ఆ దారిలోనే ఉన్నాయి. ఋషీకేశ్ నుంచి రోడ్డు మార్గంలో ప్రయాణించాల్సి ఉంటుంది. ఋషీకేశ్‌లో రైల్వేస్టేషన్ ఉంది. అక్కడికి విమానాశ్రయం సుమారు 35 కిలోమీటర్ల దూరంలోని డెహ్రాడూన్‌లో ఉంది.

అతిథి



సామాజికమైన అంతరాలను నిరసిస్తూ ఒడిశాలో ప్రారంభమైన ఒక ఉద్యమం... అలెఖ్ మహిమ ధర్మం. నిరాడంబరమైన, కఠినమైన జీవన విధానాన్ని అనుసరిస్తూ, సర్వసమానత్వాన్ని కాంక్షించే ఆ సంప్రదాయానికి చెందిన **సాధు త్రినాథ్ దాస్**... 'హిందూస్ ఫర్ ప్లూరాలిటీ అండ్ ఈక్వాలిటీ' (హెచ్‌పిఇ) సంస్థకు జాతీయ అధ్యక్షునిగా... మత విద్వేషాలు, అసమానతలపై పోరాడుతున్నారు. ఆయన పలు అంశాలపై తన అభిప్రాయాలను 'నివేదన'తో పంచుకున్నారు...

అది తెలుసుకుంటే...
మరేవీ అక్కర్లేదు

అలెఖ్ మహిమ సంప్రదాయంలోకి ఎలా వచ్చారు?

ఆ సంప్రదాయంలో నేనొక సాధువును. మాది ఒడిశాలోని కలహండి దగ్గర ఒక గ్రామం. నాకు పదేళ్ళ వయసున్నప్పుడే ఇంటి నుంచి బయటకు వచ్చేశాను. నా మాతృభాష ఒరియా. తరువాత హిందీ, తెలుగు లాంటి భాషలు కొద్దికొద్దిగా నేర్చుకున్నాను. నేను అయిదో తరగతి వరకూ చదువుకున్నాను. ఆ వయసులోనే నాకు సాధు మార్గంలో నడవాలనే ఆలోచన కలిగింది. నేను ఏదైనా నేర్చుకున్నానంటే అది మా గురువుల దగ్గరే. 'ఉన్నది ఒక్కటే... బ్రహ్మమొక్కటే' అనేది వారి నుంచే తెలుసుకున్నాను.

ఈ సంప్రదాయంలో ప్రధానమైన భావన ఏమిటి?

మేము అన్నింటిలోనూ దేవుణ్ణి దర్శిస్తాం. మాకు విగ్రహారాధనలు లేవు. తిలకాలు దిద్దుకోవడం, పూజలు చేయడం లాంటివి లేవు. ప్రతి ఒక్కరిలోనూ దేవుడున్నాడు. వారు ఎవరనేది మాకు అనవసరం. వారిలో ఉన్న దేవుణ్ణి మేము పూజిస్తాం. అలెఖ్ సంప్రదాయంలోని విశేషం అదే. ఈ ప్రపంచంలో మీరు ఏది చేస్తున్నా... అది మీరు ఉపాసన చేస్తున్న దేవుణ్ణే చేరుతుంది.

ఈ సంప్రదాయాన్ని స్థాపించింది ఎవరు?

అలెఖ్ పరబ్రహ్మ మహిమా గోస్వామి. అప్పట్లో మతకలహాలు, మత విభేదాలు ఎక్కువగా ఉండేవి. అలెఖ్ స్వామి ఎక్కడ పుట్టారో, ఎక్కడ పెరిగారో ఎవరికీ తెలీదు. మత విభేదాలు, కులవిభేదాలు వద్దని ఆయన బోధించారు. అన్ని కులాలవారినీ, మతాలవారినీ కలిపి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసేవారు. దీన్ని అగ్రకులాలవారు వ్యతిరేకించారు. అలెఖ్ స్వామి అనే వ్యక్తి ఎవరో వచ్చి కుల కట్టుబాట్లను నాశనం చేస్తున్నారని ఆ ప్రాంతంలోని రాజుకు ఫిర్యాదు చేశారు. ఆ స్వామిని బంధించాలని రాజు ఆదేశించినా... అది సాధ్యం కాలేదు. అలెఖ్ స్వామి ముప్ఫై అయిదు ఏళ్ళు మాత్రమే జీవించారు. తరువాత ఆయన నెలకొల్పిన సంప్రదాయం కొనసాగుతోంది. అది చాలా ప్రాచుర్యం పొందినదే. ఈ సంప్రదాయం ఒడిశాలో, ఆంధ్రప్రదేశ్‌లో, బిహార్‌లో, ఛత్తీస్‌గఢ్‌లో... ఇలా అనేక రాష్ట్రాలలో ఉంది.

దీనికి ఒక స్థిరమైన వ్యవస్థ ఉందా?

'అలెఖ్ మహిమ సమాజ్' అనే వ్యవస్థ ఉంది. దానికి అధ్యక్షుడు ఉంటారు. పదకొండు మంది సభ్యులతో ఒక కమిటీ ఉంటుంది. వారి నేతృత్వంలో అన్నీ క్రమబద్ధంగా నడుస్తాయి. ఇక మాకు ఆదాయ మార్గాలేవీ లేవు. ప్రత్యేకమైన వ్యాపార వ్యవహారాలేవీ లేవు. రాజకీయ ప్రాపకాల ద్వారా ఆదాయాన్ని మేము కోరుకోం. అలెఖ్ సంప్రదాయంలో ఉన్న వారితో పాటు ఇతర భక్తులు, దాతలు విరాళాలను ఇస్తారు. వాటి మీదనే మా వ్యవస్థ నడుస్తుంది. మేము ఒక రోజు ఒక ఊర్లో ఉంటాం. మరో రోజు ఇంకో ఊరిలో ఉంటాం. ఈ పూట మీ ఇంట్లో భోజనం చేస్తే... ఇక రెండో పూట మీ ఇంట్లో భోజనం చేయం. మా సంప్రదాయంలో అది ముఖ్యమైన నియమం. ఎందుకంటే... మోహం ఉండకూడదు. గాలి, నీరు అనేవి ఎప్పుడూ ప్రయాణిస్తూనే ఉంటాయి. ఎందుకంటే వాటిని బంధించలేం. మా సంప్రదాయం కూడా అలాంటిదే. మేము ఎవరినీ ద్వేషించం. నిరాడంబరంగా ఉంటాం. ఒకే చోట ఉంటే ఆ ప్రదేశం మీద, వ్యక్తుల మీద ప్రేమ, అభిమానం కలుగుతూ ఉంటాయి. ఏదో ఒక బంధంలో చిక్కుకుంటాం. ఈ బంధం ఎలాంటిదంటే... కాలసర్పంలా కాళ్ళకి చుట్టేస్తుంది.

మీ దినచర్య ఎలా ఉంటుంది?

మేము ఎక్కడ ఉన్నా... సాధువులమైనా, భక్తులమైనా... తెల్లవారుజామున మూడు గంటలకు నిద్ర లేస్తాం. కాలకృత్యాలు తీర్చుకొని, స్నానం చేస్తాం. ప్రార్థనలు చేస్తాం. వాటిలో వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీతల్లోంచి తీసుకున్నవి, మా సంప్రదాయానికి చెందినవీ ఉంటాయి. అనంతరం ధ్యానం, ప్రాణాయామం చేస్తాం. విమల్ భాయీ అనే మహాకవి అలెఖ్ మహిమ సమాజ్‌కు చెందిన వ్యక్తి. ఆయన ఒరియాలో రాసిన భజనలను మేము గానం చేస్తాం. ఆ తరువాత అల్పాహారంగా భక్తులు ఏది పెడితే అది తీసుకుంటాం. ఉదయం తొమ్మిది... పది గంటల లోపు భోజనం చేసి... మరో ఊరుకు వెళ్ళిపోతాం. ఒక రోజు రాత్రి ఉన్న ఊర్లో... రెండో రాత్రి ఉండం. అదీ ప్రధానంగా మా దినచర్య.

చాలా ప్రాంతాల్లో మీకు ఆశ్రమాలు ఉన్నాయా?

ఉన్నాయి. వాటి నిర్వహణ భక్తులు చూసుకుంటారు. అయితే సాధువులకు ప్రత్యేకంగా ఆశ్రమాలేవీ ఉండవు. మేము ఒక ఊరి నుంచి మరో ఊరికి వెళ్ళినప్పుడు... అక్కడ ఆశ్రమం లేకపోతే... జనసమ్మర్ధం లేని ప్రదేశాల్లో... పాఠశాలల్లాంటి వాటిలో రాత్రి బస చేస్తాం. అలెఖ్ స్వాములు త్యాగానికి ప్రతిరూపాలు. అత్యున్నత స్థితికి చేరుకున్నవారు కేవలం కౌపీనం (గోచీ) మాత్రమే ధరిస్తారు. మేము కూడా ఆశ్రమాల్లో ఉన్నప్పుడు కౌపీనంతోనే ఉంటాం. సాధు సమ్మేళనాల్లాంటి వాటికి హాజరైనప్పుడు... పరిస్థితులను బట్టి వస్త్రాలు ధరిస్తాం.

కొత్తవారిని చేర్చుకోవడానికి నిబంధనలు ఏవైనా ఉన్నాయా?

ఎవరైనా శిష్యరికం చెయ్యాలంటే... మా జీవన విధానాన్ని వాళ్ళు తెలుసుకోవాలి. మా లక్ష్యాన్నీ, ఉద్దేశాలనూ అర్థం చేసుకోవాలి. ఎవరినీ మేము బలవంతం చెయ్యం. ఎందుకంటే ప్రతి ఒక్కరూ ఏదో ఆరాధన చేస్తూనే ఉంటారు. దుర్మార్గాలకు పాల్పడకుండా ఏది చేసినా మేము ఆమోదిస్తాం. చంపడం, దోచుకోవడం, హాని చేయడం లాంటి వాటికి పాల్పడకుండా... మీరు ఏ దేవుణ్ణి ఆరాధించినా, ఏ దేవుణ్ణీ ఆరాధించకపోయినా మాకు అభ్యంతరం లేదు. కానీ అలాంటి పనులు చేస్తే మాత్రం మేము కచ్చితంగా అభ్యంతరం చెబుతాం.

మీరు సాకార ఆరాధన చేస్తారా?

మాకు ఆ పద్ధతి లేదు. అయితే... సాకార ఆరాధన, నిరాకార ఆరాధన అనే అభ్యంతరాలేవీ మాకు లేవు.

మీ శిష్యులు సాకార ఆరాధన చేసినా అభ్యంతరం ఉండదా?

ఈ సంప్రదాయాన్ని ఎవరైతే అనుసరిస్తారో... వారు విగ్రహారాధన చేయరు. అలెఖ్ సంప్రదాయాన్ని స్వీకరించిన వారి కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు విగ్రహారాధన చేస్తూ ఉండవచ్చు. వాళ్ళందరినీ మార్చాలనే ఉద్దేశాలు మాకు ఉండవు. 'ఏకమేవ అద్వితీయం'... 'ఉన్నది ఒక్కటే' అనేది తెలుసుకుంటే... ఇవన్నీ అక్కర్లేదు.

గృహస్థ ధర్మం పాటిస్తున్న వారున్నారా...

ఉన్నారు. వారు వివాహం చేసుకుంటారు. రోజువారీ కార్యక్రమాలు చేసుకుంటారు. కానీ మా సంప్రదాయంలోని నియమాలను పాటిస్తారు. గురువు ఏది చేస్తే అదే చేయాలి.

సమాజంలో అసహనం పెరిగిపోతోందని చెబుతున్నారు. 'హిందూస్ ఫర్ ప్లూరాలిటీ అండ్ ఈక్వాలిటీ' (హెచ్‌పిఇ) సంస్థకు జాతీయ అధ్యక్షుడిగా ఉన్నారు. మరి మీ ధర్మం దీని గురించి ఏం చెబుతోంది?

ఈ ద్వేషాన్నీ, అసహనాన్నీ నిరోధించాలి.. వేల సంవత్సరాల కిందట సింధునదికి ఇవతలివారిని 'సింధువాసులు' అని పిలిచేవారు. 'సింధు' కాస్తా 'హిందు' అయింది. మన ధర్మాన్ని అలా పిలుచుకోవడంలో తప్పులేదు. కానీ అప్పుడు ఎలా ఉన్నామో ఇప్పుడూ అలాగే ఉండాలి. ఎవరు ఏ సంప్రదాయంలో ఉన్నారు, ఏ మతంలో ఉన్నారు అనేది మనకి అవసరం లేదు. అన్ని ప్రాణుల పట్ల గౌరవం ఉండాలి. ప్రకృతి పట్ల మర్యాద ఉండాలి. ప్రకృతి బాగుంటే మనం బాగుంటాం. ఎవరి మీదా కక్ష కానీ, ద్వేషం కానీ లేని దేశం మనది. మతం వేరు, మత విద్వేషం వేరు. మా భావాలకు సన్నిహితంగా, అనుగుణంగా ఉన్న సంస్థలతో కలిసి పోరాటం చేస్తున్నాం. తద్వారా ప్రపంచానికి ఎంతో కొంత మేలు జరుగుతుందనేది మా ఉద్దేశం. ఇప్పటికే ఈ దిశగా పని చేస్తున్నాం. కానీ సంఘటితంగా పని చేస్తే... లక్ష్యాన్ని తొందరగా సాధించగలమని అనుకుంటున్నాం.

చైతన్యం రావాలంటున్నారు, ఎక్కడినుంచి...? ప్రజల నుంచా? ప్రభుత్వాల నుంచా?

ప్రభుత్వాలకూ, దీనికీ సంబంధం లేదు. చైతన్యం ప్రజల్లోనే రావాలి. మీరు రాముడి భక్తుడు, మీ అబ్బాయి కృష్ణ భక్తుడు, మీ భార్య లక్ష్మీదేవి భక్తురాలు అనుకోండి. అలాగని మీరు ఇంట్లో ఘర్షణ పడతారా? కొట్టుకుంటారా? సమాజంలో కూడా అంతే కదా! ఎవరు ఏ మతం పాటిస్తే ఇబ్బంది ఏమిటి? ఎవరు ఎవరిని పూజిస్తే మనకు సమస్యేమిటి?

సమాజంలో మీరు ఎలాంటి మార్పును కోరుకుంటున్నారు?

మనది బహుళత్వంతో... పలు విశ్వాసాలతో కూడిన జీవన విధానం మీరు ఏ సంప్రదాయానికి చెందిన వ్యక్తో నాకు తెలీదు. మీరు ఏ దేవుడికి ఆరాధన చేస్తున్నారో నాకు తెలీదు. మీ పక్కన ఉన్న వ్యక్తి, నేను... మేము ఏ దేవుణ్ణి ఆరాధిస్తున్నామో మీకు తెలీదు. ఇక్కడ మనం వందల, వేల సంవత్సరాలనుంచి కలిసి మెలిసి ఉన్నాం. దీన్ని భంగపరచడానికి సంప్రదాయం ముసుగులో కొందరు దాడులు చేస్తున్నారు. మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారు. దాన్ని ఆపడానికి మేము ప్రయత్నిస్తున్నాం. మనం ముందు నుంచీ ఇలాగే ఉన్నాం, ఇప్పుడూ అలాగే ఉన్నాం, భవిష్యత్తులోనూ ఇలాగే ఉంటాం. ఇలాగే ఉండాలనేదే నా తపన. జ్ఞాన దృష్టితో చూసినప్పుడు... నువ్వూ ఈశ్వరుడివే, నేనూ ఈశ్వరుణ్ణే. చెట్టు, పుట్ట, గాలి, నీరు... ఇవన్నీ ఈశ్వరుడే. సమస్తం ఈశ్వరుడే. ఇక్కడ ఈశ్వరుడు తప్ప మరేదీ లేదు. మరి ఎవరిని నొప్పిద్దాం? ఎవరిని ద్వేషిద్దాం? ఇతనిది అగ్రకులం, అతనిది నిమ్నకులం, నేను సాధువుని, నువ్వు గృహస్థువి... ఇవన్నీ మనం చూసే దృష్టిలో ఉన్న లోపాలు. దీన్ని దాటి మనం వెళ్ళగలిగితే... 'ఏకమేవ అద్వితీయం'... 'ఉన్నది ఒక్కటే. రెండోది ఏది లేదు' అనేది అర్థం అవుతుంది.

సంభాషణ: **కృష్ణశర్మ**

విశేషం

ఆ అడ్డంకులు తొలగాలంటే..

పతంజలి మహర్షి గొప్ప శాస్త్రవేత్త. మనిషి మనస్సును ఆయన అర్థం చేసుకున్నట్టుగా ఎవరూ అర్థం చేసుకోలేదు. తాను రచించిన ప్రధాన గ్రంథమైన 'యోగ సూత్రాల'లో... యోగ మార్గంలో ఎదురయ్యే తొమ్మిది అడ్డంకుల గురించి ఆయన చర్చించారు. అవి: వ్యాధి (శారీరక అనారోగ్యం), స్థాన్య (మానసిక అనారోగ్యం లేదా విషయాలను అర్థం చేసుకోలేకపోవడం), సంశయ (సందేహం), ప్రమాద (అజాగ్రత్త), ఆలస్య (సోమరితనం), అవిరతి (ఇంద్రియాల పట్ల అనుబంధం), భ్రాంతి దర్శన (భ్రాంతి, ఊహాలోకంలో ఉండిపోవడం) అలబ్ధ భూమికత్వం (ఏ స్థితినీ పొందలేకపోవడం), అనవస్థితత్వం (స్థిరత్వం లేకపోవడం). సాధనా మార్గంలో ఏయే అడ్డంకులు వచ్చే అవకాశం ఉందో వాటన్నిటినీ ఈ తొమ్మిదింటిలో మహర్షి చెప్పేశాడు. ఇంతకుమించి మరే అడ్డంకీ ఉండే అవకాశం లేదు. మరి వాటిని తొలగించుకోవడం ఎలా? ఒకసారి ఒక పనిని మాత్రమే ఎంచుకొని చేయడమే. దీనికే 'ఏకతత్వాభ్యాసం' అని పేరు. ఒకే సూత్రానికి కట్టుబడి సాధన చేయడం. ఆ సూత్రం దైవం కావచ్చు, ఏదైనా పదార్థం కావచ్చు, గురువు కావచ్చు లేదా నీకు నీవే కావచ్చు. ఆ విషయం ఏదైనా సరే... ఒకే దానిమీద సాధన చేసినట్టయితే... తొమ్మిది అడ్డంకులూ తొలగిపోతాయి. ఇదంతా మీలో కొంత ప్రశాంతత ఉన్నప్పుడే సాధ్యమవుతుంది. ఏకతత్వాభ్యాసానికి కొంత ప్రశాంతత అవసరం. అంటే అది లేకపోతే ఇది సాధ్యపడదు. ఏకతత్వాభాసం గురించి మరింత వివరంగా చెప్పుకోవాలంటే... ఒకే సూత్రాన్ని అంటిపెట్టుకొని ఉండడం. అంటే తనను, భగవంతుణ్ణి లేదా గురువును... అందరిలోనూ చూడ డం. ఒకే సూత్రాన్ని ప్రతి ఒక్కరిలో, ప్రతి వస్తువులో చూడడం. 'నేనే ప్రతి ఒక్కరిలో ఉన్నాను. లేదా నా గురువే అంతటా ప్రత్యక్షమై ఉన్నాడు. నా గురువు తప్ప వేరే ఎవ్వరూ లేరు. ఆయనే నాకు సర్వస్వం లేదా భగవంతుడే నా సర్వస్వం. అంతా నేను మాత్రమే ఉన్నాను' అని భావించడం. అదే జీవన నైపుణ్యం.


అడ్డంకులు, అవరోధాలు ఎగురైనప్పుడు... మనల్ని దారి తప్పించే పరిణామాలు కొన్ని కలుగుతాయి. వాటిలో కొన్ని: దుఃఖ- బాధలు పడడం, దౌర్మనస్య - మానసిక దుర్బలత, అంగమేజయత్వ - శరీరం మీ మాట వినకపోవడం. అంటే శరీరానికి, మనస్సుకు సమన్వయం కుదరకపోవడం, చివరకు శరీరమే గెలవడం. ఎక్కువ మద్యం సేవించిన వ్యక్తి ఎడమవైపు వెళ్ళాలనుకొని కుడివైపు వెళ్తూ ఉంటాడు. తిన్నగా వెళదామని అనుకుంటాడు. కానీ శరీరం సహకరించదు. అలాగే శ్వాస ప్రశ్వాస - ఒక క్రమం లేకుండా, వణుకుతూ... అసౌకర్యంగా ఉండే శ్వాస. మీరు గమనించినట్టయితే... మీరు ఆనందంగా, ఉత్సాహంతో ఉన్నప్పుడు లోపలికి పీల్చుకొనే గాలి ఎక్కువగా ఉంటుంది. బాధలో ఉన్నప్పుడు... బయటికి వదిలే శ్వాస దీర్ఘంగా ఉంటుంది. శ్వాస సక్రమంగా, స్థిరంగా ఉండదు. మరి వీటిని వదిలించుకోవాలంటే ఏం చెయ్యాలి? "ఏకతత్వాభ్యాస... ఒక సూత్రాన్ని లేదా మార్గాన్ని ఎంచుకొని దాన్నే సాధన చెయ్యండి" అని పతంజలి మహర్షి చెబుతున్నాడు.

- గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

వారే అసలైన యోగులు...

సహజయోగ



మనిషి తాను ఎదుర్కొంటున్న సమస్యలకు సమాధానాలు వెతుకుతూ ఉంటాడు. సరైన దిశానిర్దేశం లేక ఒత్తిడికి గురవుతూ ఉంటాడు. జీవితం అంటే మనిషి నిరంతరం తనతో తాను చేసే యుద్ధమే. మనిషి ఆనందంగా జీవితాన్ని కొనసాగించడానికీ, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడానికీ... ముఖ్యంగా ఆధ్యాత్మికతవైపు పయనించడానికీ, సమాజంలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పరచడానికి కృషి చేసిన వ్యక్తి శ్రీమాతాజీ నిర్మలాదేవి. మనుషులు తమలో ఉన్న దైవిక శక్తిని గుర్తించి, కుండలినీ జాగృతి ద్వారా ఆత్మసాక్షాత్కారాన్ని పొందే ప్రక్రియకు ఆమె శ్రీకారం చుట్టారు. ఆమె అందించిన యోగమే సహజయోగం. "అందరూ సహజ యోగంలోకి రండి. మిమ్మల్ని మీరు తెలుసుకోండి. జీవితాన్ని సాఫల్యం చేసుకోండి. జన్మను ధన్యం చేసుకోండి. మోక్ష ప్రాప్తిని పొందండి" అంటూ ఆమె ప్రపంచ మానవాళికి సందేశాన్ని అందించారు. ఈ ప్రక్రియ ప్రస్తుతం నూట నలభైకి పైగా దేశాల్లో కొనసాగుతోంది.

సహజయోగ ధ్యాన ఆవశ్యకత మనిషి జీవితంలో చాలా ఉంది. ఎందుకంటే మనతో పాటు జన్మించి, మనలోనే నిద్రాణమై ఉన్న శక్తిని, సృష్టి యావత్తూ వ్యాపించిన శక్తిని, భగవంతుడు ప్రసాదించిన శక్తిని... మళ్ళీ భగవంతుడితోనే కలపడం ఒక అద్భుత ప్రక్రియ. సహజయోగ ధ్యానంలో మనిషి మొదటగా తనలోని అంతర్గత శక్తి అయిన కుండలినీ శక్తి గురించి తెలుసుకుంటాడు. నిద్రాణ స్థితిలో ఉన్న ఆ కుండలినీ శక్తిని... మేల్కొలపడం ద్వారా ఆత్మసాక్షాత్కారం పొందవచ్చు. దాన్ని పొందిన సాధకుడు... భూత, భవిష్యత్, వర్తమాన కాలాల గురించి తన ఆలోచనలు తగ్గించుకొని... మధ్యేమార్గంలోకి వస్తాడు. ప్రస్తుత క్షణాన్ని ఆనందించే స్థితికి వస్తాడు. ఆ ఆనందకర స్థితి ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఒత్తిడి దూరమవుతుంది. ఆలోచనా విధానం మారుతుంది. సత్యంవైపు అడుగులు పడతాయి. తన ఆధ్యాత్మిక ప్రయాణాన్ని ప్రారంభిస్తాడు. ఆ ప్రయాణంలో మొదట తనలోని తమో, రజో గుణాలను వదిలి... సత్వ గుణాన్ని అలవరచుకుంటాడు. సుషుమ్న మార్గంలో తన ప్రయాణాన్ని కుండలినీ శక్తి సాగించే సమయంలో... మనిషిలోని అవలక్షణాలను రుగ్మతలనూ తొలగిస్తుంది, అతని సూక్ష్మ శరీరంలో చైతన్యాన్ని నింపుతూ సహస్రారాన్ని చేరుతుంది. మనిషి ఆత్మ ప్రకాశాన్ని పొందుతాడు. భగవంతుడికి ప్రతిరూపమైన ఆత్మ తనలోనే కొలువై ఉందనే సత్యాన్ని గ్రహిస్తాడు. ఆత్మ, పరమాత్మ వేరు కాదనీ, రెండూ ఒక్కటేనని గుర్తిస్తాడు.

అయితే అంతా భగవంతుడే చేస్తున్నాడనే విషయాన్ని ఆత్మసాక్షాత్కారం ద్వారా తెలుసుకున్నప్పటికీ... మళ్ళీ మనిషి మాయలో పడుతూనే ఉంటాడు. అన్నీ తానే చేస్తున్నానని అనుకుంటాడు. అతనిలో తమో, రజో గుణ ప్రభావం ఉంటుంది. కాబట్టి ఆధ్యాత్మిక సాధన చేసే వ్యక్తి... ప్రతిరోజూ ధ్యానం ద్వారా... భూత, భవిష్యత్ ఆలోచనలను వదిలిపెట్టి, వర్తమానంలోకి రావడం కోసం సాధన చేయాలి. మాయ మనిషి వెన్నంటే ఉంటుంది. అందుకనే... ప్రతిక్షణం 'నేను ఆత్మను, ఆత్మ పరమాత్మ వేరు కాదు' అని గుర్తు చేసుకుంటూ ఉండాలి చిత్తాన్ని ఎప్పుడూ సహస్రారంపై ఉండేలా చూసుకోవాలి. ఈ సాధన ద్వారా మనిషి వివేకాన్ని, శుద్ధ విద్యను, సంతృప్తిని, ధైర్యాన్ని, క్షమాగుణాన్ని పొంది... సత్వ గుణంలో స్థిరపడతాడు. ఆత్మ సాక్షాత్కారం పొందిన వ్యక్తిని 'యోగి' అంటారు. ఆత్మను భగవంతుడిపై లగ్నం చేసి, మాయకు అతీతంగా... ఎవరైతే భగవంతునితో అనుసంధానమై జీవిస్తూ ఉంటారో... వారే అసలైన యోగులు. సహజయోగ సాధన ద్వారా మానసిక, శారీరక, భావనాత్మక, ఆధ్యాత్మిక అభివృద్ధిని మనిషి పొందగలడు. ఆధ్యాత్మికతకు మొదటి మెట్టు ఆత్మసాక్షాత్కారం. ఆ ప్రక్రియను సులభతరం చేసి మానవాళికి అందించిన మహనీయురాలు శ్రీమాతాజీ

డాక్టర్ పి. రాకేష్
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



బంగ్లా, కివీస్‌లతో టెస్టులు

- ఇంగ్లండ్‌తో టీ20, వన్డేలు
- హైదరాబాద్‌లో టీ20
- టీమిండియా బిజీ షెడ్యూల్



న్యూఢిల్లీ: టీ20 వరల్డ్‌కప్ ముగిశాక భారత జట్టు సొంత గడ్డపై సెప్టెంబరు నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు మూడు ఫార్మాట్ల క్రికెట్‌తో బిజీ బిజీగా గడపనుంది. ముందుగా బంగ్లాదేశ్‌తో సెప్టెంబరు 19 నుంచి అక్టోబరు 1 వరకు చెన్నై, కాన్పూర్‌లలో రెండు టెస్టులను.. అలాగే అక్టోబరు 6 నుంచి 12 వరకు ధర్మశాల, న్యూఢిల్లీ, హైదరాబాద్‌లలో మూడు టీ20 మ్యాచ్‌లను ఆడనుంది. ఆ తర్వాత న్యూజిలాండ్ జట్టుతో అక్టోబరు 16 నుంచి నవంబరు 5 వరకు మూడు టెస్టులు (బెంగళూరు, పుణె, ముంబై) ఆడబోతోంది. అనంతరం వచ్చే ఏడాది ఇంగ్లండ్ జట్టు భారత పర్యటనకు రానుంది. వీరితో జనవరి 22 నుంచి ఫిబ్రవరి 2 వరకు ఐదు టీ20ల సిరీస్‌ను చెన్నై, కోల్‌కతా, రాజ్‌కోట్, పుణె, ముంబైలలో ఆడనుండగా.. ఫిబ్రవరి 6-12 మధ్య మూడు వన్డేలను నాగ్‌పూర్, కటక్, అహ్మదాబాద్ వేదికలపై తలపడనుంది.

- బంగ్లాతో: 2 టెస్టులు, 3 టీ20లు
- న్యూజిలాండ్‌తో: 3 టెస్టులు
- ఇంగ్లండ్‌తో: 5 టీ20లు, 3 వన్డేలు

బాదేసిన సాల్ట్, బెయిర్‌స్టో

- ఇంగ్లండ్ శుభారంభం
- 8 వికెట్లతో వెస్టిండీస్ చిత్తు



ఫిల్ సాల్ట్ (47 బంతుల్లో 87 నాటౌట్)

గ్రాస్ ఐస్‌లెట్ (సెయింట్ లూసియా): డిఫెండింగ్ చాంప్ ఇంగ్లండ్ ఎట్టకేలకు టీ20 వరల్డ్‌కప్‌లో జోరందుకొంది. క్లిష్టంగా తొలి రౌండ్‌ను దాటిన బట్లర్ సేన.. సూపర్-8లో మాత్రం ధనాధన్ ఆటతో విరుచుకు పడింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (47 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్స్‌లతో 87 నాటౌట్) దూకుడైన అర్ధశతకంతో.. గురువారం జరిగిన గ్రూప్-2 మ్యాచ్‌లో వెస్టిండీస్‌ను 8 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన విండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 180/4 స్కోరు చేసింది. ఓపెనర్లు బ్రండన్ కింగ్ (23 రిటైర్డ్ హర్ట్), చార్లెస్ (38)తోపాటు పూరన్ (36), రోవ్‌మన్ పావెల్ (36)కు చక్కని ఆరంభాలు దక్కినా.. భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. రస్సెల్ (1) విఫలం కావడంతో.. డెత్ ఓవర్లలో విండీస్ ఆశించిన స్థాయిలో స్కోరు చేయలేక పోయింది. అయితే, రూథర్‌ఫోర్డ్ (28 నాటౌట్), షెపర్డ్ (5 నాటౌట్) టీమ్ స్కోరును 180 మార్క్‌కు చేర్చారు. ఇంగ్లండ్ బౌలర్లు ఆర్చర్, రషీద్, మొయిన్ అలీ, లివింగ్‌స్టోన్‌లు తలో వికెట్ మాత్రమే పడగొట్టినా.. 51 డాట్ బాల్స్‌తో పరుగులను నియంత్రించారు. అనంతరం ఛేదనలో ఇంగ్లండ్ 17.3 ఓవర్లలో 2 వికెట్లకు 181 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు సాల్ట్, బట్లర్ (25) తొలి వికెట్‌కు 46 బంతుల్లో 67 పరుగులతో అదిరే ఆరంభాన్నిచ్చారు. దీంతో ఇంగ్లండ్ 13 ఓవర్లలో 111/2తో నిలిచింది. విజయానికి 42 బంతుల్లో 70 పరుగులు కావాల్సిన సమయంలో.. సాల్ట్, బెయిర్‌స్టో (26 బంతుల్లో 48 నాటౌట్) పవర్‌హిట్టింగ్‌తో విరుచుకుపడ్డారు. ఈ జోడీ మూడో వికెట్‌కు అజేయంగా 44 బంతుల్లో 97 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. దీంతో ఇంగ్లండ్ మరో 15 బంతులు మిగిలుండగానే గెలుపు గీత దాటింది.

పాయింట్ల పట్టిక — గ్రూప్-2

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
ఇంగ్లండ్	1	1	0	0	2	1.343
సౌతాఫ్రికా	1	1	0	0	2	0.900
అమెరికా	1	0	1	0	0	-0.900
వెస్టిండీస్	1	0	1	0	0	-1.343

ఆ: ఆడినవి; గె: గెలిచినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

సంక్షిప్త స్కోర్లు: వెస్టిండీస్: 20 ఓవర్లలో 180/4 (చార్లెస్ 38, పూరన్ 36; రషీద్ 1/21, ఆర్చర్ 1/34). **ఇంగ్లండ్:** 17.3 ఓవర్లలో 181/2 (సాల్ట్ 87 నాటౌట్, బెయిర్‌స్టో 48 నాటౌట్; చేజ్ 1/19).

భారత్ సూపర్ బోణీ

సూర్యకుమార్ అర్ధసెంచరీ

బుమ్రా స్పెల్ అదుర్స్ ● అఫ్ఘానిస్థాన్ చిత్తు ● టీ20 వరల్డ్‌కప్



సూర్యకుమార్ (28 బంతుల్లో 53)

బుమ్రా (4-1-7-3)

బ్రిడ్జిటౌన్: టీ20 వరల్డ్‌కప్‌లో టీమిండియా అజేయ ఆట తీరు కొనసాగుతోంది. ఓటమనేదే లేకుండా గ్రూప్ దశను దాటిన రోహిత్ సేన.. కీలక సూపర్-8 లోనూ అదిరే బోణీ చేసింది. సూర్యకుమార్ యాదవ్ మెరుపు అర్ధసెంచరీ (28 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 53)తో ఆకట్టుకోగా.. ఆ తర్వాత స్టార్ పేసర్ బుమ్రా (4-1-7-3) సూపర్ బౌలింగ్‌తో కట్టుదిట్టం చేశాడు. దీంతో గ్రూప్ 1లో భాగంగా గురువారం అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 47 పరుగుల తేడాతో భారత్ ఘనవిజయం సాధించింది. తమ రెండో మ్యాచ్‌ను శనివారం బంగ్లాదేశ్‌తో ఆడనుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 181 పరుగులు చేసింది. హార్దిక్ పాండ్యా (24 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 32), విరాట్ (24 బంతుల్లో 1 సిక్స్‌తో 24), పంత్ (11 బంతుల్లో 4 ఫోర్లతో 20) పర్వాలేదనిపించారు. రషీద్, ఫరూఖిలకు మూడేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో అఫ్ఘాన్ 20 ఓవర్లలో 134 పరుగులకు ఆలౌటైంది. అజ్మతుల్లా ఒమర్జాయ్ (26), జద్రాన్ (19) మాత్రమే రాణించారు. అర్ష్‌దీప్‌నకు మూడు, కుల్దీప్‌నకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సూర్యకుమార్ నిలిచాడు.

బౌలర్ల కట్టడి: ఈ పిచ్‌పై కష్టసాధ్యమైన ఛేదన కోసం బరిలోకి దిగిన అఫ్ఘాన్ ఏ దశలోనూ విజయం వైపు సాగలేదు. భారత పేసర్లు, స్పిన్నర్ల ధాటికి వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. ముఖ్యంగా బుమ్రా 20 డాట్ బాల్స్‌తో బెంబేలెత్తించాడు. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ గుర్బాజ్ (11) 4,6తో దూకుడు చూపినా, తను రెండో ఓవర్‌లోనే బుమ్రా చేతికి చిక్కాడు. ఆ తర్వాత ఇబ్రహీం జద్రాన్ (8)ను అక్షర్.. మరో ఓపెనర్ హజ్రతుల్లా (2)ను బుమ్రానే అవుట్ చేయడంతో పవర్‌ప్లేలో అఫ్ఘాన్ 35/3 స్కోరుతో నిలిచింది. ఈ స్థితిలో అజ్మతుల్లా ఒమర్జాయ్, నయీబ్ (17) నాలుగో వికెట్‌కు 44 పరుగులు జోడించి ఆశలు రేపారు. కానీ ఈ ఇద్దరినీ వరుస ఓవర్లలో కుల్దీప్, జడేజా పెవిలియన్‌కు చేర్చారు. అప్పటికి స్కోరు 71/5. 16వ ఓవర్‌లో బుమ్రా నజీబుల్లాను అవుట్ చేయడంతో ఆరో వికెట్‌కు నబీ (14)తో కలిసి చేసిన 31 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం పేసర్ అర్ష్‌దీప్ ధాటికి టెయిలెండర్లు టపటపా పెవిలియన్‌కు చేరడంతో అఫ్ఘాన్ ఓటమి ఖరారైంది.

సూర్య-హార్దిక్ అండగా..: టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్ ఎంచుకోగా.. ఆరంభంలో పరుగులు లభించడం కష్టమైంది. అయితే మధ్య ఓవర్లలో సూర్యకుమార్, హార్దిక్ ధాటిగా ఆడడంతో జట్టు సవాల్ విసిరే స్కోరందుకుంది. కానీ డెత్ ఓవర్లలో టపటపా వికెట్లను కోల్పోవడం జట్టు భారీ స్కోరుపై ప్రభావం పడింది. ఓపెనర్లు రోహిత్ (8), విరాట్‌లను అఫ్ఘాన్ బౌలర్లు ఇబ్బందిపెట్టారు. లెఫ్టామ్ పేస్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో రోహిత్ వైఫల్యం ఈసారి కూడా బయటపడింది. మూడో ఓవర్‌లోనే రోహిత్‌ను ఫరూఖి పెవిలియన్‌కు చేర్చి షాకిచ్చాడు. తన చివరి రెండు మ్యాచ్‌ల్లోనూ శర్మ 13, 3తో నిరాశ పరిచాడు. అయితే ఐదో ఓవర్‌లో విరాట్ సిక్సర్.. ఆరో ఓవర్‌లో పంత్ హ్యాట్రిక్ ఫోర్లతో జట్టు పవర్‌ప్లేలో 47/1 స్కోరు సాధించగలిగింది. ఈ ఇద్దరూ కుదురుకుంటే భారీ స్కోరు ఖాయమనిపించినా.. స్పిన్నర్ రషీద్ ఖాన్ వరుస ఓవర్లలో భారత్‌ను వణికించాడు. స్వేచ్ఛగా బ్యాట్ ఝుళిపిస్తున్న పంత్‌ను మొదట ఏడో ఓవర్‌లో అవుట్ చేయగా రెండో వికెట్‌కు 43 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత విరాట్, శివమ్ దూబే (10)ల పనిబట్టడంతో భారత్ 90 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో సూర్యకుమార్, హార్దిక్ అఫ్ఘాన్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. 13వ ఓవర్‌లో సూర్య రెండు ఫోర్లు బాదాడు. ఇందులో తక్కువ ఎత్తులో వేసిన ఓ వైడ్ బంతిని స్క్వేర్ లెగ్ వైపు ఫోర్‌గా మల్చడం అబ్బురపరిచింది. అటు హార్దిక్ 16వ ఓవర్‌లో 4,6తో జోరు చూపాడు. తర్వాతి ఓవర్‌లోనే సూర్య 6,4తో 26 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకున్నప్పటికీ ఆ వెంటనే వెనుదిరిగాడు. దీంతో ఐదో వికెట్‌కు 60 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మరోవైపు హార్దిక్ సైతం 18వ ఓవర్‌లో సిక్సర్ బాది నవీనుల్ చేతికి చిక్కాడు. జడేజా (7) విఫలం కాగా, ఆఖరి ఓవర్‌లో అక్షర్ (12) రెండు ఫోర్లతో జట్టు స్కోరు 180 దాటించింది.

1 టీ20ల్లో భారత్ తరపున ఎక్కువ పరుగులు (4066) చేసిన విరాట్, రోహిత్ (4050)ను అధిగమించాడు. ఓవరాల్‌గా బాబర్ ఆజమ్ (4145) టాప్‌లో ఉన్నాడు.

స్కోరుబోర్డు

భారత్: రోహిత్ (సి) రషీద్ (బి) ఫరూఖి 8, కోహ్లీ (సి) నబీ (బి) రషీద్ 24, పంత్ (ఎల్బీ) రషీద్ 20, సూర్యకుమార్ (సి) నబీ (బి) ఫరూఖి 53, శివమ్ దూబే (ఎల్బీ) రషీద్ 10, హార్దిక్ (సి) అజ్మతుల్లా (బి) నవీనుల్ 32, జడేజా (సి) గుల్బదిన్ (బి) ఫరూఖి 7, అక్షర్ (రనౌట్) 12, అర్ష్‌దీప్ (నాటౌట్) 2 ; **ఎక్స్‌ట్రాలు : 13 ; మొత్తం 20 ఓవర్లలో 181/8 ; వికెట్లపతనం :** 1-11, 2-54, 3-62, 4-90, 5-150, 6-159, 7-165, 8-181 ; **బౌలింగ్:** ఫరూఖి 4-0-33-3, మహ్మద్ నబి 3-0-24-0, నవీనుల్ 4-0-40-1, రషీద్ 4-0-26-3, నూర్ అహ్మద్ 3-0-30-0, అజ్మతుల్లా 2-0-23-0.

అఫ్ఘానిస్థాన్: రహ్మనుల్లా (సి) పంత్ (బి) బుమ్రా 11, హజ్రతుల్లా (సి) జడేజా (బి) బుమ్రా 2, ఇబ్రహీం జద్రాన్ (సి) రోహిత్ (బి) అక్షర్ 8, నైబ్ (సి) పంత్ (బి) కుల్దీప్ 17, అజ్మతుల్లా (సి) అక్షర్ (బి) జడేజా 26, నజీబుల్లా (సి) అర్ష్‌దీప్ (బి) బుమ్రా 19, నబీ (సి) జడేజా (బి) కుల్దీప్ 14, రషీద్ (సి) జడేజా (బి) అర్ష్‌దీప్ 2, నూర్ అహ్మద్ (సి) రోహిత్ (బి) అర్ష్‌దీప్ 12, నవీనుల్ (సి) పంత్ (బి) అర్ష్‌దీప్ 0, ఫరూఖి (నాటౌట్) 4 ; **ఎక్స్‌ట్రాలు : 19 ; మొత్తం 20 ఓవర్లలో 134 ఆలౌట్ ; వికెట్లపతనం :** 1-13, 2-23, 3-23, 4-67, 5-71, 6-102, 7-114, 8-121, 9-121 ; **బౌలింగ్ :** అర్ష్‌దీప్ 4-0-36-3, బుమ్రా 4-1-7-3, అక్షర్ 3-1-15-1, హార్దిక్ 2-0-13-0, కుల్దీప్ 4-0-32-2, జడేజా 3-0-20-1.

నల్ల రిబ్బన్లతో బరిలోకి..

అఫ్ఘాన్‌తో సూపర్-8 మ్యాచ్ సందర్భంగా టీమిండియా ఆటగాళ్లంతా తమ భుజాలకు నల్ల రిబ్బన్లు ధరించి బరిలోకి దిగారు. మాజీ పేసర్ డేవిడ్ జాన్సన్ గురువారం మృతి చెందగా.. అతడికి ఘనంగా నివాళి అర్పించేందుకు టీమ్ మేనేజ్‌మెంట్ ఈ నిర్ణయం తీసుకుంది.

జింబాబ్వే టూర్‌కు కోచ్‌గా లక్ష్మణ్?

న్యూఢిల్లీ: టీమిండియా జింబాబ్వే పర్యటనకు ఎన్‌సీఏ డైరెక్టర్ వీవీఎస్ లక్ష్మణ్ కోచ్‌గా వ్యవహరించే అవకాశముంది. వచ్చే నెల 6 నుంచి హరారేలో జింబాబ్వేతో భారత్ ఐదు టీ20ల సిరీస్‌లో తలపడనుంది. ఈ నెల 22 లేదా 23న జింబాబ్వే టూర్‌కు జట్టును ఎంపిక చేసే అవకాశం ఉంది. టీ20 వరల్డ్‌కప్‌తో కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ కాంట్రాక్ట్ ముగియనుంది. ఈ నేపథ్యంలో కొత్త కోచ్ కోసం బీసీసీఐ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

ప్రపంచకప్‌లో నేటి మ్యాచ్‌లు

ఆస్ట్రేలియా x బంగ్లాదేశ్ (ఉ.6. గం.)

ఇంగ్లండ్ x దక్షిణాఫ్రికా (రా.8. గం.)

భారత జట్టులో షబ్నమ్



విశాఖపట్నం (స్పోర్ట్స్): దక్షిణాఫ్రికాతో ప్రస్తుతం జరుగుతున్న టూర్‌లోని మిగిలిన మ్యాచ్‌లకు విశాఖపట్టణానికి చెందిన 17 ఏళ్ల పేస్‌బౌలర్ షబ్నమ్ షకీల్‌కు చోటు దక్కింది. ఈ పర్యటనలో ఇప్పటివరకూ జరిగిన రెండు వన్డేల్లోనూ భారత్ విజయం సాధించింది. సిరీస్‌లో ఇంకా ఒక వన్డే, ఒక టెస్టు, మూడు టీ20లు జరగాల్సివుంది. అయితే షబ్నమ్ ఈ మూడు ఫార్మాట్లకూ ఎంపిక కావడం విశేషం. ఆంధ్రనుంచి ఇలా మూడు ఫార్మాట్లకూ ఎంపికైన క్రికెటర్ షబ్నమ్ మాత్రమే.

టీమిండియా మాజీ పేసర్ జాన్సన్ అనుమానాస్పద మృతి



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): భారత జట్టు మాజీ పేసర్ డేవిడ్ జాన్సన్ (52) అనుమానాస్పద పరిస్థితుల్లో గురువారం మరణించాడు. కొత్తనూరులోని కనకశ్రీ లేఅవుట్‌లో తాను నివసిస్తున్న అపార్ట్‌మెంట్ నాలుగో అంతస్తు బాల్కనీనుంచి కిందపడి మృతి చెందినట్టు పోలీసులు వెల్లడించారు. అయితే అతడు ఆత్మహత్య చేసుకొన్నాడనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. జాన్సన్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. జాన్సన్ గతవారం కడుపునొప్పితో ఆసుపత్రిలో చేరినట్టు తెలిసింది. జాన్సన్ తన ఇంటికి సమీపంలో ఓ క్రికెట్ కోచింగ్ సెంటర్ నడుపుతున్నట్టు తెలుస్తోంది. అయితే అది సరిగా నడవకపోవడంతో ఆర్థిక సమస్యలు ఏర్పడినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్న అతడు డీ అడిక్షన్ కేంద్రంలో చికిత్స కూడా తీసుకుంటున్నట్టు ఓ పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు. భారత్ తరపున రెండు టెస్టులాడాడు. 1996లో ఢిల్లీలో ఆస్ట్రేలియాపై టెస్ట్ అరంగేట్రం చేశాడు. అందులో ఓ వికెట్ సాధించాడు. అనంతరం సౌతాఫ్రికాలో ఆ జట్టుపై తన రెండో టెస్ట్ ఆడాడు. ఆ మ్యాచ్‌లో 2 వికెట్లు పడగొట్టాడు. జాన్సన్ మృతికి బీసీసీఐ కార్యదర్శి జైషా, అనిల్ కుంబ్లే, గౌతమ్ గంభీర్ సంతాపం తెలిపారు.

బిజినెస్



విమానయానంలో భారత్ నంబర్ 3

పదేళ్లలో రెండు స్థానాలు పైకి

న్యూఢిల్లీ: దేశంలో విమానయానం జోరందుకుంది. దేశీయ విమానయానంలో భారత్ ప్రపంచంలో మూడో స్థానానికి చేరింది. పది సంవత్సరాల క్రితం ఐదో స్థానంలో ఉన్న భారత్ రెండు స్థానాలు ఎగబాకింది. ఓఏజీ విశ్లేషణలో ఈ విషయం వెల్లడయింది. 2014 ఏప్రిల్ నుంచి దశాబ్ది కాలంలో దేశీయ విమానయాన సంస్థల సామర్థ్యం రెట్టింపై 79 లక్షల నుంచి 1.55 కోట్లకు చేరింది. భారత్ మూడో స్థానానికి చేరడంతో బ్రెజిల్ 97 లక్షల సామర్థ్యంతో నాలుగో స్థానానికి, ఇండోనేషియా 92 లక్షల సామర్థ్యంతో ఐదో స్థానానికి దిగజారాయి. అయితే 8.61 కోట్ల సామర్థ్యంతో అమెరికా, 6.78 కోట్ల సామర్థ్యంతో చైనా తొలి రెండు స్థానాల్లో చెక్కు చెదరకుండా నిలిచాయి. భారతదేశం సామర్థ్యాల జోడింపులో మాత్రం 6.9 శాతం సగటు వార్షిక వృద్ధితో టాప్ 5 దేశాల్లో అగ్రగామిగా ఉంది. సగటు వార్షిక సామర్థ్యాల జోడింపులో 6.3 శాతంతో చైనా, 2.4 శాతంతో అమెరికా, 1.1 శాతంతో ఇండోనేషియా వెనుకబడి ఉండగా బ్రెజిల్‌లో ఇది 0.8 శాతం క్షీణించింది.

ఇండిగో మార్కెట్ వాటా జూమ్: తక్కువ ధరల విమానయాన సంస్థలకు (ఎల్‌సీసీ) పరివర్తన విషయంలో టాప్ 5 దేశాల్లో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. ఇండిగో ఎల్‌సీసీ వృద్ధికి ఆలంబనగా ఉంది. గత 10 సంవత్సరాల కాలంలో ఇండిగో మార్కెట్ వాటా రెట్టింపై 32 శాతం నుంచి 62 శాతానికి చేరింది. ఇండిగో దేశీయ సామర్థ్యాలు ఇదే కాలంలో 13.9 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేశాయి. ఇండిగో, ఎయిరిండియా విదేశాలకు విస్తరించేందుకు పటిష్ఠమైన ప్రణాళికతో ముందుకు సాగుతున్నాయని ఓఏజీ అంటోంది. ఇండిగో ఆర్డర్ చేసిన 982 విమానాల్లో 96 శాతం, ఎయిరిండియా ఆర్డర్ చేసిన 447 విమానాల్లో 74 శాతం నారో బాడీ విమానాలేనని ఆ నివేదిక తెలిపింది. అయితే ఈ వృద్ధికి ఊతం ఇవ్వగల విమానాశ్రయాలు భారత్‌కు ఉన్నాయా అనేది ప్రశ్నార్థకమని పేర్కొంది. దేశీయ విమానాల రాకపోకలకు అవకాశం ఉన్న విమానాశ్రయాలు అమెరికాలో 656, చైనాలో 250 ఉండగా భారత్‌లో 119 మాత్రమే ఉన్నట్టు తెలిపింది. ప్రస్తుతం దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్య 15.5 కోట్లుండగా 2030 నాటికి 35 కోట్లకు పెరుగుతుందని ఇండిగో అంచనా.

యూనికార్న్ ఆశలు గల్లంతు

హురున్ భవిష్యత్ యూనికార్న్‌ల జాబితా నుంచి 25 స్టార్టప్‌లు అవుట్

పెట్టుబడుల కొరత, నియంత్రణ చర్యలే కారణం



ముంబై: యూనికార్న్ హోదా సాధించాలన్న దేశీయ స్టార్టప్‌ల ఆశలు గల్లంతవుతున్నాయి. అంతర్జాతీయ అనిశ్చితుల కారణంగా స్టార్టప్‌ల్లోకి కొత్త పెట్టుబడులు దాదాపుగా నిలిచిపోవడంతో పాటు ఈ రంగంపై ఆర్థిక నియంత్రణ మండలుల చర్యలు, వేల్యువేషన్ పెంపునకు బదులు లాభదాయకతపై దృష్టి సారించాలని ఇన్వెస్టర్లు పట్టుబడుతుండటం ఇందుకు ప్రధాన కారణాలట. గురువారం విడుదలైన 'ఆస్క్ ప్రైవేట్ వెల్త్ హురున్ ఇండియన్ ఫ్యూచర్ యూనికార్న్ ఇండెక్స్ 2024' రిపోర్టు ఈ విషయాన్ని వెల్లడించింది. కనీసం బిలియన్ డాలర్ల (100 కోట్ల డాలర్లు= రూ.8,350 కోట్లు) మార్కెట్ విలువ కలిగిన స్టార్టప్‌లను యూనికార్న్‌లుగా పిలుస్తారు. గత ఏడాది దేశంలో 68 యూనికార్న్‌లు ఉండగా.. ఈ ఏడాదిలో ఆ సంఖ్య 67కు తగ్గింది. అంతేకాదు, భవిష్యత్‌లో యూనికార్న్‌లుగా ఎదిగేందుకు అవకాశాలున్న స్టార్టప్‌ల జాబితాలో ఏకంగా 25 స్టార్టప్‌లు స్థానం కోల్పోయాయి. మూడేళ్లలో యూనికార్న్‌లుగా ఎదిగేందుకు అవకాశాలున్న, 50 కోట్ల డాలర్లకు పైగా విలువైన 5 స్టార్టప్‌లు సైతం అందులో ఉన్నాయని నివేదిక వెల్లడించింది.

ఈ ఏడాది ప్రథమార్ధంలో టెక్ స్టార్టప్‌ల్లోకి 410 కోట్ల డాలర్ల పెట్టుబడులు

ఈ ఏడాది ప్రథమార్ధంలో దేశీయ టెక్నాలజీ స్టార్టప్‌లు మొత్తం 410 కోట్ల డాలర్ల పెట్టుబడులను సమీకరించగలిగాయని మార్కెట్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ ట్రాక్సాన్ తాజా నివేదిక వెల్లడించింది. ప్రపంచవ్యాప్త టెక్ స్టార్టప్‌ల విభాగంలో అత్యధిక ఫండింగ్ లభించిన దేశాల్లో అమెరికా, యూకే, చైనా తర్వాత భారత్ నాలుగో స్థానంలో నిలిచిందని రిపోర్టు తెలిపింది. అయితే, గత ఏడాది ప్రథమార్ధంలో సేకరించిన 480 కోట్ల డాలర్లతో పోలిస్తే ఈ ఏడాది ఆరు నెలల్లో పెట్టుబడులు 13 శాతం తగ్గాయి. 2023 ద్వితీయార్ధంలో (జూలై-డిసెంబరు) సేకరించిన 396 కోట్ల డాలర్ల పెట్టుబడితో పోలిస్తే మాత్రం 4 శాతం పెరిగాయని రిపోర్టు పేర్కొంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,440 ▲	66,400 ▲	97,100 ▲
ముంబై	72,160 ▲	66,100 ▲	90,040 ▲

స్విస్ బ్యాంక్‌ల్లో భారతీయుల సొమ్ము నాలుగేళ్ల కనిష్ఠం

గత ఏడాది 70% తగ్గి రూ.9,771 కోట్లకు పరిమితం

స్విట్జర్లాండ్ సెంట్రల్ బ్యాంక్ వార్షిక నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ/జ్యూరిక్: నల్లధనానికి స్వర్గసీమగా పేరుగాంచిన స్విట్జర్లాండ్ బ్యాంక్‌ల్లోని భారతీయ వ్యక్తులు, సంస్థల సొమ్ము నాలుగేళ్ల కనిష్ఠ స్థాయికి తగ్గింది. స్విస్ నేషనల్ బ్యాంక్ (ఎస్ఎన్‌బీ) గురువారం విడుదల చేసిన డేటా ప్రకారం.. 2023లో స్విస్ బ్యాంక్‌ల్లోని మనోళ్ల సొమ్ము 70 శాతం తగ్గి 104 కోట్ల స్విస్ ఫ్రాంక్‌లకు (సుమారు రూ.9,711 కోట్లు) జారుకుంది. ఈ బ్యాంక్‌ల్లో భారతీయుల సొమ్ము తగ్గడం వరుసగా ఇది రెండో ఏడాది. 2021లో మాత్రం మనోళ్ల నిధులు 14 ఏళ్ల గరిష్ఠ స్థాయి 383 కోట్ల స్విస్ ఫ్రాంక్‌కు పెరిగినప్పటికీ.. గడిచిన రెండేళ్లలో బాండ్లు, సెక్యూరిటీలు, ఇతర ఆర్థిక సాధనాల రూపంలో ఉన్న నిధులను పెద్ద ఎతున ఉపసంహరించుకోవడం ఇందుకు కారణమైంది. అంతేకాదు, డిపాజిట్ ఖాతాలు, ఇతర బ్యాంక్‌ల శాఖల ద్వారా మళ్లించిన నిధులను సైతం భారీగానే విత్‌డ్రా చేసుకున్నట్లు డేటా తేటతెల్లం చేసింది. స్విట్జర్లాండ్ బ్యాంక్‌లు ఎస్ఎన్‌బీకి సమర్పించిన అధికారిక లెక్కలివి. అంటే, మనోళ్లు అధికారికంగా స్విస్ బ్యాంక్‌ల్లో దాచుకున్న సొమ్మే తప్ప, నల్లధనం లెక్క కాదిది. అంతేకాదు, భారతీయులు, ప్రవాసులు, ఇతరులు ఇతర దేశాల్లోని సంస్థల ద్వారా స్విట్జర్లాండ్‌కు నిధులు మళ్లించి దాచుకున్న సొమ్ము వివరాలు కూడా ఇందులో లేవు.

ఇనోబ్యాట్‌లో అమర రాజాకు మరింత వాటా

4.5% వాటా రూ.180 కోట్లకు కొనుగోలు

న్యూఢిల్లీ: స్లొవేకియాకు చెందిన ఎలక్ట్రిక్ బ్యాటరీల తయారీ సంస్థ ఇనోబ్యాట్ ఏఎస్‌లో మరో 4.5 శాతం వాటాను 2 కోట్ల యూరోలకు (సుమారు రూ.180 కోట్లు) కొనుగోలు చేసినట్లు అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ గురువారం వెల్లడించింది. దాంతో ఇనోబ్యాట్‌లో అమర రాజా మొత్తం వాటా దాదాపు 9.32 శాతానికి పెరిగింది. గతంలో 4.8 శాతం వాటాను అమరరాజా కోటి యూరోలకు కొనుగోలు చేసింది. "ఇనోబ్యాట్‌లో మరింత వాటా కొనుగోలు ఇంధన విప్లవంలో ముందుండాలన్న మా నిబద్ధతను నొక్కి చెబుతుంది. బ్యాటరీ సాంకేతికతలో ఇనోబ్యాట్ వినూత్న విధానం వినియోగదారులకు సహేతుక, ఆధునిక ఇంధన పరిష్కారాలు అందించాలన్న మా లక్ష్యాన్ని పూర్తి చేస్తుంది" అని అమర రాజా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విక్రమాదిత్య గౌరినేని అన్నారు.

ఎలక్ట్రానిక్స్ పవర్ హౌస్‌గా ఏపీ

నారా లోకేశ్ ఆకాంక్ష



హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రానిక్స్ తయారీ హబ్‌గా మార్చాలన్న ఆకాంక్షను ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారని సెల్‌కాన్ గ్రూప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వై గురు తెలిపారు. ఐటీ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన లోకేశ్‌ను తాను అభినందించిన సందర్భంగా రాష్ట్రాన్ని ఎలక్ట్రానిక్ హబ్‌గా తీర్చి దిద్దాలన్న లక్ష్యానికి తాను పూర్తిగా కట్టుబడి ఉన్నట్టు చెప్పారన్నారు. ఇందుకు అవసరమైన వ్యూహాత్మక ప్రణాళిక రూపకల్పన కోసం త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, లోకేశ్‌లతో సమావేశం నిర్వహించాలనుకుంటున్నట్టు తెలిపారు. దేశంలో ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ పరిమాణం 2019 నాటికి 7,500 కోట్ల డాలర్లు కాగా 2024 నాటికి 11,500 కోట్ల డాలర్లకు చేరుతుందని అంచనా అని పేర్కొంటూ ఇందులో భారీ వాటా చేజిక్కించుకోవాలన్నదే తన లక్ష్యమని లోకేశ్ చెప్పారని ఆయన వెల్లడించారు. ఇదిలా ఉండగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేపట్టే చర్యలన్నింటికీ తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఇండియన్ సెల్యులార్, ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ చైర్మన్ పంకజ్ మహీంద్రూ ప్రకటించారు. పరిశ్రమకు చంద్రబాబు పెద్ద స్ఫూర్తి అని, ఎలక్ట్రానిక్స్ తయారీలో ఆంధ్రప్రదేశ్‌కు అద్భుత అవకాశాలున్నాయని ఆయన అన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



21వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	505
వరంగల్	512	గోదావరి	495
చిత్తూరు	563	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	124	విజయవాడ	135
వరంగల్	124	గుంటూరు	135
కరీంనగర్	124	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	124	చిత్తూరు	142
కర్నూలు	124	నెల్లూరు	142
విశాఖపట్నం	136	అనంతపురం	135
గోదావరి	135		

జోయాలుక్కాస్‌లో మజూరీపై 50 శాతం డిస్కౌంట్

హైదరాబాద్: ఆభరణాల రిటైలింగ్‌లోని జోయాలుక్కాస్ తమ కస్టమర్లకు మజూరీపై 50 శాతం డిస్కౌంట్ ఆఫర్‌ను ప్రకటించింది. ఈ నెల 14 నుంచి ప్రారంభమైన ఈ ఆఫర్ జూలై 14 వరకు అందుబాటులో ఉంటుంది. బంగారం, వెండి, వజ్రాభరణాలు, వజ్రాలు అన్నింటికీ ఈ ఆఫర్ వర్తిస్తుంది. 10 లక్షలకు పైగా డిజైన్లతో గల అద్భుత శ్రేణిలో తమకు నచ్చిన ఆభరణాలను కస్టమర్లు ఈ ఆఫర్ ద్వారా కొనుగోలు చేసుకోవచ్చునని కంపెనీ చైర్మన్ జోయాలుక్కాస్ అన్నారు. దేశంలోని అన్ని షోరూమ్‌లలోనూ ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని చెప్పారు.

కొనసాగిన రికార్డుల పరంపర

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్‌లో రికార్డుల పరంపర కొనసాగుతోంది. సెన్సెక్స్, నిఫ్టీ గురువారం మరో సరికొత్త గరిష్ఠ స్థాయిల వద్ద ముగిశాయి. సెన్సెక్స్ 141.34 పాయింట్ల లాభంతో 77,478.03 వద్ద ముగియగా నిఫ్టీ 51 పాయింట్ల లాభంతో 23,567 వద్ద ముగిసింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకు వంటి ఇండెక్స్ హెవీ వెయిట్ షేర్లలో భారీ కొనుగోళ్లు ఇందుకు ప్రధానంగా దోహదం చేశాయి. సెన్సెక్స్ గత ఆరు రోజుల్లోనే 1,022.34 పాయింట్లు దూసుకు పోయింది.

ఎఫ్ అండ్ ఓ లాభాలపై అధిక పన్ను పోటు !

న్యూఢిల్లీ: ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) ట్రేడింగ్ చేసే వారికి వచ్చే కేంద్ర బడ్జెట్ షాకివ్వబోతోంది. ఈ లావాదేవీలపై కేంద్ర ఆర్థికమంత్రి పెద్ద మొత్తంలో పన్ను విధించబోతున్నట్టు సమాచారం. నూటికి 90 శాతం మంది ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌తో చేతులు కాల్చుకుంటున్నట్టు సెబీనే చెప్పి, రిటైల్ మదుపరులు దీని జోలికి పోవద్దని సలహా ఇచ్చింది. అయినా పరిస్థితిలో పెద్దగా మార్పు లేదు. దీంతో ఈ ట్రేడింగ్ ద్వారా వచ్చే లాభాలపై అధిక పన్ను విధించాలని ఆర్థిక మంత్రి యోచిస్తున్నట్టు చెబుతున్నారు. ఇందుకు వీలుగా ఎఫ్ అండ్ ఓ ద్వారా లభించే లాభాలను 'వ్యాపార ఆదాయం'గా కాక 'స్పెక్యులేటివ్ ఆదాయం'గా పరిగణించబోతున్నట్టు తెలుస్తోంది. ఇదే జరిగితే రిటైల్ ఇన్వెస్టర్లతో పాటు, ట్రేడర్లూ ఈ ట్రేడింగ్‌లోకి పెద్దగా వెళ్లక పోవచ్చని భావిస్తున్నారు.

మంత్రుల బాధ్యతల స్వీకరణ

టీటీడీ నుంచే ప్రక్షాళన: మంత్రి ఆనం



అమరావతి, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల ప్రక్షాళన తొలుత తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నుంచే ప్రారంభిస్తున్నామని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. దేవదాయ శాఖ కమిషనరేట్‌లో గురువారం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఆయన మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ ధర్మాన్ని కాపాడటమే దేవదాయ శాఖ బాధ్యతని అన్నారు. రాష్ట్రంలో 26 వేలకుపైగా ఆలయాలు, పాలకవర్గాలు ఉన్నాయని.. కానీ దీపం పెట్టే పరిస్థితి కొన్నింటికి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యువగళం పాదయాత్రలో భాగంగా అర్చకుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు టీడీపీ మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా రూ.50వేల లోపు ఆదాయం ఉన్న ఆలయాలకు ధూప దీప నైవేద్యం కింద రూ.10 వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆలయాలకు సంబంధించిన ప్రతి సెంటు భూమినీ కాపాడేలా చర్యలు తీసుకుంటామన్నారు. జూలై 3 తర్వాత ఏపీ సచివాలయంలో తమ కార్యాలయంలో పూర్తిస్థాయి సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు.

రాష్ట్రంలోనూ గిఫ్ట్ సిటీ: మంత్రి టీజీ భరత్



అమరావతి, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖా మంత్రిగా టీజీ భరత్ గురువారం అమరావతి సచివాలయంలో నాల్గవ బ్లాకులో బాధ్యతలు స్వీకరించారు. వీసీఐసీ రివైజ్డ్ అడ్మినిస్ట్రేషన్ ఫైల్‌పై మంత్రి తొలి సంతకం చేశారు. ఏపీఐఐసీలో భూముల లీజు, కాల పరిధి పెంచే ఫైలుపై రెండో సంతకం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. తనకు పరిశ్రమలకు సంబంధించిన అంశాలపై అవగాహన ఉందన్నారు. గుజరాత్ తరహాలోనే ఇక్కడా పరిశ్రమలు తీసుకురావాలన్నారు. అక్కడ ఉన్న గిఫ్ట్ సిటీ తరహాలో ఏపీలో కూడా గిఫ్ట్ సిటీని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. లోకేష్‌తో కలిసి పరిశ్రమల రంగాన్ని పరుగులు పెట్టిస్తామన్నారు. సింగిల్ విండో విధానాన్ని సంస్కరించి మెరుగైన విధానం తెస్తామన్నారు. కాగా మంగళగిరిలోని ఏపీఐఐసీ భవన్‌లో రాష్ట్ర పరిశ్రమల శాఖ, ఏపీఐఐసీ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ప్రతి జిల్లాలో బీసీ స్టడీ సర్కిల్, బీసీ భవన్: సవిత



అమరావతి, జూన్ 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం త్వరలో బీసీ కమిషన్ ఏర్పాటు చేయనున్నట్లు బీసీ సంక్షేమ, చేనేత, జౌళిశాఖా మంత్రి ఎస్.సవిత చెప్పారు. అమరావతి సచివాలయంలో గురువారం ఆమె మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బీసీ స్టడీ సర్కిల్స్‌లో ఉచిత డీఎస్సీ కోచింగ్ ఇచ్చే ఫైల్‌పై తొలి సంతకం చేశారు. ఎన్టీఆర్ విదేశీ విద్య పథకం కొనసాగింపు ఫైల్‌పై రెండో సంతకం చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. జనాభాలో 50 శాతం ఉన్న బీసీలకు మంత్రి పదవి ఇచ్చిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రతి జిల్లాలో బీసీ స్టడీ సర్కిల్, బీసీ భవన్‌లను ఏర్పాటు చేయబోతున్నామన్నారు. హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ రంగం అభివృద్ధి కోసం ప్రతిఒక్కరూ వారానికి ఒకరోజు కాటన్ వస్త్రాలు ధరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

పరిశ్రమల ఏర్పాటులో ఎన్ఆర్ఐలకూ భాగస్వామ్యం

- 20 ఆదర్శ మండలాలకు రూ.10లక్షలు: మంత్రి కె.శ్రీనివాస్



అమరావతి, జూన్ 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సెర్ప్ ఎన్ఆర్ఐ సాధికారిత, సంబంధాలు శాఖా మంత్రిగా కొండపల్లి శ్రీనివాస్ గురువారం అమరావతి సచివాలయంలోని ఐదో బ్లాకులో బాధ్యతలు స్వీకరించారు. తనకు మంత్రిగా అవకాశం ఇచ్చిన సీఎం చంద్రబాబుకూ, లోకేశ్‌కూ ధన్యవాదాలు తెలిపారు. 20 ఆదర్శ మండలాలకు పది లక్షలు చొప్పున మంజూరు చేసే ఫైలుపైనా, ఎస్సీ, ఎస్టీ, స్వయం సహాయక బృందాలకు నిధుల లభ్యత ఆధారంగా ఇంట్రెస్ట్ ఫ్రీ లోన్స్ ఫైల్‌పైనా మంత్రి సంతకాలు చేశారు. పరిశ్రమలు ఏర్పాటుకు పెట్టుబడులు రప్పించడంలో ఎన్ఆర్ఐలను భాగస్వాములను చేస్తామన్నారు.

భూ కబ్జాలన్నీ వెలికితీస్తాం: మంత్రి అనగాని



అమరావతి, జూన్ 20(ఆంధ్రజ్యోతి): 'జగన్ పాలనలో జరిగిన భూ కబ్జాలన్నీ వెలికితీస్తాం. గత ప్రభుత్వ హయాంలో రీ సర్వేలో జరిగిన తప్పులను సరిజేస్తాం. రెవెన్యూ సిబ్బంది శిక్షణకు ప్రత్యేకంగా అకాడమీ ఏర్పాటు చేస్తాం. కోర్టు కేసుల పరిష్కారానికి ఆన్‌లైన్ రెవెన్యూ కోర్టు విధానాన్ని ప్రవేశ పెడతాం. రెవెన్యూ శాఖ ద్వారా ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని' రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్స్ శాఖల మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. గురువారం ఉదయం అమరావతి సచివాలయం నాలుగో బ్లాక్‌లో రెవెన్యూ మంత్రికి కేటాయించిన ఛాంబర్‌లో వేద మంత్రోచ్ఛరణల మధ్య ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. జూన్ 20న రెవెన్యూ డే సందర్భంగా కేక్ కట్ చేశారు.

ఓ కార్మికుడిలా పని చేస్తా: మంత్రి సుభాష్



అమరావతి, జూన్ 20(ఆంధ్రజ్యోతి): అమరావతి సచివాలయంలో గురువారం రాష్ట్ర కార్మిక, ఫ్యాక్టరీలు, బాయిలర్స్, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ శాఖా మంత్రిగా వాసంశెట్టి సుభాష్ బాధ్యతలు స్వీకరించారు. గత ప్రభుత్వ హయాంలో అమల్లో ఉన్న వైఎస్సార్ బీమా పథకాన్ని చంద్రన్న బీమా పథకంగా పేరు మారుస్తూ తొలి సంతకం చేశారు. కార్మికుల అభ్యున్నతి కోసం తానూ ఒక కార్మికుడిలా పనిచేస్తానని పేర్కొన్నారు.

సినిమా షూటింగ్‌లకు అనుమతులు: కందుల



అమరావతి, జూన్ 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పర్యాటక రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేశ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో సినిమా షూటింగ్‌లకు అనుమతులను సులభతరం చేస్తామని, ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏపీలో స్టూడియోల నిర్మాణానికి ముందుకు రావాలని నిర్మాతలకు ఆయన ఆహ్వానం పలికారు. గురువారం ఆయన మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రూ.2.31 కోట్లతో 10 టూరిజం బోట్ల కొనుగోలు ఫైల్‌పై తొలి సంతకం చేశారు. ఏపీలో సినిమా షూటింగ్‌లు పెరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. టూరిజం స్పాట్లలో మౌలిక వసతులు కల్పిస్తాం. దేశంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతామని చెప్పారు.

బళ్లు ఓడలయ్యాయ్!

- ఇక ఎమ్మెల్యే జగన్.. 11 మందే గెలవడంతో అసెంబ్లీలో దక్కని ప్రతిపక్ష నేత హోదా
- సాధారణ సభ్యుడిగానే మాజీ సీఎం
- సభానాయకుడి తర్వాత ప్రమాణం చేసే చాన్సు లేదు
- కేబినెట్ ర్యాంకు, భద్రతా ఉండవు



అమరావతి, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ఓడలు బళ్లయిన దృశ్యం రాష్ట్ర శాసనసభలో సాక్షాత్కరిస్తోంది. ఎన్నికల ముందు వరకు ఐదేళ్లపాటు సభానాయకుడిగా ఉన్న నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి.. కొత్త అసెంబ్లీలో సాధారణ ఎమ్మెల్యేగా మారిపోయారు. తాజా ఎన్నికల్లో ఆయనకు కనీసం ప్రతిపక్ష నేత హోదా కూడా దక్కని విధంగా ఘోరపరాజయం ఎదురైంది. ఆ హోదా దక్కాలంటే సభలోని మొత్తం సభ్యుల సంఖ్యలో కనీసం పదో వంతు సీట్లు ఆయన పార్టీకి దక్కాలి. రాష్ట్ర శాసనసభలో మొత్తం సభ్యుల సంఖ్య 175. ప్రతిపక్ష నాయకుడి హోదా దక్కాలంటే వైసీపీకి కనీసం 18 మంది ఎమ్మెల్యేలు ఉండాలి. కానీ ఆ పార్టీ 11 చోట్ల మాత్రమే గెలిచింది. ఆ పార్టీకి మించి జనసేనకు 21 సీట్లు వచ్చాయి. అయితే జనసేన అధికార కూటమిలో భాగంగా ఉంది. దీంతో వైసీపీ ప్రతిపక్ష హోదా లేని ప్రతిపక్షంగా సభలో ఉండబోతోంది. దరిమిలా జగన్ కూడా ఇకపై సభలో సాధారణ సభ్యుల్లో ఒకరుగా మాత్రమే ఉండనున్నారు. ప్రతిపక్ష హోదా దక్కితే ఆ పార్టీ నేతగా ఆయనకు ప్రతిపక్ష నాయకుడి హోదా, కేబినెట్ ర్యాంక్, దానికి తగిన స్థాయి భద్రత, ఇతర ప్రభుత్వ సౌకర్యాలు లభించేవి. ఇకపై ఆయనకు అవేవీ రావు. మామూలు ఎమ్మెల్యేలు పొందే వసతులు మాత్రమే లభిస్తాయి. ప్రతిపక్ష నేత హోదా ఉంటే కొత్త ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారంలో కూడా ఆయనకు ప్రాధాన్యం లభించేది. సభా నాయకుడిగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత.. ప్రతిపక్ష నేతతోనే ప్రమాణం చేయించేవారు. ఇప్పుడు అధికారికంగా ప్రతిపక్ష నేత హోదాతో ఎవరూ లేకపోవడంతో ముఖ్యమంత్రి తర్వాత ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రమాణం చేయనున్నారు. ఎమ్మెల్యేలతో అక్షర క్రమంలో ప్రమాణం చేయించినప్పుడు తన పేరు వచ్చినప్పుడు మాత్రమే జగన్మోహన్‌రెడ్డి ప్రమాణం చేయాల్సి ఉంటుంది. ప్రతిపక్ష హోదా ఉన్నా లేకపోయినా ప్రతిపక్ష స్థానానికి గౌరవం ఇవ్వాలని ముఖ్యమంత్రి అనుకుంటే మాత్రం ఆయన తర్వాత ప్రమాణం చేసే అవకాశం జగన్‌కు దక్కుతుంది. అది చంద్రబాబు విచక్షణపై ఆధారపడి ఉంటుంది. తమ పట్ల సభలో ఐదేళ్లపాటు జగన్ కక్షతో వ్యవహరించిన తీరుపై తీవ్ర ఆవేదనతో ఉన్న ప్రస్తుత టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు మాత్రం.. అంత ఔదార్యం చూపాల్సిన అవసరం లేదని భావిస్తున్నారు. ఏం జరుగుతుందనేది సభలో శుక్రవారం చూడాల్సి ఉంది.

రుషికొండపై అన్నీ అబద్ధాలే!



(మొదటి పేజీ తరువాయి)

ఉండేవి. వాటిని పర్యాటకులు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునేవారు. వారికోసం ప్రత్యేకంగా రెస్టారెంట్, సమావేశం మందిరం ఉండేవి. మొత్తం 48వేల చ.అడుగుల విస్తీర్ణంలో ఆ భవనాలు ఉండేవి. చక్కగా నడుస్తున్న వాటిని కూలగొట్టి సీఎం క్యాంపు కార్యాలయం నిర్మించుకోవాలని ప్రణాళిక వేశారు. ఆ ప్రాంతం సీఆర్‌జెడ్ పరిధిలో ఉండటంతో క్యాంపు కార్యాలయం అని చెప్పకుండా 'పర్యాటక భవనం' అనే పేరుతో ఢిల్లీలోని కేంద్ర అటవీ పర్యావరణ శాఖకు దరఖాస్తు చేశారు. పాత గదులు కూల్చేసి, పర్యాటకులకు మంచి వసతులున్న భవనాలు నిర్మిస్తామని పేర్కొన్నారు. అయితే అనుమతులు వచ్చిన తర్వాత అందుకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టారు. హరిత రిసార్ట్స్‌కు ఉపయోగించిన మొత్తం భూమి 9.88 ఎకరాలు కాగా అందులో 4.5 ఎకరాలే భవన నిర్మాణాలకు ఉపయోగించారు. అందులో 48వేల చ.అ. బిల్టప్ ఏరియా వచ్చింది. అంతే విస్తీర్ణంలో నిర్మాణాలు చేపడతామని ఢిల్లీలో చెప్పి ఇక్కడ అంతకు మించి భూమిని వాడుకున్నారు. 1,48,413 చ.అడుగుల్లో నిర్మించారు. అందులో కట్టిన గదులు కేవలం 12 మాత్రమే. అవి కూడా జగన్ దంపతులు, వారి కుమార్తెల కోసం విశాలంగా నిర్మించారు. వాటిలో పర్యాటకులకు ఉపయోగపడేలా ఒక్క గది కూడా నిర్మించలేదు.

రెండు బ్లాకులు మాయం

నూతనంగా నిర్మించే భవనంలో ఏడు బ్లాకులు ఉంటాయని కేంద్రానికి సమర్పించిన దరఖాస్తులో పేర్కొన్నారు. విజయనగర, కళింగ, చోళ, పల్లవ, గజపతి, వేంగి బ్లాకులు 5.18 ఎకరాల్లో నిర్మిస్తామని, మిగిలిన 4.7 ఎకరాలు పార్కింగ్‌కు వాడుకుంటామని తెలిపారు. కొండ మొత్తం 61ఎకరాలు కాగా వినియోగించిన 9.88 ఎకరాలు పోను మిగిలిన 51.12 ఎకరాలను భవిష్యత్తు నిర్మాణాలకు వినియోగిస్తామని ఏపీటీడీసీ వెల్లడించింది. ఇక విజయనగర, కళింగ, గజపతి, వేంగి బ్లాకులనే నిర్మించారు. విజయనగర బ్లాకును 1, 2, 3గా విభజించి దానిని 3బ్లాకులుగా పేర్కొన్నారు. అలాగే వేంగి బ్లాకును 1, 2గా విభజించి రెండుగా చూపించారు. చోళ, పల్లవి బ్లాకులను అసలు నిర్మించలేదు. చోళ బ్లాకు 0.65 ఎకరాల్లో, పల్లవ బ్లాకు 0.43 ఎకరాల్లో అంటే రెండూ కలిపి 1.08 ఎకరాల్లో నిర్మించాల్సి ఉండగా... ఆ విస్తీర్ణాన్ని కూడా విజయనగర బ్లాకులో కలిపేసి నిర్మించుకున్నారు. వాస్తవానికి విజయనగర బ్లాకును 1.8 ఎకరాల్లో నిర్మిస్తామని ప్లాన్‌లో చూపించారు. దానికి చోళ, పల్లవి బ్లాకుల విసీర్ణం 1.08 ఎకరాలు కలిపేసి మొత్తం 2.88 ఎకరాల్లో జగన్ దంపతులు, వారి ఇద్దరు కుమార్తెలకు కలిపి సుమారు 3 ఎకరాల్లో సింగిల్ బ్లాక్ విజయనగరను నిర్మించారు. ఎవరూ వెళ్లకుండా దానికి ప్రత్యేకంగా గేట్లు ఏర్పాటుచేసి సెక్యూరిటీ పెట్టారు. చోళలో సమావేశ మందిరం, పల్లవలో సూట్‌రూమ్‌లు, సమావేశ మందిరాలు నిర్మించాలి. కానీ వాటిని లేకుండా చేశారు. అనుమతుల కోసం దరఖాస్తు చేసినప్పుడు ఈ ఏడు బ్లాకులకు రూ.240 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణాలు చేపడతామని పేర్కొన్నారు. తొలిదశలో రూ.92కోట్లు, రెండో దశలో రూ.148కోట్లు ఖర్చుచేస్తామని వెల్లడించారు. కానీ నిర్మాణం పూర్తయ్యేసరికి ఆ వ్యయం రూ.500 కోట్లు దాటేసింది. ప్రభుత్వ నిర్మాణాలకు రెట్టింపు వ్యయమైన దాఖలాలు రాష్ట్ర చరిత్రలో లేవు. అన్ని పనులు అనుకున్న సమయంలోనే పూర్తిచేసినా ఖర్చు రెట్టింపవడం విశేషం. అయినా పర్యాటకుల కోసం ఎటువంటి వసతి ఏర్పాటు చేయలేదు. కేవలం జగన్ దంపతులు, వారి కుమార్తెలు, వారి పరివారం కోసమే నిర్మించుకున్నారనేది అక్షర సత్యం.

నేటి నుంచే సభ

రెండు రోజులకు పరిమితం

- ఎమ్మెల్యేల కుటుంబ సభ్యులకు, సందర్శకులకు నో ఎంట్రీ



అమరావతి, జూన్ 20(ఆంధ్రజ్యోతి): ఏపీ నూతన అసెంబ్లీ సమావేశాలు శుక్రవారం నుంచి ప్రారంభం అవుతున్నాయి. ఈ సమావేశాలను రెండు రోజులకే పరిమితం చేశారు. తొలిరోజు ఉదయం 9.26 గంటలకు సభ ప్రారంభానికి ముహూర్తంగా నిర్ణయించారు. జాతీయ గీతాలాపనతో సభ ప్రారంభం అవుతుంది. నిర్ణయించిన కార్యక్రమం ప్రకారం ప్రొటెమ్ స్పీకర్ సభను ప్రారంభిస్తారు. తొలిరోజు అంతా కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారానికే కేటాయించారు. సభలో మొదటగా సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకారం జరుగుతుంది. తర్వాత ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆ తర్వాత మంత్రులు చేస్తారు. ఆ పిమ్మట మహిళా ఎమ్మెల్యేలతో చేయిస్తారు. వారి తర్వాత అక్షర క్రమంలో ఎమ్మెల్యేల ప్రమాణం జరుగుతుంది. 175 మంది ఎమ్మెల్యేలతో ప్రమాణం చేయించి సభను ముగిస్తారు. తొలిరోజే స్పీకర్ ఎన్నిక కోసం నోటిఫికేషన్ జారీ చేస్తారు. నామినేషన్లు స్వీకరిస్తారు. రెండోరోజు సభలో స్పీకర్ ఎన్నిక జరుగుతుంది. సభలో ప్రతిపక్షానికి అతి తక్కువ సంఖ్యాబలం ఉండటం వల్ల స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవంగానే జరిగే అవకాశం ఉంది. సీనియర్ ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడును స్పీకర్‌గా ఇప్పటికే టీడీపీ నిర్ణయించింది. స్పీకర్‌గా ఆయన ఎన్నికను ప్రకటించిన తర్వాత సభలో సీఎం, ఇతర నేతలు ప్రసంగిస్తారు. చివరగా స్పీకర్ వారికి ధన్యవాదాలు చెబుతూ మాట్లాడతారు. దీనితో రెండోరోజు సభ ముగుస్తుంది. రెండోరోజు కేవలం స్పీకర్ ఎన్నిక కోసం మాత్రమే సభను సమావేశపరుస్తున్నారు. దీని తర్వాత సభ నిరవధికంగా వాయిదా పడుతుంది. ఈ సమావేశాల కోసం విస్తృత భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. సందర్శకుల పాస్‌లు పూర్తిగా నిలిపివేశారు. ఎమ్మెల్యేల కుటుంబ సభ్యులు కూడా రావద్దని అసెంబ్లీ అధికారులు సమాచారం పంపారు. సభలో సందర్శకుల గ్యాలరీలో కేవలం 200 సీట్లు మాత్రమే ఉన్నాయి. అందులో కొంత భాగం మీడియాకు సర్దుబాటు చేశారు. మరికొన్ని సీట్లు ఎమ్మెల్సీలకు, మాజీ ఎమ్మెల్యేలకు రిజర్వు చేశారు. స్థలం పరిమితంగా ఉండటంతో తమ వెంట ఎవరినీ తేవద్దని ఎమ్మెల్యేలను కోరారు.

గోరంట్లతో ప్రమాణం చేయించిన గవర్నర్

శాసనసభ ప్రొటెమ్ స్పీకర్‌గా ఏడుసార్లు గెలిచిన సీనియర్ టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఎంపికయ్యారు. ఆయనతో గవర్నర్ అబ్దుల్ నజీర్ గురువారం విజయవాడలోని రాజ్ భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయించారు. బుచ్చయ్యతో ప్రొటెమ్ స్పీకర్‌గా కాకుండా అసెంబ్లీ తొలి సభ్యునిగా ప్రమాణం చేయించడం విశేషం. స్పీకర్ ఎన్నిక జరిగే వరకూ స్పీకర్‌కు ఉండే అన్ని అధికారాలు ప్రొటెమ్ స్పీకర్‌కు ఉంటాయి. స్పీకర్ హోదాలో శాసనసభ కార్యకలాపాలకు సంబంధించిన ఫైళ్లపై కూడా ఆయన సంతకాలు చేయవచ్చు. గోరంట్ల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి శాసనసభా వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్, మంత్రులు నిమ్మల రామానాయుడు, అనగాని సత్య ప్రసాద్, గొట్టిపాటి రవి కుమార్, టీజీ భరత్, సవిత, ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, గద్దె రామ్మోహనరావు తదితరులు హాజరయ్యారు.

గవర్నర్ ఛలోక్తులు

ప్రొటెమ్ స్పీకర్ కార్యక్రమం కోసం రాజ్ భవన్‌కు వచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలతో గవర్నర్ కాసేపు సరదాగా గడిపారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం ముగిసిన తర్వాత ఆయన వేదిక దిగి కిందకు వచ్చి మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య కాసేపు ఉండి వారితో మాట్లాడారు. మంత్రులతో వారి శాఖల గురించి ఛలోక్తులు విసిరారు. ప్రొటెం స్పీకర్ బుచ్చయ్యను ఉద్దేశించి 'మీరు కూడా నాలాగే తటస్థ పాత్రలోకి రావాలి' అని గవర్నర్ వ్యాఖ్యానించారు.

'గనుల' ఫైళ్లు గల్లంతు!

(మొదటి పేజీ తరువాయి)

గనుల శాఖ కీలక అధికారితో పాటు మరో ముగ్గురు సీనియర్ అధికారుల పాత్రపై చర్చ జరుగుతోంది. నిధుల దుర్వినియోగం కేసులో కీలక పరిణామాలు వెలుగు చూసిన తర్వాతే కూటమి సర్కారు అప్రమత్తమైంది. ఇబ్రహీంపట్నం, తాడిగడపలోని గనుల శాఖ, ఏపీఎండీసీ కార్యాలయాలను స్వాధీనం చేసుకొని సీజ్ చేసింది. అయితే అప్పటికే ఈ మొత్తం గోల్‌మాల్ జరిగిపోయినట్లు తెలిసింది.

గుట్టు విప్పే నోట్‌ఫైళ్లు ముక్కలు

మాంగనీస్ టెండర్లకు సంబంధించి ఓ కాంట్రాక్టర్ నుంచి వసూలు చేసిన సెక్యూరిటీ డిపాజిట్ గనుల శాఖ ఖాతాల్లో ఉంది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను వాడుకొని ఆ నిధులను ఉన్నతాధికారులు దారిమళ్లించి సొంతానికి వాడుకున్నారు. ఈ అంశానికి సంబంధించిన మూడు నోట్‌ఫైళ్లను ఇబ్రహీంపట్నంలోని ఆఫీసులో ఈ నెల 6వ తేదీ రాత్రే ముక్కలు చేసినట్లు తెలిసింది. ఆ తర్వాత సర్వేరాళ్ల కొనుగోలు ఫైళ్లలోని నోట్‌ఫైళ్లను కూడా తొలగించి చింపివేసినట్లు సమాచారం. శాఖలో ఓ ఉన్నతాధికారి తన బావమరిదితో కంపెనీ ఏర్పాటు చేయించి సర్వేరాళ్ల సరఫరా టెండర్ ఆయనకే దక్కేలా చక్రంతిప్పారు. ఈ ఒక్క అంశంలోనే దాదాపు రూ.350కోట్ల మేర అక్రమాలు జరిగాయి. గత నవంబరులో ఈ అంశాన్ని 'ఆంధ్రజ్యోతి' ఆధారాలతో సహా బయటపెట్టింది. ఈ నేపథ్యంలో రాళ్ల కొనుగోలు ఫైలులోని నోట్‌ఫైళ్లనూ చింపివేసినట్లు తెలిసింది. ఇదే సమయంలో తాడిగడప ఏపీఎండీసీ కార్యాలయంలోనూ కీలక ఫైళ్లు, డాక్యుమెంట్లను ఇద్దరు అధికారులు తొలగించినట్లు సమాచారం. 2019 ఆగస్టు నుంచి 2021 వరకు జరిగిన ఇసుక వ్యాపారంలోని లావాదేవీలు, వాటికి సంబంధించిన బిల్లుల చెల్లింపు, నోట్‌ఫైళ్లను కూడా గల్లంతు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. మధ్యప్రదేశ్‌లోని సులియారీలో ఏపీఎండీసీకి బొగ్గు నిక్షేపాలున్నాయి. బొగ్గు తవ్వితీయడంతో పాటు ముడిబొగ్గును అమ్మే కాంట్రాక్టులు అదానీకి కట్టబెట్టారు. దీనికి సంబంధించిన ఫైళ్లను కూడా గుట్టుగా మాయం చేసినట్లు తెలిసింది. ఈ అంశాలపై విచారణ జరిగితే గనుల శాఖలో కీలక అధికారితో పాటు, ఆయన వ్యక్తిగత సహాయకుడు, మరో ముగ్గురు సీనియర్ అధికారులు, ఏపీఎండీసీలోని ఓ సలహాదారు, మరో ఇద్దరు సీనియర్ అధికారుల పాత్ర బయటకొస్తుంది. వీరంతా కలసి కీలక ఫైళ్లను మాయం చేసిన తర్వాతే రెండు ఆఫీసులను సీజ్ చేశారని సీనియర్ అధికారులు కూడా చెబుతున్నారు.

ఆ కేసుతోనే అప్రమత్తం

గనుల శాఖ డైరెక్టరేట్ పరిధిలో సెక్యూరిటీ డిపాజిట్‌గా ఉన్న కోట్లాది రూపాయల నిధులను దారిమళ్లించి దోచుకున్న అంశం ఇటీవల వెలుగు చూసింది. దీనికి సంబంధించి ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో ముగ్గురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, గుంటూరుకు చెందిన ఇసుక కాంట్రాక్టర్, మరో ప్రైవేటు వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. జగన్ కార్యాలయంలో కీలక అధికారి ప్రోద్బలంతో కేవలం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై మాత్రం కేసు నమోదు చేసి, ఉన్నతాధికారులను తప్పిస్తున్నారని విమర్శలు వచ్చాయి. ఈ నెల 4న ఎన్నికల ఫలితాలు రావడంతో గనుల శాఖ అధికారులకు భవిష్యత్తు గుర్తుకొచ్చింది. మళ్లీ జగన్ అధికారంలోకి వస్తారని కలలు కన్నవారు ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. ఆ తర్వాత 6వ తేదీ మధ్యాహ్నం 3.30 నుంచి రాత్రి 10 గంటల వరకు శాఖలోని నలుగురు అధికారులు కీలక మంత్రాంగం నడిపారు. ఆ తర్వాతే ఇబ్రహీంపట్నంలో నమోదైన కేసుకు సంబంధించిన నిధుల మళ్లింపులో వాస్తవాలు బయటపెట్టే మూడు నోట్ ఫైళ్లను చింపివేసినట్లు తెలిసింది.

సవాళ్లను అధిగమిస్తాం.. పోలవరాన్ని నిర్మిస్తాం

గత ప్రభుత్వ అవినీతిపై శ్వేతపత్రం: నిమ్మల



అమరావతి, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): పోలవరం రాష్ట్రానికి వరం, జీవనాడి అని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఎన్ని సవాళ్లు ఎదురైనా అధిగమించి ప్రాజెక్టును పూర్తి చేశామని స్పష్టం చేశారు. ఆయన గురువారం అమరావతి సచివాలయంలోని నాలుగో బ్లాకులో పదవీ బాధ్యతలు స్వీకరించారు. సచివాలయానికి కుటుంబసమేతంగా వచ్చిన ఆయనకు వేదపండితులు పూర్ణ కుంభంతో, అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తనకు కీలకమైన జలవనరుల శాఖ బాధ్యతలు అప్పగించిన సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. 'చంద్రబాబు ఐదేళ్లపాటు సోమవారాన్ని పోలవారంగా మార్చారు. జగన్ వచ్చి ప్రాజెక్టు పనులు చేయకపోగా 20ఏళ్లు వెనక్కి తీసుకెళ్లారు. మేం చేసిన పనులను ధ్వంసం చేశారు. కేంద్ర జలశక్తి శాఖ హెచ్చరించినా కాంట్రాక్టు ఏజెన్సీలను, అధికారులను మార్చేశారు. రివర్స్ టెండరింగ్‌తో ప్రాజెక్టును గాలికి వదిలేశారు. 13నెలలు ప్రాజెక్టును పర్యవేక్షించకుండా చేశారు. దీనివల్లే డయాఫ్రంవాల్ దెబ్బతింది. కాఫర్ డ్యాంలో 350క్యూసెక్కుల మేర సీపేజీ వస్తోంది. గ్యాప్ 3, 1 వద్ద 50నుంచి వంద అడుగుల లోతు అగాధాలు ఏర్పడ్డాయి. ఇలా ప్రాజెక్టును గత ప్రభుత్వం క్లిష్టతరం చేసేసింది. కేంద్రం రీయింబర్స్ చేసిన నిధులను కూడా మళ్లించారు. చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు అబద్ధాలు చెబుతున్నారు. ఈ ప్రాజెక్టులో గత ప్రభుత్వం చేసిన అవినీతిపై త్వరలో శ్వేతపత్రం విడుదల చేస్తాం. ఎవరు ఎంత డబ్బు, ఎవరు ఎలా దోచారో విచారిస్తాం. తప్పుచేసిన వాళ్లను వదిలిపెట్టం' అని తేల్చిచెప్పారు. పోలవరం సహా ఇతర నీటిపారుదల ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలను ప్రాధాన్యం ప్రకారం సకాలంలో పూర్తి చేస్తామన్నారు. కాలువల్లో గుర్రపుడెక్క, పూడికతీత కోసం నిమ్మల మొదటిసంతకం చేశారు. గేట్లు, షట్టర్లు, లాకుల మరమ్మతులకు తక్షణం నిధులు విడుదల చేస్తున్నామని చెప్పారు. గత ఐదేళ్లుగా ఎక్కడా డీసిల్టింగ్ చేయలేదని, అందుకే చుక్క వాన పడినా అన్ని ప్రాంతాలు మునిగాయని తెలిపారు. వచ్చే సీజన్‌లో పంటలను కాపాడేందుకు కాలువల్లో డీసిల్టింగ్‌కు నిర్ణయం తీసుకున్నామన్నారు. వర్షాల సీజన్‌లో వరదలకు ఏటిగట్లు తెగిపోకుండా ముందస్తు చర్యల కోసం ఆదేశాలిచ్చామని చెప్పారు.

కార్పొరేషన్లలోని జగన్ సైన్యంపై వేటు

- 'ఆంధ్రజ్యోతి'లో కథనంతో కదలిక..
- వారి రాజీనామాలు తీసుకుని, ఆమోదించండి: సీఎస్ ఉత్తర్వులు

అమరావతి, జూన్ 20 (ఆంధ్రజ్యోతి) : పదవీ విరమణ తర్వాత కూడా శాఖల్లో కొనసాగుతున్న వైసీపీ సిబ్బందిపై వేటు పడింది. వారందరినీ వెంటనే తొలగించాలని ప్రభుత్వం ఆదేశించింది. గత ప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా రిటైర్ అయిన ఉద్యోగులను ఆయా శాఖల్లో కొనసాగించింది. వందల మంది ఉద్యోగులు తమ శాఖలను విడిచిపెట్టకుండా, పదవీ విమరణ తర్వాత కూడా అక్కడే తిష్టవేశారు. కొంతమంది ఇంటి వద్దనే ఉంటూనే, వివిధస్థాయిల్లో పోస్టింగ్‌లు తీసుకుని జీతాలు డ్రా చేస్తున్నారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' గురువారం సంచికలో 'కార్పొరేషన్లలో జగన్ సైన్యం' శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురించింది. ఈ కథనంపై ప్రభుత్వం వెంటనే స్పందించింది. వారందరినీ తొలగిస్తూ గురువారం మధ్యాహ్నానికల్లా సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై అన్ని శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులు, హెచ్‌వోడీలకు ఆయన ఆదేశాలిచ్చారు. ఇప్పటికే రిటైర్ అయి రీఎంప్లాయిమెంట్ కింద శాఖల్లో కొనసాగుతున్న వారందరి దగ్గర నుంచి వెంటనే రాజీనామా లేఖలు తీసుకోవాలని, ఆ వెంటనే వాటిని ఆమోదించాలని స్పష్టం చేశారు. ఆయా శాఖల్లో ఎవరెవరిని తొలగించాలనేది ఈ నెల 24లోగా సాధారణ పరిపాలన విభాగానికి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అదే సమయంలో శాఖల్లో ఆయా ఉద్యోగుల సేవలు అవసరం అనుకుంటే ప్రభుత్వం అనుమతితో తిరిగి నియమించుకోవాలని సూచించారు. వారికి కొత్తగా అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

జగన్ నోట మళ్లీ మోసం పాట

(మొదటి పేజీ తరువాయి)

లోక్‌సభ సభ్యులు, ఓడిపోయిన అభ్యర్థులను మాత్రమే ఆహ్వానించారు. పార్టీ కార్యవర్గ సభ్యులను ఆహ్వానించలేదు. ఓడిపోయిన వారిలోనూ సగం మంది ఈ భేటీకి దూరంగా ఉండడం గమనార్హం. ఎన్నికల ఫలితాలు వచ్చాక ఈ నెల ఏడో తేదీన.. గెలుపొందిన ఎమ్మెల్యేలు, ఎంపీలతో, ఓడిన అభ్యర్థులను పిలిపించుకుని మాట్లాడినప్పుడు జగన్ ఏం చెప్పారో.. గురువారం కూడా అవే వల్లెవేశారు. ఈవీఎంలపై అనుమానాలున్నా ఆధారాల్లేవన్నారు. ఫలితాలు వచ్చాక వైసీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులు జరిగాయని.. వారందరికీ అండగా ఉండాలని నేతలకు సూచించారు. ప్రత్యర్థుల దాడిలో మృతి చెందినవారి కుటుంబాలను డిసెంబరు తర్వాత తాను ఓదార్చుతానని.. గాయపడ్డ కార్యకర్తలను పరామర్శిస్తానని తెలిపారు. పార్టీ ఓటమికి ప్రధాన కారణాలేంటో అభ్యర్థుల అభిప్రాయాలు ఆయన తెలుసుకోలేదు. అధికార పక్షాన్ని కౌరవులతో.. ఫలితాలను శకుని పాచికలతో పోల్చారు. హనీమూన్ కాలం ముగిశాక.. పథకాలు అందక ప్రజల్లో కూటమి సర్కారుపై ఆగ్రహం, అసహనం పెరిగిపోతాయని.. మేనిఫెస్టో అమలు చేయని చంద్రబాబుపై ప్రజాగ్రహం పెరిగి ఆయన 2029లో సింగిల్ డిజిటకే పరిమితమవుతారని జగన్ జోస్యం చెప్పారు. వైసీపీనే తిరిగి అధికారంలోకి వస్తుందన్నారు. ఇదే సమయంలో ఎన్నికల్లో మోసపోయామని.. ఏదో జరిగిందంటూ ప్రజలపైనా.. గెలుపొందిన పార్టీలపైనా నిందలు వేసే ప్రయత్నం మళ్లీ చేశారు. మోసం జరిగినా దానికి సాక్ష్యాలు, ఆధారాలు లేవన్నారు. ఓటమికి కారణాలేంటో విశ్లేషించుకోకుండా ఐదేళ్లలో ఏం చేశానో ఆత్మస్తుతి చేసుకోవడానికే జగన్ ప్రాధాన్యం ఇచ్చారు.

తాను చెప్పాలనుకున్నదే చెప్పారు..

సమావేశంలో నేతలకు తాను చెప్పాలనుకున్నది చెప్పేసి పంపేశారని.. ఓటమికి కారణాలేంటో తమ నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోనేలేదని హాజరైన కొందరు అభ్యర్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. భేటీలో ఏం జరిగిందని అడిగినప్పుడు.. 'ఏముందిలే.. మొన్న భేటీలో చెప్పిన కథలే జగన్ చెప్పారు. శిశుపాలుడు, శకుని, కురుక్షేత్రం కథలు వల్లెవేశారు. పార్టీ ఓడిపోవడానికి ప్రధానమైన కారణాలపై సమీక్షించలేదు. గడచిన ఐదేళ్లుగా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై జగన్ పూర్తి నిర్లక్ష్యం చూపారు. వలంటీర్ల వ్యవస్థతోనే గెలిచేస్తామని భావించారు. కార్యకర్తలను ఐదేళ్లుగా పట్టించుకోలేదు. ప్రజాప్రతినిధులను కలువలేదు. మాట్లాడలేదు. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతోందో తెలుసుకోలేదు. ఐప్యాక్ టీం చెప్పిందే వేదంగా భావించారు. మద్యం ధరలు పెంచేయడం.. భూమ్మీద లేని బ్రాండ్లు తీసుకురావడం.. నిషేధం విధిస్తానంటూ మరింత విశృంఖలంగా మద్యం అమ్మడం వంటి వాటిపై ప్రజల్లో.. అందునా మహిళల్లో ఆగ్రహం నెలకొంది. అన్నిటి కంటే ముఖ్యంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్టు, పట్టాదార్ పాస్ పుస్తకాలపై జగన్ ఫొటోలపై ప్రజల్లో తీవ్ర అభ్యంతరం వ్యక్తమైంది. దీనిపై సమీక్షించకుండా తాను బటన్ నొక్కి పథకాలు ఇచ్చానని.. తప్పకుండా వైసీపీకే ఓటు వేస్తారని భావించారు. కానీ తద్విరుద్ధంగా జరిగింది' అని రాయలసీమకు చెందిన ఓ మాజీ ఎంపీ, సీనియర్ నాయకుడు వ్యాఖ్యానించారు.

ఈవీఎంల పాత్రలేదు: రాపాక



ఓటమికి ఈవీఎంలే కారణమని జగన్ అంటుంటే.. కానే కాదని రాజోలు మాజీ ఎమ్మెల్యే, అమలాపురం లోక్‌సభకు పోటీచేసి ఓడిపోయిన రాపాక వరప్రసాద్ స్పష్టం చేశారు. తాడేపల్లి ప్యాలెస్ ఎదుట మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో కూటమి గెలవడానికి .. వైసీపీ ఓడిపోవడానికి ప్రజాగ్రహమే కారణమన్నారు.





రాజధాని అమరావతిలో పగిలిపోయిన రోడ్లు, తుప్పు పట్టిపోయి శిథిలమైపోయిన నిర్మాణ సామగ్రి



నీట మునిగిన జీఏడీ టవర్స్ నిర్మాణ ప్రాంతాన్ని చూస్తున్న సీఎం చంద్రబాబు

అమరావతి పునర్నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

పర్యటించారు. నాటి సీఎం జగన్ తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజావేదికను కూల్చివేసి తన విధ్వంసక పాలనను ప్రారంభించారు. చంద్రబాబు కూలిన ప్రజావేదిక ప్రాంతంలో మొదలుపెట్టి రాజధాని ప్రాంతంలోని అన్ని భవన నిర్మాణ సముదాయాలను పరిశీలించారు. అనంతరం సీడ్ యాక్సెస్ రోడ్డులో రైతుల సమక్షంలో మీడియాతో మాట్లాడారు. "అమరావతి మనకు చిరునామా లాంటిది. ఐదు కోట్ల మంది దిశ దశను నిర్ధారించే రాజధాని ఇది. ఉద్యోగం, ఉపాధి కోసం చెన్నై, బెంగళూరు నగరాలకు తరలిపోకుండా సగర్వంగా మా రాజధాని అని చెప్పుకొనే నగరం. మూడు రాజధానులు అంటూ మూడు ముక్కలాట ఆడారు. ఏ ముఖ్యమంత్రి అయినా మంచి పనితో పాలన ప్రారంభిస్తారు. కానీ జగన్ ప్రజావేదిక కూల్చివేతతో పరిపాలన మొదలుపెట్టారు. అమరావతి బ్రాండ్‌ను దెబ్బతీయాలని విషం జల్లే ప్రయత్నాలు చేశారు. ఐదేళ్ల కిందట వేసిన మట్టి ఎక్కడిది అక్కడే ఉంది. చివరికి రాజధాని నిర్మాణానికి తీసుకొచ్చిన పైపులు, ఇసుక, రోడ్డు కంకర కూడా దొంగలించారు. ఒక్క భవనాన్ని కూడా పూర్తిచేసే ఆలోచన చేయలేదు. మొత్తం తిరిగి చూశాక నాకే ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి వచ్చింది. రోడ్లు మధ్యలోనే ఆగిపోయాయి. అధికారులు, ఎమ్మెల్యే ఎమ్మెల్సీల నివాస సముదయాలు నిలిచిపోయాయి శంకుస్థాపన చేసిన ప్రాంతాన్ని చూస్తే బాధ కలిగింది. రాష్ట్రం, దేశం, ప్రపంచంలోని అన్ని ప్రాంతాల నుంచి ప్రార్థనాలయాలు, పవిత్ర నదుల నుంచి పవిత్ర మట్టి, జలాలు తీసుకొచ్చి శంకుస్థాపన చేశాం. ప్రధాని మోదీ పార్లమెంటులోని మట్టితో పాటు యమునా నదీ జలాలు తీసుకొచ్చారు. ఎంత విధ్వంసం చేయాలని ప్రయత్నించినా ఆ మహిమే ఈరోజు రాజధానిని కాపాడింది." అని చంద్రబాబు తెలిపారు.

శ్వేతపత్రం విడుదల చేస్తాం

"రాజధానిని తిరిగి పునర్‌నిర్మించాలి. మరోవైపు ప్రభుత్వ గల్లా పెట్టె ఖాళీ చేశారు. అందుకే అసలు పరిస్థితి ఏంటనేదానిపై త్వరలో శ్వేతపత్రం విడుదల చేస్తాం. ఇది ఏ ఒక్క వ్యక్తికీ చెందిన రాజధాని కాదు. ఇది రాష్ట్ర ప్రజలందరిది. మరోవైపు విశాఖపట్నాన్ని ఆర్థిక రాజధానిగా, కర్నూలును అధునాతన నగరంగా తీర్చిదిద్దుతాం. రాజధాని రాష్ట్రానికి మధ్యలో ఉండాలని శివరామకృష్ణన్ కమిటీ చెప్పింది. అందుకు అనుగుణంగానే అమరావతిని ఎంపిక చేశాం. దీనిపై ఇన్‌సైడింగ్ ట్రేడింగ్ అని, స్విస్ చాలెంజ్ అని అవహేళన చేశారు. ఫలితంగా రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు అయినా రాజధాని ఇదీ అని చెప్పుకోలేని దుస్థితి. అమరావతి కోసం 55వేల ఎకరాలు సేకరించాం. 29వేల మంది రైతుల్లో ఒక్కరూ కోర్టుకు వెళ్లలేదు. రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాల కల్పన తర్వాత మిగిలిన భూములు విక్రయించడం ద్వారా అద్భుతమైన రాజధాని కట్టొచ్చు. అందుకే ఇది సెల్ఫ్ ఫైనాన్స్ సిటీ. రాజధాని నగరం వల్ల ఆదాయం పెరుగుతుంది. తద్వారా అభివృద్ధి కార్యక్రమాలతోపాటు సంక్షేమ పథకాలు అమలుచేయవచ్చు" అన్నారు.

> "నాటి వైసీపీ దుష్ట పాలనలో రాజధాని ప్రాంతం విధ్వంసానికి గురైంది. మూడు రాజధానులు అంటూ మూడు ముక్కలాట ఆడారు. ఏ ముఖ్యమంత్రి అయినా మంచి పనితో పాలన ప్రారంభిస్తారు. కానీ జగన్ ప్రజావేదిక కూల్చివేతతో తన పరిపాలనను అప్పట్లో మొదలుపెట్టారు. శంకుస్థాపన చేసిన ప్రాంతాన్ని చూస్తే బాధ కలిగింది."
>
> "ఐదేళ్ల కిందట రాజధాని శంకుస్థాపనకు వేసిన మట్టి ఎక్కడిది అక్కడే ఉంది. చివరికి రాజధాని నిర్మాణానికి తీసుకొచ్చిన పైపులు, ఇసుక, రోడ్డు కంకర కూడా దొంగలించారు. ఒక్క భవనాన్నీ పూర్తిచేసే ఆలోచన చేయలేదు. మొత్తం తిరిగి చూశాక, నాకే ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి వచ్చింది. రోడ్లు మధ్యలోనే ఆగిపోయాయి. అధికారులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాస సముదయాలు నిలిచిపోయాయి" - చంద్రబాబు

తుమ్మ చెట్లు పెంచారు...

"రాజధాని ప్రాంతం మొత్తం తుమ్మచెట్లు పెరిగిపోయాయి. ఇప్పుడు వాటిని తొలగించడమే పెద్ద పని. అందుకే టెండర్లు పిలిచి మొత్తం తుమ్మ చెట్లు తొలగించాలని ఆదేశించా. అప్పుడే ఏది ఎక్కడుందనే క్లారిటీ వస్తుంది. రాజధాని ప్రాంతం మొత్తాన్ని అతలాకుతలం చేశారు. మౌలిక సదుపాయాల నిర్మాణ సామగ్రిని దొంగలించారు. పైగా అసాంఘిక కార్యకలాపాలు, రౌడీయిజానికి అడ్డాగా మార్చారు. ఇకపై ఈ ప్రాంతంలో తప్పుడు పని చేసేవారిని నిర్మొహమాటంగా అణచివేస్తాం. గతంలో ముఖ్యమంత్రులు మంచి చేయలేకపోతే వదిలేసేవారు. అంతేగానీ ఉన్నవాటిని చెడగొట్టే ప్రయత్నం చేయలేదు. కానీ జగన్ అందుకు భిన్నంగా మొత్తం నాశనం చేశారు" అని చంద్రబాబు ఆగ్రహించారు.

పూర్వవైభవం తీసుకొస్తాం

"ఎక్కడికక్కడ నిలిచిపోయిన అమరావతికి తిరిగి పూర్వవైభవం తీసుకొస్తాం. ఓవైపు ఖజానా ఖాళీ అయినందున ఎలా చేస్తే బాగుంటుందో పరిశీలిస్తాం. ఇందుకోసం ప్రజల అభిప్రాయాలు కూడా తీసుకుంటాం. అందరి అభిప్రాయాలు తీసుకున్న తర్వాత మళ్లీ పని ప్రారంభిస్తాం. రాజధాని నగరంలో భూ రికార్డులు ఏంచేశారో చూడాలి. ప్రజావేదికపై ఏం చేయాలో చూడాలి. జపాన్‌లో హిరోషిమా, నాగసాకి నగరాలను... అణుబాంబులు వేసిన తర్వాత విధ్వంసానికి ప్రతీకగా అలాగే ఉంచారు. ఇప్పుడు ప్రజావేదికను కూడా అలాగే ఉంచాలా? లేదా? అనేది చూస్తాం. గత ప్రభుత్వంలో కొందరు అధికారులు అడ్డగోలుగా పనిచేసి ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయారు. ఎడాపెడా అప్పులు చేశారు. చివరికి భవిష్యత్తులో వచ్చే మద్యం ఆదాయం చూపి కూడా అప్పులు తీసుకొచ్చారు" అని చంద్రబాబు మండిపడ్డారు..

జగన్‌కు దేవుడి స్క్రిప్టే

"అమరావతి రైతులు 1631 రోజులు ఉద్యమం చేశారు. వాటిలో ఒక్కో సంఖ్య కూడితే 11 వస్తుంది. చివరికి జగన్‌కు కూడా 11 సీట్లే వచ్చాయి అంటే ఇది దేవుడి స్క్రిప్టే. మనది చారిత్రక విజయం. దేశ చరిత్రలో ఇలాంటి ఘన విజయం లేదు. అయితే వైసీపీకి ఓట్లు వేసిన వారు కూడా ఆలోచించుకోవాలి. ఇలాంటి వారు రాజకీయాలకు అర్హులా? అని చూడాలి. దీనిపై విస్తృత చర్చ జరగాలి. నన్ను అరెస్టు చేసినప్పుడు 80 దేశాల్లో నిరసనలు తెలిపారు. అది చూసి మన తెలుగు వారు ఇన్ని దేశాల్లో ఉన్నారా అని ఆశ్చర్యపోయా. అంటే అదంతా అభివృద్ధి జరగడం వల్ల సాధ్యమైంది. జగన్ నుంచి దేవుడే అమరావతి కాపాడాడు" అని చంద్రబాబు అన్నారు.

ఇవి వ్యక్తిగత సంపదలు కావు

"రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టులు వ్యక్తిగత సంపదలు కావు. ఇవి రాష్ట్ర ప్రజలందరికీ ఉపయోగపడేవి. పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి, నదుల అనుసంధానం చేసుకుంటే రాయలసీమ రతనాల సీమ అవుతుంది. అలాంటి పోలవరం ప్రాజెక్టును గోదావరిలో కలిపే పరిస్థితి తీసుకొచ్చారు. ఆ ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరు అందుతుంది. అమరావతిని పూర్తి చేస్తే అందరికీ ఉపయోగపడుతుంది. అందువల్ల వీటిని ఏ ఒక్కరి ఆస్తిగా భావించకూడదు" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

బాబును చూడగానే జేజేలు..

ఐదేళ్ల నుంచి రాజధాని కోసం పూజలు చేస్తున్నామని, ఇప్పటికి అవి ఫలించాయని ఆయనతో వారు అన్నారు. పక్కనే ఉన్న శిలాఫలకాలను ఆయన చూశారు. అక్కడ రైతులు, మహిళలు జైజై బాబు అని నినాదాలు చేశారు. ఆయన దగ్గరకు వచ్చి మహిళలు తమ సంతోషం తెలుపుతూ మాట్లాడారు. కానీ, సీఎం ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఆ ప్రదేశాన్ని చూసి ఒకింత కలత చెందినట్లుగా ఆయన కనిపించారు. ఆ తర్వాత జరిగిన ప్రెస్‌మీట్‌లో.... అమరావతి ప్లాన్ ఫొటోను చూపించారు. తర్వాత రాయపూడిలో ఓ అపార్ట్‌మెంట్ పైకి ఎక్కి అమరావతిలో పెరిగిన తుమ్మచెట్లను, ఇతర నిర్మాణాలను పరిశీలించారు. హైకోర్టు సమీపంలో నిలిచిపోయిన జడ్జిల నివాస భవనాలను పరిశీలించారు. ప్రభుత్వ కార్యదర్శుల భవన సముదాయాలను పరిశీలించుకుంటూ సెక్రటేరియట్ భవన నిర్మాణ ప్రదేశానికి చంద్రబాబు వచ్చారు. అక్కడ నీట మునిగి ఉన్న పునాదులను చూసి తీవ్ర ఆవేదనకు గురయ్యారు. అధికారులను అడిగి నిర్మాణ పరిస్థితులను తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల భవనాలు 80శాతం, ఏఐఎస్ అధికారుల భవనాలు 70శాతం పూర్తయ్యాయని అధికారులు వివరించారు. అక్కడి నుంచి గ్రూప్- 4 ఉద్యోగుల భవన సముదాయం, న్యాయమూర్తులు, మంత్రుల గృహ సముదాయాలను పరిశీలించుకుంటూ నిర్మాణంలో ఉన్న సీఆర్డీఏ కేంద్ర కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ప్రజలను, మీడియాను ఉద్దేశించి భావోద్వేగంతో ప్రసంగించారు. ప్రజలు, మీడియా నుంచి ఆయన సలహాలు, సూచనలు కోరారు. పర్యటన దారిపొడవునా విపరీతంగా తుమ్మచెట్లు పెరిగి అడవిని తలపించింది. దీంతో వెంటనే తుమ్మచెట్ల తొలగింపునకు ఆదేశాలు జారీచేశారు. ఈ పర్యటనలో సీఎం చంద్రబాబు వెంట మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, కొలికపూడి శ్రీనివాస్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, ఉన్నతాధికారులు అనిల్‌కుమార్ సింఘాల్, కాటమనేని భాస్కర్, వివేక్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి ఉన్నారు.



నిర్మాణం సగంలో ఆగిపోయిన హైకోర్టు న్యాయమూర్తుల భవనాలను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

బరువెక్కిన మనసుతో..

- రాజధాని దుస్థితికి కలత చెందిన సీఎం
- ప్రజావేదికతో మొదలైన పర్యటన
- నీళ్లలో నానుతున్న సెక్రటేరియట్ పునాదులను చూసి ఆవేదన

అమరావతి, గుంటూరు, జూన్ 20 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం రాజధానిలో పర్యటించారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే తొలుత పోలవరం ప్రాజెక్టును సందర్శించిన ఆయన, ఆ వెంటనే రాజధాని అమరావతిలో పర్యటించారు. తన రెండు కళ్లుగా భావిస్తున్న పోలవరం, అమరావతి పరిస్థితిని చూసి ఆయన తీవ్ర ఆవేదనకు గురయ్యారు. బరువెక్కిన మనసుతో ఆయన అమరావతిలో పర్యటించారు. సీడ్ క్యాపిటల్ లోని అడుగడుగూ ఆయన తిరిగి పరిశీలించారు. సీడ్ యాక్సిస్ రోడ్డు మీదుగా ఉద్దండరాయునిపాలెం చేరుకుని అక్కడ ప్రధాని నరేంద్రమోదీ శంకుస్థాపన చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. అమరావతి కోసం దేశంలోని అన్ని దేవాలయాలు, మసీదులు, చర్చిల నుంచి తెచ్చి పవిత్రమైన మట్టి, అన్ని నదుల నుంచి తెప్పించిన పుణ్య జలాలలో ఏర్పాటు చేసిన మట్టి దిమ్మెను ఆయన దర్శించుకుని సాష్టాంగ నమస్కారం చేశారు. ప్రధాని ఆవిష్కరించిన శిలాఫలకాలు, యజ్ఞశాలలు, రాజధాని నమూనా మాస్టర్ ప్లాన్ రూపొందించిన ప్రదర్శన శాలను ఆయన సందర్శించారు. అక్కడ జరిగిన విధ్వంసాన్ని చూసి ఆవేదన చెందారు. ఆ పక్కనే యజ్ఞశాలను పరిశీలించి అక్కడ రాజధాని మహిళలు ఇచ్చిన వస్త్రాలు స్వీకరించారు.



ఏ రూల్ ప్రకారం ప్రజావేదిక కూల్చారు?

- అధికారులను నిలదీసిన ముఖ్యమంత్రి

ఐదేళ్ల తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో పర్యటించారు. ఆయన ఇంటి పక్కనే కూల్చివేసిన ప్రజావేదికతో తన పర్యటన మొదలుపెట్టారు. అక్కడి శకలాలను పరిశీలించారు. ఏ రూల్ ప్రకారం ప్రజావేదికను కూల్చివేశారని సీఆర్డీఏ అధికారులను ప్రశ్నించారు. 'ప్రజావేదికను నిబంధనల ప్రకారం నిర్మించాం. మీరు ఏ రూల్ ప్రకారం కూల్చివేశారో చెప్పండి. దీనికి కాంపిటేటివ్ అథారిటీ ఎవరు?' అని నిలదీశారు. పై అధికారులు ఆదేశాలిచ్చారని అక్కడున్న అధికారులు సమాధానమిచ్చారు. రాతపూర్వకంగా ఇచ్చారా? మౌఖికంగా ఇచ్చారా? అని ప్రశ్నించగా మౌఖిక ఆదేశాలు వచ్చాయి అని బదులిచ్చారు. ఏ రూల్ ప్రకారం కూల్చారనేదానికి మాత్రం అధికారులు సమాధానం చెప్పలేకపోయారు. అనంతరం శకలాల మధ్యలోకి చంద్రబాబు వెళ్లి చూశారు. ప్రజావేదిక నమూనా చిత్రాన్ని చూసి ఆవేదన వ్యక్తంచేశారు.

జగన్ అధికారంలోకి రాగానే కూల్చివేసిన ప్రజా వేదిక శిథిలాల వద్ద సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ

ఈవీఎం ధ్వంసం.. ప్రజాస్వామ్యంపై దాడే!

- 2019లోనూ పిన్నెల్లిపై ఇదే తరహా కేసు
- హైకోర్టుకు ఈసీ తరఫు న్యాయవాది నివేదన
- ముగిసిన వాదనలు.. తీర్పు రిజర్వ్
- పిన్నెల్లికి అరెస్టు నుంచి రక్షణ పొడిగింపు



అమరావతి, జూన్ 20(ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రంలో ఈవీఎంను ధ్వంసం చేయడం ప్రజాస్వామ్యంపై దాడేనని ఎన్నికల కమిషన్ (ఈసీ) స్పష్టం చేసింది. మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ముందస్తు బెయిల్ మంజూరు చేయొద్దని కోరింది. మే 13న పోలింగ్ సందర్భంగా పాల్వాయ్‌గేటు పోలింగ్ బూత్‌లో ఈవీఎం, వీవీప్యాట్ ధ్వంసం, అడ్డుకోబోయిన టీడీపీ ఏజెంట్ శేషగిరిరావుపై దాడి, నాగమణి అనే మహిళను దూషించిన కేసులతో పాటు పోలింగ్ మర్నాడు కారంపూడి సీఐ నారాయణ స్వామిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ పిన్నెల్లి దాఖలు చేసిన పిటిషన్లపై గురువారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. అనంతరం తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు ప్రకటించారు. పిటిషనర్‌కు అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ముందస్తు బెయిల్‌ను తీర్పు వెల్లడించేంతవరకు పొడిగించారు. గురువారం పిటిషన్లు విచారణకు వచ్చినప్పుడు పిన్నెల్లి తరఫు సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఈవీఎం ధ్వంసానికి సంబంధించిన టీడీపీ నేత లోకేశ్ పోస్టు చేసిన వీడియో ఆధారంగా ఈసీ పిన్నెల్లిపై కేసు నమోదు చేశారని.. ఆ వీడియో మార్ఫింగ్ చేశారేమోనని తమకు అనుమానాలు ఉన్నాయని తెలిపారు. పోలీసుల తరఫు న్యాయవాది ఎస్.అశ్వనీకుమార్ వాదనలు వినిపిస్తూ.. తమవద్ద ఉన్న వీడియో ఫుటేజ్ ఆధారంగా ఈవీఎం ధ్వంసం చేసింది పిన్నెల్లి రామకృష్ణారెడ్డేనని ఈసీ నిర్ధారించిందన్నారు. 'ఈవీఎం ధ్వంసం ద్వారా పిటిషనర్ ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశారు. ఈ ఘటనను ప్రజాస్వామ్యంపై దాడిగా పరిగణించాలి. ఇదే తరహా వ్యవహారంలో 2019లోనూ ఆయనపై కేసు నమోదైంది. పోలింగ్ తర్వాతి రోజు కారంపూడిలో పిటిషనర్, ఆయన అనుచరులు జరిపిన దాడిలో సీఐ నారాయణస్వామి తలకు తీవ్ర గాయమైంది. కోర్టు విధించిన షరతులను పిన్నెల్లి పాటించలేదు. సాక్షులను బెదిరించారు' అని తెలిపారు. పిన్నెల్లి దాడి బాధితుల తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ.. ఈవీఎం ధ్వంసం చేయడాన్ని అడ్డుకోబోయిన టీడీపీ ఏజెంట్ శేషగిరిరావుపై దాడిచేయాలని పిన్నెల్లి తన అనుచరులను ప్రేరేపించారన్నారు. ఈవీఎం ధ్వంసం వ్యవహారంలో పిటిషనర్‌కు భయపడి ఏ అధికారి, వ్యక్తి కేసు పెట్టేందుకు కూడా ముందుకు రాలేదన్నారు. పిన్నెల్లి నేరచరిత్రను పరిశీలిస్తే.. ఆయన్ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. ముందస్తు బెయిల్ పొందేందుకు ఆయన ఏమాత్రం అర్హుడు కాదన్నారు.

ఏజీగా దమ్మాలపాటి బాధ్యతల స్వీకారం

అమరావతి, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అడ్వకేట్ జనరల్(ఏజీ)గా సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఏజీగా బాధ్యతలు చేపట్టేందుకు హైకోర్టుకు వచ్చిన ఆయనకు వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం సతీసమేతంగా కార్యాలయంలో ఆయన పూజలు నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, హైకోర్టు న్యాయవాదుల సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. నూతన ఏజీకి ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, న్యాయవాదులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మళ్లీ పట్టాలపైకి అమరావతి ఔటర్ ప్రాజెక్టు

- రంగం సిద్ధం చేస్తోన్న ఆర్అండ్‌బీ

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

అమరావతి రాజధాని ప్రాంతంలోని 87 గ్రామాల ప్రజలకు శుభవార్త. అమరావతి ఔటర్ రింగ్ (ఏఓఆర్)రోడ్డు ప్రాజెక్టు మళ్లీ పట్టాలెక్కనుంది. 189 కి.మీ. పరిధిలో నాలుగు వరసల్లో నిర్మించాలనుకున్న ప్రతిపాదనను మళ్లీ తెరపైకి తీసుకురాబోతున్నారు. ఈ ప్రతిపాదనలను రోడ్లు భవనాల శాఖ సిద్ధం చేస్తోంది. ఆర్అండ్‌బీ ఉన్నతాధికారవర్గాలు ఈ విషయాన్ని ప్రాథమికంగా నిర్ధారించాయి. త్వరలో సీఎం చంద్రబాబు వద్ద సమావేశం జరగనుందని, ఔటర్ ప్రాజెక్టుపై ప్రతిపాదనలు సమర్పిస్తామని సీనియర్ అధికారి ఒకరు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. 189 కి.మీ. పొడవైన ఔటర్ రింగ్ రోడ్డు ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలోని 87 గ్రామాలను అనుసంధానించేలా, 150 మీటర్ల వెడల్పుతో, నాలుగు వరసల్లో రహదారి నిర్మించేలా గతంలోనే ఆర్అండ్‌బీ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. పాత అలైన్‌మెంట్ ప్రకారమే ఔటర్‌ను కొనసాగించేలా ప్రతిపాదిస్తామని అధికారవర్గాలు తెలిపాయి. అమరావతిగా రాజధానికి ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మిస్తామని 2015లోనే చంద్రబాబు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆర్వీ అసోసియేట్స్‌తో సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) రూపొందించారు. 3,400 హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉంటుందని, ఇందుకు రూ.4 వేల కోట్లు ఖర్చుకానుందని అంచనా వేశారు. భూ సేకరణ, నిర్మాణం కోసం పూర్తిగా రూ.17,500 కోట్లు ఖర్చవుతుందని లెక్కలు వేశారు. నిధులు ఇచ్చేందుకు కేంద్రం కూడా అంగీకరించింది. భారతమాల ప్రాజెక్టు కింద ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు కేంద్రం నిధులు కేటాయించింది. అయితే, జగన్ సర్కారు వచ్చాక అమరావతి రాజధానితోపాటు, ఆ పేరిట ఉన్న ఇతర కీలకమైన మౌలికరంగ ప్రాజెక్టులను నిలిపివేసింది. అనంతపురం - అమరావతి ఎక్స్‌ప్రెస్ వేతోపాటు, అమరావతి ఔటర్‌రింగ్‌రోడ్డును కూడా అడ్డుకున్నారు. కేంద్రం నిధులు ఇచ్చేందుకు పలుమార్లు సంసిద్ధతను వ్యక్తం చేసినా జగన్ సర్కారు అడ్డుకుంది. ఇప్పుడు ఎన్డీయే కూటమి ప్రభుత్వం వచ్చింది. రాజధాని నిర్మాణ పనులు జోరందుకున్నాయి. దీంట్లో భాగంగా ఔటర్‌రింగ్ రోడ్డు ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కించాలని ఆర్అండ్‌బీ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. పెరిగిన ధరలకు అనుగుణంగా భూ సేకరణతోపాటు, అంచనాలూ భారీగా పెరగనున్నాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో రహదారి నిర్మాణం చేయాలనుకుంటే భూసేకరణకు, సివిల్ వర్క్‌లకు ఎంత ఖర్చుకానుందో అంచనాయనున్నారు. మరోసారి డీపీఆర్ రూపొందించనున్నారు.



జస్టిస్ శేషసాయిని సన్మానిస్తున్న హైకోర్టు న్యాయవాదుల సంఘ సభ్యులు

జస్టిస్ ఏవీ శేషసాయికి ఘన సన్మానం

అమరావతి, జూన్ 20(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తిగా ఇటీవల పదవీ విరమణ చేసిన జస్టిస్ ఏవీ శేషసాయిని హైకోర్టు న్యాయవాదుల సంఘ సభ్యులు గురువారం ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి, జ్ఞాపికలు అందజేశారు. అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ.. జస్టిస్ ఏవీ శేషసాయి అందించిన న్యాయసేవలను కొనియాడారు. జస్టిస్ శేషసాయి మాట్లాడుతూ... న్యాయవ్యవస్థ భవిష్యత్తు యువన్యాయవాదులపై ఆధారపడి ఉందన్నారు. వ్యవస్థకు మంచిపేరు తెస్తారని ఆశిస్తున్నానన్నారు. సీనియర్ న్యాయవాదులను గౌరవించాలని వారికి సూచించారు. తనపై ప్రేమాభిమానాలు చూపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీహరి, ఇతర కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. మరోవైపు ఏపీ హైకోర్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అక్కెన వేణుగోపాల్ ఆధ్వర్యంలో జస్టిస్ ఏవీ శేషసాయిని ఘనంగా సన్మానించారు. ఉపాధ్యక్షుడు సురేంద్రనాథ్, కార్యదర్శి ఎలీషా, సంయుక్త కార్యదర్శి జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏసీబీ నుంచి మాజీ డీజీపీ అవుట్

(మొదటి పేజీ తరువాయి)

ఏ మాత్రం ప్రాధాన్యం లేని ప్రింటింగ్-స్టేషనరీ విభాగం కమిషనర్‌గా బదిలీచేసింది. ఏపీఎస్పీ అదనపు డీజీ అతుల్ సింగ్‌కు అదనంగా ఏసీబీ బాధ్యతలు అప్పగించింది. ఇక జగన్ ప్రభుత్వ ప్రోద్బలంతో ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు పెట్టడంతో పాటు నాటి ఎంపీ రఘురామరాజుపై కస్టడీలో థర్డ్ డిగ్రీ ప్రయోగించిన సీఐడీ మాజీ చీఫ్, ప్రస్తుతం అగ్నిమాపక సర్వీసుల డీజీగా ఉన్న పీవీ సునీల్‌కుమార్‌ను కూడా తప్పించింది. ఆయనకు ఏ పోస్టూ ఇవ్వకుండా సాధారణ పరిపాలన విభాగం (జీఏడీ)లో రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. జగన్‌పై స్వామిభక్తితో టీడీపీ, జనసేన నేతలు, శ్రేణులను అమితంగా వేధించి పక్కా వైసీపీ కార్యకర్తల్లా పనిచేసిన పోలీసు అధికారులను ఇప్పటికీ కీలక బాధ్యతల్లో కొనసాగించడంపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించడంతో ప్రభుత్వం తాజా చర్యలకు ఉపక్రమించింది. ఫైర్ విభాగం అదనపు బాధ్యతలను శాంతిభద్రతల అదనపు డీజీ శంఖబ్రత బాగ్చీకి అప్పగించింది. అలాగే విపక్ష నేతగా ఉన్నప్పుడు చంద్రబాబు కుప్పం పర్యటనను అడ్డుకుని.. లోకేశ్ యువగళం పాదయాత్రకు అడుగడుగునా అడ్డంకులు కల్పించిన నాటి చిత్తూరు ఎస్పీ, జగన్‌కు వీరభక్తుడిగా పనిచేసిన రిశాంత్‌రెడ్డిపైనా వేటు వేసింది. కౌంటర్ ఇంటెలిజెన్స్ ఎస్పీగా ఆయన్ను తొలగించారు. ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ ఎస్పీగా అదనపు బాధ్యతల నుంచీ ఆయన్ను రిలీవ్ చేసి.. జీఏడీలో రిపోర్టు చేయాలని సీఎస్ ఆదేశించారు. ఈ రెండు పోస్టుల భర్తీకి డీజీపీ తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కొద్ది రోజుల్లో మరికొందరు ఐపీఎస్ అధికారులను బదిలీ చేసే అవకాశముంది.



బీజేపీ ప్రజాప్రతినిధుల సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న పురందేశ్వరి

అభివృద్ధి-సంక్షేమం కోసమే చరిత్రాత్మక తీర్పు

- ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే బాధ్యత కూటమిదే
- అభినందన సభలో బీజేపీ ప్రజాప్రతినిధుల స్పష్టీకరణ

అమరావతి, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జగన్ అరాచక, అవినీతి, అస్తవ్యస్త పాలనకు చరమగీతం పాడి.. అభివృద్ధితో కూడిన సంక్షేమం కోరుకుంటూ ఎన్నికల్లో చరిత్రాత్మక తీర్పునిచ్చిన ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాల్సిన బాధ్యత కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంపై ఉందని బీజేపీ ప్రజాప్రతినిధులు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేసి గెలుపొందిన ఎంపీలు, ఎమ్మెల్యేలకు గురువారం సాయంత్రం విజయవాడలో అభినందన సభ ఏర్పాటు చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, నరసాపురం ఎంపీ, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర వైద్య ఆరోగ్య మంత్రి వై.సత్యకుమార్ యాదవ్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, బీజేపీ ఎమ్మెల్యేలు సుజనాచౌదరి (విజయవాడ పశ్చిమ), పార్థసారథి (ఆదోని), ఆదినారాయణరెడ్డి (జమ్మలమడుగు), నల్లమిల్లి రామకృష్ణారెడ్డి (అనపర్తి), ఈశ్వరరావు (ఎచ్చెర్ల), కామినేని శ్రీనివాస్ (కైకలూరు)లను బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ.. జగన్‌లా బటన్ నొక్కడం ఒక్కటే కాదని, రోడ్లు, విద్య, వైద్యం, పరిశ్రమలు తదితర రంగాల్లో అభివృద్ధితో కూడిన సంక్షేమం కావాలని ప్రజలు తమ తీర్పు ద్వారా చెప్పారని తెలిపారు. జగన్ అనే రాజకీయ నరకాసురుడిని సంహరించి జనం జూన్‌లోనే దీపావళి తీసుకొచ్చారని మంత్రి సత్యకుమార్ అన్నారు. శ్రీనివాసవర్మ మాట్లాడుతూ.. బీజేపీ సిద్ధాంతాలను నమ్ముకుని పనిచేస్తే సామాన్య కార్యకర్తకు కూడా గుర్తింపు లభిస్తుందని చెప్పడానికి తానే ఉదాహరణ అన్నారు. నరసాపురం పార్లమెంటు నియోజకవర్గంలోని టీడీపీ అభ్యర్థులందరినీ సమన్వయం చేసి తన గెలుపు కోసం కృషి చేసిన చంద్రబాబుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు.

ఇసుక, మద్యంలో వేల కోట్లు లూటీ

- విచారణ జరపాలని బాబుకు పురందేశ్వరి వినతి
- ఉండవల్లిలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలకు సీఎం విందు

అమరావతి, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో ఇసుక, మద్యంలో రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేశారని బీజేపీ ఆరోపించింది. ఆయన ప్రత్యక్ష ప్రమేయంతోనే వీటిలో భారీ కుంభకోణాలు జరగాయని తెలిపింది. దీనిపై విచారణ జరపాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆయనకు రెండు వేర్వేరు లేఖలు అందజేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి భూమి కేటాయించాలని కోరుతూ మరో లేఖ అందించారు. పురందేశ్వరి, కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ సహా రాష్ట్రంలో గెలిచిన బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలకు చంద్రబాబు గురువారం రాత్రి ఉండవల్లిలోని తన నివాసంలో విందు ఇచ్చారు. వారందరికీ శాలువాలు కప్పి, సత్కరించారు. కేంద్రంలో, రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు, అభివృద్ధికి సంబంధించిన అంశాలపై వారంతా కొంతసేపు మాట్లాడుకున్నారు. చంద్రబాబు సతీమణి, తన చెల్లెలు భువనేశ్వరి పుట్టిన రోజును పురస్కరించుకుని, పురందేశ్వరి ఆమెను కలిసి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

మంత్రులకు అభినందనలు.. వినతులు

మంత్రి లోకేష్‌కు..



చిట్టినగర్: మంత్రి నారా లోకేష్‌ను గురువారం మంగళగిరి కార్యాలయంలో వీఎంసీ మినిస్టరియల్ అండ్ ఆల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నేతలు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎస్.వి.ఎస్ చలం, జాయింట్ సెక్రటరీ టీ.ప్రతాప్‌కుమార్, చీఫ్ అడ్వైజర్ రమణారెడ్డి, తదితరులు ఉన్నారు.

మంత్రి నారాయణకు..



ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పీ నారాయణను గురువారం లెనిన్ సెంటర్ సీఆర్‌డీఏ కార్యాలయంలో ఏపీ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అసోసియేషన్ నేతలు కలిసి అభినందనలు తెలిపి వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేశారు. అసోసియేషన్, ఉద్యోగులకు ఎలాంటి సమస్యలున్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని మంత్రి నారాయణ సూచించారు. దీనిపై అసోసియేషన్ సంతోషం వ్యక్తం చేశారు. మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ అధ్యక్షులు కె. వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు సత్తార్, జనరల్ సెక్రటరీ పీ.మోహన్‌బాబు, కోశాధికారి వెంకటకష్ణ, అసోసియేషన్ ఉపాధ్యక్షులు హరిదాసు. జోనల్ ప్రెసిడెంట్ వసీం బేగ్, సభ్యులు రంగప్రసాద్, మధుసూదన్, వెంకటరావు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పయ్యావులకు..



వన్‌టౌన్: రూ.వెయ్యిలోపు ఖరీదున్న పాదరక్షలపై 12శాతం జీఎస్టీని తొలగించాలని ఏపీ ఫుట్‌వేర్ అసోసియేషన్ ప్రతినిధి బృందం గురువారం రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్‌అధ్యక్షుడు సీహెచ్ అరుణ్ కుమార్‌తో పాటు ఎం.ఈశ్వరరావు, హెచ్. చంద్రశేఖర్ ఫుట్‌వేర్ రంగం ప్రస్తుత పరిస్థితిని గురించి మంత్రికి వివరించారు. రూ.వెయ్యిలోపు ఖరీదు గల పాదరక్షలకు జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికు తగ్గించాలని ఈమేరకు జీఎస్టీ కౌన్సిల్‌కు సిఫారసు చేయాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ వెంటనే తాను ఈ ప్రతిపాదనపై కౌన్సిల్‌కు సిఫారసు చేస్తానన్నారు.

మంత్రి పార్థసారథికి..



ఉయ్యూరు: తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రారంభించిన టిడ్కో గృహనిర్మాణం త్వరగా పూర్తిచేసి అర్హులైన పేదలకివ్వాలని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. గృహనిర్మాణ శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన కొలుసు పార్థసారథిని గురువారం క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పేదవారి సొంతింటికల సాకారం చేయాలన్న సంకల్పంతో చంద్రబాబు రాష్ట్రవ్యాప్తంగా కొన్ని లక్షల ఇళ్లు నిర్మించారని తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటికి కనీస వసతులు కల్పించకుండా పాడుబెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని త్వరగా నిర్మాణపనులు పూర్తిచేసి అర్హులకు అందజేసేలా చర్యలు చేపట్టాలన్నారు. జంపన వీరశ్రీనివాస్, రాజులపాటి ఫణి, అజ్మతుల్లా, వీరస్వామి పార్థసారథిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి..

బస్టేషన్: పండిట్ నెహ్రూ బస్టేషన్‌లో పరిశీలనకు వచ్చిన రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని గురువారం ఆర్టీసీ టీసీ ఎం ప్లాయిస్ సంక్షేమ సంఘం నేతలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగు చ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మా ట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అన్ని అసోసియేషన్‌లతో మాట్లాడుతామని సూచనలు, సలహాలు తీసుకుంటామన్నారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌పీ శేషగిరిరావు, సలహాదారులు ఎం.తిరుపతిరావు, ఈ.కృష్ణ, వి.జే రత్నం, టి.భరణి పాల్గొన్నారు.

దురాక్రమణలు అడ్డుకోండి..!

● ఎమ్మెల్యే బొండాకు స్థానికుల వినతి

మధురానగర్: సెంట్రల్‌లోని 29వ డివిజన్ మధురానగర్, 1వ డివిజన్ గుణదల డివిజన్‌కు అనుకుని బీఆర్‌టీఎస్ రోడ్డులో రైవస్ కాల్వపక్కన స్థలాల ఆక్రమణలపై ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. కోట్ల రూపాయల విలువైన ఈ స్థలాలపై ఎన్నికల ముందు వైకాపా నేతల కన్ను పడటం, కొందరు వాటిని ఆక్రమించడం, మీడియాలో రావడంతో ఆక్రమణదారులు వెనక్కుతగ్గారు. కానీ ఇంకా ఆయా స్థలాలు వారి చేతుల్లోనే ఉన్నాయని, వాటిని ఖాళీ చేయించి రక్షణగా ఫెన్సింగ్ వేయించాలని కోరుతున్నారు. 29, 1వ డివిజన్ మధ్యలో బీఆర్‌టీఎస్‌రోడ్డు వంతెన పక్కన కాల్వ గట్టున సుమారు 3వేల గజాల స్థలం ఉంది. దీనిపై గత ప్రభుత్వ హయాంలో టీడీపీ సానుభూతిపరుడిగా ఉన్న ఒక ప్రార్థనా మందిరం నిర్వాహకుడి కన్ను పడింది. ఆ విషయం తెలిసి అప్పటి మధురానగర్ టీడీపీ కార్పొరేటర్ అత్యూరి రవి కుమార్ సాగనివ్వలేదు. అక్కడ ప్రజలకు ఉపయోగపడే నిర్మాణాలు చేపట్టాలని పట్టుపట్టాడు. దీంతో అవ్వక్తి వైసీపీలోకి వెళ్లిపోయాడు. అనంతర కాలంలో వంగవీటి మోహన రంగా పేరుతో కమ్యూనిటీ హాలు నిర్మించారు. వెనుక కాస్తదూరంలో వీఎంసీ పబ్లిక్‌టాయ్‌లెట్స్ ఉన్నాయి. వెలంపల్లి శ్రీనివాసరావు అభయంతో వెలమ సంక్షేమ సంఘం ఈ ఖాళీ స్థలంలో రేకుల షేడ్ వేయడానికి సరంజామా తెచ్చి పనులు మొదలు పెట్టడం, 1వ డివిజన్ కార్పొరేటర్ ఉద్దంటి సునీత భర్త సురేష్‌కు తెలియడంతో హుటాహుటిన వచ్చి పనులు ఆపించారు. ఈ స్థలంలో రెండు వర్గాలు ఇప్పటికీ పట్టు వీడటం లేదు. ఇదే తరహాలో పడవల రేవు సబ్ స్టేషన్ వెనుక హోర్డింగుల వెనుక కూడా మరో వెయ్యి గజాలస్థలాన్ని ఇదే రీతిలో కబ్జాకు ప్రయత్నం చేశారు. రేకుల షేడ్, గదుల నిర్మాణం కూడా చేపట్టారు. విషయం మీడియాలో రావడంతో ఎక్కడి దొంగలు అక్కడ గప్ చిప్ అయ్యారు. కనుక ప్రస్తుత ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఈ రెండు స్థలాలను కాపాడి స్థానిక ప్రజల అవసరాలకు పనికొచ్చే నిర్మాణాలైన కమ్యూనిటీ హాలు లేదా మినీ రైతు బజార్, సచివాలయం, అన్నాక్యాంటీన్‌కు గానీ కేటాయించాలని కోరుతున్నారు.



కాల్వ ఒడ్డున ఆక్రమించిన స్థలంలో నిర్మాణానికి తీసిన గుంతలు (ఫైల్ ఫొటో)



సబ్‌స్టేషన్ వెనుక ఆక్రమిత స్థలంలో వేసిన షెడ్ (ఫైల్ ఫొటో)



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్న సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల ప్రతినిధులు, ప్రిన్సిపాల్ రామోజీరావు

ప్రజారోగ్యంపై పరిశోధనలు అవసరం

● సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల ప్రతినిధి గేల్ గిబ్సన్ గేయిల్

గన్నవరం, జూన్ 20: దంత వైద్య విద్యార్థులు ప్రజారోగ్యంపై విస్తృత పరిశోధనలు చేయాలని న్యూయార్క్‌కు చెందిన సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల ప్రతినిధి గేల్ గిబ్సన్ గేయిల్ అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ డెంటల్ కళాశాలలో గురువారం హెల్త్ ఇన్‌ఫర్మేటిక్స్, హెల్త్ మేనేజ్‌మెంట్ కోర్సులపై అవగాహన సదస్సు జరిగింది. దీనిలో న్యూయార్క్‌కు చెందిన సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల ప్రతినిధులు గేల్ గిబ్సన్ గేయిల్, మిచెల్ స్టీవెన్, కోర్ని ఇన్నిస్, సైమన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పబ్లిక్‌హెల్త్ కాపాడటంలో విద్యార్థి దశ నుంచే పరిశోధనలు విస్తృతం కావాలన్నారు. తమ కళాశాలలో అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. బీడీఎస్ చేశాక మాస్టర్స్‌కు విదేశాల్లో మంచి అవకాశాలున్నాయన్నారు. తమ కళాశాలతో న్యూయార్క్ సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాలకు ఎంవోయూ కుదిరినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు తెలిపారు. రీసెర్చ్‌లో ప్రతిభ చూపిన 15మంది విద్యార్థులకు, గైడ్‌గా ఉన్న అధ్యాపకులకు రీసెర్చి గ్రాంటు నుంచి స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఏవో వై.మధుసూధనరావు, డెంటల్ ఎడ్యుకేషన్ కన్వీనర్ డాక్టర్ కె.అజయ్ బెనర్జీ, హెచ్‌వోడీలు రవిచంద్ర, ఎ.కాళేశ్వరరావు, కోటేశ్వరరావు, ప్రభాత్, శ్రీహర్ష, సునీల్ చంద్ర, కిరణ్‌కుమార్; సురేష్, జీఎం నాయుడు పాల్గొన్నారు.

టీడీపీ నేత తమ్ముడిపై

వైసీపీ కార్పొరేటర్ కొడుకు దాడి..!

రాణిగారితోట, జూన్ 20: సంబంధం లేని వివాదంలో తలదూర్చి టీడీపీ నేత తమ్ముడిపై వైసీపీ కార్పొరేటర్ తనయుడు, అతడి అనుచరులు దాడి చేసిన సంఘటన స్రూబిడ్డి సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. బాధితుడు గోగుల ఏసుబాబు తెలిపిన వివరాల ప్రకారం 16వ డివిజన్ స్క్రూబిడ్డి సమీపంలో టీడీపీ నేత గోగుల రమేష్ తమ్ముడు ఏసుబాబు ఆరేళ్ల నుంచి ఇసుక, ఇటుక, కంకరు వ్యాపారం చేస్తున్నాడు. ఇదే స్థలంలో హోటల్ పెట్టుకునేందుకు కావాలని స్థానిక కార్పొరేటర్ తనయుడు స్థల యజమాని రమేశ్‌తోపాటు ఏసుబాబును అడగ్గా ఇద్దరూ నిరాకరించారు. ఈ నేపథ్యంలో స్థల యజమాని పటమటలో తనకున్న స్థలంలో మట్టి ఉందని తోలాలని చెప్పాడు. ఈ విషయం తెలియని యజమాని సోదరుడు డివిజన్‌లో అదే వ్యాపారం చేసే ఆంజనేయులుకు చెప్పడంతో ఆంజనేయులు ఆ మట్టిని తొలగించాడు. ఈ విషయం తెలుసుకున్న ఏసుబాబు.. ఆంజనేయులను ప్రశ్నించడంతో స్వల్ప వివాదం జరిగింది. దీన్ని అసరాగా చేసుకున్న కార్పొరేటర్ కొడుకు, ఆంజనేయులుతో పాటు మరికొందరు వ్యక్తులతో వచ్చి ఏసుబాబు కుటుంబసభ్యులపై దాడికి పాల్పడి గాయపరిచారు. పైగా బాధితుడు ఏసుబాబు కుటుంబంపైనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడ సీసీ కెమెరాలుండడం, బాధితుడు వాటిని పోలీసులకు చూపించడంతో నిజాలు తెలుసుకున్న పోలీసులు బాధితుడి నుంచి ఫిర్యాదు స్వీకరించి దర్యాప్తు చేస్తున్నారు.

రెండో కౌన్సెలింగ్‌లో 172 మందికి అడ్మిషన్లు

భారతీనగర్, జూన్ 20: ప్రస్తుత విద్యాసంవత్సరానికి గాను జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో రెండో విడత అడ్మిషన్లకు గురువారం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 191 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 172 మంది విద్యార్థులకు అడ్మిషన్లు కేటాయించినట్టు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ ఎం.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు.

పోలీసులపై రౌడీషీటర్ కుటుంబసభ్యుల దౌర్జన్యం

● సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

వన్‌టౌన్, జూన్ 20: కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధి గొల్లపాలెంగట్టు ప్రాంతానికి చెందిన వైసీపీ నేత, రౌడీషీటర్ బంకా శివ కుటుంబసభ్యులు గురువారం సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసుల విధులకు ఆటంకం కలిగించి వారిని అసభ్యంగా దూషించి సిబ్బందిపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. మహిళా కానిస్టేబుల్ వేపూరి చాందిని ఫిర్యాదు మేరకు పోలీసులు బంకా శివ కుటుంబసభ్యులపై కేసు నమోదు చేశారు. బంకా శివ కుటుంబంలోని దుర్గాసాయి అనే మహిళ ఆరేళ్ల క్రితం ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ వద్ద సుమారు రూ.30వేలు లోన్ తీసుకుంది. అప్పట్నుంచి లోన్ చెల్లించలేదు. పలుమార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. గాంధీనగర్ జింఖానా గ్రౌండ్స్ సమీపంలోని ఆ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ బ్రాంచ్ ఆఫీస్‌లోని ఓ ఉద్యోగి దుర్గాసాయికి ఫోన్ చేసి లోన్ చెల్లించకుంటే ఆమె ఫొటోలను మార్ఫింగ్ చేసి వాట్సాప్‌లోని కాంటాక్ట్‌లకు పెడతానని హెచ్చరించాడు. దీంతో ఆమె ఆ ఉద్యోగికి ఫోన్‌చేసి అడ్రస్ తెలుసుకుని సుమారు 10మందికి పైగా ఆ కార్యాలయం వద్దకు వెళ్లి వీరంగం సృష్టించారు. కార్యాలయంలోని కంప్యూటర్లను నేలకేసి కొట్టారు. ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్‌కు, 112కు ఫోన్ చేశారు. దీంతో సత్యనారాయణపురం పీఎస్ బ్లూకోర్స్, ఒక హోంగార్డు ఫైనాన్స్ కంపెనీ వద్దకు వెళ్లి గొడవపడుతున్న వారిని ఆపి స్టేషన్‌కు తీసుకొచ్చారు. స్టేషన్ వద్ద బంకా విజయ, బంక తులసి, బంకా చాముండేశ్వరి మరికొందరు విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందిపై కేకలేస్తూ అసభ్యకరంగా దూషించి కేకలు వేశారు. అంతటితో ఆగకుండా ఓ మహిళా కానిస్టేబుల్, ఓ మహిళా ఎస్ఐ అడ్డురాగా వారిని పక్కకు తోసేసి బెదిరించారు. ఈ ఘటనలో మహిళా ఎస్ఐకు స్వల్పంగా గాయాలయ్యాయి. మహిళా కానిస్టేబుల్ చాందిని ఫిర్యాదు మేరకు పోలీసులు విజయ, తులసి, చాముండేశ్వరి, మరికొందరిపై కేసు నమోదు చేశారు. ఫైనాన్స్ కంపెనీ, పోలీస్ సిబ్బందిపై దౌర్జన్యం ఘటనలో బంకా శివ ఉన్నట్టు పోలీస్ సిబ్బంది చెబుతున్నారు.

టీటీడీలో జరిగిన అవినీతి, అక్రమాలపై

న్యాయ విచారణ చేయించండి

● కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి

ధర్నాచౌక్, జూన్ 20: తిరుమల తిరుపతి దేవస్థానంలో గతంలో జరిగిన అవినీతి, అక్రమాలపై సీబీసీఐడీతో లేదా రిటైర్డ్ న్యాయమూర్తితో న్యాయ విచారణ జరిపించాలని తమిళనాడు తెలుగు యువశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. టీటీడీ మోసాలకు నెలవుగా మారిందని, తిరుమలలో జరుగుతున్న అన్యాయాలను నిలదీసే హక్కు భక్తులకు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉన్న యాజమాన్యం ఈవో ఆధ్వర్యంలో అవీనితి, అక్రమాలపై విచారించాలన్నారు. గోవిందరాజ సత్రాల పునర్నిర్మాణం కోసం రూ.600 కోట్లను కమీషన్ల కోసం కేటాయించడం దుర్మార్గమన్నారు. టీటీడీ ఇంజనీరింగ్‌కు గతంలో ఏటా రూ.150కోట్ల బడ్జెట్ కేటాయిస్తే ఇటీవల ఏకంగా రూ.1500 కోట్లను కేటయించడపై ప్రభుత్వం విచారించాలన్నారు. స్విమ్స్ ఆసుపత్రిలో రెనోవేషన్ మెయింటెన్స్ పేరుతో సుమారు రూ.200 కోట్లు కేటాయించిన పనులపై దృష్టి సారిస్తే నమ్మలేని నిజాలు, భారీ అవినీతి కుంభకోణం వెలుగులోకి వస్తుందన్నారు. ధర్మకర్తల సమావేశాల్లో ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాలపై సమగ్రంగా దర్యాప్తు చేస్తే నమ్మలేని నిజాలు, అవినీతి, అక్రమాలు వెలుగులోకి వస్తాయన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి చేవూరి శ్రీధర్‌రెడ్డి, బీసీ సంఘం నేత చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌లో

హెచ్‌సీ జన్మదిన వేడుకలు

● కేక్ కటింగ్‌కు హాజరైన రౌడీషీటర్, గంజాయి స్మగ్లర్స్

● హెచ్‌సీపై వేటువేసిన అధికారులు

విజయవాడ, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు, గంజాయి స్మగ్లర్లకు ఖాకీ దుస్తులను చూస్తే వెన్నులో వణుకు పుట్టాలి. పోలీసుల పేరు వింటేనే దుకాణాలు బంద్ చేయాల్సిన వారు ఓ హెడ్‌కానిస్టేబుల్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ఇది బయట ప్రైవేటు ప్రాంతంలో జరిగిన ఘటన కాదు. సాక్షాత్తు పోలీసు స్టేషన్‌లో జరిగిన వేడుకల్లో వారు పాల్గొనడం చర్చనీయాంశమైంది. నున్న పోలీసు స్టేషన్‌లో నాగరాజు అనే హెడ్‌కానిస్టేబుల్ ఐదేళ్లుగా పనిచేస్తున్నాడు. ఇక్కడ సెక్షన్ డ్యూటీలు చేస్తుంటాడు. నేరగాళ్ల కదలికలు, గంజాయి కార్యకలాపాలు చేసే వారి సమాచారం కోసం వేగులను ఏర్పాటు చేసుకోవాల్సిన అతడు స్వయంగా వారితోనే పరిచయం పెంచుకున్నాడు. ఈ పరిచయం స్నేహంగా మారింది. ఈనెల 14న నాగరాజు పుట్టినరోజు రాత్రి 12 గంటలకు స్టేషన్‌లో ఆయన వేడుకలు నిర్వహించుకున్నాడు. రాత్రి విధుల్లోని సిబ్బంది సమక్షంలో కేక్ కటింగ్ చేశాడు. పోలీసు సిబ్బంది కాకుండా ప్రైవేటు వ్యక్తులు ఈ వేడుకల్లో పాల్గొని హడావుడి చేశారు. వారి గురించి ఆరా తీయగా రౌడీషీటర్, గంజాయి స్మగ్లర్లని తేలింది. కొద్దిరోజులపాటు గోప్యంగా ఉన్న ఈ విషయం తాజాగా పోలీసు కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ దృష్టిలో పడింది. దీనిపై విచారణ చేయించగా అదంతా వాస్తవమేనని తేలింది. దీనితో నాగరాజును విధుల నుంచి సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు.

కృష్ణానదిలో అనధికార క్వారీ

● అంతా ఆ ఉద్యోగి కనుసన్నల్లోనే..! ● పట్టించుకోని అధికారులు

రాణిగారితోట: వారధి వద్ద అనధికార ఇసుక క్వారీ ఒక ఉద్యోగి కనుసనల్లో నడుస్తోంది. ఈ విషయం అధికారులకు తెలిసినా తెలియనట్టు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. నిత్యం పదుల సంఖ్యలో ద్విచక్రవాహనాల్లో వచ్చి రాత్రీ, పగలు తేడాలేకుండా బస్తాలతో తోడేస్తున్న రాబందులకు సదరు ఉద్యోగి పూర్తి అండదండలందిచడంతో కృష్ణమ్మ గర్భాన్ని తొలిచేస్తున్నారు. శివుడాజ్ఞ లేనిదే చీమైన కుట్టదన్నట్టు ఆ ఉద్యోగి అండదండలతోనే వారధితో పాటు, మెట్లబజార్, స్వర్గపురి వద్ద ఇసుకాసురులు చెలరేగిపోతున్నారు. పోలీసులు కూడా వారికి తోడవడంతో నిత్యం వందలాది బస్తాల వ్యాపారం గుట్టుగా సాగిపోతోంది. కృష్ణానది పరివాహక ప్రాంతాన్ని కాపాడాల్సిన సదరు ఉద్యోగి తన విధులు ఇక్కడ కాకపోయినా నిత్యం విధులు నిర్వహిస్తూ ఇసుకాసురుల వద్ద దండిగా డబ్బులు వసూలు చేస్తూ జేబులు నింపుకుంటున్నాడు. రాష్ట్రంలో ఇసుక క్వారీలు ఆగిపోవడంతో ఇసుకాసురులు బంగారంతో సమానంగా ఇసుకను అమ్మేస్తున్నారు. యనమలకుదురు, సింగ్‌నగర్, మధురానగర్, గవర్నర్‌పేటతో పాటు నగరంలో ఎక్కడ ఇసుక కావాలన్నా ఆటోల సాయంతో తరలిస్తున్నారు. స్థానికంగా ఇసుక, ఇటుక, సిమెంటు అమ్మే వ్యాపారులతో కుమ్మక్కైన సదరు ఉద్యోగి, ఇసుకాసురులు ఇసుక అడిగిన నిముషాల్లోనే తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. అండగా స్థానిక వైసీపీ కార్పొరేటర్లు, నేతలుండడంతో ఇసుక మాఫియా యథేచ్ఛగా కొనసాగుతోంది. ఇసుక అవసరాన్ని బట్టి, తరలించే దూరాన్ని బట్టి బస్తా ఇసుకను రూ.60 నుంచి రూ.120 వరకు అమ్ముతున్నారు. ఈ తతంగమంతా పై అధికారులకు తెలిసినా తెలియనట్టు నటిస్తున్నారని స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఇలాంటి అనధికార క్వారీలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం: శ్రీనివాస్, ఇరిగేషన్ ఏఈ

ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చింది. తమ ఉద్యోగులు అక్రమార్కులకు అండగా నిలిస్తే చర్యలు తీసుకుంటాం. ఈ విషయాన్ని పైఅధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఆయా ప్రాంతాల్లో సిబ్బందిని నియమించి ఇసుకను తరలించకుండా చర్యలు తీసుకుంటాం.





వాహనాల్లో ఇసుకను తరలిస్తున్న అక్రమార్కులు

కేసుల వివరాల్లో ఎందుకీ గోప్యత..?



సత్యనారాయణపురం, జూన్ 20: స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు, సీఐ చెబితే కానీ కేసుల వివరాలు తెలియవు. ఆఖరుకి నమోదైన కేసుల్లోనూ గోప్యత పాటిస్తున్నారు. స్టేషన్ రైటర్ ఉన్నా లేనట్టే. ఏమడిగినా సమాచారం తెలియదంటారు. నెల కిందట సీతన్నపేటలో బంగారం మెరుగు పెడతామని చెప్పి మోసం చేసి నగలు దొంగిలించారు. వారిని సింగ్‌నగర్ పోలీసులు పట్టుకునే వరకూ ఈ దొంగతనం గురించి ఎవరికీ తెలియదు. కనీసం ఇలాంటి దొంగలు తిరుగుతున్నారని పోలీసులు ప్రజలను అప్రమత్తం చేసిన పాపన పోలేదు. గడచిన రెండు నెలల్లో పదికి పైగా ద్విచక్ర వాహనాలు దొంగతనం జరిగాయి. శ్రీనగర్‌కాలనీలో వరుస బైక్ దొంగతనాలు చేసిన వ్యక్తి సీసీ ఫుటేజ్ ఇచ్చినా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. సత్యనారాయణపురం, ముత్యాలంపాడులో పాలబూత్‌లు, 4 షాపుల షట్టర్లు పగలుగొట్టి నగదు దొంగిలించారు. రెండు రోజుల క్రితం నివాసాల మధ్య వ్యభిచారం నిర్వహిస్తున్న వారిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. గురువారం గాంధీనగర్‌లో ఓ హోటల్‌లో స్పా నిర్వాహకులు వ్యభిచారం నిర్వహిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు 10 మందిని అదుపులోకి తీసుకొని సత్యనారాయణపురం పోలీసులకు అప్పగించారు. కానీ కేసు నమోదు చేసినట్టు ఎవరికీ తెలియదు. అదే ఏదైనా చిన్న వస్తువు రికవరీ చేస్తే మాత్రం 24గంటల్లో సాధించామని ప్రెస్‌మీట్లు పెడుతున్నారు. కొన్ని చోట్ల అర్ధరాత్రి వరకు దుకాణాలు బార్లు తెరిచి ఉంటున్నా పోలీసులు పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి స్టేషన్‌పైన ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



భువనేశ్వరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బుద్దా వెంకన్న

భువనేశ్వరికి బుద్దా జన్మదిన శుభాకాంక్షలు

వన్‌టౌన్, జూన్ 20: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుద్దా వెంకన్న గురువారం ట్విట్టర్ (ఎక్స్) వేదికగా సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు రాజకీయ ప్రయాణంలో ఆయన కష్టసుఖాల్లో భువనేశ్వరి తోడుగా నిలిచి ఎంతో సహకరిస్తున్నారని ఆమెకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు.

'ఆడుదాం' అక్రమాలపై చర్యలు తీసుకోండి

● ఎంపీ శివనాథ్‌కు రంభా ప్రసాద్ వినతి



విజయవాడ స్పోర్ట్సు, జూన్ 20: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి రోజా, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి నిర్వహణలో ఆడుదాం- ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణలో రూ.100 కోట్లపైనే అవినీతి, అక్రమాలు జరిగాయని, దీనిపై సీఎం చంద్రబాబు చొరవ తీసుకునేలా తగు చర్యలు తీసుకోవాలని ఎంపీ కేశినేని శివనాథ్‌ను ఆత్యా-పాత్యా రాష్ట్ర జనరల్ సెక్రటరీ, జాతీయ కబడ్డీ మాజీ క్రీడాకారుడు రంభా ప్రసాద్ గురువారం కలిసి కోరారు. తొలుత ఎంపీ ని దుశ్శాలువతో రంభా సత్కరించారు. ఆడుదాం- ఆంధ్రాపై మంత్రి రామప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో సీఐడీ విచారణకు ప్రభుత్వం ఆదేశించేలా తగు చర్యలు తీసుకోవాలని కోరగా శివనాథ్ సానుకూలంగా స్పందించారు.



ద్వారకా తిరుమలరావును సత్కరిస్తున్న నేతలు

దక్షతకు, నిజాయితీకి నిలువుటద్దం ద్వారకా తిరుమలరావు

● ప్రజా రవాణా సంస్థ కార్మిక పరిషత్ నేతలు

బస్టేషన్, జూన్ 20: ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు దక్షతకు, నిజాయితీకి నిలువుటద్దమని ప్రజా రవాణా సంస్థ కార్మిక పరిషత్ నేతలు పేర్కొన్నారు. డీజీపీగా వెళుతున్న ద్వారకా తిరుమలరావును గురువారం ఆర్టీసీ హౌస్‌లోని ఎండీ చాంబర్‌లో కార్మిక పరిషత్ నేతలు ఆయన్ను కలిసి సముచిత రీతిలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు అందజేస్తూ కార్మిక పరిషత్ ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి శేషగిరిరావు మాట్లాడుతూ ద్వారకా తిరుమలరావు పనితీరును విశిష్టశైలిని కొనియాడారు. ఉద్యోగులకు సంబంధించి పీఆర్‌సీ బకాయిలు, కారుణ్య నియామకాలు, ప్రొవిడెంట్ ఫండ్‌పై అవగాహన కల్పించారని ఆర్టీసీకి ఐదు అవార్డులు సాధించారన్నారు. ద్వారకా తిరుమలరావు డీజీపీ అవుతారని తాము మొదట్లోనే చెప్పామని గుర్తుచేశారు. ఆయన డీజీపీగా వెళ్లడం హర్షదాయకమన్నారు. కే.సురేంద్ర, వై.రమేష్, సీహెచ్ లక్ష్మణరావు, కడప రీజియనల్ కార్యదర్శి ఎం.పురుషోత్తం, హెడ్ ఆఫీస్ వైస్ ప్రెసిడెంట్ తోట బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

సస్పెండైన ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఇవ్వాలి: యూటీఎఫ్



గవర్నర్‌పేట, జూన్ 20: సార్వత్రిక ఎన్నికల్లో వివిధ కారణాలతో సస్పెన్షన్‌కు గురైన ఉపాధ్యాయులకు వెంటనే పోస్టింగ్ ఇవ్వాలని ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాను యూటీఎఫ్ విజ్ఞప్తి చేసింది. గురువారం యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు రాష్ట్ర సచివాలయంలో ఎన్నికల ప్రధాన అధికారికి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. మాచర్ల నియోజకవర్గంలో ఎన్నికల సందర్భంగా సస్పెండ్ అయిన పీవో, ఏపీవోకు తిరిగి పోస్టింగ్ ఇవ్వాలని, ఎన్నికల విధులకు హాజరు కాలేదన్న పేరుతో కొద్దిమంది ఉపాధ్యాయులను స్థానిక కలెక్టర్లు సస్పెండ్ చేశారని వీరందరికీ తిరిగి పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. ఎన్నికలు విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు ఎన్ని రోజులు ఎన్నికల విధుల్లో ఉంటే అన్ని రోజులకు డ్యూటీ సర్టిఫికెట్లు ఆధారంగా ఎరన్‌లీవ్ మంజూరు చేసేలా ఉత్తర్వులివ్వాలని యూటీఎఫ్ నేతలు కోరారు.

నేడు దుర్గగుడిలో మలేషియా డ్యాన్స్ అకాడమీ నాట్యప్రదర్శన

వన్‌టౌన్, జూన్ 20: దుర్గగుడిలో శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు మలేషియాకు చెందిన నందీకేశ్వర్ డాన్స్ అకాడమీ కళాకారులు కూచిపూడి నృత్యప్రదర్శన చేయనున్నట్టు దేవస్థానం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ అకాడమీకి డాక్టర్ చంద్రమోహన్ రామస్వామి నాయకత్వం వహిస్తున్నారన్నారు. ప్రస్తుతం మలేషియాలో నివాసముంటున్న తూర్పుగోదావరి జిల్లా నరేంద్రపురానికి చెందిన గరిమెళ్ల రాకేష్ కుమార్తె తాన్వీ సారథ్యంలో నృత్య ప్రదర్శన జరగనున్నట్టు దేవస్థానం తెలిపింది.

విద్యారంగాన్ని బలోపేతం చేయండి

● పీడీఎస్‌యూ రాష్ట్ర నేతలు

ధర్నాచౌక్, జూన్ 20: ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి తగిన చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షప్రధానకార్యదర్శులు ఎల్.రాజశేఖర్, ఎం.వినోద్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు. గడచిన ఐదేళ్లలో నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చి పాఠశాల విద్య నుంచి విశ్వవిద్యాలయం స్థాయి వరకు విద్యా రంగాన్ని నాశనం చేసిందని మండిపడ్డారు. 3,4,5 తరగతుల విలీనాన్ని ఆపాలని, 117 జీవోను రద్దు చేయాలన్నారు. విద్యారంగానికి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించి విద్యా, ఉపాధి రంగాన్ని అభివృద్ధి చేయాలన్నారు. ఉపాధ్యక్షుడు ఎస్‌కే జునైత్‌షా, సహాయ కార్యదర్శి ఎం.సునీల్, లోకేష్, ఎస్‌కే.జాకీర్, మానస, ఎం.ప్రసన్న, నేతి నాగేశ్వరరావు, సిసింద్రీ బాబు, సాహిత్ పాల్గొన్నారు.

జోగి కబ్జాలపై నిజనిర్ధారణ కమిటీ వేయాలి

● కాంగ్రెస్ నేత కొలనుకొండ శివాజీ

విజయవాడ, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి జోగి రమేష్ అంబాపురంలో చేసిన భూకబ్జాలపై నిజ నిర్ధారణ కమిటీ ఏర్పాటు చేయాలని పీసీసీ ఉపాధ్యక్షుడు కొండ శివాజీ డిమాండ్ చేశారు. అంబాపురంలోని అగ్రిగోల్డ్‌కు సంబంధించిన భూములను జోగి ఆక్రమించుకుని ఇతరులకు విక్రయించిన వ్యవహారాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించాలన్నారు. ఈ అక్రమాలకు సహకరించిన అధికారులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జోగి రమేష్ ఆక్రమించిన 2వేల గజాల భూమిని తక్షణమే స్వాధీనం చేసుకోవాలన్నారు. మంత్రిగా ఉన్నప్పుడు జోగి కనుసన్నల్లో ఇసుక, మట్టి దోపిడీ జరిగిందని ఆరోపించారు. దీనికి పోలీసు, రెవెన్యూ అధికారులు సహకరించారని విమర్శించారు. దీనిపైనా విచారణ చేయాలని డిమాండ్ చేశారు.



మంటల్ని ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

'సికింద్రాబాద్ స్టేషన్'లో 2 బోగీలకు మంటలు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అలుగడ్డ బావి వద్ద ఉన్న రైల్వే వాషింగ్ సైడ్ వద్ద ఆగి ఉన్న ఓ కొత్త రైలు రెండు బోగీలకు మంటలంటుకొన్నాయి. 15 బోగీలతో కూడిన ఈ రైలు శుక్రవారం ప్రయాణికులకు అందుబాటులోకి రావాల్సి ఉంది. దీన్ని 15 రోజుల క్రితం వాషింగ్ యార్డులో నిలిపారు. గురువారం ఉదయం 11.15 సమయంలో ఆ రైలు వంట గదులున్న (ప్యాంట్రీ) చివరి రెండు బోగీలకు మంటలంటుకున్నాయి. రైల్వే సిబ్బంది మిగతా బోగీలతో ఆ రెండు బోగీలను వేరు చేశారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

నేడు గుంటూరుకు పెమ్మసాని

▸▸ కేంద్రమంత్రిగా తొలిసారి రాక



న్యూఢిల్లీ, జూన్ 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టాక డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శుక్రవారం తొలిసారి గుంటూరుకు రానున్నారు. ఆయన ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని ప్రకటించారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ టోల్ ప్లాజా దగ్గర భారీ ర్యాలీ ప్రారంభమై ఆర్టీసీ బస్టాండ్, జిన్నా టవర్ సెంటర్ మీదుగా శ్రీ కన్వెన్షన్ వరకు సాగుతుంది. సాయంత్రం 6 గంటలకు శ్రీ కన్వెన్షన్‌లో ఆత్మీయ సమావేశం, అనంతరం విందు నిర్వహిస్తారు.

మీరు ఎంతో స్ఫూర్తినిచ్చారు

▸▸ తల్లి భువనేశ్వరికి మంత్రి లోకేశ్ పుట్టినరోజు శుభాకాంక్షలు



అమరావతి, జూన్ 20(ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేశ్ తన తల్లి భువనేశ్వరికి గురువారం ఎక్స్ వేదికగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. 'అమ్మా.. మీ ప్రేమ, దయ, మద్దతు నాకు గొప్ప బలం. మీరు నాకు ఎంతో స్ఫూర్తినిచ్చారు. ప్రజలకు సేవ చేయడం, వ్యాపార చతురత, న్యాయం కోసం పోరాడటం పట్ల మీ అంకితభావం చాలా గొప్పది. మీ ప్రేమ, దయతో మా జీవితాలను ప్రకాశవంతం చేస్తున్నారు' అనిపేర్కొన్నారు. 'నిజం గెలవాలి' బృందం ఆధ్వర్యంలో భువనేశ్వరి జన్మదిన వేడుకలను టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ ప్రశంసనీయం

▸▸ సీఈవో మీనాకు టీడీపీ నేతల సత్కారం



సీఈవో మీనాను సత్కరిస్తున్న వర్ల రామయ్య, అశోక్‌బాబు తదితరులు

అమరావతి, జూన్ 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అరాచకమూకల పీచమణిచి, ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరగడంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్ మీనా చేసిన కృషి అద్భుతమని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ప్రశంసించారు. గురువారం టీడీపీ నేతలు మీనాను మర్యాదపూర్వకంగా కలసి, ఆయనను దుశ్శాలువాలతో సత్కరించి, ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, పార్టీ నేతలు రాజశేఖర్, బుచ్చిరామ్‌ప్రసాద్, కోడూరి అఖిల్ పాల్గొన్నారు. కాగా, రాష్ట్ర హోంమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వంగలపూడి అనితను గురువారం వర్ల రామయ్య కలిసి అభినందించారు.

26న తెలుగు ఫిలిం చాంబర్ సమావేశం

విజయవాడ, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): తెలుగు ఫిలిం చాంబర్ సమావేశాలు ఈ నెల 26న విజయవాడలో జరగనున్నాయి. ప్రస్తుతం చాంబర్‌కు ప్రముఖ నిర్మాత దిల్‌రాజు అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఇందులో నిర్మాతల నుంచి 16 మంది, పంపిణీదారుల నుంచి 12 మంది, స్టూడియో విభాగం నుంచి నలుగురు, ఎగ్జిబిటర్ల నుంచి 16 మంది మొత్తం 100 మంది వరకు ఉంటారు. ఏడాదికి ఒకసారి ఎన్నికయ్యే కార్యవర్గంలో అధ్యక్షుడిని ఒక్కో ఏడాది ఒక్కో విభాగం నుంచి ఎన్నుకుంటారు.

లైక్‌లు, కామెంట్ల కోసం దుస్సాహసం!



పుణె, జూన్ 20: ఇన్‌స్టాలో లైకులు, కామెంట్లు వెల్లువలా వచ్చి పాపులర్ అవుతామనే ఉద్దేశంతో పుణెలో ఆ ఇద్దరు మైనర్లు చేసిన సాహసం, నెటిజన్లను గగుర్పాటుకు గురిచేసింది. ఏడెనిమిది అంతస్తులంత ఎత్తయిన కోట అంచున ఓ అబ్బాయి బోర్లా పడుకున్నాడు! అతడి చేతిని పట్టుకొని ఓ అమ్మాయి అత్యంత ప్రమాదకర స్థాయిలో కిందకు వేలాడుతోంది! ఈ దృశ్యాన్ని పక్క నుంచి మరో అబ్బాయి వీడియో తీశాడు. 'ఈ ఇద్దర్నీ జైల్లో పెట్టాలి. అప్పుడే ఇలాంటి వీడియోలు ఇంకెవరూ చేసేందుకు సాహసించరు' అంటూ ఓ నెటిజన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

'ఆడుదాం ఆంధ్ర' అక్రమాలపై కమిటీ: మంత్రి

అమరావతి, జూన్ 20(ఆంధ్రజ్యోతి): 'ఆడుదాం ఆంధ్ర'లో అక్రమాలపై కమిటీ వేసి, విచారణ జరుపుతామని రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చెప్పారు. గురువారం అమరావతి సచివాలయంలో తనను కలిసిన విలేకర్లతో మంత్రి మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రలో అక్రమాలకు ప్రపంచ ఓషియానిక్ రోలర్ స్కేటింగ్‌లో బంగారు పతకం సాధించిన క్రీడాకారులను మంత్రి సత్కరించారు.

దక్షిణ చైనా సముద్రంలో మరో 'గల్వాన్'

▸▸ ఫిలిప్పీన్స్ బోట్లపై విరుచుకుపడ్డ చైనా కోస్టు గార్డు

న్యూఢిల్లీ, జూన్ 20: దక్షిణ చైనా సముద్రంలో చైనా సైనికులు పొరుగుదేశమైన ఫిలిప్పీన్స్ నౌకాదళ సిబ్బందిపై గొడ్డళ్లు, కత్తులతో దాడి చేశారు. ఆయుధాలు లేనప్పటికీ ఫిలిప్పీన్స్ సైనికులు వారిని చేతులతోనే సమర్థంగా ఎదుర్కొన్నారు. ఇది నాలుగేళ్ల క్రితం లద్దాఖ్‌లోని గల్వాన్ వ్యాలీలో భారత దేశ సైనికులపై దాడి చేసిన ఘటనను గుర్తు చేసింది. నిత్యం నీటిలో మునిగి ఉండే పగడాల దిబ్బ అయిన సెకండ్ థామస్ షోల్ విషయమై ఇరు దేశాల మధ్య వివాదం ఉంది. ఇక్కడ ఫిలిప్పీన్స్ దేశం రెండో ప్రపంచ యుద్ధ కాలం నాటి బార్జ్‌లాంటి ఓ నౌకను నిలిపి ఉంచింది. దీని వద్ద డజను మంది నౌకా దళ సిబ్బంది విధులు నిర్వరిస్తుంటారు. వీరికోసం బుధవారం రెండు రబ్బరు బోట్లలో ఆహారం, ఆయుధాలు తీసుకెళ్తుండగా ఎనిమిది బోట్లలో వచ్చిన చైనా కోస్టు గార్డు సిబ్బంది వారిపై దాడి చేశారు. పెద్ద ఖడ్గాలు, కత్తులు, సుత్తులతో బోట్లను ధ్వంసం చేశారు. ఎనిమిది ఎం4 రైఫిల్స్, నావిగేషన్ పరికరాలు, ఇతర వస్తువులను తీసుకెళ్లారు. ఇందుకు సంబంధించిన వీడియోను ఫిలిప్పీన్స్ మిలటరీ విడుదల చేసింది. దీనిపై ఫిలిప్పీన్ సైనికాధికారి జనరల్ రోమియో బ్రావనర్ జూనియర్ విలేకరులతో మాట్లాడుతూ చైనా సైనికులను 'సముద్ర దొంగలు'గా అభివర్ణించారు.

ప్యాలెస్ కాదు.. వైసీపీ కార్యాలయం..!



▸▸ ఆ పార్టీ విశాఖ నేతల బరితెగింపు
▸▸ ఎండాడలో రెండెకరాల ప్రభుత్వ భూమి కేటాయింపు
▸▸ ఎకరా రూ.50 కోట్ల విలువైన భూమికి ఏడాదికి రూ.వెయ్యి చొప్పున చెల్లింపు
▸▸ 33 ఏళ్లపాటు లీజుకు ఇస్తూ ఉత్తర్వులు
▸▸ దీనిపై అప్పట్లోనే వెల్లువెత్తిన విమర్శలు
▸▸ జీవీఎంసీ అనుమతి లేకుండానే భవన నిర్మాణం
▸▸ ప్రభుత్వం మారడంతో తాజాగా ప్లాన్ అనుమతికి దరఖాస్తు



విశాఖ నగర పరిధిలో ఎండాడ సర్వే నంబర్ 175/4లో ప్యాలెస్ మాదిరిగా నిర్మించిన వైసీపీ కార్యాలయం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'రాష్ట్రంలో అక్రమ భవనాలు ఉండడానికి వీల్లేదు. అలాంటి వాటిని మా ప్రభుత్వం ఉపేక్షించదు. ప్రజా వేదిక కూడా అలాంటిదే కాబట్టి కూల్చేస్తున్నాం' అంటూ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలినాళ్లలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గొప్పలు చెప్పుకొన్నారు. ఆ హడావుడి అంతా ప్రజావేదిక కూల్చివేత వరకే.. ఆ తరువాత ఏ అనధికార నిర్మాణాన్నీ తొలగించింది లేదు. అంతేకాదు ఆయన పార్టీ కూడా అనుమతులు లేకుండా అనేక అక్రమ నిర్మాణాలు చేపట్టింది. ఈ జాబితాలో విశాఖ నగరంలో వైసీపీ కార్యాలయం కోసం చేపట్టిన భవనం కూడా ఉంది.

చేతిలో అధికారం ఉంది కదా అని వైసీపీ నేతలు విశాఖ ఐటీ సెజ్ సమీపంలో అత్యంత విలువైన రెండెకరాల భూమిని లీజు పేరుతో కారుచౌకగా దక్కించుకున్నారు. అందులో జీవీఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండానే ప్యాలెస్‌ను తలదన్నేలా పార్టీ కార్యాలయం కోసం భారీ భవనం నిర్మించేశారు. అప్పుడు అధికారంలో ఉన్న పార్టీ కావడంతో అధికారులు కూడా నోరెత్తే సాహసం చేయలేకపోయారు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో అక్రమ భవన నిర్మాణం అంశం ఎక్కడ తమ పీకకు చుట్టుకుంటుందోనని ఆందోళన చెందుతున్నారు. వైసీపీ అధికారంలో ఉండగా 2022 మే 16న పీఎం పాలెం సమీపాన ఎన్‌వీపీ లా కాలేజీ నుంచి ఐటీ హిల్స్‌కు వెళ్లే రోడ్డును ఆనుకుని పనోరమ హిల్స్ సమీపంలో ఎండాడ సర్వే నంబర్ 175/4లో రెండెకరాల ప్రభుత్వ భూమిని పార్టీ కార్యాలయం నిర్మాణానికి కేటాయించుకున్నారు. ప్రస్తుతం అక్కడ భూమి ధర ఎకరా రూ.50 కోట్లు పైగా పలుకుతుంది. అంటే రెండు ఎకరాల భూమి విలువ రూ.వంద కోట్లు. ఆ భూమిని ఏడాదికి (ఎకరాకు ఏడాదికి రూ.వెయ్యి) కేవలం రూ.రెండు వేలు చెల్లించేలా 33 ఏళ్లపాటు లీజుకు ఇస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ఐదేళ్ల లీజు మొత్తం (రూ.పది వేలు) ముందుగానే చెల్లించాలని, తర్వాత ప్రతి ఐదేళ్లకు లీజు మొత్తాన్ని పది శాతం చొప్పున మాత్రమే పెంచేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వానికి చెందిన భూమిని కారుచౌకగా అధికార పార్టీకి కట్టబెట్టడంపై అప్పట్లో విమర్శలు వెల్లువెత్తాయి. జీవీఎంసీ నుంచి అనుమతులు పొందాల్సి ఉన్నప్పటికీ ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే ప్యాలెస్‌ను తలపించేలా ఆ స్థలంలో భారీ భవనాన్ని నిర్మించారు. భవన నిర్మాణ పనులు చివరి దశలో ఉండగానే గత ఏడాది సెప్టెంబరు రెండో తేదీన పార్టీ కార్యాలయాన్ని హఠాత్తుగా ప్రారంభించేశారు. ఒకవైపు భవన నిర్మాణపనులు జరుగుతుంటే మరోవైపు అక్కడే పార్టీ సమావేశాలు నిర్వహించేవారు. ఎన్నికల ఫలితాలు వెలువడేంత వరకూ పార్టీ నేతలు, కార్యకర్తలతో కార్యాలయం కళకళలాడుతుండేది. ఎన్నికల్లో పార్టీ ఓటమి తర్వాత కార్యాలయం ముఖం చూసేవారు లేకపోవడంతో ప్రస్తుతం బోసిపోతోంది.

ప్లాన్ లేకుండానే భవన నిర్మాణం

జీవీఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండానే వైసీపీ నేతలు పార్టీ కార్యాలయం కోసం ప్యాలెస్ మాదిరిగా భారీ భవంతిని నిర్మించేయడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పార్టీ కార్యాలయం నిర్మాణం కోసం వైసీపీ నేతలు మీసాల వెంకట సుబ్రసాయిశరణ్ అనే లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ ద్వారా ప్లాన్‌కు గత ఏడాది జనవరి 12న దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు ఫీజు కింద రూ.10 వేలు చెల్లించి వదిలేశారు. లీజు భూమిలో నిర్మాణం కావడంతో గ్రామ పంచాయతీ చార్జీల కింద రూ.4.44 లక్షలు, పర్మిట్ ఫీజు కింద రూ.10.44 లక్షలు, గ్రీన్ ఫీజు కింద రూ.33 వేలు, డీపీఎంఎస్ యూజర్ చార్జీలు కింద రూ.500, లేబర్ సెస్ చార్జీల కింద రూ.1.54 లక్షలు.. మొత్తం సుమారు రూ.17 లక్షలు జీవీఎంసీకి చెల్లించాలి. ఆ ఫీజులన్నింటినీ చెల్లించిన తర్వాత భూమికి సంబంధించిన డాక్యుమెంట్లు, భవన నిర్మాణానికి సంబంధించిన డిజైన్, డ్రాయింగ్‌ను ఎల్‌టీపీ అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. డాక్యుమెంట్లు అన్నీ సరైనవేనని ఆన్‌లైన్‌లో వెరిఫికేషన్ అయిన తర్వాత బిల్డింగ్ ప్లాన్ నంబర్ జనరేట్ అవుతుంది. తర్వాత ప్లాన్ అప్లికేషన్ సంబంధిత వార్డు సచివాలయంలోని వార్డు ప్లానింగ్ సెక్రటరీ పరిశీలనకు వెళుతుంది. ప్లానింగ్ సెక్రటరీ భవన నిర్మాణం ప్రతిపాదిత స్థలానికి వెళ్లి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన డాక్యుమెంట్లలో ఉన్నట్టుగానే భూమి కొలతలు, రోడ్డు కనెక్టివిటీ ఉనదీ లేనిదీ పరిశీలిస్తారు. సక్రమంగా ఉన్నట్టు నిర్ధారిస్తే తనపై అధికారికి, అలా కమిషనర్ వరకూ అప్లికేషన్ వెళ్లి అక్కడ ప్లాన్ అప్రూవల్ జరుగుతుంది. కానీ వైసీపీ కార్యాలయం ప్లాన్ విషయానికి వస్తే కేవలం అప్లికేషన్ చార్జీల కింద గత ఏడాది జనవరి 12న రూ.పది వేలు చెల్లించి వదిలేశారు. అధికారంలో ఉన్నామనే ధీమాతో ఎలాంటి ప్లాన్ లేకుండానే అడ్డగోలుగా భవన నిర్మాణం పూర్తిచేసేశారు. అధికారం కోల్పోవడంతో ఎక్కడ ఇబ్బందులు వస్తాయోనని భయంతో ఇప్పుడు ప్లాన్ కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. దీని కోసం ఈ నెల 17న గ్రామ పంచాయతీ చార్జీలు కింద కట్టాల్సిన రూ.4.44 లక్షలు చెల్లించారు. మిగిలిన ఫీజులను మాత్రం ఇంకా చెల్లించకపోవడంతో ప్లాన్ అప్లికేషన్ ఇంకా ఎల్‌టీపీ లాగిన్ నుంచి జీవీఎంసీ లాగిన్‌కు చేరలేదు.

ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

ప్లాన్ అనుమతి లేకుండానే వైసీపీ కార్యాలయ భవన నిర్మాణం పూర్తిచేసేయడంతో దీనిపై జీవీఎంసీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనే ఆసక్తి నెలకొంది. భవన నిర్మాణానికి ముందే ప్లాన్ తీసుకోవాల్సి ఉంటుంది. ప్లాన్ అప్రూవ్ అయిన తర్వాతే నిర్మాణ పనులు ప్రారంభించాలి. అలా కాకుండా ప్లాన్ జారీ కాకుండానే భవన నిర్మాణం చేపట్టినా, పూర్తిచేసినా సరే అక్రమ నిర్మాణంగానే పరిగణిస్తారు. తీసుకున్న ప్లాన్‌కు చిన్నపాటి ఉల్లంఘనలతో నిర్మాణాలు చేశారని ఆరోపిస్తూ అనేక భవనాలను కూలగొట్టేసిన జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు.. ఎలాంటి ప్లాన్ లేకుండానే నిర్మాణం పూర్తిచేసిన వైసీపీ భవనం విషయంలో ఎలా ముందుకువెళతారో చూడాలి.

ఏ ఆధారాలూ లేకుండా..
గోవులను ఎలా అప్పగిస్తారు?

▸▸ నిబంధనలు పాటించలేదని తేలితే తీవ్ర పరిణామాలు
▸▸ విజయవాడ భవానీపురం పోలీసులపై హైకోర్టు ఆగ్రహం.. విచారణ నేటికి వాయిదా

అమరావతి, జూన్ 20(ఆంధ్రజ్యోతి): ఎలాంటి ఆధారాలూ లేకుండా వాటి యజమానిని తానే అని చెప్పిన వ్యక్తికి 195 ఆవులు, ఎద్దులు, దూడలను ఎలా అప్పగిస్తారని విజయవాడలోని భవానీపురం పోలీసులను హైకోర్టు ప్రశ్నించింది. ఏదైనా కేసులో స్వాధీనం చేసుకున్న బంగారానికి తానే యజమానిని వస్తే ఆధారాలు పరిశీలించకుండా ఇచ్చేస్తారా? అని నిలదీసింది. పోలీసుల తీరుపై జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, జస్టిస్ జగడం సుమతితో కూడిన ధర్మాసనం గురువారం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. నిబంధనలు పాటించలేదని తేలితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని అధికారులను హెచ్చరించింది. ఆ గోవులకు తానే యజమానినని, తన వాదనలనూ పరిగణనలోకి తీసుకోవాలంటూ ఉమర్ ఫరూక్ అనే వ్యక్తి వేసిన అనుబంధ పిటిషన్‌ను అనుమతించింది. విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. బక్రీద్ సందర్భంగా వధించేందుకు తెచ్చిన 195 ఆవులు, ఎద్దులు, దూడలను భవానీపురం పోలీసులు తమ అధీనంలోకి తీసుకున్నారు. పండుగ ముగిశాక ఆ పశువులను వాటి యజమానినంటూ వచ్చిన వ్యక్తికి అప్పగించారు. వాటిని అప్పగించే సమయంలో వ్యక్తికి సంబంధించిన ఎలాంటి వివరాలను తీసుకోలేదు. దీనిపై విజయవాడకు చెందిన సూరాబత్తుల గోపాలరావు, తోట సురేష్‌బాబు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ధర్మాసనం బుధవారం విచారణ జరిపి పోలీసుల తీరును తప్పుపట్టింది. ఈ వ్యాజ్యం గురువారం మరోసారి విచారణకు రాగా గోవుల యజమానిగా చెబుతున్న ఉమర్ ఫరూక్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు తమ స్థలంలో ఉన్న గోవులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని, తిరిగి గోవులను అప్పగించాక ఫరూక్ వాటిని విక్రయించారని తెలిపారు. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ వేస్తామన్నారు. ఇంప్లీడ్ పిటిషన్ వేసేందుకు అనుమతించాలని కోరారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఇంప్లీడ్ పిటిషన్ వేసేందుకు అనుమతిస్తూ విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

జగన్ కోసం కట్టింది కాదు

▸▸ రుషికొండ భవనంపై అంబటి దబాయింపు

అమరావతి, జూన్ 20(ఆంధ్రజ్యోతి): రుషికొండ భవనంపై మాజీ మంత్రి అంబటి రాంబాబు దబాయింపునకు దిగారు. అది వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఉండేందుకు నిర్మించింది కాదంటూ బుకాయించారు. తాడేపల్లి జగన్ నివాస ప్రాంగణంలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆ పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. అనంతరం రుషికొండ భవనంపై మీడియా వేసిన ప్రశ్నకు.. 'అది ప్రభుత్వ భవనం. ఎవరైనా వాడుకోవచ్చు' అంటూ అంబటి బుకాయించే ప్రయత్నం చేశారు. ప్రభుత్వ భవనమైనప్పుడు సమాచారం రహస్యంగా ఎందుకు దాచి పెట్టారన్న ప్రశ్నకు ఆయన సహేతుకమైన వివరణ ఇవ్వలేకపోయారు. ప్రభుత్వం వేసిన కమిటీ సీఎం నివాసంగా సూచించిందా? అన్న ప్రశ్నకు.. 'అది మరో అంశం' అంటూ తప్పించుకునే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నందున ప్రభుత్వ భవనంగా వాడుకోవచ్చంటూ పేర్కొన్నారు. రూ.500 కోట్లతో భవనం నిర్మించడానికి కారణాలేమిటో రాంబాబు వెల్లడించలేకపోయారు.

శారదా పీఠం పేరుతో
కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు

▸▸ కిలోల కొద్దీ బంగారం
▸▸ ఆదాయంపై స్వాముల మధ్య విభేదాలు
▸▸ స్వాత్మానందతో స్వరూపానందేంద్రకు ప్రాణహాని: మూర్తి యాదవ్



విశాఖపట్నం, జూన్ 20(ఆంధ్రజ్యోతి): చినముషిడివాడలోని శారదా పీఠం పేరుతో రూ.44 కోట్లు ఉన్నాయని, అవి కాకుండా బినామీల పేరుతో మరో రూ.60 కోట్లు... మొత్తం కలిపి రూ.100 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. విశాఖపట్నం పౌర గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'కిలోల కొద్దీ బంగారం నిల్వలు కూడా వారి దగ్గర ఉన్నాయి. పన్ను పరిధిలోకి రాని ఈ నిధులను స్వాధీనం చేసుకొని విచారణ చేయాలి. తెలంగాణలోని కోకాపేటలో ఆధ్యాత్మిక వ్యవహారాల పేరిట రూ.250 కోట్ల విలువైన భూమిని ఉచితంగా తీసుకున్నారు. అందులో సాహితీ ఇన్‌ఫ్రా అధినేతతో కలిసి నెలకు రూ.కోటి అద్దె వచ్చేలా వాణిజ్య సముదాయం నిర్మించే యత్నం చేశారు. ఇక్కడ జగన్ ప్రభుత్వం భీమిలి మండలం కొత్తవలసలో 15 ఎకరాల భూమి కేటాయించింది. దానిని కూడా వాణిజ్య అవసరాలకు ఉపయోగించుకునేలా మార్చాలని కొత్త జీఓ ఇవ్వాలని స్వాత్మానందేంద్ర ప్రభుత్వాన్ని కోరిన విషయం తెలిసిందే. పీఠంలో ఆస్తుల గొడవలు, సెటిల్‌మెంట్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలో స్వాముల మధ్య విభేదాలు వచ్చాయి. స్వరూపానందేంద్రకు, స్వాత్మానంద వల్ల ప్రాణహాని ఉందనే ప్రచారం కూడా జరుగుతోంది' అని మూర్తి యాదవ్ విజ్ఞప్తి చేశారు.

'ఉక్కు' భూములకు రెక్కలు!?



▸▸ చెన్నైలో 13.2, హైదరాబాద్‌లో 22 ఎకరాలు
▸▸ హైకోర్టు ఆంక్షలున్నా విక్రయించేందుకు యత్నాలు
▸▸ అవసరాలకు తప్పదు.. అధికారుల సమర్థన

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కడానికి విశాఖపట్నం స్టీల్ ప్లాంటు భూములు విక్రయించాలని యత్నిస్తోంది. ఎన్నికలకు ముందు విశాఖపట్నం హెచ్‌బీ కాలనీలో కొన్ని భూములను విక్రయించిన సంగతి తెలిసిందే. ఆ తరువాత ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ హైకోర్టును ఆశ్రయించడంతో ఆస్తుల విక్రయంపై స్టే విధిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే, స్టే అమలులో ఉండగానే ఇటీవల సమావేశమైన స్టీల్ ప్లాంటు బోర్డులో భూముల విక్రయంపై చర్చ జరిగింది. మార్కెటింగ్ శాఖ అధికారులు దేశంలో ఎక్కడెక్కడ ఎంతెంత భూములు ఉన్నాయో వెల్లడిస్తూ.. వాటిని విక్రయిస్తే ఎంత మొత్తం వస్తుందో అధికారులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అందులో తొలి విడతగా హైదరాబాద్‌లోని 22 ఎకరాలు, చెన్నైలోని 13.2 ఎకరాలు విక్రయించాలని నిర్ణయించారు.

ఆ రెండూ మార్కెటింగ్‌లో కీలకం

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు దేశవ్యాప్తంగా మార్కెటింగ్ నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకొని అనుకూలమైన ప్రాంతాల్లో స్టాక్‌యార్డులు నెలకొల్పింది. దక్షిణ భారత దేశంలో హైదరాబాద్, చెన్నై చాలా కీలకమైన ప్రాంతాలు. స్టీల్‌ప్లాంటు ఉత్పత్తిలో 40 శాతం ఈ రెండు కేంద్రాల ద్వారానే అమ్ముడవుతుంది. హైదరాబాద్ సమీపాన మెదక్ జిల్లా వెలుమలలో 22 ఎకరాల భూమిలో స్టాక్ యార్డు ఉంది. అక్కడ ఏటా 4.5 లక్షల టన్నుల స్టీల్ అమ్ముతున్నారు. సొంత యార్డు కావడంతో హ్యాండ్లింగ్ చార్జీల కింద టన్నుకు రూ.34 ఖర్చవుతోంది. ఇక చెన్నైలో 13.2 ఎకరాల్లో స్టాక్ యార్డు ఉంది. అక్కడ ఏడాదికి 3 లక్షల టన్నుల స్టీల్ విక్రయిస్తున్నారు. అక్కడ హ్యాండ్లింగ్ చార్జీల కింద టన్నుకు రూ.70 అవుతోంది. ఈ రెండు నగరాల్లో భూమికి మంచి రేటు వస్తుండడంతో వాటిని అమ్మేయాలని బోర్డు సమావేశంలో నిర్ణయించారు.

గణనీయంగా పెరగనున్న చార్జీలు

సొంత యార్డులు లేని చోట అద్దెతో పాటు హ్యాండ్లింగ్ చార్జీలను కన్‌సైన్‌మెంట్ ఏజెంట్‌కు ఇవ్వాల్సి ఉంటుంది. అక్కడ ఏర్పాటుచేసిన స్టాక్‌యార్డు విస్తీర్ణం, విక్రయించే సరుకు ఆధారంగా ఈ రేట్లు ఉంటాయి. కోల్‌కతాలో టన్నుకు రూ.450 ఇస్తున్నారు. ఇప్పుడు హైదరాబాద్, చెన్నై స్టాక్‌యార్డులు అమ్మేస్తే అక్కడ కూడా ఏజెంట్లకు టన్నుకు రూ.500పైగానే చెల్లించాల్సి ఉంటుంది. దీనివల్ల వ్యయం పెరుగుతుంది. లాభం తగ్గుతుంది. జిందాల్, టాటా వంటి వారితో పోటీ తట్టుకోలేక విక్రయాలు పడిపోయే ప్రమాదం ఉంది.

తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఉక్కు పరిరక్షణ కమిటీ

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటుకు బ్యాంకులేవీ రుణాలు ఇవ్వడం లేదని, అందుకే అవసరాల కోసం ఈ నిర్ణయం తీసుకుంటున్నామని బోర్డు డైరెక్టర్లు తమ నిర్ణయాన్ని సమర్థించుకుంటున్నారు. దీనిని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ కన్వీనర్ అయోధ్యరామ్ తీవ్రంగా ఖండించారు. తక్షణం ఆస్తుల విక్రయం ఆలోచన విరమించుకోవాలని, కేంద్రమే రూ.3 వేల కోట్లు ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు.

పురుషాంగ కణజాలంలో మైక్రోప్లాస్టిక్స్

▸▸ అంగస్తంభన సమస్యకు దారి తీసే ప్రమాదం



వాషింగ్టన్, జూన్ 20: ప్లాస్టిక్ భూతం సర్వవ్యాప్తమైపోయింది. చివరికి మన శరీరంలోకీ వ్యాపించింది. సూక్ష్మ ప్లాస్టిక్ రేణువులు (మైక్రో ప్లాస్టిక్స్) మనిషి దేహంలోని అన్ని అవయవాలను ఆక్రమించేస్తున్నాయి. తాజాగా, పురుషాంగం కణజాలంలోనూ వీటి ఉనికిని శాస్త్రవేత్తలు గుర్తించారు. దీనివల్ల అంగస్తంభన సమస్య తలెత్తే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. అమెరికాలోని మియామీ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ రంజిత్ రామసామి నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం ఈ పరిశోధన జరిపింది. దీంట్లో భాగంగా, అంగస్తంభన సమస్య పరిష్కారం కోసం శస్త్రచికిత్స చేయించుకున్న ఆరుగురు వ్యక్తుల పురుషాంగ కణజాలం నమూనాలను సేకరించారు. వాటిపై కెమికల్ ఇమేజింగ్ నిర్వహించి ఫలితాలను విశ్లేషించారు. ఆ వివరాలను రంజిత్ రామసామి వెల్లడించారు. 'ఐదుగురి నమూనాల్లో ఏడు రకాల మైక్రోప్లాస్టిక్స్ కనిపించాయి. ముఖ్యంగా పాలీఎథిలీన్ టెరెఫ్తలేట్ (పీఈటీ), పాలీప్రొపిలీన్ గణనీయంగా ఉన్నాయి. ప్లాస్టిక్ బాటిళ్లు, డబ్బాల్లో పీఈటీ ఉంటుంది. పాలీప్రొపిలీన్ వాటి మూతలలో ఉంటుంది. ఈ మైక్రో ప్లాస్టిక్స్ 2 మైక్రోమీటర్ల సైజులో (ఒక మిల్లీమీటరులో 2 వేల వంతు) కూడా ఉన్నాయి. మైక్రోప్లాస్టిక్స్ జాడ కనిపించని ఆరో వ్యక్తి క్యూబాకు చెందిన వాడు. అతడు పూర్తిగా సంప్రదాయ పద్ధతిలో జీవిస్తుంటారు. ప్లాస్టిక్ వస్తువులను పెద్దగా వాడరు' అని తెలిపారు.

ఆహారం, నీరు, గాలి, స్పర్శ ద్వారా ఐదు మిల్లీమీటర్ల కన్నా తక్కువ సైజు ఉన్న ప్లాస్టిక్ రేణువులు మన దేహంలోకి చేరుతున్నాయి. మనిషి గుండెలో మైక్రోప్లాస్టిక్స్ ఉన్నట్లు గతంలో ఒక పరిశోధన వెల్లడించింది. పురుషులలోనైతే వృషణాలు, వీర్యం లోనూ వీటి జాడ ఉందని మరో అధ్యయనం తెలిపింది. వియామీ వర్సిటీ శాస్త్రవేత్తల తాజా పరిశోధన.. అంగం కణజాలంలోనూ మైక్రోప్లాస్టిక్స్ చేరిపోయాయని తెలియజేస్తోంది. అంగం స్తంభించినప్పుడు రక్తనాళాల్లో ప్రవాహం పెరిగిపోయి మైక్రోప్లాస్టిక్స్ అంగం కణజాలంలోకి చేరుతుండొచ్చని ఇది దీర్ఘకాలంలో అంగస్తంభన సమస్యకు కారణమవుతుందా అన్నదానిపై మరింత పరిశోధన చేపట్టాల్సి ఉందని రంజిత్ రామసామి అన్నారు.

మనిషిని 'మార్చిన' రాక్షస ప్రేమ!

▸▸ అనుమతి లేకుండానే లింగమార్పిడి
▸▸ శస్త్రచికిత్స జరిపించిన ప్రియుడు
▸▸ అనస్థీషియా మత్తులో వైద్యుల ఆపరేషన్
▸▸ తనకు తెలియకుండానే అమ్మాయిగా మారిన అబ్బాయి
▸▸ యూపీలో దారుణం.. మానవ అవయవ విక్రయ ముఠా కారణమన్న ఆరోపణలు



ముజఫర్‌పూర్, జూన్ 20: సున్నితంగా ఉండాల్సిన ప్రేమ.. ప్రాణాంతకంగా మారుతోంది. ఎదుటి వ్యక్తి ఇష్టాయిష్టాలతో పని లేకుండా ప్రేమను రుద్దే సంఘటనలు పెరిగిపోతున్నాయి. ఇదే తరహాలో యూపీలోని ముజఫర్‌పూర్‌లో ఓ విచిత్ర ఘటన జరిగింది. ఓ యువకుడి మీద ప్రేమను పెంచుకున్న మరో యువకుడు.. సదరు యువకుడికి తెలియకుండానే లింగమార్పిడి శస్త్రచికిత్స జరిపించి అమ్మాయిగా మార్పించాడు. తన అనుమతి లేకుండా జరిగిన ఈ దారుణంపై బాధిత యువకుడు లబోదిబోమంటున్నాడు. యూపీలోని సంజక్ అనే గ్రామానికి చెందిన 20 ఏళ్ల యువకుడు ముజాహిద్‌తో ఓంప్రకాశ్ అనే యువకుడు సన్నిహితంగా ఉండేవాడు. ఈ క్రమంలో ముజాహిద్‌కు ఆరోగ్య సమస్య ఉందని నమ్మించి అతడిని చికిత్స కోసం మన్సూర్‌పూర్‌లోని బేగ్రాజ్‌పూర్ మెడికల్ కాలేజీకి ఈ నెల 20న తీసుకెళ్లాడు. వైద్యులు ముజాహిద్‌ను పరీక్షించి, చిన్న శస్త్రచికిత్స చేస్తామని చెప్పి అనస్థీషియా(మత్తుమందు) ఇచ్చారు. ముజాహిద్ మత్తులో ఉండగానే అతడికి లింగమార్పిడి ఆపరేషన్ చేసి పురుషాంగం, వృషణాలు తొలగించారు. స్పృహలోకి వచ్చిన తర్వాత ముజాహిద్ జరిగిన దారుణాన్ని గ్రహించాడు. ఓంప్రకాశ్ అతడి వద్దకు వచ్చి.. 'నేనే ఇదంతా చేయించా. ఇకపై నిన్ను నీ కుటుంబంగానీ, మీ వర్గం వాళ్లుగానీ దగ్గరికి రానివ్వరు. నాతో కలిసి ఉండాల్సిందే. నీ తండ్రిని తుపాకీతో కాల్చి చంపుతా. నీ వాటా భూమి తీసుకొని దాన్ని నా పేరు మీద రాయాలి. అది అమ్మి లక్నోకు వెళ్లిపోదాం' అని బెదిరించాడు. దీనిపై ముజాహిద్ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో ఓంప్రకాశ్‌ను పోలీసులు అరెస్టు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. అయితే, ఈ ఘటన వెనుక మానవ అవయవాలను విక్రయించే నేరముఠా ఉందని స్థానిక రైతు నేత శ్యాంలాల్ ఆరోపించారు. మనుషుల నుంచి అవయవాలను తొలగించి వాటిని విక్రయించటం, అనుమతి లేకుండా లింగమార్పిడి శస్త్రచికిత్సలు జరపటం వంటి దారుణాలు బేగ్రాజ్‌పూర్ మెడికల్ కాలేజీలో గతంలోనూ జరిగాయన్నారు. ఈ అనైతిక వ్యాపారంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు. బాధితుడికి రూ.2 కోట్ల పరిహారం ఇవ్వాలన్నారు.

హైదరాబాద్-బాలానగర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్(సీఐటీడీ)- ఫుల్ టైం మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్(ఎంఈ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ సహకారంతో ఈ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నారు. కోర్సు వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఎంట్రెన్స్ ఎగ్జామ్, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. హైదరాబాద్ సీఐటీడీ క్యాంపస్‌లో ప్రతి సోమ, మంగళ, బుధ వారాల్లో ఉదయం తొమ్మిదిన్నర నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు; ఓయూ ఇంజనీరింగ్ కాలేజ్(మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్) క్యాంపస్‌లో ప్రతి గురు, శుక్ర, శని వారాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం అయిదున్నర వరకు తరగతులు నిర్వహిస్తారు. స్కాలర్‌షిప్‌లు ఉండవు. ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి ఉస్మానియా యూనివర్సిటీ మాస్టర్స్ డిగ్రీని ప్రదానం చేస్తుంది.

సీఐటీడీలో మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్

స్పెషలైజేషన్‌లు
- మెకానికల్ క్యాడ్/క్యామ్
- టూల్ డిజైన్
- డిజైన్ ఫర్ మాన్యుఫాక్చర్
- మెకట్రానిక్స్

అర్హత వివరాలు: ఏఐసీటీఈ గుర్తింపు పొందిన కళాశాల నుంచి మెకానికల్ ఇంజనీరింగ్/ప్రొడక్షన్ ఇంజనీరింగ్/ మెకట్రానిక్స్ ఇంజనీరింగ్/ఆటోమొబైల్ ఇంజనీరింగ్/ఏరోనాటికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. అభ్యర్థుల వయసు 45 ఏళ్లలోపు ఉండాలి. గేట్ స్కోర్ తప్పనిసరి కాదు. అడ్మిషన్ ప్రక్రియలో గేట్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకోరు. ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో సాధించిన ర్యాంక్ ఆధారంగానే ప్రవేశాలు కల్పిస్తారు.



స్పాన్సర్డ్ అభ్యర్థులకు కనీసం రెండేళ్ల ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి.

ఎంట్రెన్స్ ఎగ్జామ్: ఓయూ నిబంధనలను అనుసరిస్తూ సీఐటీడీ ఈ పరీక్షని నిర్వహిస్తుంది. అన్నీ మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలే ఇస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు. మొత్తం మార్కులు 150. ఇందులో 50 మార్కులకు కామన్ పేపర్, 100 మార్కులకు కోర్ పేపర్ ఉంటాయి.

- కామన్ పేపర్లో సైకోమెట్రిక్ టెస్ట్ కింద పర్సనాలిటీ అండ్ ఆటిట్యూడ్, ఇంగ్లీష్ యూసేజ్, రీడింగ్ కాంప్రహెన్షన్, క్రిటికల్ రీజనింగ్ అంశాల నుంచి 20 ప్రశ్నలు; టెక్నికల్ నాలెడ్జ్ టెస్ట్ కింద 30 ప్రశ్నలు అడుగుతారు. కోర్ పేపర్ పూర్తిగా ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి ఉంటుంది. అభ్యర్థులు డిగ్రీ స్థాయిలో చదివిన బ్రాంచ్‌కు నిర్దేశించిన సిలబస్‌ను అనుసరించి 100 ప్రశ్నలు ఇస్తారు. ఇంజనీరింగ్ విభాగాల సిలబస్‌ను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
- ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో సాధించిన మెరిట్ ప్రకారం అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు.

ముఖ్య సమాచారం
- **ప్రోగ్రామ్ ఫీజు:** రెగ్యులర్ అభ్యర్థులు సెమిస్టర్‌కు రూ.41,000; స్పాన్సర్డ్ అభ్యర్థులు సెమిస్టర్‌కు రూ.51,000 చెల్లించాల్సి ఉంటుంది. అటానమస్ ఫీజు కింద రూ.9,770; కాషన్ డిపాజిట్ కింద రూ.1,000 చెల్లించాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.750
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 12
- **జతచేయాల్సిన పత్రాలు:** పదోతరగతి, ఇంటర్/డిప్లొమా, డిగ్రీ సర్టిఫికెట్‌లు, మార్కుల పత్రాలు; టీసీ, బోనఫైడ్, మైగ్రేషన్ సర్టిఫికెట్; కులం, వైకల్యం, ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రాలు; సర్వీస్ సర్టిఫికెట్‌లు; స్పాన్సరింగ్ లెటర్(స్పాన్సర్డ్ అభ్యర్థులకు మాత్రమే)
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** జూలై 14
- **పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **వెబ్‌సైట్:** citdindia.org

Central Institute of Tool Design

నల్సార్‌లో సర్టిఫికేషన్ కోర్సు



హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లాకు చెందిన సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(సీడీఓఈ)- షార్ట్ టర్మ్ సర్టిఫికేషన్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇందులో ప్రధానాంశం 'సైబర్ క్రైమ్స్ ఇన్వెస్టిగేషన్ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్స్ యూజింగ్ ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్(ఓసింట్) టూల్స్ అండ్ టెక్నిక్స్'. ఈ కోర్సుకి సెంటర్ ఫర్ సైబర్ లాస్ అండ్ ఫోరెన్సిక్ సైన్సెస్ సహకారం అందిస్తోంది. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు, ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. లా చదువుతున్నవారికి, లీగల్ ప్రొఫెషనల్స్‌కు, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్లకు ఈ కోర్సు ఉపయోగపడుతుంది. మొత్తం 70 సీట్లు ఉన్నాయి. నల్సార్ విద్యార్థుల కోసం 10 సీట్లు ప్రత్యేకించారు.

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి మూడు రోజులు. దీనిని జూలై 5 నుంచి 7 వరకు నిర్వహిస్తారు. ప్రతి రోజూ ఉదయం తొమ్మిదిన్నర నుంచి సాయంత్రం ఆరు వరకు ఆన్‌లైన్ సెషన్స్ ఉంటాయి. రోజుకి నాలుగు సెషన్స్ ఉంటాయి. ప్రతి సెషన్ రెండు గంటలు ఉంటుంది. ప్రోగ్రామ్‌నకు సంబంధించిన అన్ని సెషన్స్‌ను ఎల్ఎంఎస్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచుతారు.

- మొదటి రోజు 'సైబర్ లాస్ అండ్ ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్ బేసిక్స్', రెండో రోజు 'టూల్స్ అండ్ ఇంజిన్స్ ఫర్ యూస్ ఇన్ ఓసింట్ సెర్చెస్', మూడో రోజు టెక్నికల్ సినారియోస్ అండ్ యూజ్ కేసెస్' అంశాలు వివరిస్తారు. వీటితో పాటు ల్యాబ్ సెషన్స్ కూడా ఉంటాయి. ప్రోగ్రామ్ చివరలో ఫైనల్ ల్యాబ్ అసెస్‌మెంట్ టెస్ట్ ఉంటుంది. కనీసం 75 శాతం అటెండెన్స్ ఉండి అసెస్‌మెంట్ టెస్ట్‌లో కనీసం 50 శాతం మార్కులు వచ్చినవారికి మాత్రమే సర్టిఫికెట్ ప్రదానం చేస్తారు.

- **కోర్సు ఫీజు:** రూ.6000
- **ప్రోగ్రామ్ సెషన్స్:** జూలై 5 నుంచి 7 వరకు
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 4
- **వెబ్‌సైట్:** https:nalsar.ac.in

నీలిట్‌లో డిప్లొమా, డిగ్రీ, పీజీ

అగర్తలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(నీలిట్)- ఇంజనీరింగ్ డిప్లొమా, బీసీఏ, ఎమ్మెస్సీ(ఐటీ) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

ఇంజనీరింగ్ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కోదానిలో 60 సీట్లు చొప్పున మొత్తం 120 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 35 శాతం మార్కులతో పదోతరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

బీసీఏ(బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్): ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో 40 సీట్లు ఉన్నాయి.

అర్హత: మేథ్స్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్ సబ్జెక్టులలో ఏవేని రెండు సబ్జెక్టులతో ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు; మూడేళ్ల వ్యవధి గల ఏదేని ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తి చేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు.

ఎమ్మెస్సీ(ఐటీ): ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో మొత్తం 30 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఎస్సీ(ఐటీ/సీఎస్)/బీసీఏ/బ్యాచిలర్ డిగ్రీ(కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. మేథ్స్ ఒక సబ్జెక్ట్‌గా ఇంటర్‌తో పాటు బీఎస్సీ/బీకాం/బీఏ పూర్తిచేసినవారు కూడా అర్హులే.

- దరఖాస్తు ఫీజు లేదు.
- **ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 28
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** జూలై 3న
- **ఎంపికైన అభ్యర్థుల మొదటి లిస్ట్ విడుదల:** జూలై 4న
- **వెబ్‌సైట్:** nielitagtadmission.in

ఐఐఎఫ్‌టీల్లో సర్టిఫికెట్ ప్రోగ్రామ్స్



గాంధీనగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ) క్యాంపస్- ఆన్‌లైన్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఇన్ ఏఐ అండ్ ఎంఎల్ ఇన్ ఫైనాన్స్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి 20 గంటలు. వారాంతాల్లో ఆన్‌లైన్ ఇంటరాక్టివ్ సెషన్స్ నిర్వహిస్తారు. ప్రతి శని, ఆదివారాల్లో ఉదయం పది నుంచి మధ్యాహ్నం పదకొండున్నర వరకు; మధ్యాహ్నం పన్నెండు నుంచి సాయంత్రం ఒకటిన్నర వరకు సెషన్స్ ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా కేస్ స్టడీ అనాలిసిస్, అసైన్‌మెంట్స్, ఆన్‌లైన్ క్విజ్‌లు, అసెస్‌మెంట్స్ ఉంటాయి. గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎర్లీ ఏజ్ ఫైనాన్స్ ప్రొఫెషనల్స్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్‌లు, ఫిన్‌టెక్ టెక్నాలజీపై ఆసక్తి ఉన్న విద్యార్థులు, బీఎఫ్ఎస్ఐ ప్రొఫెషనల్స్‌కు ఈ ప్రోగ్రామ్ ఉపకరంగా ఉంటుంది.

ప్రోగ్రామ్‌లోని అంశాలు: బేసిక్స్ ఆఫ్ ఏఐ అండ్ ఎంఎల్, డిజిటల్ బ్యాంకింగ్ అండ్ డిజిటల్ పేమెంట్స్, సైబర్ సెక్యూరిటీ, బిగ్ డేటా, డిజిటల్ ఫిన్‌టెక్, ఫ్రాడ్ డిటెక్షన్, యాంటీ మనీ లాండరింగ్, రోబో అడ్వైజింగ్

ముఖ్య సమాచారం
- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.20,000+ 18 శాతం జీఎస్‌టీ
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 25
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** జూన్ 29 నుంచి
- **వెబ్‌సైట్:** www.iift.ac.in

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- 'సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఇన్ ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ మేనేజ్‌మెంట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇండస్ట్రీ లీడర్స్, మిడిల్ లెవెల్ ఎగ్జిక్యూటివ్‌లు, ఆంత్రప్రెన్యూర్స్‌కు ఈ ప్రోగ్రామ్ ఉపయుక్తంగా ఉంటుంది. ఫ్రెషర్స్ కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అకడమిక్ ప్రతిభ, అనుభవం ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు ప్రవేశాలు కల్పిస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి నాలుగు నెలలు. దీనిని ఆఫ్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. వారాంతాల్లో ఉదయం తొమ్మిదిన్నర నుంచి సాయంత్రం అయిదు వరకు క్లాస్‌రూం తరగతులు ఉంటాయి. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ప్రోగ్రామ్‌లో భాగంగా లెక్చర్స్, కేస్ స్టడీ, జనరల్ డిస్కషన్స్, ఇండివిడ్యువల్/గ్రూప్ అసైన్‌మెంట్స్, ఆన్‌లైన్ అసెస్‌మెంట్స్, ప్రజంటేషన్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు, క్విజ్‌లు ఉంటాయి. ఇంటర్నల్ ఎగ్జామ్స్, ఫైనల్ ఎగ్జామ్స్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులందరికీ కోర్సు మెటీరియల్, డాక్యుమెంట్స్‌తో కూడిన లెర్నింగ్ వెబ్ పోర్టల్‌కు లైఫ్ టైం యాక్సెస్ ఇస్తారు.

- ఈ ప్రోగ్రామ్‌లో ఇంటర్నేషనల్ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆపరేషన్స్ అండ్ డాక్యుమెంటేషన్, ఇండియాస్ ఫారిన్ ట్రేడ్ అండ్ పాలసీ, ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫైనాన్స్, కస్టమ్ రెగ్యులేషన్స్ అండ్ ఇంపోర్ట్ ప్రొసీజర్స్ ఆఫ్ ఇండియా, ఇంటర్నేషనల్ ట్రేడ్ లాజిస్టిక్స్ అంశాలు ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం
- **ప్రోగ్రామ్ ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1,10,000+18 శాతం జీఎస్‌టీ; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం రాయితీ లభిస్తుంది.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 20
- **వెబ్‌సైట్:** www.iift.ac.in

జాబ్ కార్నర్

బెల్‌లో ఇంజనీరింగ్ అసిస్టెంట్ ట్రెయినీలు

మొత్తం ఖాళీలు: 32

హైదరాబాద్‌లోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.



1. ఇంజనీరింగ్ అసిస్టెంట్ ట్రెయినీ: **12 పోస్టులు**
2. టెక్నీషియన్ 'సి': **17 పోస్టులు**
3. జూనియర్ అసిస్టెంట్: **3 పోస్టులు**

అర్హత: ఐటీఐ, ఇంజనీరింగ్ డిప్లొమా, బీకాం, బీబీఎం ఉత్తీర్ణులై ఉండాలి.

జీతం: ఇంజనీరింగ్ అసిస్టెంట్ ట్రెయినీ పోస్టుకు రూ.24,500 - రూ.90,000. టెక్నీషియన్, జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు రూ.21,500 - రూ.82,000

వయోపరిమితి: 28 ఏళ్లు మించకూడదు

దరఖాస్తు ఫీజు: జనరల్/ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.250. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు ఎక్స్ సర్వీస్‌మన్‌లకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: షార్ట్‌లిస్ట్, రాత పరీక్ష తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 11

వెబ్‌సైట్: https://belindia.in/

ఎన్‌ఎఫ్‌ఎల్‌లో ఇంజనీర్లు

మొత్తం ఖాళీలు: 97

नोयिडालोनि... నోయిడాలోని నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్.. దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ఎన్ఎఫ్ఎల్ యూనిట్లు/కార్యాలయాల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. ఇంజనీర్(ప్రొడక్షన్): **40 పోస్టులు**
2. ఇంజనీర్(మెకానికల్): **15 పోస్టులు**
3. ఇంజనీర్(ఎలక్ట్రికల్): **12 పోస్టులు**
4. ఇంజనీర్(ఇన్‌స్ట్రుమెంటేషన్): **11 పోస్టులు**
5. ఇంజనీర్(సివిల్): **1 పోస్టు**
6. ఇంజనీర్(ఫైర్ అండ్ సేఫ్టీ): **3 పోస్టులు**
7. సీనియర్ కెమిస్ట్(కెమికల్ ల్యాబ్): **9 పోస్టులు**
8. మెటీరియల్స్ ఆఫీసర్: **6 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, బీఎస్సీ(ఇంజనీరింగ్), ఎమ్మెస్సీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 18 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా


దరఖాస్తు రుసుము: రూ.700. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఈఎస్ఎం అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 1

వెబ్‌సైట్: https://www.nationalfertilizers.com/

హెచ్‌పీసీఎల్‌లో ఇంజనీర్లు

మొత్తం ఖాళీలు: 247



ముంబయిలోని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్).. కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. మెకానికల్ ఇంజనీర్: **93**
2. ఎలక్ట్రికల్ ఇంజనీర్: **43**
3. ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీర్: **5**
4. సివిల్ ఇంజనీర్: **10**
5. కెమికల్ ఇంజనీర్: **7**
6. సీనియర్ ఆఫీసర్ - సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్: **6**
7. సీనియర్ ఆఫీసర్ - సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ప్రాజెక్ట్స్: **4**
8. సీనియర్ ఆఫీసర్/అసిస్టెంట్ మేనేజర్ - నాన్ - ఫ్యూయల్ బిజినెస్: **12**
9. సీనియర్ ఆఫీసర్ - నాన్ ఫ్యూయల్ బిజినెస్: **2**
10. మేనేజర్ - టెక్నికల్: **2**
11. మేనేజర్ - సేల్స్ ఆర్అండ్‌డి ప్రొడక్ట్ కమర్షియలైజేషన్: **2**
12. డిప్యూటీ జనరల్ మేనేజర్ క్యాటలిస్ట్ బిజినెస్ డెవలప్‌మెంట్: **1**
13. చార్టర్డ్ అకౌంటెంట్స్: **29**
14. క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్స్: **9**
15. ఐఎస్ ఆఫీసర్: **15**
16. ఐఎస్ సెక్యూరిటీ ఆఫీసర్ - సైబర్ సెక్యూరిటీ స్పెషలిస్ట్: **1**
17. క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్: **6**

అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ, బీఈ, బీటెక్, సీఏ, ఎంసీఏ, ఎంబీఏ, పీజీడీఎం, ఎమ్మెస్సీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

దరఖాస్తు రుసుము: యూఆర్/ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1180. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, గ్రూప్ టాస్క్, పర్సనల్ ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: జూన్ 30

వెబ్‌సైట్: www.hindustanpetroleum.com/

లిటిల్స్

నిజమైన మంత్రదండం

అవంతీపురాన్ని పరిపాలించే రాజమహేంద్రవర్మకు చదరంగం అంటే ఇష్టం. దాంతో ఎక్కువ సమయం ఆ ఆట ఆడుతూ గడిపేవాడు. రాజ్యానికి సంబంధించిన విషయాలు పట్టించుకొనేవాడు కాదు. అతని మంత్రి వినయుడు కష్టపడి పనిచేసే స్వభావం కలిగినవాడు. మహేంద్రవర్మ అప్పుడప్పుడు తన మంత్రితో- "మన దగ్గర ఒక మంత్రదండం ఉంటే బావుంటుంది. ఎవరు ఏమి అడిగినా ఇచ్చేయవచ్చు" అంటూ ఉండేవాడు. రాజుకు ఎలాగైనా బుద్ధి చెప్పాలనుకొని మంత్రి వినయుడు ఒక రోజు- "రాజా.. మన రాజ్యంలోకి ఒక మునీంద్రుడు వచ్చాడు. ఆయన దగ్గర ఉన్న మంత్రదండం మహిమ కలిగినది. ఎవరు ఏమి అడిగినా వెంటనే ప్రత్యక్షమవుతుంది. మీరు ఆ ముని మంత్రదండం అడిగి తీసుకోండి" అన్నాడు. వెంటనే



రాజు ముని దగ్గరకు వెళ్లి మంత్రదండం అడిగాడు. అప్పుడు ఆ ముని- "రాజా! ఈ మంత్రదండం వద్దనే ఒక వ్యక్తిని చూపించు.. అప్పుడు నీకు ఈ మంత్రదండం ఇస్తా" అన్నాడు. దాంతో రాజు తన రాజ్యమంతా దండోరా వేయించాడు. అందరు ప్రజలు మంత్రదండం కోసం ఎగబడ్డారు. గూఢచారులు వచ్చి- "రాజా! రాజధాని సమీపంలో కట్టెలు కొట్టుకొని బతికే చిన్నయ్య మాత్రం మంత్రదండంపై ఎలాంటి ఆసక్తి చూపించటం లేదు" అని చెప్పారు. అప్పుడు రాజు అతనిని పిలిచింది- "నీకు మంత్రదండం ఎందుకు వద్దు..? కారణం చెప్పు?" అన్నాడు. అప్పుడు చిన్నయ్య- "నేను గొడ్డలితో చెట్లు నరుకుతాను. సంపాదించుకుంటాను. నా గొడ్డలే నా మంత్రదండం" అన్నాడు. అప్పుడు రాజుకు తాను చేస్తున్న తప్పు అర్థమయింది.

5 తేడాలు గుర్తించండి




దారి కనుక్కోండి





సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 338

8		7				2		
			5				7	
	3			9	4			
	5				7	9		
1				5				8
		8	3				1	
			8	3			4	
	8				9			
		4				6		9

సుడోకు - 337 సమాధానం

3	1	6	4	7	2	5	8	9
4	8	5	9	6	1	7	3	2
7	2	9	3	5	8	1	4	6
5	4	2	1	9	6	3	7	8
8	6	1	7	2	3	9	5	4
9	3	7	8	4	5	2	6	1
6	9	8	2	3	7	4	1	5
2	5	3	6	1	4	8	9	7
1	7	4	5	8	9	6	2	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.